అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 24-07-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 205 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50




మాటల మూటలే

సామాన్యులకు భారాలు.. సంపన్నులకు వరాలు

ఏడోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

సామాన్యులకు మాటల్లో .. కార్పొరేట్లకు మూటల్లో వడ్డించే మోడీ ప్రభుత్వం తాజా బడ్జెట్‌లోనూ అదే విన్యాసం చేసింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఏడవసారి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ సామాన్యులకు ఉత్త మాటలే దక్కాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి మంగళవారం లోక్‌సభలో ప్రతిపాదించిన 48,20,512 కోట్ల రూపాయల బడ్జెట్‌లో అధికభాగం కార్పొరేట్ల వైపే పరుగులు పెట్టింది. ఫలితంగా అత్యంత కీలకమైన వ్యవసాయం నుండి అన్ని రంగాల్లోనూ కార్పొరేట్ల ప్రయోజనాలకే పెద్దపీట దక్కింది. నిరుద్యోగ నిర్మూలనకోసమంటూ అట్టహాసంగా ప్రకటించిన నూతన పథకాలను సైతం కార్పొరేట్ల ఖజనాలను నింపే వనరులుగా మార్చివేయడం మోడీ సర్కారు ప్రాధాన్యతలకు అద్దం పడుతోంది. ఈ పథకాల్లోనూ కొత్త ఉద్యోగ, ఉపాధి అవకాశాలు శూన్యం! ఇంటర్న్‌షిప్‌లనే సర్వస్వంగా చిత్రించేందుకు ప్రయత్నించారు. గరీబ్, మహిళా, యువ, అన్నదాత అని మాటలు చెబుతూనే, వారికిచ్చే సబ్సిడీలలో భారీగా కోతలు పెట్టే వంచనాశిల్ప విద్యను కేంద్రం ప్రదర్శించింది. పెరిగిన ధరలతో నిరుపేదలు కుంగిపోతున్నా ఉపాధి హామీ నిధుల్లో అడ్డగోలు కోతను మోడీ సర్కారు కొనసాగించింది. అది చాలదన్నట్లు ఆహార సబ్సిడీ మీద 7,082 కోట్ల రూపాయల కోత పెట్టింది. అంగన్‌వాడీలతో పాటు మాతా శిశు పథకాలకు అరకొర కేటాయింపులే దక్కాయి. ఇక విద్య, వైద్యం గ్రామీణాభివృద్ధి రంగాలకు కూడా ద్రవ్యోల్బణాన్ని ఏ మాత్రం పరిగణలోకి తీసుకోకుండా విదిలింపులతో సరిపెట్టారు. వేతన జీవులకు పెద్దగా ఊరట లభించలేదు. పేదలకిచ్చే సబ్సిడీలపై కోతలు పెట్టిన మోడీ ప్రభుత్వం అదే సమయంలో సంపదపైనా, వారసత్వపు ఆస్తులపైనా నామమాత్రపు పన్ను విధించడానికి కూడా సిద్ధపడలేదు. ఫలితంగా రానున్న రోజుల్లో అంతరాలు మరింత పెరగనున్నాయి. సామాన్యులకు మరిన్ని కష్టాలు, కన్నీళ్లు తప్పని స్థితి!



(రూ. కోట్లలో)	2022-23 వాస్తవిక గణాంకాలు	2023-24 బడ్జెట్ అంచనాలు	2023-24 సవరించిన అంచనాలు	2023-24 తాత్కాలిక వాస్తవిక గణాంకాలు	2024-25 బడ్జెట్ అంచనాలు
రెవెన్యూ రాక	2383206	2632281	2699713	2728412	3129200
మూలధన రాక	1809951	1870816	1790773	1714130	1691312
మొత్తం	4193157	4503097	4490486	4442542	4820512
రెవెన్యూ ఖాతా	3453132	3502136	3540239	3494036	3709401
మూలధన ఖాతా	740025	1000961	950246	948506	1111111
మొత్తం ఖర్చు	4193157	4503097	4490486	4442542	4820512
రెవెన్యూ లోటు	1069926	869855	840527	765624	580201
ద్రవ్య లోటు	1737755	1786816	1734773	1653670	1613312
ప్రాథమిక లోటు	809238	706845	679346	589799	450372

న్యూఢిల్లీ : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం వరుసగా ఏడవసారి కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ రికార్డును అధిగమించి కొత్త రికార్డును నెలకొల్పారు. మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్ ఇది. ఈ బడ్జెట్‌లో ప్రధానంగా తొమ్మిది ప్రాధాన్యతాంశాలను పేర్కొన్నట్లు తెలిపారు. అవి వ్యవసాయ రంగంలో ఉత్పాదకత పెంపు, ఉపాధి, నైపుణ్యాల అభివృద్ధి, సమగ్ర మానవ వనరుల అభివృద్ధి, సామాజిక న్యాయం, తయారీ రంగం-సేవలు, సూక్ష్మ చిన్న మధ్య తరహా సంస్థలకు తోడ్పాటు, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక వసతులు, వినూత్న పరిశోధనలు-అభివృద్ధి రంగాలు, తదుపరి తరం సంస్కరణలని చెప్పారు.

మైనారిటీ పథకాలకు కోతలు

మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు కేటాయింపులు చాలా స్వల్పంగా 2.7శాతం మేరకే పెరిగాయి. అందులో కూడా పలు పథకాలకు కోతలు పడ్డాయి. మైనారిటీలకు కోచింగ్, ఇతర సంబంధిత పథకాలకు కేటాయింపులను ఈ ఏడాది రూ.30కోట్ల నుండి రూ.10కోట్లకు తగ్గించారు. విదేశాల్లో చదువుకునే మైనారిటీ విద్యార్థుల రుణాలపై ఇచ్చే వడ్డీ సబ్సిడీని కూడా తగ్గించారు. మదరసాలు, మైనారిటీల ...6లో



కార్పొరేట్లకు నజరానా 3లో..

పన్ను రాయితీలతో సర్కారు ఖజానాకు భారీ గండి



పెరిగిన దేశం అప్పు 3లో..

ఆరేండ్లలో రూ.79,70,283.27 కోట్లు



సబ్సిడీలకు కోత 3లో..

ఆహారం, గ్యాస్, పెట్రోల్, యూరియాకు తగ్గిన కేటాయింపులు

ఉత్ప్రేరక బడ్జెట్



భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా మార్చటానికి ఊతం

భారత్‌ను ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా మార్చే ప్రక్రియలో బడ్జెట్ ఉత్ప్రేరకంగా పనిచేస్తోంది. నేటి బడ్జెట్ కొత్త అవకాశాలు, కొత్త శక్తి, కొత్త ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను తీసుకొచ్చింది. మెరుగైన వృద్ధిని, ఉజ్వల భవిష్యత్తును తెచ్చిపెట్టింది. భారత్‌కు గట్టి పునాది వేస్తుంది. ఈ బడ్జెట్‌తో అందరికీ ఉజ్వల భవిష్యత్తుకు మార్గం సుగమం.

- ప్రధాని మోడీ

ఇది తిరోగమన బడ్జెట్



అభివృద్ధికి కీలకమైన ఆర్థిక కార్యకలాపాల విస్తరణ ఏది?

కేంద్ర బడ్జెట్‌పై సీపీఐ(ఎం) విమర్శ

బడ్జెట్ వైఫల్యాన్ని నిరసిస్తూ ఆందోళనలకు పిలుపు

న్యూఢిల్లీ : కనీవినీ ఎరుగని స్థాయికి చేరుకున్న నిరుద్యోగం, అధిక ఆహార ద్రవ్యోల్బణం రేటు, అసాధారణమైన రీతిలో పెరుగుతున్న అసమానతలు, మందగించిన ప్రయివేట్ పెట్టుబడులు వంటి ఆర్థిక వాస్తవికతల నేపథ్యంలో ఈ బడ్జెట్ ఆర్థిక కార్యకలాపాలను విస్తరించడంపై ప్రధానంగా దృష్టిపెట్టాల్సి ఉందని, అందుకు భిన్నంగా ప్రస్తుత బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదనలు వాటిని కుదించేలా, తిరోగమన ధోరణిలో వున్నాయని సిపిఎం విమర్శించింది. పార్టీ పొలిట్‌బ్యూరో ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన జారీ చేసింది. ప్రజలపై మరింత భారాలు మోపేలానే ఈ ప్రతిపాదనలు వున్నాయని, పెట్టుబడులు 3లో

కుర్చీ బచావో బడ్జెట్




ఇది ముమ్మాటికీ కుర్చీ బచావో బడ్జెట్. కేవలం మిత్రపక్షాలను బుజ్జగించే చర్య. ఇతర రాష్ట్రాల ఖర్చుతో వారికి బూటకపు వాగ్దానాలు చేశారు. ఆప్తమిత్రులను (క్రోనీలు) ప్రసన్నం చేసుకొనేలా రూపొందించారు. సామాన్య భారతీయులకు ఎలాంటి ఉపశమనం లేదు. ఈ బడ్జెట్ గత బడ్జెట్‌ల కాపీ అండ్ పేస్ట్.

- రాహుల్ గాంధీ

రూపాయి రాక




రూపాయి పోక





ధరలు తగ్గేవి	ధరలు పెరిగేవి
కొన్ని రకాల కేన్సర్ మందులు	ప్లాటినం వస్తువులు బంగారు కడ్డీలు
మెడికల్ ఎక్స్‌రే యంత్రాలు	కృత్రిమ ఆభరణాలు
మొబైల్ ఫోన్లు, చార్జర్లు	సిగరెట్లు
చేపలు, రొయ్యల మేత	వంటగది చిమ్నీలు
తోలు వస్తువులు పాదరక్షలు వస్త్రాలు	కాంపౌండ్ రబ్బరు
బంగారం, వెండి, ప్లాటినం తయారీ చార్జీలు	కాపర్ స్క్రాప్
	దిగుమతి చేసుకున్న టెలికాం పరికరాలు





విభజన హామీల ఊసేలేదు

మూసీ ప్రక్షాళనపై రాష్ట్ర ప్రభుత్వం మొరపెట్టుకున్నా ఆలకించలేదు

- తెలంగాణకు మరోసారీ మొండి చేయే
- నిరుద్యోగం ధరల నియంత్రణకు కార్యాచరణేదీ?
- ఉత్పత్తి రంగ ప్రాధాన్యతను మరిచిన కేంద్ర బడ్జెట్ : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు చెందిన విభజన హామీల ఊసేలేదని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా విమర్శించింది. వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తి రంగాల ప్రాధాన్యతను ...15లో

కేంద్రం వివక్షపై అసెంబ్లీలో తీర్మానం



లోక్‌సభలోనూ నిరసన చెప్తాం | **ప్రతిపక్షాలు కలిసిరావాలి**

- కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ రాజీనామా చేయాలి
- బీజేపీ ఎంపీలు బానిసలుగా వ్యవహరించొద్దు
- బడ్జెట్ కేటాయింపులపై ప్రజలకు వివరణ ఇవ్వాలి
- కుర్చీ కాపాడుకోవడం కోసమే మోడీ క్విడ్‌ప్రోకో బడ్జెట్
- వికసిత భారత్ బోగస్ :సీఎం రేవంత్‌రెడ్డి

15లో

రాష్ట్రానికి మొండిచేయి



ప్రాజెక్టులు మొదలు పరిశ్రమల వరకు కేంద్ర బడ్జెట్లో రిక్త హస్తం



తెలంగాణ ఊసే ఎత్తని నిర్మలమ్మ

ఎనిమిది సీట్లిచ్చినందుకు బీజేపీ రిటన్ గిఫ్ట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వడ్డించేవాడు మనవాడైతే ఏ వరుసలో కూర్చున్నా మనకు దక్కాల్సింది దక్కుతుంది. మనవాడు కాకుంటే ముందు వరుసలో కూర్చున్నా పచ్చడి మెతుకులే దిక్కంటారు. కేంద్ర బడ్జెట్లో తెలంగాణ పట్ల బీజేపీ సర్కార్ అనుసరించిన తీరు ఇందుకు అద్దం పడుతోంది. ప్రాజెక్టుల నుంచి మొదలుకుని పరిశ్రమల వరకు నిధుల కేటాయింపులో రిక్త హస్తాన్ని అందించింది. బడ్జెట్లో ఏపీ పునర్విభజన చట్టం గురించి పలుమార్లు ప్రస్తావించినప్పటికీ ఎక్కడా తెలంగాణ ఊసేత్తలేదు. అక్కున చేర్చుకుని ...15లో

శాంతించినా..ప్రమాదకరంగానే..

వేగంగా పెరిగి నెమ్మదిగా తగ్గుతున్న గోదావరి

- 52 నుంచి 50 అడుగులకు చేరిక
- కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక



నవతెలంగాణ-భద్రాచలంరూరల్

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో భద్రాచలంలోని గోదావరికి వరదనీరు పోటెత్తుతుండటంతో నీటిమట్టం 52 అడుగులకు చేరింది. తుది హెచ్చరికకు ఒక అడుగు దూరంలో నిలిచిన గోదావరి.. ఇప్పుడు కొంత శాంతించి నెమ్మదిగా తగ్గుతూ మంగళవారం రాత్రి 7 గంటలకు 50 అడుగులకు చేరుకొని రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిలో ప్రవహిస్తోంది. అయితే కొంతమేర వరద ప్రవాహం తగ్గినా మళ్లీ పెరిగే అవకాశం ఉందని జల వనరులశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా, ఎగువనున్న ప్రాణహిత, ఇంద్రావతి నదుల నుంచే కాక, కిన్నెరసాని, తాలిపేరు ఉపనదుల ప్రవాహమూ తోడై గోదావరికి వరదనీరు అధికంగా చేరుతోంది. ఈ నేపథ్యంలో భద్రాచలం డివిజన్ ప్రజలు భయం గుప్పెట్లోనే గడుపుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం వరకు ఉగ్రరూపంలో ఉన్న గోదావరి ప్రవాహ ప్రభావంతో భద్రాచలం నుండి కూనవరం, వీఆర్ పురం, చింతూరు మండలాలకు వెళ్లే జాతీయ రహదారి రాకపోకలు నిలిచిపోయాయి. ఇటు కుక్కునూరు, వేలేరుపాడుకు వెళ్లే బూర్గంపాడు రహదారిపై సైతం గోదావరి ప్రవహిస్తుండటంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. మరోపక్క భద్రాచలం నుంచి చర్ల, వెంకటాపురం, వాజేడు వెళ్లే జాతీయ ...15లో



సరిగ్గా ప్రిపేరవ్వండి..

మీకిచ్చిన సబ్జెక్టులపై అధ్యయనం చేయండి..ఫిరాయింపులపై నిలేద్దాం

సమస్యలపై సర్కారును ఎండగడదాం

బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో అధినేత కేసీఆర్

అసెంబ్లీలో ఎవరెవరు ఏయే అంశాలపై మాట్లాడాలో దిశా నిర్దేశం

కుమార్తె కవితను గుర్తు చేసుకుని భావోద్వేగానికి లోనైన మాజీ సీఎం

మండలిలో బీఆర్ఎస్ పక్ష నేతగా మధుసూదనాచారి నియామకం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇటీవల ముందుకొచ్చిన అనేకాంశాలపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలేద్దామంటూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సూచించారు. ఈ క్రమంలో వారికిచ్చిన సబ్జెక్టులపై అధ్యయనం చేసి, సరిగ్గా ప్రిపేరవ్వాలని ఆదేశించారు. పార్టీ ...15లో

నీట్ పరీక్ష రద్దు అవసరం లేదు


వారికి నాలుగు మార్కులు తగ్గించాలని సుప్రీం ఆదేశాలు



న్యూఢిల్లీ : వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన నీట్ యూజి పరీక్షను రద్దు చేయనవసరం లేదని సుప్రీం కోర్టు మంగళవారం స్పష్టం చేసింది. ప్రశ్నా పత్రం లీకేజీలో వ్యవస్థాగతమైన ఉల్లంఘనలేవీ జరగలేదని అందువల్ల పరీక్ష పవిత్రత దెబ్బ తినలేదని వ్యాఖ్యానించింది. పరీక్షను రద్దు చేయాలని కోరుతున్న పిటిషన్లను ...15లో

మాటల్లోనే ఆర్భాటాలు

బడ్జెట్‌పై సీఐటీయూ విమర్శ



న్యూఢిల్లీ : మంగళవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ప్రజా వ్యతిరేక, బడా వ్యాపార వర్గాల అనుకూల బడ్జెట్ అని సీఐటీయూ విమర్శించింది. అభివృద్ధి, ఉపాధి, ప్రజా సంక్షేమం అంటూ గొప్పగా, ఆర్భాటంగా మాటలు చెబుతూ ఆచరణలో ప్రజలను మోసం చేశారంటూ సీఐటీయూ అధ్యక్షురాలు కె.హేమలత, ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ విమర్శించారు. బడ్జెట్‌ను ఒక్కసారి అవలోకిస్తే, రెవిన్యూ దాదాపు 15శాతం మేర పెరిగినా ఖర్చు ఆరు శాతం కూడా లేదని విమర్శించింది. పైగా కనివినని రీతిలో నిరుద్యోగం, ఆహార ద్రవ్యోల్బణం రేటు పెరగడంతో సామాన్యులు ...6లో



లాస్యనందిత మృతికి సంతాపం

అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి

సభలో ప్రవేశపెడుతున్నందుకు చింతిస్తున్నా

ప్రారంభమైన రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు

సంతాప తీర్మానం అనంతరం నేటికి వాయిదా

గన్‌పార్కు వద్ద అమరవీరులకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నివాళి

అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీగా వచ్చిన బీజేపీ ఎమ్మెల్యేలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఉండి ఇటీవల కాలంలో మరణించిన లాస్య నందిత మృతిపై శాసనసభ తీవ్ర సంతాపం ప్రకటించింది. సంతాప తీర్మానాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టారు. 'ఇలాంటి బాధాకరమైన తీర్మానాన్ని సభలో ప్రవేశపెడుతున్నందుకు చింతిస్తున్నాను' అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. లాస్యనందిత మృతిపట్ల సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సాయన్న అత్యంత సామాన్య కుటుంబంలో జన్మించి రాజకీయంగా అంచెలంచెలుగా ...5లో



31 వరకు అసెంబ్లీ

రేపు బడ్జెట్ 5లో..

26, 28 తేదీల్లో సెలవులు

రైతుల మధ్య ప్రభుత్వం గందరగోళం సృష్టిస్తోంది

- బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రైతుల మధ్య రాష్ట్ర ప్రభుత్వం గందరగోళం సృష్టిస్తోందని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ విమర్శించారు. మంగళవారం శాసన సభ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. 30 లక్షల రైతులు ఉంటే కేవలం 11 లక్షల మందికి మాత్రమే రుణ మాఫీ చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ అనేక హామీలతో అధికారంలోకొచ్చిందని గుర్తు చేశారు. ఏ బ్యాంకరైనా రైతు వద్ద ఉన్న రేషన్ కార్డు చూసి రుణం ఇవ్వరని తెలిపారు. ఏక కాలంలో రైతులకు రెండు లక్షల రూపాయలు రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వడ్డీతో సంబంధం లేకుండా అసలు మాత్రమే మాఫీ చేయడం సరికాదన్నారు. ఇచ్చిన హామీ మేరకు పంటల బీమా పథకాన్ని ఎందుకు తేలేదని ప్రశ్నించారు.

ఫసల్ భీమా పథకం అమలు చేసి ఉంటే అనావృష్టి కారణంగా పంట నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేదన్నారు. బీఆర్ఎస్ విధానాలనే కాంగ్రెస్ అమలు చేస్తున్నదని విమర్శించారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ వడ్ల కొనుగోలుపై రూ.500 బోనస్ అమలు చేయలేదని చెప్పారు. రైతుల రుణ మాఫీ ఎలాంటి షరతులు లేకుండా చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు మరింత చేరువగా..

- రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు
- కమిషనరేట్ సోషల్ మీడియా అకౌంట్లలో సమాచారం
- క్యూఆర్ కోడ్ పోస్టర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ- సిటీబ్యూరో

కాలానికి అనుగుణంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీని ఉపయోగించుకుంటూ ప్రజలకు మరింత చేరువకావడం కోసం సోషల్ మీడియా అకౌంట్లు ఎంతో దోహదం చేస్తాయని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. సామాజిక మాధ్యమాలు ప్రజలకు మెరుగైన సత్వర సేవలు అందించేందుకు, ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు పెంపొందించుకోవడానికి ఉపయోగకరంగా ఉంటాయన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ సామాజిక మాధ్యమాల అకౌంట్ల గురించి ప్రజల్లో అవగాహన పెంచేందుకు, వాటిని అందరికీ చేరువ చేసేందుకు క్యూఆర్ కోడ్ పోస్టర్లను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నేరేడ్‌మెట్‌లోని రాచకొండ సీపీ కార్యాలయంలో మంగళవారం సీపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. రాచకొండ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా.. రాచకొండ పోలీస్ 'ఫేస్‌బుక్' 'ఎక్స్' 'ఇన్‌స్టాగ్రామ్' వంటి సామాజిక మాధ్యమాల అకౌంట్లు, యూట్యూబ్ చానల్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ ఆవరణలో, రిసెప్షన్‌లో రాచకొండ పోలీస్ 'క్యూఆర్ కోడ్' కలిగిన పోస్టర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు ఈ క్యూఆర్ కోడ్‌ను వారి మొబైల్ ఫోన్లతో స్కాన్ చేయడం ద్వారా సంబంధిత రాచకొండ కమిషనరేట్ సోషల్ మీడియా అకౌంట్లకు సులభంగా చేరుకుని సబ్‌స్క్రైబ్ చేసుకోవచ్చని, ఫాలో కావచ్చని తెలిపారు. వీటి ద్వారా ఎప్పటికప్పుడూ డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కార్యక్రమాల నిర్వహణ, సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయడం, భారీ వర్షాలు, వరదలు, అగ్ని ప్రమాదాలు, ఇతర సందర్భాల్లో విపత్తు నిర్వహణ సమాచారం అందిస్తామని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో రాచకొండ కమిషనరేట్ వాట్సాప్ కంట్రోల్ నెంబర్ 8712662111 ద్వారా కూడా బాధితులు ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. ఈ సమావేశంలో యాదాద్రి డీసీపీ రాజేష్ చంద్ర, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, ఎస్బీ డీసీపీ కరుణాకర్, డీసీపీ క్రైం అరవింద్ బాబు, మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి, ఉమెన్ సేఫ్టీ డీసీపీ ఉషా విశ్వనాథ్, ఐటీసెల్ ఏసీపీ నరేందర్ గౌడ్, ఇన్‌స్పెక్టర్లు సుధాకర్, గట్టు మల్లు తదితరులు పాల్గొన్నారు.

స్మిత సబర్వాల్‌ను అనర్హురాలిగా ప్రకటించాలి

ఆర్‌పీడబ్ల్యూడీ కమిషనర్‌కు ఎన్‌పీఆర్‌డీ వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికలాంగులను కించపరిచే విధంగా మాట్లాడిన ఐఏఎస్ అధికారి స్మిత సభర్వాల్‌ను అనర్హురాలిగా ప్రకటించాలనీ, తక్షణమే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం ప్రతినిధి బృందం మంగళవారం హైదరాబాద్‌లోని 2016 ఆర్‌పీడబ్ల్యూడీ కమిషనర్ బి శైలజకు వినతి పత్రంసమర్పించింది. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య మాట్లాడుతూ సీనియర్ ఐఏఎస్‌అధికారి స్మిత సభర్వాల్ వికలాంగులను కించపరిచే విదంగా ట్విట్టర్ లో పోస్ట్ పెట్టారని తెలిపారు. ఐక్య రాజ్యా సమితి హక్కుల ఒప్పంద పత్రం, 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టంలో పేర్కొన్న సమానత్వం, వికలాంగుల పట్ల వివక్షతకు పూర్తి భిన్నమైందని పేర్కొన్నారు . వికలాంగులను కించపరిచే ఉద్దేశంతో బహిరంగంగా ఉద్దేశపూర్వకంగా అవమానించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు . వికలాంగులను అగౌరవపరిచెందుకు ప్రయత్నం చేసినందున ఆమెపై చట్టబద్ద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం సెక్షన్ 34 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో వికలాంగుల కొరకు ప్రత్యేకంగా వైకాల్యాన్ని బట్టి రిజర్వ్ పోస్టులు గుర్తించి ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ అమలు చేయాలని స్పష్టంగా ఉన్న విషయం ఆమెకు తెలియదా అని ప్రశ్నించారు.

బదిలీల అవకతవకలు సరిచేయాలి

- వైద్యారోగ్య కమిషనర్‌కు టీయూఎంహెచ్ఇయూ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సాధారణ బదిలీల సందర్భంగా జరిగిన అవకతవకలు, గందరగోళ పరిస్థితులను సరి చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డీ ఫసియొద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్, ఉపాధ్యక్షులు కె.బలరామ్, హరిశంకర్, భువనగిరి జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, టిహబ్ నాయకులు ఆదిత్య మంగళవారం హైదరాబాద్‌లో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బదిలీలు జరగని క్యాడర్లను వెంటనే బదిలీ చేయాలని కోరారు. ముఖ్యంగా స్టాఫ్ నర్సులు, హెడ్ నర్సులు, ఎంపీహెచ్ఎస్ మేల్ సీనియార్టీ లిస్టులు ప్రకటించి వెంటనే కౌన్సిలింగ్ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీహెచ్ఇఓ, పీహెచ్ఎం, సీనియర్ అసిస్టెంట్, ఫార్మసిస్ట్ తదిత క్యాడర్లలో పని చేస్తున్న వారు బదిలీ కాకుండా రీటెయిన్ తీసుకోవంతో సాధారణ ఉద్యోగులకు అన్యాయం జరిగిందనీ, దీన్ని విచారించి సరి చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీహెచ్ఏ ఫిమేల్ బదిలీల సందర్భంగా హైదరాబాద్‌లో ఉన్న అందరినీ వేరే జిల్లాల్లకు పంపడంతో సేవలకు ఆటంకం ఏర్పడినందున వారిని వెనక్కి తీసుకోవాలని సూచించారు. ఫోకల్ నుంచి ఫోకల్, నాన్ ఫోకల్ నుంచి నాన్ ఫోకల్‌కు చేసిన బదిలీలను కూడా సరిచేయాలని కోరారు. హైదరాబాద్ తెలంగాణ డయాగ్నస్టిక్ టిహబ్‌లో పని చేస్తున్న 24 మంది ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలని విజ్ఞప్తి చేశారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను తొలగించవద్దని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌తో పాటు 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రస్తావించారు.

అక్రమాలు సరి చేస్తాం-కమిషనర్

బదిలీల్లో జరిగిన అక్రమాలను సరి చేస్తామని కమిషనర్ ఆర్వీ కర్ణన్ హామీ ఇచ్చారు. యూనియన్లకు ఇచ్చిన ప్రయారిటీలను రద్దు చేస్తామని తెలిపారు. ఏఎన్ఎంలు, టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని యూనియన్ నాయకులతో చెప్పారు.

317 జీవో సమస్యలను పరిష్కరించాలి

- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి జాక్టో వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 317 జీవో బాధిత ఉద్యోగుల అప్పీళ్ల సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో జాక్టో చైర్మెన్ జి సదానందంగౌడ్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల కోర్టు వివాదాన్ని త్వరగా పరిష్కరించి బదిలీలు, పదోన్నతులు కల్పించాలని కోరారు. ప్రతి మండలానికీ ఒక రెగ్యులర్ ఎంఈవోను నియమించాలనీ, ప్రతి నియోజకవర్గానికీ ఒక డిప్యూటీఈవో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖలో విలీనం చేయాలని కోరారు. వివిధ జిల్లాల్లో జరుగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు పాఠశాల విద్యాశాఖ సంచాలకుల ద్వారానే జరగాలని సూచించారు. అందుకు సంబంధించిన వివరాలను వెబ్‌పోర్టల్‌లో ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాక్టో నాయకులు రాధాకృష్ణ, కృష్ణుడు, చైతన్య పర్వత్‌రెడ్డి, చంద్రశేఖర్, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు నిరాశే : టాప్ర

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర బడ్జెట్‌లో పెన్షనర్లకు నిరాశే ఎదురైందని టాప్ర రాష్ట్ర కార్యదర్శి జి అశోక్ మంగళశారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షన్ ఆదాయంపై పన్నుని రద్దు చేయాలంటూ చాలా కాలం నుంచి ఆందోళనలు చేస్తున్నా కేంద్రం పట్టించుకోలేదని తెలిపారు. పన్ను మదింపులో స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.50 వేల నుంచి రూ.75 వేలకు పెంచడం వల్ల కొంత ఊరట లభించిందని పేర్కొన్నారు. కొత్త పన్ను విధానంలోకి ఉద్యోగులను బలవంతంగా తేవడమే లక్ష్యంగా కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్టుగా కనిపిస్తున్నదని తెలిపారు.

కార్పొరేట్లకు నజరానా



పన్ను రాయితీలతో సర్కారు ఖజానాకు భారీ గండి

- ఏటా రూ.1.45 లక్షల కోట్లు నష్టపోతున్న ప్రభుత్వం
- వ్యక్తిగత, కార్పొరేట్ పన్ను వసూళ్ల మధ్య పెరుగుతున్న అంతరం
- ఈ బడ్జెట్‌లోనూ తగ్గిన కార్పొరేట్ పన్ను రేట్లు

కార్పొరేట్ల పైనే ప్రేమ

2014-2024 మధ్యకాలంలో కార్పొరేట్ పన్నుల రాబడిలో పెరుగుదల చాలా స్వల్పంగా ఉంది. 2014-15లో రూ.4.28 లక్షల కోట్ల మేర కార్పొరేట్ పన్నులు వసూలు కాగా 2024-25 బడ్జెటరీ అంచనాల్లో అది కేవలం రూ.10.2 లక్షల కోట్లకు మాత్రమే పెరిగింది. దీనికి భిన్నంగా అదే కాలంలో ఆదాయపన్ను రాబడులు రూ.2.5 లక్షల కోట్ల నుంచి రూ.11.8 లక్షల కోట్లకు అంటే 4.5 శాతం మేర పెరిగాయి. ప్రతి ఏటా పెరుగుతున్న ఈ ఆదాయం... పన్ను చెల్లింపుదారుల కంటే కార్పొరేట్ సంస్థలకే ప్రభుత్వం అనుకూలంగా వ్యవహరిస్తోందన్న చేదునిజాన్ని చాటిచెబుతోంది.

న్యూఢిల్లీ : వ్యక్తులు చెల్లించే ఆదాయపన్ను నుంచి ప్రభుత్వానికి వచ్చే రాబడి కార్పొరేట్ సంస్థలు చెల్లించే పన్నుల కంటే అధికంగా ఉంటోంది. ఆదాయపన్ను ద్వారా ప్రభుత్వానికి 19 శాతం ఆదాయం సమకూరుతుండగా కార్పొరేట్ సంస్థల నుండి వస్తున్నది కేవలం 17 శాతం మాత్రమే. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంటుకు సమర్పించిన బడ్జెట్ పత్రాలను విశ్లేషిస్తే ఈ విషయం అర్థమవుతోంది. ఐదు సంవత్సరాల క్రితం 2019లో మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల పన్నులను తగ్గించిన విషయం తెలిసిందే. దీనివల్ల ప్రభుత్వం ఏటా రూ.1.45 లక్షల కోట్ల ఆదాయాన్ని కోల్పోతోంది. దీనికి ప్రభుత్వం చెబుతున్న కారణం ఏమిటో తెలుసా ? కార్పొరేట్ సంస్థలకు పన్ను రాయితీలు కల్పిస్తే ప్రయివేటు పెట్టుబడులు పెరుగుతాయని, తద్వారా యువతకు మరిన్ని ఉద్యోగాలు వస్తాయని.

గత ఐదు సంవత్సరాల కాలంలో ఈ పన్ను రాయితీల కారణంగా ప్రభుత్వం రూ.8.7 లక్షల కోట్ల ఆదాయాన్ని కోల్పోయిందని బడ్జెట్‌కు ముందు ఆర్థిక మంత్రికి రాసిన లేఖలో సంజయ్ ఝా తెలియజేశారు. సంజయ్ గతంలో కాంగ్రెస్ పార్టీకి జాతీయ ప్రతినిధిగా పనిచేశారు. 'ఉద్యోగాలు ఎక్కడ వచ్చాయో చెప్పగలరా? మూలధనపు పెట్టుబడులు ఎక్కడ? మీరు పన్ను రాయితీలు ఇచ్చిన కంపెనీలు ఆదా చేసిన ఆ సొమ్మును డివిడెండ్లు, లాభాలుగా పంపిణీ చేశాయా లేక జేబుల్లో వేసుకున్నాయా? కార్పొరేట్ సంస్థలు ఇబ్బడిముబ్బడిగా లాభాలు దండుకుంటుంటే స్టాక్ మార్కెట్లు పరుగులు తీస్తున్నాయి. వాస్తవ పరిస్థితులకు ఇది పూర్తి భిన్నంగా ఉంది' అని ఆయన తెలిపారు.

ప్రస్తుత బడ్జెట్‌లో కూడా మోడీ ప్రభుత్వం అసాధారణ రీతిలో కార్పొరేట్ పన్ను రేట్లను 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించింది. ఇప్పటికే ప్రకటించిన ఇతర రాయితీలకు ఇది అదనం.

స్థూల పన్ను రాబడిలో...

స్థూల పన్ను రాబడి (జీటీఆర్)లో పన్ను చెల్లింపుదారులు, కార్పొరేట్ సంస్థల చెల్లింపుల వాటాను పరిశీలిద్దాం. ప్రభుత్వం ఇటీవల కార్పొరేట్ పన్ను దామాషాను తగ్గించే ప్రయత్నం చేసింది. జీటీఆర్‌లో కార్పొరేట్ పన్ను వాటా 2014-15లో 34.5 శాతం ఉండగా 2024-25 బడ్జెట్ అంచనాల్లో 26.6 శాతానికి తగ్గిపోయింది. మరోవైపు అదే కాలంలో ఆదాయపన్ను వాటా 20.8 శాతం నుంచి 30.9 శాతానికి పెరిగిపోయింది. అంటే గత పది సంవత్సరాల కాలంలో జీడీపీలో కార్పొరేట్ పన్నుల వాటా 3.4 శాతం నుంచి 3.1 శాతానికి పడిపోయింది. దీనికి భిన్నంగా ఆదాయపన్ను వాటా 2.1 శాతం నుంచి 3.5 శాతానికి పెరిగింది.

పెరుగుతున్న అంతరం

2018-19, 2022-23 మధ్యకాలంలో దేశంలో వ్యక్తిగత పన్ను వసూళ్లు 76 శాతం పెరిగాయి. కానీ పన్ను వసూళ్లలో కార్పొరేట్ వాటా కేవలం 24.45 శాతం మాత్రమే పెరిగింది. 2018-19లో సెక్యూరిటీల లావాదేవీల పన్ను సహా వ్యక్తిగత ఆదాయపన్ను వసూళ్లు రూ.4,73,179 కోట్లు. 2022-23 నాటికి అది రూ.8,33,307 కోట్లకు పెరిగింది. అదే సమయంలో కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.6,63,572 కోట్ల నుంచి రూ.8,25,834 కోట్లకు మాత్రమే పెరిగాయి. ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఉదారంగా పన్ను రాయితీలు, మినహాయింపులు ఇస్తుండడంతో అవి చెల్లించే పన్నులు తగ్గిపోతున్నాయి. వ్యక్తిగత ఆదాయపన్ను చెల్లించే వారికి మాత్రం బడ్జెట్‌లో ప్రభుత్వం పెద్దగా ఊరట కల్పించడం లేదు. 2019లో కార్పొరేట్ సంస్థలకు కల్పించిన రాయితీల కారణంగా మొత్తం పన్నుల రాబడిలో వ్యక్తిగత ఆదాయపన్ను, కార్పొరేట్ పన్నుల మధ్య అంతరం బాగా పెరిగిపోతోంది.

దేశప్రగతి బడ్జెట్ కాదు..
సేవ్ మోడీ గవర్నమెంట్ బడ్జెట్ ఇది..



"ఎన్డీఏ మనుగడ కోసం తన సంకీర్ణ భాగస్వాములకు అర్ధహృదయంతో 'రేవడీస్'(ఉచితాలు) పంపిణీ చేస్తున్నందున కాపీక్యాట్ బడ్జెట్ కనీసం కాంగ్రెస్ న్యాయ ఎజెండాను సరిగ్గా కాపీ కూడా చేయలేక పోయింది. ఇది దేశ ప్రగతికి బడ్జెట్ కాదు.. 'సేవ్ మోడీ గవర్నమెంట్ బడ్జెట్'. దళితులకు, ఆదివాసీలకు, వెనుకబడిన తరగతులకు, మైనారిటీలకు, మధ్యతరగతి, గ్రామీణ పేదలకు విప్లవాత్మక పథకం లేదు. ప్రజలు కాంగ్రెస్-యూపీఏ అమలు చేసిన విధానాన్ని ఇష్టపడుతున్నారు. మహిళల కోసం ఈ బడ్జెట్‌లో వారి ఆర్థిక సామర్థ్యాన్ని పెంపొందించే, శ్రామికశక్తిలో మరింత ఎక్కువగా పాల్గొనేలా చేసేది ఏమీ లేదు"

- కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే



"నిరుద్యోగాన్ని పరిష్కరించటంలో ప్రభుత్వ ప్రతిస్పందన చాలా తక్కువగా ఉన్నది. ఇది తక్కువ ప్రభావాన్ని మాత్రమే చూపుతుంది. అయితే బడ్జెట్‌లో ఏదీ కూడా ప్రజలకు ద్రవ్యోల్బణాన్ని 'తీవ్రంగా పరిష్కరిస్తుంది' అనే విశ్వాసాన్ని ఇవ్వలేదు"

- కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పి. చిదంబరం



"నిరుద్యోగం, పెరుగుతున్న ధరలు, ద్రవ్యోల్బణం వంటి అత్యవసర సమస్యలను పరిష్కరించటానికి బదులుగా.. బీజేపీ తన సంకీర్ణ భాగస్వాములకు లంచం ఇవ్వటానికి, ప్రభుత్వం పతనమయ్యేలోపు సమయాన్ని కొనుగోలు చేయటానికి బడ్జెట్‌ను రూపొందించింది"

- తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ



"యువత, రైతుల ప్రయోజనాలను బడ్జెట్ విస్మరించింది. బీహార్, ఏపీలకు ప్రకటనలు బీజేపీ తన ప్రభుత్వాన్ని రక్షించుకోవటానికే కారణంగా ఉన్నాయి. బడ్జెట్‌లో యూపీకి ఏమైనా ఉందా?"

- ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్



"ఒడిశా, ఏపీ, బీహార్ ప్రత్యేక కేటగిరీ కోసం అడుగుతుండగా.. రెండు రాష్ట్రాలు ప్రత్యేక నిధులు పొందాయి. అయితే ఒడిశా డిమాండ్ పరిగణించబడలేదు. ఇది.. రాష్ట్రంలో 21 మంది లోక్‌సభ ఎంపీలలో 20 మంది బీజేపీ ఎంపీలను ఎన్నుకున్నందుకు ఒడిశాకు పడిన శిక్ష. ఏపీ, బీహార్‌లలోని బీజేపీ మిత్రపక్షాలకు బహుమానం"

- బీజేడీ రాజ్యసభ సభ్యులు సస్మిత్ పాత్ర

కాగా, ఒడిశాకు ప్రత్యేక కేటగిరీ రాష్ట్ర హోదా తిరస్కరణపై రాజ్యసభ నుంచి బీజేడీ వాకౌట్ చేసింది. ఏపీ, బీహార్, కొన్ని ఇతర రాష్ట్రాలతో పాటు ఒడిశా సైతం ప్రత్యేక హోదా గురించి డిమాండ్ చేస్తున్నది. ఇటీవల ముగిసిన సాధారణ ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ 21 ఎంపీ సీట్లకు గానూ 20 సీట్లను దక్కించుకోవటమే కాకుండా రాష్ట్ర అసెంబ్లీలో అత్యధిక స్థానాలను కైవసం చేసుకొని రాష్ట్రంలో ప్రభుత్వాన్ని కూడా ఏర్పాటు చేయటం గమనార్హం.

పెరిగిన దేశం అప్పు
ఆరేండ్లలో రూ.79,70,283.27 కోట్లని అంచనా

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో దేశం అప్పు విపరీతంగా పెరుగుతోంది. ఆరేండ్లలోనే దాదాపు రూ.82 లక్షల కోట్లకు చేరింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎంత మేర అప్పులున్నాయో వెల్లడించారు. 2024 మార్చి 31 నాటికి రూ.168,72,554.16 కోట్లు అప్పు ఉంటే, 2025 మార్చి 31 నాటికి రూ. 181,68,456.91 కోట్లకు పెరుగుతుందని అంచనా వేశారు. అంటే ఏడాదిలోనే రూ.12,95,902.75 కోట్ల మేర అప్పు పెరుగుతుందని ప్రభుత్వ బడ్జెట్ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. 2019-20లో రూ.101,98,173.64 కోట్లు అప్పు ఉంటే, అది కాస్తా 2024-25 నాటికి రూ.181,68,456.91 కోట్లకు పెరుగుతుంది. అంటే రూ.79,70,283.27 కోట్లు అప్పు పెరగనుంది. ప్రభుత్వం విదేశీ అప్పులకు వడ్డీ 32,597.90 కోట్లు, దేశీయ అప్పుకు వడ్డీ రూ. 85,7482.79 కోట్లు చెల్లిస్తుంది.



ఆరేండ్లలో పెరిగిన వివరాలు

ఏడాది	అప్పు (కోట్లల్లో)
2019-20	రూ.101,98,173.64
2020-21	రూ.120,58,987.40
2021-22	రూ.135,45,605.78
2022-23	రూ. 152,23,605.78
2023-24	రూ.168,72,554.16
2024-25	రూ. 181,68,456.91

2024, 2025 మార్చి 31 నాటికి.. అప్పు (కోట్లల్లో)

దేశీయం	: రూ.163,35,070.06	రూ.175,93,529.40
విదేశీయం	: రూ.5,37,484.10	రూ.5,74,927.51
మొత్తం	: రూ.168,72,554.16	రూ.181,68,456.91

సబ్సిడీలకు కోత

ఆహారం, గ్యాస్, పెట్రోల్, యూరియా వంటి వాటికి తగ్గిన కేటాయింపులు

- అంగన్‌వాడీలు, పంట బీమాకు కోత
- ఉపాధి హామీ, పీఎం కిసాన్‌కు పెంపు లేదు
- 'మహిళా భద్రత' కేటాయింపుల్లోనూ కోతే

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో పేదలు, రైతులకు సంబంధించిన సబ్సిడీలకు కేంద్ర ప్రభుత్వం కోత విధించింది. ఆహారం, వంటగ్యాస్, పెట్రోలియం, యూరియా వంటి వాటికి బడ్జెట్ కేటాయింపులు తగ్గించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్య, పేద ప్రజలకు ఎటువంటి ఉపశమనం కలగలేదు. పైగా ఆయా వర్గాలకు సంబంధించిన రంగాల కేటాయింపుల్లో కోత విధించారు. ఆహార సబ్సిడీకి సంబంధించి 2022-23 బడ్జెట్‌లో రూ. 2,72,802 కోట్లు కేటాయించగా, 2023-24లో దాన్ని రూ.2,12,332 కోట్లకు, 2024-25లో రూ.2,05,250 కోట్లకు తగ్గించారు. ప్రజా పంపిణీకి 2023-24లో రూ 137.36 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం రూ.106.73 కోట్లకు తగ్గించారు. గ్యాస్ సబ్సిడీకి 2023-24లో రూ 12,240 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం రూ.11,925.01 కోట్లకు తగ్గించారు.

పెట్రోలియానికి సంబంధించి 2023-24లో రూ.12,240 కోట్లు కేటాయించగా, దాన్ని 2024-25లో రూ.11,925 కోట్లకు తగ్గించారు. రైతులకు సంబంధించిన ముఖ్యమైన ఎరువులకు 2022-23లో రూ.2,51,339 కోట్లు కేటాయించగా, 2023-24లో రూ.1,88,894 కోట్లకు తగ్గించారు. దాన్ని 2024-25లో రూ.1,64,000 కోట్లకు తగ్గించారు. అందులోనూ యూరియాకి 2022-23 బడ్జెట్‌లో రూ.1,65,217 కోట్లు కేటాయించగా, 2023-24లో దాన్ని రూ.1,31,100 కోట్లకు తగ్గించారు. 2024-25లో రూ.1,00,340 కోట్లకే పరిమితం చేశారు. పంటల బీమా పథకానికి సంబంధించి 2023-24 బడ్జెట్‌లో రూ.15,000 కోట్లు కేటాయించగా, దాన్ని 2024-25 బడ్జెట్‌లో రూ. 14,600 కోట్లకు తగ్గించారు. నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ (ఎన్ఆర్ హెచ్ఎం)కి కేటాయింపులే లేవు. స్మార్ట్ సిటీలకు 2023-24లో రూ 13,200 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.10,400 కోట్లకు తగ్గించారు. అంగన్‌వాడీలకు 2023-24లో రూ 21,523.13 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం రూ.21,200 కోట్లకు తగ్గించారు. మహిళా భద్రత పథకాల కేటాయింపుల్లో భారీ కోత విధించారు. 2023-24లో రూ.1,009 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం రూ.155 కోట్లకు తగ్గించారు.

ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడులకు సంబంధించి 2023-24 బడ్జెట్‌లో రూ.34,354 కోట్లు కేటాయించగా, దాన్ని సవరించిన అంచనాల్లో రూ.32,800 కోట్లకు తగ్గించారు. 2024-25లో రూ.31,107 కోట్లకు తగ్గించారు. అంటే రూ.3,247 కోట్లు తగ్గించారు. కోల్ ఇండియా లిమిటెడ్‌కు భారీ కోత పడింది. 2023-24లో రూ 16,500 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.15,500 కోట్లకు తగ్గించారు. ఎస్ఎల్సీ ఇండియా లిమిటెడ్‌కు 2023-24లో రూ 2,880 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.2,429 కోట్లకు తగ్గించారు. సాంస్కృతిక పథకాలకు 2023-24లో రూ 808.77 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.520.24 కోట్లకు తగ్గించారు. అకాడమీ, మ్యూజియంలకూ బడ్జెట్‌లో కోత విధించారు. అకాడమీలకు సంబంధించి 2023-24లో రూ 435.45 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.389.37 కోట్లకు తగ్గించారు. మ్యూజియంలకు సంబంధించి 2023-24లో రూ 389.40 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.373.70 కోట్లకు తగ్గించారు. పీఎం కిసాన్, ఉపాధి హామీకి ఎటువంటి పెంపుదల లేదు. గతంలో కేటాయించిన వాటినే కాపీ, పేస్ట్ చేశారు.

'ఉపాధి'కి గతేడాది కేటాయించిన నిధులే

- ఈ యేడు నయాపైసా పెంపులేదు
- మూడేండ్ల కిందటి పెంపు కన్నా తక్కువ
- అర్బన్ ఉపాధి ప్రస్తావనే లేదు : ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీకి గతేడాది కేటాయించిన నిధులనే కేటాయించారని, ఈ యేడు నయాపైసా పెంపు లేదని వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి వెంకట్ అన్నారు. ఈ కేటాయింపులు మూడేండ్ల కిందటి పెంపు కన్నా తక్కువని తెలిపారు. కేంద్ర బడ్జెట్ దేశ సంపదను కార్పొరేట్లు, మతోన్మాదులు, పెత్తందారులకు దోచిపెట్టే బడ్జెట్ అని ఆయన విమర్శించారు. గ్రామీణ ఉపాధి పేదల సమస్యలను దృష్టిలో పెట్టుకుని వారిని కాపాడేందుకు ఏడాదికి రూ. 2లక్షల కోట్లు కేటాయించాలని మేధావులు చెబుతున్న మాటలు మోడీ చెవికెక్కకపోవటం విచారకరమన్నారు. ఉపాధికి మూడేండ్ల క్రితం రూ. 90 వేల కోట్లు కేటాయించగా, గతేడాది రూ. 86 వేల కోట్లు ఖర్చు చేశారని, ఈసారి కూడా రూ.86 వేల కోట్లే కేటాయించడం ఉపాధిని నిర్వీర్యం చేయడమేనని అన్నారు. మొత్తం కేంద్ర బడ్జెట్ రూ. 44 లక్షల కోట్ల నుంచి రూ. 48 లక్షల కోట్లకు అంటే 10 శాతం పెరిగిందని, ఆ ప్రకారం కేటాయింపులు కూడా 10 శాతం పెరగాల్సి ఉండగా కుదించటం దారుణం అన్నారు.

ఓట్లు గ్రామీణ పేదలవి కావాలని, కేటాయింపులు మాత్రం కార్పొరేట్లకు చేస్తామనే విధంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. పేదల గృహ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 5 లక్షల చొప్పున, రాష్ట్ర ప్రభుత్వం రూ. ఐదు లక్షల చొప్పున మొత్తం ఒక్కొక్క లబ్దిదారునికి రూ.10 లక్షలు చొప్పున కేటాయించాలని కోరుతుంటే, కేటాయింపులు గతం కంటే, మరింత తగ్గించారని అన్నారు. అర్బన్ ఉపాధి హామీ ఊసేలేదని అన్నారు. సామాన్యుల వ్యతిరేక, సంపన్నులకూ అనుకూలమైన ఈ బడ్జెట్‌ను వ్యతిరేకించాలని ప్రజానుకూల కేటాయింపుల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని, జులై 24, 25 తేదీల్లో నిరసనలకు ఆయన పిలుపునిచ్చారు.

బీహార్‌కు రూ. 58,900 కోట్లు
కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

బీహార్‌కు వివిధ ప్రాజెక్టులకు రూ.58,900 కోట్లు ఇస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. మంగళవారం లోక్‌సభలో ఆమె బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టుల అభివృద్ధికి సహకరిస్తామని, రూ.26,000 కోట్లతో పాట్నా-పూర్నియా ఎక్స్‌ప్రెస్ వే, బక్సర్-భాగల్పూర్ ఎక్స్‌ప్రెస్ వే, బుద్ధగయ, రాజ్‌గిర్, వైశాలి, దర్భంగా స్పర్స్, గంగా నదిపై బక్సర్ వద్ద అదనపు 2-లేన్ వంతెన నిర్మిస్తామని పేర్కొన్నారు.

రూ.21,400 కోట్ల వ్యయంతో పిర్పైంటిలో కొత్తగా 2,400 మెగా వాట్ల పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, బీహార్‌లో కొత్త విమానాశ్రయాలు, వైద్య కళాశాలలు, క్రీడలకు మౌలిక సదుపాయాలు నిర్మిస్తామన్నారు. బీహార్ తరచుగా వరదలతో బాధపడుతోందని, వాటిల్లో చాలా దేశం వెలుపల ఉద్భవించేవేనని తెలిపారు. నేపాల్‌లో వరద నియంత్రణ నిర్మాణాల ప్రణాళికలు ఇంకా పురోగతి సాధించలేదన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్ ప్రోగ్రాం, ఇతర ప్రాజెక్టులతో కోసి-మెచి ఇంట్రా స్టేట్ లింక్ రూ.11,500 కోట్ల అంచనా వ్యయంతో బ్యారేజీలు, నదుల కాలుష్య నివారణ, నీటిపారుదల వంటి 20 ప్రాజెక్టులను ఇప్పటికే కొనసాగిస్తున్నదని, కొత్త ప్రాజెక్టులకూ ఆర్థిక సహాయాన్ని అందిస్తామన్నారు. అదనంగా, కోసి సంబంధిత వరద ఉపశమన, నీటిపారుదల ప్రాజెక్టుల సర్వే, విచారణ కూడా చేపడతామని అన్నారు.

అమృత్‌సర్-కలకత్తా ఇండస్ట్రియల్ కారిడార్‌లో గయ వద్ద పారిశ్రామిక నోడ్ అభివృద్ధికి తాము మద్దతు ఇస్తామని, ఈ కారిడార్‌తో తూర్పు ప్రాంతం పారిశ్రామిక అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. అలాగే పెట్టుబడులకు మద్దతుగా అదనపు కేటాయింపు అందిస్తామని, బ్యాంకుల నుంచి సహాయం కోసం బీహార్ ప్రభుత్వం అభ్యర్థనలు వేగవంతం చేస్తామని తెలిపారు. గయలోని కాశీ విశ్వనాథ ఆలయ కారిడార్ తరహాలో విష్ణుపాద ఆలయ కారిడార్, మహాబోధి ఆలయ కారిడార్‌లను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

ఇది తిరోగమన బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

ఉపాధి కల్పన స్థాయిలను దిగజార్చేలా వున్నాయని విమర్శించింది.

ప్రభుత్వ రెవిన్యూ ఆదాయాలు 14.5 శాతం మేరకు పెరగగా, వ్యయం మాత్రం కేవలం 5.94 శాతమే పెరిగినట్లు బడ్జెట్ గణాంకాలు తెలియచేస్తున్నాయి. ఈ రెవిన్యూలను ఆర్థిక కార్యకలాపాల విస్తరణకు ఉపయోగించడానికి బదులుగా, జిడిపిలో ఆర్థిక లోటును 5.8శాతం నుంచి 4.9శాతానికి తగ్గించడం ద్వారా అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడిదారులను బుజ్జగించడానికి ఉపయోగించారని పేర్కొంది.

బడ్జెట్‌లో అంచనా వేసిన జిడిపి గణాంకాలు డేటా ఫడ్జింగ్ (సమాచారాన్ని తప్పుగా చూపించడం, మోసపూరితమైన పద్ధతి)లో మరో ప్రక్రియ అని పొలిట్‌బ్యూరో విమర్శించింది. నామమాత్రపు జీడీపీ వృద్ధి 10.5శాతమని అంచనా వేశారు, కానీ కీలకమైన ద్రవ్యోల్బణ రేటు 3శాతాన్ని మినహాయించడం ద్వారా వాస్తవిక జీడీపీ 6.5 నుండి 7శాతం మేరకు వృద్ధి చెందుతుందని అంచనా వేశారు. కీలక ద్రవ్యోల్బణం రేటులో కూడా అధిక ఆహార ద్రవ్యోల్బణం 9.4శాతాన్ని మినహాయించారు. ఆ రకంగా వాస్తవిక జిడిపి వృద్ధిని ఎక్కువ చేసి చూపించారని సిపిఎం విమర్శించింది.

ప్రభుత్వ వ్యయాన్ని మరింతగా కుదించారు. సబ్సిడీల్లో గణనీయంగా కోత విధించారు. ఎరువుల సబ్సిడీని రూ.24,894 కోట్ల మేరకు కోత విధించారు. ఆహార సబ్సిడీని రూ.7082 కోట్ల మేరకు కోత పెట్టారు. విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి రంగాలపై వ్యయాలను జిడిపిలో శాతంగా గనక చూసినట్లైతే పెద్దగా మార్పేమీ లేదని చెప్పవచ్చని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో పేర్కొంది. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్)ను మరింతగా నిర్లక్ష్యం చేస్తూనే వచ్చారు. బడ్జెట్ కేటాయింపులు రూ.86వేల కోట్లు వున్నాయని, ఇది, 2023 ఆర్థిక సంవత్సరంలో ఖర్చు పెట్టిందానికన్నా తక్కువేనని పేర్కొంది. ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి నాలుగు మాసాల్లో ఇప్పటికే రూ.41,500కోట్లు ఖర్చు పెట్టగా, మిగిలిన 8మాసాల కాలంలో కేవలం రూ.44,500కోట్లు మాత్రమే ఖర్చు పెట్టడానికి వున్నాయి. గ్రామీణ భారతంలో తీవ్రంగా నెలకొన్న నిరుద్యోగ సంక్షోభాన్ని ఎదుర్కొనడానికి ఇవి ఎంత మాత్రమూ సరిపోవనేది స్పష్టమవుతోందని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామనే పేరుతో, బడ్జెట్ అనేక జిమ్మిక్కులకు పాల్పడింది. ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్‌గా తీసుకువచ్చిన కొత్త పథకం కింద సాధికార రంగంలో కొత్తగా చేరి రూ.లక్ష కన్నా తక్కువ సంపాదిస్తున్న వారికి ఒక నెల వేతనాన్ని ఇస్తామని ప్రకటించింది. అర్హులైన వర్కర్లు గరిష్టంగా రూ.5 వేలను మూడు నెలవారీ వాయిదాల్లో పొందుతారని పొలిట్‌బ్యూరో తెలిపింది. అయితే, దీనివల్ల యజమానులు ఎక్కువగా లబ్ది పొందుతారని పేర్కొంది. రెండేళ్లలో సృష్టించిన ప్రతి అదనపు ఉద్యోగానికి రూ.లక్ష వరకు నెల జీతం వున్న ప్రతి ఒక్క కొత్త ఉద్యోగి వల్ల రూ.72 వేలు చొప్పున, 24 నెలవారీ వాయిదాల్లో యజమానులు లబ్ధి పొందుతారు. ఇటువంటి జిమ్మిక్కుల వల్ల ఉపాధి కల్పన జరగబోదని సిపిఎం పేర్కొంది. గత సంవత్సరాల్లో కార్పొరేట్ రంగం సంపాదించిన భారీ లాభాలు భారీ యంత్రాలు, ఉత్పత్తి రంగాల్లో పెట్టుబడుల రూపంలో కనిపించడం లేదు. ఆర్థిక వ్యవస్థలో నిలకడగా డిమాండ్ లేకపోవడమే ఇందుకు కారణంగా వుంది. దీనివల్ల ప్రజల్లో కొనుగోలు శక్తి బాగా క్షీణించిందని పేర్కొంది.

యువతలో నైపుణ్యాలను పెంపొందించే పథకాలను బడ్జెట్‌లో బాగా ప్రముఖంగా ప్రస్తావించారు. అయితే దీనివల్ల కూడా తీవ్రంగా వున్న నిరుద్యోగ సమస్య పరిష్కారం కాదు. 2016-2022ల్లో కేవలం 18శాతం మంది యువత మాత్రమే నైపుణ్యాల అభివృద్ధి పథకాల ద్వారా శిక్షణ పొంది ఉద్యోగాలు సంపాదించుకున్నారు. మరోసారి ఇక్కడ సుస్పష్టం చేయాల్సిన అంశమేమంటే ఆర్థిక కార్యకలాపాలు విస్తరించకపోతే వృద్ధి చెందలేం. 'సహకార సమాఖ్యవాదం' గురించి అంతలా చెప్పినప్పటికీ



రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఇబ్బందులు పడుతున్నాయి. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఆంధ్రప్రదేశ్, బీహార్‌ల పరిస్థితి మాత్రం వేరుగా వుంది. మిత్రపక్షాల మద్దతుపై ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ, జనతాదళ్ (యునైటెడ్)లపై ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం మనుగడ ఆధారపడింది. అయితే, రాష్ట్రాలకు ఆర్థిక సంఘం మంజూరు చేసే నిధులు (పన్నుల ద్వారా వచ్చేది కాకుండా) 2022-23లో రూ.1,72,760 కోట్లు వుండగా, 2023-24కి వచ్చేసరికి రూ.1,40,429 కోట్లకు పడిపోయాయి. ఈ బడ్జెట్ ఈసారి ఇంకా కుదించబడి, 1,32,378 కోట్లకు చేరుకుంది. మొత్తమ్మీద చూసినట్లైతే, ఈ బడ్జెట్ సంపన్నులను మరింత సంపన్నులుగా చేయడానికి, పేదలను మరింత దుర్భర దారిద్ర్యంలోకి నెట్టడానికి ఉద్దేశించబడిందని పేర్కొంది. దేశంలోని సూపర్ సంపన్నులపై సంపద పన్ను లేదా వారసత్వపు పన్ను విధింపు ప్రతిపాదనను పరిశీలించేందుకు కూడా తిరస్కరించింది. ప్రజలపై పడే పరోక్ష పన్ను భారానికి ఉపశమనం కూడా ఈ బడ్జెట్‌లో లేదని విమర్శించింది. దేశ ప్రజలు, ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించడంలో విఫలమైనందుకు నిరసనగా ఆందోళనలు చేపట్టాల్సిందిగా అన్ని పార్టీ శాఖలకు పొలిట్‌బ్యూరో పిలుపునిచ్చింది.

బంగారంపై కస్టమ్స్ సుంకం తగ్గింపు

న్యూఢిల్లీ : దేశంలో భారీగా పెరిగిన బంగారం ధరల నుంచి వినియోగదారులకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది. బంగారం, వెండితో పాటు ప్లాటినంపై కస్టమ్స్ సుంకాన్ని తగ్గిస్తున్నట్లు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో తెలిపారు. బంగారం, వెండిపై కస్టమ్స్ సుంకాన్ని 6 శాతానికి కోత పెట్టినట్లు వెల్లడించారు. ఇంతక్రితం ఈ లోహాలపై ఏకంగా 15 శాతం కస్టమ్స్ సుంకం అమల్లో ఉంది. ప్లాటినంపై కస్టమ్స్ ట్యాక్స్‌ను 6.4 శాతానికే పరిమితం చేస్తున్నట్లు తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పసిడి దిగుమతులు రూ.2.8 లక్షల కోట్లుగా నమోదయ్యాయని విజ్ఞాహర్తా గోల్డ్ ఛైర్మన్ మహేంద్ర లునియా పేర్కొన్నారు. దీంతో పసిడి పరిశ్రమపై ఏకంగా రూ.42వేల కోట్ల పన్ను భారం పడిందన్నారు. బంగారంపై సుంకాన్ని 15 శాతం నుంచి ఆరు శాతానికి తగ్గించడంతో పరిశ్రమకు మేలు జరగనుందన్నారు. డిమాండ్ కూడా పెరగనుందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.2,990 తగ్గి రూ.70,860 వద్ద ముగిసింది. 22 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన బంగారంపై రూ. 2,750 తగ్గి రూ.64,950గా నమోదయ్యింది. కిలో వెండిపై రూ.3500 దిగివచ్చి రూ.92,500గా పలికింది.

సంపాదకీయం

చెంచు జాతికేది చేయూత..!

చెంచు జాతి అంతరించిపోతోంది. ఆ జాతికి ఆదరణ కరువైంది. ఐదవ షెడ్యూల్ ఉన్నా దాన్ని ఆచరణలో పెట్టే నాథుడే లేడు. ఇటీవల కొల్హాపూర్ మండలం, మొలచింతపల్లి గ్రామంలో ఈశ్వరమ్మపై జరిగిన పాశవిక లైంగిక దాడే దీనికి తాజా ఉదాహరణ. తీగలాగితే డొంకంతా కదిలినట్టు చెంచుల అత్యంత దయనీయమైన జీవితాలు వెలుగులోకి వచ్చాయి. ఇది కేవలం ఓ మహిళపై జరిగిన హింస మాత్రమే కాదని, ఆ జాతుల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యానికి, పెత్తం దార్ల దాష్టికానికి నిదర్శనమని తేలింది. ఏండ్ల నుండి ఆ జాతులెదుర్కొంటున్న సమస్యలు ఇప్పుడు ప్రధాన ఎజెండాగా మారాయి.

కొల్లాపూర్ చుట్టూ ఉన్న నల్లమల అడవిలో 16 చెంచు పెంటల(గూడాలు)ను 90వ దశకంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల సాయంతో బలవంతంగా ఖాళీ చేయించింది. నక్సలైట్లకు అన్నం

ఐదో షెడ్యూల్ ప్రాంతంలో జీవించే వారి సమస్యలు పరిష్కరించే హక్కు రాజ్యాంగం గవర్నర్‌కు ఇచ్చింది. చివరకు గవర్నర్లు సైతం వారి బాధ్యత మర్చిపోతున్నారు. అందుకే టీఏజీఎస్ ప్రతినిధి బృందం ఇటీవల గవర్నర్‌ను కలిసి సమస్య విన్నవించి, బాధ్యత గుర్తు చేసింది. ఐదో షెడ్యూల్ ప్రాంతంలోని గ్రామాన్ని ఖాళీ చేయిస్తే తిరిగి వారికి ఐద షెడ్యూల్ ప్రాంతంలోనే పునరావాసం కల్పించాలి. లేదంటే వారికి పునరావాసం కల్పించిన ప్రాంతాన్నయినా ఐదో షెడ్యూల్లో చేర్చాలనే నిబంధన ఉంది. కానీ ప్రభుత్వాలు ఇవేవీ పట్టించుకోవడం లేదు.

పెడుతున్నారనే కారణాన్ని దీనికి వాడుకుంది. మొలచింతలపల్లి గ్రామంలో భ్రమరాంబిక కాలనీ ఏర్పాటు చేసి అక్కడ వీరిని వదిలిపెట్టారు. కానీ అక్కడ వీరి ఆశ్రయం భ్రమలాగే మిగిలింది. అప్పటి వరకు పోడుభూముల్లో వ్యవసాయం చేసుకుంటూ, ఆహారాన్ని సేకరించు కుంటూ జీవనం గడిపే వీరు మైదానం ప్రాంతంలో బతుకు పోరాటం మొదలుపెట్టారు.



అడవి నుంచి గ్రామానికి తరలించడంతో జీవన విధానంలో ఒక్కసారిగా వచ్చిన మార్పులను తట్టుకోలేకపోయారు. ఒడ్డున పడ్డచేపల్లా విలవిల్లాడి పోయారు. ఆనాటి నుండి భూమి లేక, ఆహారాన్ని సేకరించుకునే దారిలేక అత్యంత దయనీయ పరిస్థితుల్లో జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఉండటానికి ఇల్లు, బతకడానికి ఉపాధి, పిల్లలు చదువుకోడానికి పాఠశాలలు, చివరకు సరైన వైద్య సదుపాయాలు కూడా లేవు. అంతెందుకు వీరెవరికీ ఆధార్ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు సైతం లేవు. అంటే కేంద్ర ప్రభుత్వం ప్రకారం వీరంతా కనీసం తమ పౌరసత్వాన్ని కూడా నిరూపించుకోలేని దుస్థితిలో బతుకుతున్నారన్నమాట!

రాష్ట్రంలో అంతరించి పోతున్న జాతుల్లో చెంచులతో పాటు కొలామ్స్, తోటి, ఆమ్ద్, కొండరెడ్డి వంటి జాతులు కూడా ఉన్నాయి. ఆదివాసీల హక్కులు, వాటి అమలులో ప్రభుత్వ చూపుతున్న నిర్లక్ష్యమే దీనికి కారణం. రక్షించాల్సిన వారే భక్షిస్తుంటే ఆ జాతులు అంతం కాక అభివృద్ధి ఎలా చెందుతాయి? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యం గిరిజనులను కొల్లగొట్టే విధానాలనే అనుసరిస్తున్నాయి. అడవి భూములను కార్పొరేట్లకు కట్టబెడుతూ జల్, జంగిల్, జమీన్‌కు అడవి బిడ్డలను దూరం చేస్తున్నాయి. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి బడ్జెట్‌లో అంతరించిపోతున్న జాతులకు ఇండ్లు నిర్మిస్తున్నామంటూ ప్రచారం చేసుకుంటున్నది. కానీ ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ఇల్లు ఇవ్వలేదు. దీనికి నల్లమల చెంచులే ఉదాహరణ. అలాగే 2006లో ఆదివాసీలకు హక్కు పత్రాలు ఇవ్వాలని చట్టం వచ్చింది. దీన్ని ఎక్కడా అమలు చేయడం లేదు.

ఇక రాష్ట్రంలో భద్రాచలం, ఏటూరు నాగారం, ఉట్నూరు, మన్ననూర్ కేంద్రాలుగా నాలుగు ఐటీడీఏలున్నాయి. వీటిలో దేనికీ ప్రాజెక్ట్ ఆఫీసర్లు లేరు. అత్యంత దారుణమైన విషయం ఏమిటంటే రేవంత్‌రెడ్డి సొంత జిల్లా మహబూబ్ నగర్‌లోని మన్ననూర్ ఐటీడీఏకి సైతం ప్రాజెక్ట్ ఆఫీసర్ లేరు. ముఖ్యమంత్రి సొంత జిల్లా పరిస్థితే ఇలా ఉంటే ఇక మిగిలిన జిల్లాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవల్సిన పనిలేదు. ఈశ్వరమ్మ ఘటన జరిగింది కూడా ఈ ఐటీడీఏ పరిధిలోనే. అలాగే రాజ్యాంగం ప్రకారం ప్రతి రాష్ట్రంలో ఆదివాసీ ఎమ్మెల్యేలతో ట్రైబల్ అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు అవుతున్నా ఇప్పటి వరకు ఆ ఊసే ఎత్తలేదు. ఆదివాసీల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి ఇంతకు మించి మరో ఉదాహరణ అవసరం లేదనుకుంటా!

ఐదో షెడ్యూల్ ప్రాంతంలో జీవించే వారి సమస్యలు పరిష్కరించే హక్కు రాజ్యాంగం గవర్నర్‌కు ఇచ్చింది. చివరకు గవర్నర్లు సైతం వారి బాధ్యత మర్చిపోతున్నారు. అందుకే టీఏజీఎస్ ప్రతినిధి బృందం ఇటీవల గవర్నర్‌ను కలిసి సమస్య విన్నవించి, బాధ్యత గుర్తు చేసింది. ఐదో షెడ్యూల్ ప్రాంతంలోని గ్రామాన్ని ఖాళీ చేయిస్తే తిరిగి వారికి ఐద షెడ్యూల్ ప్రాంతంలోనే పునరావాసం కల్పించాలి. లేదంటే వారికి పునరావాసం కల్పించిన ప్రాంతాన్నయినా ఐదో షెడ్యూల్లో చేర్చాలనే నిబంధన ఉంది. కానీ ప్రభుత్వాలు ఇవేవీ పట్టించుకోవడం లేదు. దాంతో ఆ జాతులు ఉపాధి కోసం వెళ్లి పెత్తందార్ల దాష్టికాలకు బలైపోతున్నాయి. అలా బలైపోయిందే ఈశ్వరమ్మ కుటుంబం.

ఎన్నికలప్పుడు ఆదివాసీలను తమ ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్న ప్రభుత్వాలు వీరి సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఈ జాతులు పూర్తిగా అంతరించే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలి. ఆదివాసీల జీవితాల పట్ల అవగాహన ఉన్న మాజీ ఐఏఎస్ అధికారులను ఐటీడీఏలకు ప్రాజెక్ట్ ఆఫీసర్లుగా నియమించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే పథకాల్లో ఈ జాతులకు ప్రాధాన్యం ఇవ్వాలి. అన్నింటికంటే ముఖ్యంగా వీరి రక్షణ విషయంలో ప్రభుత్వాలు పూర్తి బాధ్యత తీసుకుంటేనే చెంచు జాతి మిగులుతుంది, బతుకుతుంది.

అమానవీయ దాడుల్ని అరికట్టలేరా?

శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశం ఎంతో పురోగతి సాధిస్తున్నదని చెబుతున్న పాలకులు దళితులపై జరుగుతున్న అమానవీయ దాడులను అరికట్టడంలో విఫలమవుతూనే ఉన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నుంచి మొదలుకుని ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు సైతం పట్టించుకోని పరిస్థితి. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిస్తే దళితులకు పూర్తిస్థాయిలో అండగా ఉంటామని, రక్షణగా నిలుస్తామని ఎన్నికల ముందు ప్రకటించిన రేవంత్‌రెడ్డి ఆ దిశగా పయనించక పోవడం బాధాకరం. ఎందుకంటే అధికారంలోకి వచ్చి ఏడునెలలు గడుస్తున్నా దళితులకు సంబంధించిన అంశాలపై చర్చించకపోవడం, గ్రామాల్లో మధ్య యుగాల నాటి మనుస్మృతి శిక్షలు దళితులపై అమలు చేస్తుంటే పట్టించుకోకపోవడం, కారకులపై చర్యలు తీసుకోక పోవడం కాంగ్రెస్ డొల్లతనాన్ని బయటపెడుతున్నది. దళితులపై వరుస ఘటనలు జరుగుతున్నా పార్టీ లేదా ప్రభుత్వం నుంచి ఖండించకపోవడం చూస్తే ఈ ప్రభుత్వం ఎవరికోసం పనిచేస్తోందన్న ప్రశ్న తలెత్తకమానదు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనే రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామంలో పెత్తందారులు మూకుమ్మడిగా దళితవాడపై దౌర్జన్యం చేశారు పన్నెండుమంది దళితులను కర్రలతో దాడిచేసి కొట్టారు. తీవ్రంగా గాయపరిచారు. దళితుల చర్చి ప్రహరీని కూల్చుతూ రోడ్డు వేయడాన్ని వారు అడ్డుకోగా ఈ దాడి జరిగింది. దాడిచేసిన వారితోపాటు దాడికి గురైై క్షతగాత్రులైన బాధితులపై కూడా కేసులు నమోదు



చేయడం విచారకరం.సిద్దిపేట జిల్లా కేంద్రానికి పన్నెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న సీతారాంపల్లి గ్రామంలో హనుమాన్ మాల వేసుకున్న దళితులు భిక్ష సందర్భంగా గుడిలోకి వెళ్లగా రానీయ కుండా ఆ గ్రామ పెత్తందారులు అడ్డుకుని గెంటేశారు. అంటే దళితులు గుడిలోకి వెళ్లే అర్హత లేదా? 'మీరు అంటరానివారు. గుడి గడప తొక్కడానికి వీల్లేదు' అని బెదిరించడం చూస్తుంటే అ అమానవీయ ఘటనలకు ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుంది? నాగర్ కర్నూలు జిల్లా మూల చింతలపల్లి చెంచు మహిళ ఈశ్వరమ్మ గురించి తెలిసిందే. అదే గ్రామానికి చెందిన పెత్తందారుడు ఆమె భూమిని లాక్కోవడానికి చూస్తే ఈశ్వరమ్మ ప్రతిఘటించడటంతో జనం చూస్తుండగానే పెత్తందారు తనభార్యను ఉసిగొల్పడంతో ఆమె మర్మాంగంలో కారంపోసి సజీవదహనం చేయడానికి డీజిల్ పోసేందుకు ప్రయత్నించడాన్ని ఏమనాలి? మనం ఏ కాలంలో ఉన్నామనేది ఈ ఒక్క ఘటన చాలదూ! ఇంతటి దాష్టీకం జరిగితే మంత్రులుగానీ, ముఖ్యమంత్రి గానీ ఖండించిన పాపాన పోలేదు.

ఇలాంటి ఘటనలే కాదు అగ్రకులాలకు చెందిన వారిని దళితులు ప్రేమించిన తప్పేనట. ఇష్టపడి ప్రేమించుకున్న పాపానికి ఇరువురి కులాలు వేరు కావడం, వారిపై కులదురహంకార దాడులు జరగడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు సమాజంలో అనేకం. సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో దళిత యువకుడు తుడుం శ్రీనాథ్ అక్కడి అగ్రకులం అమ్మాయిని ప్రేమించాడు. పెండ్లి చేస్తామని చేస్తామని అమ్మాయి సోదరుడు, మరో ఇద్దరు కలిసి సౌదీలో ఉన్న అతన్ని పిలిపించి విపరీతంగా కొట్టడంతో అవమానభారంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలా ఒక్కటి కాదు, రెండు కాదు మన చుట్టూ ఎన్నో ఘటనలు చోటుచేసుకుంటున్నా ఒక్క కేసులోనైనా నిందితులను అరెస్టు చేసింది లేదు.

ఇంకా చెప్పాలంటే ప్రభుత్వ ఉద్యోగులయిన దళితులకు కూడా రాష్ట్రంలో రక్షణ లేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్‌ను తన పై అధికారి అయిన సీఐ, మరో ఐదుగురు కానిస్టేబుళ్లు కలిసి కులం పేరుతో వేధించడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. తనపై జరుగుతున్న వేధింపుల పట్ల సీపీకి లిఖిత పూర్వకంగా వివరాలు రాసి పంపాడు. ఈ ఘటనకు పూర్తి బాధ్యులుగా ఉన్న వారిని శిక్షించలేదు, కానీ ప్రజా సంఘాల పోరాటం వల్ల తర్వాత సీఐని సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారు. చట్టాలు అమలు చేసే పోలీసుశాఖలో కూడా అగ్రకులాల వేధింపులున్నాయని చెప్పే ఘటనిది.

జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సుల మేరకు కులవివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా ప్రతినెలా చివరి రోజున గ్రామాల్లో చైతన్యసభలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దళితుల్లో ఉన్న నిరక్షరాస్యత, పేదరికం, అమాయకత్వం మూలంగా ఇలాంటి అఘాయిత్యాలు జరుగుతున్నాయి. అందుకే దళితులకు సమాజంలో సరైన గౌరవమివ్వాలి. వారు ఎదుర్కొంటున్న ప్రధాన మౌలిక సమస్యలైన భూమి, విద్య, ఉపాధి, వైద్యం వంటి కీలకమైన అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలి. అది జరగనంత వరకు వివక్షలు, వేధింపులు సమాజంలో పునరావృతమవుతూనే ఉంటాయి. అందుకే తక్షణ కర్తవ్యంగా దళితులపై దౌర్జన్యాలను అరికట్టేందుకు ప్రజా సంఘాలు నిరంతరం పోరాడటం, ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ద్వారా ఈ దాడుల్ని కొంతవరకు అరికట్టగలం.

- టి. స్కైలాబ్‌బాబు, 9177549646

ట్రంప్ గెలుపోటముల చుట్టూ అమెరికా రాజకీయం!



ఎం కోటేశ్వరరావు
8331013288

అమెరికా అధ్యక్షుడు, రెండవసారి పోటీచేసేందుకు ప్రయత్నించిన డెమోక్రటిక్ పార్టీ నేత జో బైడెన్ తాను పోటీ పరుగు నుంచి తప్పుకుంటున్నట్లు ఆదివారం నాడు ప్రకటించటమే కాదు, అధ్యక్ష పదవి అభ్యర్థిగా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌ను బలపరుస్తున్నట్లు వెల్లడించారు. అమెరికా చరిత్రలో అధికారంలో ఉండి పోటీ నుంచి తప్పుకున్న తొలి వ్యక్తిగా చరిత్రకెక్కాడు. ముదిమితో మతి తప్పి మాట్లాడుతున్న 81ఏండ్ల బైడెన్ పోటీ నుంచి వైదొలగి వేరొకరికి అవకాశం ఇవ్వాలన్న ఒత్తిడి గత కొద్ది వారాలుగా వచ్చింది. అయినప్పటికీ పోటీలో ఉంటానని చెప్పిన పెద్దమనిషి ఆకస్మికంగా ప్రకటించటంతో డెమోక్రాట్లు కొత్త అభ్యర్థికోసం హడావుడి పడుతున్నారు. ఆగస్టు 19-22వ తేదీలలో పార్టీ ప్రతినిధుల సమావేశంలో ఎన్నిక జరుగుతుంది. మరి కొంతమంది కూడా పోటీలో ఉన్నట్లు వార్తలు వచ్చినా బైడెన్ ప్రకటన తరువాత జరిగిన పరిణామాలను బట్టి చూస్తే అనూహ్య పరిణామాలు జరిగే తప్ప డోనాల్డ్ ట్రంప్‌ను ఢీకొనబోయేది కమలాహారిస్ అని చెప్పవచ్చు. డోనాల్డ్ ట్రంప్ పలుకుబడి దిగజారినట్లు, హత్యాయత్నం జరిగిన తరువాత ట్రంప్ విజయావకాశాలు మరింత పెరిగినట్లు వార్తలు వచ్చిన పూర్వరంగం జోబైడెన్ నిర్ణయాన్ని వేగిరం కావించింది.

బైడెన్ నిర్ణయం అమెరికా లోపలా వెలుపలా, శత్రువులూ, మిత్రుల మధ్య చర్చనీయాంశమైంది. మిత్రదేశాల నేతలందరూ సానుకూలంగా మాట్లాడారు. "ఇటీవలి సంవత్సరాలలో అమెరికాలో జరుగుతున్న పరిణామాలు మాకు ఒక అంశాన్ని నేర్పాయి, అదేమిటంటే దేని గురించి మేము ఆశ్చర్యపడాల్సిందేమీ ఉండదు అని, ఈ అంశం అమెరికా ఓటర్లకు సంబంధించింది తప్ప మాది కాదు, భవిష్యత్‌లో రెండు దేశాల మధ్య సంబంధాలు ఎలా ఉంటాయన్నదే మాకు చాలా ముఖ్యం, ఇప్పుడవి చరిత్రలో అత్యంత దిగజారిన స్థితిలో ఉన్నాయి" అని రష్యా ప్రతినిధి స్పందించారు. ఇది వారి అంతర్గత అంశమని చైనా పేర్కొన్నది.అయితే అక్కడి మీడియా, సామాజిక మాధ్యమంలో పెద్ద స్పందన వెలువడింది. నలభైకోట్ల మంది ఈ వార్తను చూసినట్లు లక్షలది మంది వ్యాఖ్యలు చేసినట్లు వాయిస్ ఆఫ్ అమెరికా పేర్కొన్నది. అధ్యక్ష పీఠంపై ఎవరు ఉన్నా అమెరికా పెద్దన్నకే అగ్రతాంబూలం అన్నట్లుగా వ్యవహరి స్తారన్నది తెలిసిందే. ఈ కారణంగానే ఎన్నికలు వారి అంతర్గత అంశమైనప్పటికీ అనేక దేశాల నేతలు స్పందించారు. అంతర్గతంగా కమలాహారిస్ గెలుస్తారా, ఆమె బలం, బలహీనతలు ఏమిటన్న చర్చ మొదలైంది. బైడెన్ ప్రకటన వెలువడగానే ఆమె స్పందించారు." పార్టీని ఐక్యంగా ఉంచేందుకు చేయాల్సిందంతా చేస్తాను. డోనాల్డ్ ట్రంప్‌ను, ప్రమాదకరమైన అతగాడి ప్రాజెక్టు 2025 అజెండాను ఓడించేందుకు గాను దేశాన్ని ఐక్యం చేసేందుకు పూనుకుంటానని" పేర్కొన్నారు.

ప్రపంచంలో దిగజారుతున్న ఆర్థిక పరిస్థితులను పరిష్కరించటంలో పెట్టుబడిదారీ వ్యవస్థ వైఫల్యం చెందింది. జనం దగ్గర దారిలో పరిష్కారాల కోసం చూస్తున్నారు. పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయం సోషలిస్టు వ్యవస్థతప్ప ఇప్పటికి మరొకటి లేదు. అయితే సోవియట్ యూనియన్, ఇతర దేశాల్లో జరిగిన ప్రయోగాలు, వాటి గురించి సోషలిజం అనుకూల శక్తులలోనే తలెత్తిన విబేధాలు, వ్యతిరేకులు చేసిన ఎదురుదాడి నేపథ్యంలో జనం గందరగోళంలో ఉన్నారు. దీన్ని అవకాశంగా తీసుకొని పెట్టుబడిదారీ విధానాన్ని సమర్థించేందుకు, కాపాడేందుకు అవసరమైతే నిర్బంధకాండకు సైతం సిద్ధపడే పచ్చిమితవాద, ఫాసిస్టు శక్తులు రంగంలోకి వస్తున్నాయి.ఐరోపాలో ఈ పరిణామం స్పష్టంగా కనిపిస్తోంది. అమెరికా కూడా దీనికి మినహాయింపు కాదు. ప్రాజెక్టు 2025ను రూపొందించిన హెరిటేజ్ ఫౌండేషన్ మితవాద, నిరంకుశుల అజెండా. ట్రంప్ అధికారానికి వస్తే అమలు జరుపుతారనే ప్రచారం ఉంది. దీన్ని జనంలోకి తీసుకెళ్తే జో బైడెన్ మరోసారి ఎన్నికౌతారని డెమోక్రాట్లు భావించారు. ఇప్పుడు రంగం నుంచి తప్పుకున్నప్పటికీ ట్రంప్‌ను దెబ్బకొట్టగలిగే అస్త్రం ఇదే అని వారు ఇప్పటికీ భావిస్తున్నారు.కమలా హారిస్ మాటల భావమిదే.

అసలేమిటిది?

పచ్చి మితవాద భావజాల సంస్థ హెరిటేజ్ ఫౌండేషన్ 1973లో ఉనికిలోకి వచ్చింది. వందకు పైగా అలాంటి బృందాల సలహాలతో 922 పేజీల విశ్లేషణ, సిఫార్సులే ప్రాజెక్టు 2025. దీని వెనకాల ఉన్నది ఎవరో నాకు తెలియదు.వారితో నాకెలాంటి సంబంధమూ లేదు అని ఇటీవల ట్రంప్ చెప్పుకున్నాడు. ఎన్నికలు ముగిసేవరకు ట్రంప్ ఇదే నాటకాన్ని కొనసాగిస్తాడన్నది తెలిసిందే. అయితే బుకాయించినా గతంలో అతని దగ్గర పనిచేసిన వారూ, మద్దతుదారులందరూ దాని రూపకల్పనలో భాగస్వాములే కనుక, దాన్నే అమలు జరుపుతారని వేరే చెప్పనవసరం లేదు. మన దేశంలో ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, ప్రపంచ వాణిజ్య సంస్థ చేసిన సిఫార్సులు, ఆదేశాలను అమలు జరుపుతున్న పార్టీలేవీ ఎక్కడా బహిరంగంగా వాటి గురించి చెప్పరు. అవన్నీ తమ విధానాలే అని జనాన్ని నమ్మించేందుకు చూస్తాయి.తమ ముద్రవేసుకుంటాయి. ఈ విషయంలో కాంగ్రెస్, బీజేపీ, తెలుగుదేశం, బీఆర్ఎస్ ఇలా ఏ పార్టీని చూసినా అదే కనిపిస్తుంది. అందుకే ఈ పార్టీల మధ్య అధికారం కోసం కుమ్ములాటలుంటాయి తప్ప విధానపరంగా ఎలాంటి ఘర్షణ ఉండదు. ఫాసిస్టు శక్తులు అధికారంలోకి రాకుండా అడ్డుకొనేందుకు వాటిని వ్యతిరేకించే మితవాద, వామపక్ష శక్తులందరూ ఇటీవలి ఫ్రెంచి పార్లమెంటు ఎన్నికల్లో చేతులు కలిపి ప్రస్తుతానికి ఆ ముప్పును తప్పించిన సంగతి తెలిసిందే. అమెరికాలో కూడా ట్రంప్‌కు వ్యతిరేకంగా అదే జరగనుందా?

అధ్యక్ష స్థానానికి ఎన్నికయ్యేవారు, నియమిత అధికార యంత్రాంగానికి ఇప్పుడున్న వాటి కంటే అధికారాలను మరింతగా కట్టబెట్టటం, మరింత కేంద్రీకరించటం ప్రాజెక్టు 2025లక్ష్యాలలో ఒకటి.అధికార దుర్వినియోగానికి ఇది బాటవేస్తుందని భావిస్తున్నారు. సంక్షేమ పథకాలకు కోతపెట్టాలని, నియంత్రణలను నామమాత్రం చేయాలని కార్పొరేట్, మితవాద శక్తులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నాయి, అందువలన వీటి సాధన రెండవది.సామాజిక, మతపరమైన అంశాలలో రిపబ్లికన్లు, డెమోక్రాట్ల మధ్య వ్యత్యాసం ఉంది.అబార్షన్లను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వ అధికారాలను వినియోగించాలని, గర్భనిరోధ పద్ధతులను పరిమితం చేయాలని, బూతుపై నిషేధం, ఆ ఇతివృత్తంతో తీసే సినిమాలు, సీరియళ్లు, ఇతర ఉత్పత్తులను సృష్టించేవారు, వాటిని పంపిణీ చేసే వారి మీద నిషేధం పెట్టాలని, శిక్షించాలన్న అజెండా కూడా దీనిలో ఉంది. ఇవన్నీ నిరంకుశ, తిరోగామి ప్రతిపాదనలని వేరే చెప్పనవసరం లేదు. నిజానికి ఇవి కొత్త ఆలోచనలు, ప్రతిపాదనలూ కావు.వీటిని అమలు జరిపేందుకు తగిన వాడు ట్రంప్ అని భావించటమే తాజాదనం. తన ఓటమిని అంగీకరించకుండా, జోబైడెన్ ఎన్నికను అధికారికంగా ప్రకటించకుండా అడ్డుకొనేందుకు అమెరికా అధికార కేంద్రం మీద దాడి చేయించిన ట్రంప్‌కే ఈ అజెండాను అమలు చేసే దమ్ము ఉంటుదని అనేక మంది గట్టిగా భావిస్తున్నారు. ఇదే



ప్రపంచంలో దిగజారుతున్న ఆర్థిక పరిస్థితులను పరిష్కరించటంలో పెట్టుబడిదారీ వ్యవస్థ వైఫల్యం చెందింది. జనం దగ్గర దారిలో పరిష్కారాల కోసం చూస్తున్నారు. పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయం సోషలిస్టు వ్యవస్థతప్ప ఇప్పటికి మరొకటి లేదు. అయితే సోవియట్ యూనియన్, ఇతర దేశాల్లో జరిగిన ప్రయోగాలు, వాటి గురించి సోషలిజం అనుకూల శక్తులలోనే తలెత్తిన విబేధాలు, వ్యతిరేకులు చేసిన ఎదురుదాడి నేపథ్యంలో జనం గందరగోళంలో ఉన్నారు. దీన్ని అవకాశంగా తీసుకొని పెట్టుబడిదారీ విధానాన్ని సమర్థించేందుకు, కాపాడేందుకు అవసరమైతే నిర్బంధకాండకు సైతం సిద్ధపడే పచ్చిమితవాద, ఫాసిస్టు శక్తులు రంగంలోకి వస్తున్నాయి.ఐరోపాలో ఈ పరిణామం స్పష్టంగా కనిపిస్తోంది.అమెరికా కూడా దీనికి మినహాయింపు కాదు.

మితవాదులను వ్యతిరేకించేవారిలో ఇటీవల ఆందోళనను పెంచుతోంది. లక్షలాది మంది పౌర ఉద్యోగులను తొలగించి తన మద్దతుదార్లను నియమించేందుకు 2020లో ట్రంప్ నిర్ణయించాడు. అయితే అమలు జరిపే సమయానికి ఎన్నికల్లో ఓడి పదవి నుంచి దిగిపోయాడు. ఆ నిర్ణయాన్ని బైడెన్ రద్దు చేశాడు. ఇప్పుడు ట్రంప్ గెలిస్తే తన అజెండాను అమలు జరపవచ్చని భావిస్తున్నారు. విద్యా శాఖను రద్దు చేసి అమ్మఒడి-తల్లికి వందనం పేరుతో అమ్మలకు ఇస్తున్న నగదు మాదిరే ప్రయివేటు స్కూళ్లకు పంపే తలిదండ్రులకు నగదు ఇవ్వాలని మితవాదులు కోరుతున్నారు. తక్కువ రాబడి వచ్చే స్కూళ్లకు నిధుల నిలిపివేత, మధ్యాహ్న భోజన పథకాల రద్దు, విద్యారుణాలను విధిగా వసూలు చేయాలనే చర్యలు చేపట్టవచ్చు. పర్యావరణ హాని నివారణ చర్యలను నిలిపివేయాలని, హరిత ఇంధన సబ్సిడీలను ఎత్తివేయాలని, చమురు, గ్యాస్ వెలికితీతపై పర్యావరణ ఆంక్షలను రద్దు చేయాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. అక్రమంగా వచ్చిన వారికి విద్యా రుణాలు ఇవ్వకూడదని, ప్రభుత్వ సహాయం పొందే గృహాల్లో వారికి అవకాశం కల్పించరాదని, అక్రమ ప్రవేశాల నిరోధానికి సరిహద్దుల్లో అశ్వికదళాలను తిరిగి నియమించటమే గాక విస్తరించాలని కోరుతున్నారు. ఇలాంటి ప్రతిపాదనలతో ఉన్నదే ప్రాజెక్టు 2025. దీని రూపకల్పనలో భాగస్వాములు, వాటితో ఏకీభవించేవారిని యంత్రాంగంలో నియమించి వారి పేరుతో అమలు జరిపించేందుకు ట్రంప్ చూస్తున్నారని పురోగామివాదులు అనేక మంది హెచ్చరిస్తున్నారు.

హెరిటేజ్ ఫౌండేషన్‌కు నిధుల కొరత లేదు. అధ్యక్షుడిగా ఎవరు ఎన్నిక కావాలనేదానికంటే ప్రభుత్వాన్ని ప్రభావితం చేసే రీతిలో తన మనుషులను యంత్రాంగంలోకి పంపేందుకే ఇది ప్రాధాన్యత ఇస్తుంది. ఇరవైవేల మంది సుశిక్షితులైన కార్యకర్తలు, ఇరవైలక్షల మంది స్వచ్ఛంద కార్యకర్తలు దీనికి ఉన్నట్లు అంచనా. దాని అజెండాను అమలు జరిపేందుకు, ప్రజాప్రతినిధులను ప్రభావితం చేసేందుకు, సామాజిక మాధ్యమంలో జనాన్ని సమీకరించేందుకు వారంతా రంగంలోకి దిగుతారు. అనేక మందిని పార్లమెంటరీ కార్యాలయాల్లోకి ఇప్పటికే చొప్పించింది.ట్రంప్ యంత్రాంగంలో 2017నాటికి 70 మంది ఈ సంస్థతో సంబంధం ఉన్నవారున్నారు.వారిలో నలుగురు మంత్రులు. ఈ సంస్థ ఉనికిలోకి వచ్చినప్పటి నుంచి రిపబ్లికన్లు మరింత మితవాదం వైపు మొగ్గేందుకు చేయాల్సిందంతా చేస్తోంది.1981లో రోనాల్డ్ రీగన్ అధికారంలోకి వచ్చినపుడు దీని అజెండాలో 60శాతం అమలు జరిపాడు. ట్రంప్ తొలిసారి అధికారంలో ఉన్నపుడు దీని సిఫార్సుల్లో 64శాతం అమలు చేశాడంటే దీని సత్తా ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. రిచర్డ్ నిక్సన్ హయాంలో 1973లో ఉనికిలోకి వచ్చిన ఈ సంస్థ నిర్వాహకులు తాము కమ్యూనిజానికి వ్యతిరేకమని, కార్పొరేట్లకు అనుకూలమని, క్రైస్తవ మత భావజాలానికి అనుగుణంగా పనిచేస్తామని చెప్పుకున్నారు. తాజా విషయానికి వస్తే ట్రంపిజాన్ని వ్యవస్థీకృతం కావించేందుకు తాము పనిచేస్తామని ఫౌండేషన్ అధ్యక్షుడు కెవిన్ డి రాబర్ట్స్ న్యూయార్క్‌టైమ్స్ పత్రికతో చెప్పాడు. అమెరికా ఇప్పుడు రెండవ విప్లవక్రమంలో ఉందని, అది రక్తపాత రహితంగా ఉంటుందని కూడా ఒక టీవీ చర్చలో చెప్పాడు. ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లు ఈ అంశాలను జనంలోకి తీసుకువెళ్లగలిగితే నల్లేరు మీద బండిలా సాగుతుందనుకుంటున్న ట్రంప్ ఎన్నిక తిరగబడినా ఆశ్చర్యం లేదు.

అయితే అది అంత తేలిక కాదు. ఇప్పటికే జోబైడెన్ ప్రతిష్ట దిగజారింది. దాని ప్రభావం కమలాహారిస్ మీద కూడ పడుతుంది.వ్యక్తిగా బైడెన్ కంటే అతగాడి విధానాల ఫలితంగానే పలుకుబడి తగ్గటమే దీనికి కారణం. రెండవది ఊపు మీద ఉన్న ట్రంప్ మద్దతుదార్లు ఆమె మీద పెద్ద ఎత్తున ప్రచారదాడికి దిగే అవకాశం ఉంది. గార్డియన్ పత్రిక పేర్కొన్న సమాచారం ప్రకారం పోటాపోటీగా ఉన్న పెన్సిల్వేనియా, జార్జియా, అరిజోనా వంటి రాష్ట్రాలలో టీవీ ప్రకటనల కోసం 50లక్షల డాలర్లను కుమ్మరించేందుకు సిద్ధంగా ఉన్నారు. అదే విధంగా అబార్షన్ల వంటి అంశాలపై ఆమె అభిప్రాయాల మీద రెచ్చగొట్టే అవకాశం ఉంది.కమలా హారిస్ తల్లి భారతీయ మూలాలున్న మహిళ, తండ్రి ఆఫ్రికన్. అందువలన మనదేశంలోని వారు మనమ్మాయి అన్నట్లుగా ప్రచారం చేసుకున్నా అమెరికాలో ఆమెను ఒక ఆఫ్రికన్‌గానే చూస్తారు. శ్వేతజాతి అహంకారం ఉన్న అమెరికాలో దాన్ని కూడా ముందుకు తీసుకురావచ్చు.ఆమె అభ్యర్థిత్వం ఖరారైన తరువాత తలెత్తే పరిణామాల గురించి మరోసారి చూద్దాం!

రైతు రుణమాఫీలో నష్టపోయేదెవరు?



నాదెండ్ల శ్రీనివాస్
9676407140

తెలంగాణలో రైతు రుణమాఫీ మార్గదర్శకాలను జూలై 15వ తేదీన ప్రభుత్వం విడుదల చేసింది. పంట రుణమాఫీ సొమ్మును నేరుగా లబ్ధిదారుల రుణాలున్న బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనుంది. ఆరోహణ క్రమంలో చిన్న విలువ నుంచి పెద్ద విలువ రుణమాఫీ సొమ్మును విడుదల చేస్తామని ప్రకటించింది.రీషెడ్యూల్ చేసిన రుణాలకు 2లక్షల రూపాయల రుణమాఫీ వర్తించదని వెల్లడించింది. వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, పిఏసిఎస్ నుంచి తీసుకున్న రుణాలే మాఫీ అవుతాయి. యస్ఎచ్ జి,జెఎల్ జి,ఆర్ఎంజి,ఎల్ఈసిఎస్ రుణాలకు వర్తించదని తెలిపింది.ఒక రైతు కుటుంబానికి 2 లక్షల రూపాయల వరకు ఉన్న రుణాలను ప్రభుత్వం నేరుగా మాఫీ చేస్తుంది.ఏ కుటుంబానికైతే 2 లక్షల రూపాయలకు మించి రుణం ఉంటుందో ఆ రైతులు రూ.2లక్షలకు పైబడి ఉన్న మొత్తాన్ని మొదట బ్యాంకుకు చెల్లించాలి.ఆ తర్వాత అర్హత గల రూ.2లక్షలను రైతు కుటుంబీకుల రుణ ఖాతాలకు ప్రభుత్వం బదిలీ చేస్తుంది. ఇదీ తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ పెట్టిన షరతు. పునర్వ్యవస్థీకరించబడిన లేదా రీషెడ్యూల్ చేసిన రుణాలకు రుణమాఫీ వర్తించదని, బ్యాంకులు వారు పొందిన రుణాలపై తిరిగి చర్చలు జరుపుతున్నందున ఇది పెద్ద సంఖ్యలో రైతులపై ప్రభావం చూపుతుంది.

మార్గదర్శక సూత్రాల్లో లోపాలు

రుణమాఫీకి సంబంధించిన మార్గదర్శక సూత్రాలు తీవ్ర లోపభూయిష్టంగా ఉన్నాయి.వాటి ప్రకారం కౌలు దార్లకు రుణమాఫీ వర్తించదు, పోడు వ్యవసాయం చేసే వారికి, రైతుమిత్ర గ్రూపులకు రుణ మాఫీ ఉండదు. కాంగ్రెస్ పార్టీ అందరికీ రుణ మాఫీని వర్తింపజేస్తామని ఎన్నికలకు ముందు ప్రకటించి ఇప్పుడు వారిని విస్మరిస్తున్నది. చిన్నసన్న కారు రైతులందరూ ఈ పథకంలో లబ్దిపొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.జాయింట్ లియబిలిటీ గ్రూపులుగా కౌలుదార్లను రూపొందించి ఈ పథకాన్ని వారికి వర్తింపజేయాలి.ప్రకృతి వైపరీత్యాలతో తీవ్ర నష్టాలు వచ్చినప్పుడు ప్రభుత్వం రుణాలను రీషెడ్యూల్ చేస్తుంది. అలాంటిది మరి ఈ రీషెడ్యూల్‌కు రుణమాఫీ వర్తింపజేయకపోవడం ఏమిటనేది అంతుచిక్కని ప్రశ్న. రైతుమిత్ర గ్రూపుల్లో చిన్న,సన్నకారు రైతులు, కౌలు రైతులు ఉన్నారన్నారు.రైతుమిత్ర గ్రూపులు రుణాలు తీసుకోవడానికి అర్హులవుతారు కానీ, రుణమాఫీకి అనర్హులవుతున్నారు.తొలుత రేషన్‌కార్డు ప్రామాణికమని ప్రకటించి,విమర్శలు రాగానే పట్టాదారు పాసుపుస్తకమని చెబుతున్నారు. రేషన్‌కార్డులో ఉన్న వారందరినీ ఒకే కుటుంబంగా పరిగణించి, కుటుంబంలో ఒక వ్యక్తికే రుణమాఫీ వర్తింపజేయడం వలన కుటుంబం నుంచి వేరు పడిన వారికి రుణమాఫీ వర్తించదు. ఆధార్‌కార్డు, పాస్‌బుక్, రేషన్‌కార్డు లేని కుటుంబాలు లక్షల్లో ఉన్నాయి. పాసుపుస్తకాల కోసం ధరణిలో 12 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. రేషన్



కార్డులకు కూడా లక్షల్లో దరఖాస్తు చేసుకున్నారు. వ్యవసాయ రుణం తీసుకున్న స్వయం సహాయక బృందాలు,జాయింట్ లయబిలిటీ గ్రూపులు, రైతుమిత్ర గ్రూపులు, కౌలుదారులకు ఇచ్చిన లోన్ ఎలిజిబిలిటీ కార్డు ఉన్నవారికి రుణమాఫీ వర్తించకపోవడంతో ఈ నాలుగు గ్రూపుల్లోని దళిత, గిరిజన,వెనుకబడిన వర్గాలకు చెందిన నిరుపేదలు నష్టపోతున్నారు.

గత పదేండ్లుగా బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడం వల్ల రైతులకు వడ్డీలు పెరిగాయి. అలాంటి రైతుల రుణం రెండు లక్షలకు పైగా ఉన్నది. పీఎం కిసాన్ డేటాకు రుణమాఫీని జోడించడం వల్ల చాలామంది రైతులు రుణ మాఫీ అర్హత కోల్పోతారు. రాష్ట్రంలో 72లక్షల మంది రైతులు ఉన్నప్పటికీ బ్యాంకులు 43 లక్షల మంది రైతులకు మాత్రమే అప్పులిచ్చాయి. పీఎం కిసాన్ పథకం కింద 31 లక్షల మందికే వర్తింపజేశారు. అందువల్ల పీఎం కిసాన్ డేటాను వర్తింప జేయడం వల్ల అర్హత కలిగినవారు రుణమాఫీ పొందలేకపోతారు. 2018 డిసెంబర్12 నుంచి 2023 సెప్టెంబర్ 12 మధ్య తీసుకున్న లోన్లను కొన్ని బ్యాంకులు జనవరి 2024 నుంచి రీ షెడ్యూల్ చేశాయి. బ్యాంకులు బుక్ అడ్జెస్ట్‌మెంట్ ద్వారా రైతులకు రుణాలు పెంచుకుంటూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2023 డిసెంబర్ 9 తర్వాత రీ షెడ్యూల్ చేసిన రుణాలకు లేదా బుక్ అడ్జెస్ట్‌మెంట్ చేసిన రుణాలకు రుణమాఫీని వర్తింపజేయాలి.

వర్షాభావ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులు రుణాలు చెల్లించకపోవచ్చు.ఆ సందర్భంలో రుణమాఫీ తప్పనిసరి. ఇప్పటికే దాదాపు 13లక్షల కోట్ల రూపాయలు కార్పొరేట్‌లకు రాయితీలు కల్పించిన ఎన్డీయే సర్కార్ రైతుల విషయంలో ఉదాసీనంగా ఉండటం దారుణం.


శాశ్వత పరిష్కారాలు అవసరం

రుణమాఫీ అనేది పరిమిత వర్గాల రైతులకు స్వల్పకాలిక ఉపశమనాన్ని అందించగలదు. అది రైతులను అప్పుల విష వలయం నుండి బయటకు తీసుకురావడానికి చాలా తక్కువ అవకాశం ఉంటుంది. 2008లో అఖిల భారత వ్యవసాయ రుణమాఫీ మొదటి తర్వాత వ్యవసాయ కష్టాలు తగ్గుముఖం పట్టడంపై కచ్చితమైన ఆధారాలు లేవు. దీర్ఘకాలంలో రైతుల ఆదాయాన్ని మెరుగు పరచడం, స్థిరీకరించడం ద్వారా తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని బలోపేతం చేయడం మాత్రమే వారిని దూరంగా ఉంచడానికి ఏకైక మార్గం. నీటిపారుదల సామర్థ్యాలు, కోల్డ్ స్టోరేజీ చైన్‌లను నిర్మించడం, పంటల బీమా కవరేజీని పెంచడం, వ్యవసాయ మౌలిక సదుపాయాల నిర్మాణం, సాంకేతికతతో కూడిన ఉత్పాదకత మెరుగుదల రైతులకు మంచి ఎంపికగా సహాయపడతాయి. రాష్ట్రాలు వ్యవసాయ రంగంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సంస్కరణలను అత్యవసరంగా చేపట్టి, చిత్తశుద్ధితో అమలు చేస్తే వ్యవసాయ కష్టాలు, రైతుల ఆదాయాలు మరింత మెరుగ్గా పరిష్కరించబడతాయి.ప్రత్యామ్నాయంగా రుణమాఫీ పరిమాణంపై పరిమితికి బదులుగా రుణంలో కొంత భాగాన్ని మాత్రమే మాఫీ చేయడం నైతిక ప్రమాదాలను నివారించడంలో మెరుగుదల అవుతుంది. వ్యవసాయ రంగంలో మిగులు కార్మికులను మరింత ఉత్పాదక రంగాలకు తీసుకెళ్లి ప్రజలందరికీ వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా, నిలకడగా మార్చగలిగే సృజనాత్మక నిమగ్నత కూడా అవసరం.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను రక్షించాలి

ఉపాధి కల్పించి నేతన్నలను ఆదుకోవాలి

- ప్రభుత్వం స్పందించకుంటే 26న చలో హైదరాబాద్ : చేనేత పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు చెరుపల్లి సీతారాములు
- రెండో రోజు కొనసాగిన జేఏసీ నిరాహార దీక్ష
- అంబేద్కర్ చౌక్ వద్ద రాస్తారోకో



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

కొన్ని నెలల నుంచి సంక్షోభంలో కూరుకుపోయిన సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను రక్షించి, నేత కార్మికులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, చేనేత పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు చెరుపల్లి సీతారాములు ప్రభుత్వాన్ని కోరారు. వస్త్ర పరిశ్రమ, అనుబంధ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం రెండో రోజు కొనసాగింది. చెరుపల్లి హాజరై మద్దతు తెలిపారు. వస్త్ర పరిశ్రమ అనుబంధ రంగాల జేఏసీ సభ్యులతో కలిసి అంబేద్కర్ చౌక్ వద్ద రాస్తారోకో చేపట్టి.. వర్షంలో రోడ్డుపైనే భోజనాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ తొమ్మిది నెలల నుంచి సంక్షోభంలో కూరుకుపోయిందని, దీనిపై ఆధారపడిన కార్మికులు, ఆసాములు ఉపాధి లేక రోడ్డున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. పనులు లేక ఆర్థిక ఇబ్బందులతో 10మంది కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, సమస్యలకు పరిష్కార మార్గం చూపడం లేదని విమర్శించారు. సిరిసిల్ల నేతన్నలు ఏం పాపం చేశారని ప్రశ్నించారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా నేత కార్మికుల పొట్ట కొట్టొద్దని కోరారు.

గత ప్రభుత్వం కంటే ఎక్కువ అభివృద్ధి చేస్తామని చెప్పి, ఇప్పుడు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు సంబంధించిన అన్ని పథకాలనూ తొలగించి నేతన్నలను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడి వస్త్ర పరిశ్రమ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉచిత విద్యుత్, వర్కర్ టూ ఓనర్ పథకం, యారన్ సబ్సిడీ, జనతా వస్త్ర పథకాలను అమలు చేయాలని, గత ప్రభుత్వం కంటే ఎక్కువ ఆర్డర్లు ఇచ్చి, సంక్షేమ పథకాలన్నింటినీ కొనసాగించాలని డిమాండ్ చేశారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యను ఎంపీ బండి సంజయ్ కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. వస్త్ర పరిశ్రమపై జీఎస్టీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో నేతన్నల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే బాధ్యత స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్‌పై ఉందన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా నేతన్నల సమస్యకు కృషి చేయాలని కోరారు. ఈనెల 26లోపు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకుంటే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, నాయకులు తాటిపాముల దామోదర్, ఆడేపు భాస్కర్, మండల సత్యం, కుమ్మరి కుంట కిషన్, గోనె పరశురాములు, యేల్లండి దేవదాస్, గాజుల నారాయణ, ఏనుగుల ఎల్లయ్య, సిరిసిల్ల రవి, ఎక్కలదేవి జగదీష్, శ్రీగాద మైసయ్య, చేరాల అశోక్, కోడం అశోక్, బండారి అశోక్, మ్యాన సత్యనారాయణ, మూషం రమేష్, కోడం రమణ, పంతం రవి పాల్గొన్నారు.



పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి

- లక్ష్మాపురం నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ప్రకటించాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి
- ప్రాజెక్టులను పరిశీలించిన సీపీఐ(ఎం) బృందం

నవతెలంగాణ -దేవరకొండ/నాంపల్లి

నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మంగళవారం మర్రిగూడ మండలంలోని శివన్నగూడెం రిజర్వాయర్ లక్ష్మాపురం నుంచి దేవరకొండ మండలం గొట్టిముక్కల రిజర్వాయర్ పనులను, నాంపల్లి మండలంలోని స్వాములవారి లింగోటం గ్రామపంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న కిష్టరాయన్‌పల్లి రిజర్వాయన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల ఆకాంక్ష మేరకు ప్రారంభించిన ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కిష్టరాయన్‌పల్లి రిజర్వాయర్ ముంపు గ్రామమైన లక్ష్మాపురం నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని ప్రకటించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణానికి డీపీఆర్ లేకుండానే పనులు చేపట్టిందన్నారు. ఈ ప్రభుత్వం డీపీఆర్ అప్రూవల్ తీసుకొని ప్రాజెక్టు పనులు, కాలువల నిర్మాణాలు చేయాలన్నారు. డిండి ఎత్తిపోతల పథకం కింద నిర్మిస్తున్న 5 రిజర్వాయర్ల నిర్మాణాలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుల నిర్మాణం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి అధిక నిధులు కేటాయించాలని కోరారు. డీపీఆర్ అప్రూవల్ తీసుకొని, పర్యావరణ అనుమతులు పొంది త్వరితగతిన ప్రాజెక్టులు పూర్తిచేసి మునుగోడు, దేవరకొండ, నాగార్జున సాగర్ నియోజకవర్గాల్లోని మూడున్నర లక్షల ఎకరాలకు సాగునీరు, గ్రామాలకు తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, నాయకులు బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, కందాల ప్రమీల, పాలడుగు ప్రభావతి, సయ్యద్ హాషం, కంబాలపల్లి ఆనంద్, నాంపల్లి చంద్రమౌళి, ఎండి.సలీం, పుచ్చకాయల నర్సిరెడ్డి, నల్లా వెంకటయ్య, సైదులు, ఏర్పుల యాదయ్య, మిరియాల వెంకన్న, బొట్టు శివకుమార్, ధనంజయ గౌడ్, ముత్తి లింగం, శివలింగం, శ్రీను, మల్లేశ్, కొమ్ము లక్ష్మయ్య పాల్గొన్నారు.

రుణమాఫీ చేస్తుంటే బీఆర్ఎస్‌కు కడుపుమంట

- కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం : శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రైతులకు రుణమాఫీ చేస్తుంటే బీఆర్ఎస్ నేతలు కడుపుమంటతో పసలేని ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాలు ఈనెల 31 వరకు జరుగుతాయని చెప్పారు. 25న బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. స్పీకర్ నిర్వహించిన బీఏసీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. డిమాండ్లతోపాటు పూర్తిస్థాయి ద్రవ్య వినిమయ బిల్లు పాస్‌చేయకపోతే జీతాలు కూడా రాని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం, ప్రతిపక్షాలు అనేక అంశాలపై సభలో చర్చిస్తాయన్నారు. ప్రశ్నోత్తరాలు నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో అందరూ మాట్లాడొచ్చని చెప్పారు. ప్రతిపక్షాల స్పందనను వినాలని స్పీకర్‌ను కోరినట్టు వివరించారు. ఓటాన్ అకౌంట్ సమావేశాల్లో ప్రజాసమస్యలపై చర్చించినట్టు తెలిపారు. అసెంబ్లీ సమావేశాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఇష్టానుసారం మాట్లాడం సరికాదన్నారు. గత ప్రభుత్వంలో వారు మంత్రిగా ఉన్నారనీ, వారు ఎన్నిరోజులు సభను నడిపారో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. తిమ్మిని బమ్మిని చేయడం, బమ్మిని తిమ్మిని చేయడం బీఆర్ఎస్‌కు అలవాటని విమర్శించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 28 నుంచి 30 రోజులు అసెంబ్లీ సమావేశాలు నడిపామంటూ గుర్తు చేశారు. అన్ని అంశాలనూ తాజా బడ్జెట్ సమావేశాల్లో చర్చిస్తామన్నారు. స్థానిక సంస్థలను బీఆర్ఎస్ నిర్వీర్యం చేసిందన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు మొసలికన్నీరు కారుస్తున్నారని చెప్పారు. రాష్ట్ర అవసరాల రీత్యా సంపూర్ణ చర్చ చేస్తామని వివరించారు. సర్కారును ప్రశ్నించే నైతిక హక్కు ఎమ్మెల్యేలకు ఉంటుందనీ, అలాగే బాధ్యతలు కూడా ఉంటాయని చెప్పారు. ఆయా అంశాలపై అందరికీ మాట్లాడే అవకాశం ఉంటుందన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు తేవడంలో విఫలమయ్యారని విమర్శించారు. తెలంగాణను కేంద్రం మోసం చేసిందన్నారు. కొత్త రైల్వేలైన్ ప్రాజెక్టుల్లోనూ అన్యాయం చేశారని విమర్శించారు.

బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

- కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల పట్ల నిర్లక్ష్యం : మంత్రి ఉత్తమ్ విమర్శ
- కార్పొరేట్లకు లక్షల కోట్ల మాఫీ
- రైతులకు పైసా ఇవ్వడం లేదని వ్యాఖ్య



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. విభజన చట్టం హామీలను తప్పనిసరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్ రాజకీయ ప్రేరేపితంగా ఉందనీ, ప్రజల కోసం పెట్టింది కాదని వ్యాఖ్యానించారు. మంగళవారం అసెంబ్లీలోని తన చాంబర్‌లో మీడియాతో చిట్‌చాట్ చేశారు. టీడీపీ, జేడీయూని ప్రసన్నం చేసుకునేందుకు పెట్టిన బడ్జెట్‌లా ఉందని అన్నారు. బీహార్‌కు రూ.41 వేల కోట్లు, ఏపీకి రూ.15 వేల కోట్లు, పోలవరం పూర్తికి నిధులు కేటాయించి కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాలను పట్టించుకోలేదన్నారు. 'ఏపీకి ప్రత్యేక నిధులు ఇవ్వడాన్ని వ్యతిరేకించడం లేదనీ, తెలంగాణ పట్ల చూపుతున్న వివక్షను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సీఎం నేతృత్వంలో తెలంగాణ మంత్రుల బృందం ఏడు నెలలుగా అన్ని మంత్రిత్వశాఖలకు నిధులు కేటాయించాలని కోరుతూ పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకుండాపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో పోలవరం నిర్మాణానికి హామీ ఇచ్చిన కేంద్రం, తెలంగాణలో పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి ఎలాంటి హామీ ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ తదితర అర్థమైన వాటికి నిధులు ఇవ్వలేదన్నారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని హామీలను నెరవేరుస్తామని ఆర్థిక మంత్రి చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని మంత్రి ఉత్తమ్ అభిప్రాయపడ్డారు. దేశ భావి ప్రధాని రాహుల్‌గాంధీ అని వ్యాఖ్యానించారు. రాహుల్‌కు విజన్ ఉందన్నారు. కార్పొరేట్లకు 4.5 లక్షల కోట్లు మాఫీ చేసిన మోడీ సర్కారు, రైతులకు ఒక్క పైసా ఇవ్వడం లేదని చెప్పారు. రుణమాఫీ చేశామనీ, రైతుబంధు కూడా ఇస్తామని అన్నారు. రాష్ట్ర రైతులు, ఇతరులకు రుణమాఫీ చేసినందుకు కాంగ్రెస్ అధిష్టానం సంతోషంగా ఉందన్నారు. కొత్తగా రేషన్‌కార్డులు ఇస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఎవరైనా చూడొచ్చనీ, బీఆర్ఎస్ సర్కారులా తాము అడ్డుకోబోమని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లల్లో రూ.21 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేసిందనీ, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఆరు నెలల్లోనే రూ.31 వేల కోట్లు మాఫీ చేయడం గొప్ప విషయమన్నారు. సీఎం రేవంత్, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క చేసిన కృషికి ఫలితం రుణమాఫీ అని ప్రశంసించారు.

ఎస్సారెస్పీకి 25 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్



ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు మంగళవారం 25,490 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1070.0 అడుగుల (23.308 టీఎంసీల) నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 1082.80 అడుగుల(52.948 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

కార్మిక, ప్రజా వ్యతిరేక బడ్జెట్

సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2024-25 యూనియన్ బడ్జెట్ దేశ ఆర్థిక వ్యవస్థను బలహీన పర్చేదిగా ఉందనీ, కార్మికవర్గానికి, పేదలకు హాని చేసేదిగా ఉన్నదని సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కారాములు, పాలడుగు భాస్కర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదేండ్ల నుంచి బీజేపీ ప్రభుత్వం అనుసరించిన కార్పొరేట్ సంస్థల అనుకూల విధానాలకు కొనసాగింపే కేంద్ర బడ్జెట్ అని పేర్కొన్నారు. ఉద్యోగులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు ఈ బడ్జెట్‌ను నిరసించాలని పిలుపునిచ్చారు. 2024-25 బడ్జెట్ రూ.48,21,000 కోట్లతో ప్రతిపాదించినప్పటికీ రెవెన్యూ లోటు రూ.16 లక్షల కోట్లుగా చూపించటం ఆందోళనకరమని తెలిపారు. రెవెన్యూ లోటును ఏవిధంగా ప్రభుత్వం భర్తీ చేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో ప్రజలు, కార్మికవర్గంపై పన్నుల భారాలు మోపటం ఖాయమని తెలిపారు.

దేశంలో కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 22 లక్షల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయడానికి బడ్జెట్‌లో ప్రతిపాదనలు, కేటాయింపులు లేవని పేర్కొన్నారు. ప్రభుత్వరంగ సంస్థల, కేంద్ర ప్రభుత్వోద్యోగులకు పే కమిషన్ ఏర్పాటు గురించి కనీస ప్రస్తావన లేదని తెలిపారు. రక్షణ రంగానికి రూ.6 లక్షల కోట్లు కేటాయించినప్పటికీ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను ప్రయివేటీకరించకుండా పటిష్టపరిచే చర్యలు నిర్దిష్టంగా ప్రకటించక పోవటంలోవ అంతర్యమేమిటని ప్రశ్నించారు.

ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణలో భాగంగా సింగరేణి 61 బ్లాకులను ప్రయివేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన సింగరేణి శ్రావణపల్లి బ్లాకును (మంచిర్యాల) వేలం వేయడానికి సిద్ధపడిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తామని ప్రకటన చేయలేదని గుర్తు చేశారు. ఈ బడ్జెట్‌లో రాష్ట్రానికి లాభం చేకూర్చే ఏ చర్యా తీసుకోకుండా మోడీ ప్రభుత్వం మరోసారి మోసం చేసిందని విమర్శించారు. కార్మికవర్గం సుదీర్ఘకాలం లేబర్ కోడ్ల రద్దు కోసం పోరాడుతున్నదని తెలిపారు. కనీస వేతనం రూ.26వేల డిమాండ్ గురించి పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని కోరినా పట్టించుకోలేదని తెలిపారు.అసంఘటిత కార్మికుల సంక్షేమం బీజేపీ ప్రభుత్వానికి పట్టదా? అని ప్రశ్నించారు. వ్యవసాయ, పారిశ్రామిక సంక్షోభం అధిక స్థాయి నిరుద్యోగం, అధిక ఆహార ద్రవ్యోల్బణం రేటు, అసమానతలు ప్రయివేట్ పెట్టుబడుల మందగమనం వంటి ఆర్థిక పరిస్థితుల నేపథ్యానికి అనుగుణంగా బడ్జెట్‌ను రూపొందించకపోవడం తిరోగమనమేనని విమర్శించారు. ప్రజలు, కార్మికవర్గంపై రాబోయే రోజుల్లో మరిన్ని కష్టాలను విధించడానికే దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి కల్పన స్థాయిలను అణచేస్తుందని వారు ఆ ప్రకటనలో తెలిపారు.

ఉద్యోగులకు నిరాశే

- తెలంగాణకు కేంద్రం మొండిచేయి : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ఉద్యోగులు, ఉపాధ్యాయులను కేంద్ర బడ్జెట్ నిరాశపరిచిందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విమర్శించారు. ఆదాయపు పన్ను శ్లాబుల్లో పెద్ద మార్పుల్లేవని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ పెన్షన్ స్కీంను యథావిధిగా కొనసాగిస్తామంటూ ప్రకటించిందని పేర్కొన్నారు. రూ.ఐదు లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపును ఉద్యోగులు కోరుకుంటున్నారని వివరించారు. కానీ రూ.మూడు లక్షల వరకే కేంద్రం మినహాయింపునిచ్చిందని తెలిపారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని ఉద్యోగులు కోరుకుంటు న్నారని పేర్కొన్నారు. అందులో ఎలాంటి మార్పులు చేయలేదని తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలు వేగంగా పెరుగుతున్న క్రమంలో అందుకనుగుణంగా ఆదాయపు పన్ను శ్లాబ్‌లో కూడా మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్‌లో మధ్యతరగతికి చేయూతనిస్తుందని ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారని గుర్తు చేశారు. కానీ ఈ బడ్జెట్‌ను గమనిస్తే మధ్యతరగతికి వెసులుబాటు కల్పించే ప్రతిపాదనలేమీ కనిపించలేదని తెలిపారు. ఇది మాటల బడ్జెట్‌గానే కనిపించిందని విమర్శించారు. విద్యారంగానికి, శిక్షణా, ఉపాధి రంగానికి కలిపి రూ.1.48 లక్షల కోట్లు కేటాయించారని వివరించారు. మొత్తం కేంద్ర బడ్జెట్‌లో ఇది మూడు శాతమేనని తెలిపారు. బడ్జెట్ ప్రసంగంలో ప్రాథమిక విద్య నుంచి విశ్వవిద్యాలయాల వరకు ఒక్క మాట కూడా లేదనీ, కేంద్ర ప్రభుత్వానికి విద్య పట్ల ఆసక్తి లేనట్టు కనిపిస్తున్నదని పేర్కొన్నారు. విద్యా ప్రయివేటీకరణ యథేచ్ఛగా జరిగేందుకు కేంద్రం సానుకూలంగా ఉన్నట్టు తెలుస్తున్నదని వివరించారు. రైతు భరోసా బడ్జెట్ అని చెప్పినా ఇందులో వారి కోసం ప్రత్యేక అంశాలేమీ కనిపించలేదని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు 50 శాతం మిగిలి ఉండేలా నిర్ణయిస్తున్నట్టు ప్రస్తావించారని పేర్కొన్నారు. కానీ మద్దతు ధరలు ఉత్పత్తి ఖర్చులకు సమానంగా గానీ, లేక ఉత్పత్తి ఖర్చులు ఎక్కువగా ఉంటున్నాయని వివరించారు. ఇప్పటికీ రైతులు అప్పుల్లోనే ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం రైతు రుణాలు మాఫీ చేస్తున్న సందర్భంలో కేంద్ర బడ్జెట్‌లో ఎలాంటి సహాయం ప్రకటించలేదని విమర్శించారు. తెలంగాణకు మొండిచేయి చూపిందని తెలిపారు. విభజన చట్టంలో ఉన్న బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, విద్యుత్ ఉత్పత్తికి ప్రత్యేక ప్యాకేజీ, ఏ నీటిపారుదల ప్రాజెక్టుకూ నిధులను కేటాయించలేదని వివరించారు. నితీశ్, చంద్రబాబుపై కేంద్రం ఆధారపడి ఉన్నందున బీహార్, ఏపీకి కొన్ని ప్యాకేజీలు ప్రకటించారని తెలిపారు. ఇది కార్పొరేట్ల బడ్జెట్ తప్ప, సామాన్య ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేది కాదని విమర్శించారు.

యువతను విస్మరించిన బడ్జెట్

- నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపని కేంద్రం డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో యువతను విస్మరించిందని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ విమర్శించింది. నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదని తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పన హామీ పదేండ్లపాటు బీజేపీ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. మూడోసారి అధికారంలోకి వచ్చినా ఈ బడ్జెట్‌లో కూడా ఉపాధి కల్పన గురించి ప్రస్తావించకుండా యువతను మరోసారి మోసం చేసిందని తెలిపారు. నిరుద్యోగ సమస్యను ఎదుర్కోవాలంటే ఏటా దాదాపు 78.51 లక్షల ఉద్యోగాలను సృష్టించాల్సిన అవసరముందంటూ ఆర్థిక సర్వే సూచించిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించారని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. విభజన హామీల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని విమర్శించారు.

లాస్యనందిత మృతికి సంతాపం

(మొదటిపేజీ తరువాయి)

ఎదిగారనీ, అందరికీ ఆప్తులుగా, సన్నిహితులుగా ఉండేవారని గుర్తుచేశారు. ఎమ్మెల్యేగా కంటోన్మెంట్ ప్రజలకు ఎన్నో సేవలు చేసిన ఆయన ప్రజాజీవితంలోనే మరణించారన్నారు. సాయన్న వారసురాలిగా, కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా లాస్య నందితను ప్రజలు ఎన్నుకున్నారని చెప్పారు. చిన్న వయస్సులోనే రోడ్డు ప్రమాదంలో ఆమె చనిపోవడం బాధాకరమన్నారు. కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్ఎంసీలో కలపాలన్నది సాయన్న చిరకాల కోరిక అనీ, దురదృష్టవశాత్తు ఆ కల నెరవేరే సమయంలో అయన తమ మధ్యలో లేకపోవడం బాధాకరమని చెప్పారు. లాస్య బతికి ఉన్నా తన తండ్రి కోరిక నెరవేరినందుకు సంతోషించి ఉండేవారన్నారు. కీలకమైన సమయంలో వారు తమ మధ్య లేకపోవడం కలిచివేస్తోందన్నారు. వారు ప్రజల హృదయాల్లో చిరస్థాయిలో నిలిచిపోతారని చెప్పారు. వారి ఆశయాలను, చేయాలనుకున్న పనులను తమ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తుందని హామీనిచ్చారు.

సాయన్న కుటుంబానికి అండగా ఉంటాం : కేటీఆర్

ఏడాదిలోపే తండ్రీ, కూతురు మరణించారనే వార్త వినటానికే ఎంతో ఆవేదనగా ఉందనీ, అలాంటి సాయన్న కుటుంబం ఎలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నదనే దాన్ని తలుచుకుంటేనే బాధగా ఉందని బీఆర్ఎస్ సభ్యులు కె.తారకరామారావు(కేటీఆర్) అన్నారు. సాయన్న కుటుంబానికి అండగా ఉంటామని ఇదే సభలో మాజీ సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారనీ, ఆ మాటకు కట్టుబడి ఉంటామని చెప్పారు. లాస్య నందిత చాలా చురుకైన అమ్మాయి అని గుర్తుచేశారు. సాయన్నకు కూతుర్లు లాస్యనందిత, లాస్య నివేదితలు కుడి, ఎడమ భుజాలుగా ఉండి అన్నీ చూసుకునేవారన్నారు. అయనతోపాటే నిరంతరం ప్రజల్లో ఉండేవారన్నారు. సాయన్న మాదిరిగానే ప్రజా సేవ చేసే అవకాశం లాస్య నందితకు వచ్చిందన్నారు. ఆమె కుటుంబాన్ని విధి పగబట్టిందనీ, తండ్రి మరణం, ఆమెకు వరుసగా మూడు ప్రమాదాలు జరగటం, చివరకు రోడ్డు ప్రమాదంలోనే మరణించడాన్ని ఇంకా జీర్ణించుకోలేక పోతున్నామని చెప్పారు. సభలో ఆమె మృతికి సంతాపం తెలిపే పరిస్థితి వస్తుందని కలలో కూడా ఊహించలేదన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టండి : కూనంనేని

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతికి సీపీఐ పక్షనేత కూనంనేని సాంబశివరావు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది తమ విలువైన ప్రాణాలను కోల్పోతున్నారనీ, కుటుంబాలను క్షోభలోకి నెట్టి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

లాస్య నందితనే కాదు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కొడుకు కూడా ఔటర్ రింగురోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలోనే చనిపోయారని గుర్తుచేశారు. ఔటర్‌పై ప్రమాదాల నివారణకు నిబంధనలు పెట్టి, పలు జాగ్రత్త చర్యలు చేపట్టి ఇతరులు ప్రాణాలు కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని సూచించారు. బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి లాస్యనందిత మృతికి సంతాపం తెలిపారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సాయన్నతో తనకున్న అనుభవాలను పంచుకున్నారు. సంతాప తీర్మానంపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎంఐఎం సభ్యులు బలాల, కాంగ్రెస్ సభ్యులు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, శ్రీగణేశ్, బీఆర్ఎస్ సభ్యులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సునీతా లక్ష్మారెడ్డి, ముఠాగోపాల్, కేపీ.వివేకానంద, బీజేపీ సభ్యులు పాయల్ శంకర్ మాట్లాడారు. సాయన్న కుటుంబంతో ఉన్న తమ అనుబంధాన్ని పంచుకున్నారు. ఎంతో రాజకీయ భవిష్యత్తు ఉన్న లాస్యనందిత చిన్నవయస్సులో మరణించడం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

అధికార పక్షంవైపు పోచారం..బీఆర్ఎస్ సభ్యుల వెనకాల కడియం

ఇటీవల బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ తీర్థం పుచుకున్న మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధికార పక్షం వైపు కూర్చున్నారు.

సభలో చివరి వరుసలోని సీటులో ఆశీనులయ్యారు. మాజీ మంత్రి కడియం శ్రీహరి మాత్రం బీఆర్ఎస్ సభ్యుల వెనకాల ఉన్న రోలో కూర్చున్నారు. కడియం పక్కనే చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆశీనులయ్యారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల తొలి రోజు బీఆర్ఎస్ పక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గైర్హాజరయ్యారు. ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ కూడా రాలేదు. బీఆర్ఎస్ సభ్యులంతా గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పించి సభలోకి వచ్చారు. బీజేపీ ఎల్పీ నేత ఎ.మహేశ్వర్‌రెడ్డి, ఇతర సభ్యులు ట్యాంక్‌బండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అక్కడ నుంచి 'ఆంక్షలు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలి' అని నినాదాలు చేస్తూ అసెంబ్లీకి ర్యాలీగా వచ్చారు.

31వరకు అసెంబ్లీ

- రేపు బడ్జెట్
- 26, 28 తేదీల్లో సెలవులు
- మిగిలింది ఆరు రోజులే
- బీఏసీలో నిర్ణయం
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన భేటీ
- వాడీవేడిగా సమావేశం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈనెల 31 వరకు జరగనున్నాయి. గురువారం(25న) బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో 26, 28(ఆదివారం) తేదీల్లో అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. 31వ తేదీన ద్రవ్య వినిమయ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలుపనుంది. సెలవులు పోను ఇంకా ఆరు రోజులపాటు శాసనసభ జరగనుంది. మంగళవారం శాసనసభ తొలిరోజు వాయిదా అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన అసెంబ్లీ బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ) సమావేశం జరిగింది. దీనికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు డి. శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌గౌడ్, విప్ బీర్ల ఐలయ్య, ప్రతిపక్ష నేతలు తన్నీరు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా శాసనసభ సమావేశాల షెడ్యూల్‌ను స్పీకర్ ప్రసాద్‌కుమార్ బీఏసీ ముందుంచారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను సజావుగా నిర్వహించుకుందామని ప్రతిపాదించినట్టు తెలిసింది. ప్రజాసమస్యలపై చర్చించి పరిష్కారాల కోసం ప్రయత్నం చేయాలని సూచించినట్టు సమాచారం. అన్ని పార్టీలకు సభలో మాట్లాడే అవకాశం ఇస్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని చెప్పడంతోపాటు కేంద్ర బడ్జెట్ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం సమావేశాలు నిర్వహిస్తున్నదని పేర్కొన్నట్టు సమాచారం. పద్దుల మీద చర్చకు ప్రత్యేకంగా సమావేశాలు పెట్టుకుందామని అన్నట్టు తెలిసింది. సాంకేతిక కారణాల దృష్ట్యానే ఈనెల 31లోగా ద్రవ్యవినిమయ బిల్లును ఆమోదించుకోవాల్సి ఉందనీ, లేకపోతే జీతాలు కూడా ఇవ్వలేమని సమావేశం దృష్టికి తెచ్చినట్టు అసెంబ్లీ వర్గాల్లో చర్చ జరిగింది. సభను ఎన్నిరోజులు నిర్వహించాలనే విషయమై నిర్ణయం తీసుకోవాల్సింది స్పీకరేనని గుర్తుచేసినట్టు అసెంబ్లీలో ప్రచారం జరిగింది. ప్రతిపక్షాలు లేవనెత్తిన అన్ని అంశాలపై కూలంకషంగా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందనీ, అలాగే సర్కారు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కూడా శాసనసభ వేదికగా ప్రజలకు చెపాల్సిన అవసరం ఉందని సీఎం వివరించినట్టు తెలిసింది. స్పీకర్ అవకాశమిస్తే, 31 తర్వాత కూడా సభను నిర్వహించేందుకు ప్రభుత్వానికి అభ్యంతరం లేదని అన్నట్టు సమాచారం. ప్రభుత్వం అన్ని అంశాల్లో ప్రజాస్వామ్యయుతంగా నడుచుకుంటుందనీ, విపక్షాల విలువైన సలహాలు, సూచనలు స్వీకరిస్తామని సీఎం అన్నట్టు సమాచారం. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ నిరుద్యోగం, ఆరు గ్యారంటీలు, శాంతిభద్రతల్లో వైఫల్యం, చేనేత కార్మికుల సమస్యలు, రుణమాఫీ, పంటల బోనస్, రైతు భరోసా, పల్లె, పట్టణ ప్రగతి, ఫీజు రీయింబర్స్‌మెంటు, స్థానిక సంస్థలకు నిధులు తదితర అంశాలపై అసెంబ్లీలో చర్చించాలని కోరినట్టు తెలిసింది. సమావేశాలను 15 రోజులపాటు నిర్వహించాలని డిమాండ్ చేసినట్టు సమాచారం. శాసనసభలో ప్రజాసమస్యలపై అర్థవంతమైన చర్చ జరగాలనీ, సమస్యల పరిష్కార వేదికగా అసెంబ్లీ ఉండాలని సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు సూచించగా, బీజేపీ, ఎంఐఎం సభ్యులు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు ఎక్కువ రోజులు జరపాలని విజ్ఞప్తిచేసినట్టు లాబీల్లో మీడియాతో చెప్పడం గమనార్హం.

ప్రజావాణికి 606 దరఖాస్తులు

- మిషన్ భగీరథ కార్మికుల సమస్యలపై సీఐటీయూ వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 606 దరఖాస్తులందాయి. అక్కడకు వచ్చిన వారి నుంచి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య దరఖాస్తులను స్వీకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ కార్మికుల సమస్యలపై సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, పలువురు కార్మికులు వినతిపత్రం అందజేశారు. కనీసవేతనం అమలు కాకపోవడం, రక్షణ పరికరాలు ఇవ్వకపోవడం, రాత్రి సమయాల్లో పనిచేయించడం తదితర అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చిన్నారెడ్డి హామీ ఇచ్చారు. ప్రజవాణిలో రెవెన్యూకు సంబంధించి 108, పౌరసరఫరాల శాఖకు 106, విద్యుత్ శాఖ కు 64, హౌజింగ్‌కు 115, మైనారిటీ సంక్షేమ శాఖకు 38, ఇతర శాఖలకు సంబంధించి 175 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు.

మాటల మూటలే

(మొదటిపేజీ తరువాయి)

విద్యా పథకానికి ఇచ్చే బడ్జెట్‌కూడా దారుణంగా రూ.10కోట్ల నుండి రూ.2కోట్లకు తగ్గిపోయింది. రైల్వేలకు బడ్జెట్‌లో రూ.2.62 లక్షల కోట్లను కేటాయించారు. 40వేల కొత్తరైల్వే ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టినట్లు చెప్పారు.

పన్ను శ్లాబ్‌లో మార్పులు

పన్ను చెల్లింపుదారులకు మంచి వార్తను వినిపించారు. పన్ను శ్లాబుల్లో మార్పులను తీసుకువచ్చారు. స్టాండర్డ్ డిడక్షన్‌ను ప్రస్తుతమున్న రు.50వేల నుండి రు.75వేలకు పెంచారు. కొత్త పన్ను శ్లాబ్‌ల కింద ఆదాయపన్నులో రూ.17,500 వరకు ఉద్యోగులు ఆదా చేసుకోవచ్చని మంత్రి చెప్పారు. పాత పన్ను వ్యవస్థలో ఎలాంటి మార్పులు చేయలేదు.

ఉపాధి హామీకి తగ్గిన నిధులు

ఈసారి బడ్జెట్‌లో గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు తగ్గాయి. గతేడాది ఖర్చు పెట్టిన దానికన్నా తక్కువ మొత్తమే కేటాయించారు. ఇటీవలి ఎన్నికల్లో గ్రామీణ భారతంలో బిజెపి నష్టాలు చవిచూసినప్పటికీ ఈ పథకానికి కేటాయింపులు పెరగలేదు.

ఐటీ చట్టంపై సమగ్ర సమీక్ష

ఐటీ చట్టంపై సమగ్ర సమీక్ష జరుపుతామని నిర్మలా సీతారామన్ చెప్పారు. అందరూ అర్థమయ్యేలా చదువుకునేందుకు, వ్యాజ్యాల సంఖ్యను తగ్గించేందుకు ఈ సమీక్ష అవసరమని అన్నారు. స్టార్టప్ కంపెనీలకు ఊతమిచ్చేందుకు ఏంజెల్ పన్నును రద్దు చేస్తామని ఆమె ప్రతిపాదించారు. విదేశీ కంపెనీలపై కార్పొరేట్ పన్ను రేటును 40% నుండి 35%కి తగ్గిస్తామని తెలిపారు.

పూర్వోదయ పథకం

బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సమగ్రాభివృద్ధి కోసం 'పూర్వోదయ' పథకాన్ని చేపడతామని ఆర్థిక మంత్రి చెప్పారు. బడ్జెట్‌లో మూలధనపు వ్యయ లక్ష్యాన్ని రూ.11.11 లక్షల కోట్లుగా చూపారు.

వ్యవసాయానికి రూ.1.5లక్షల కోట్లు

ప్రకృతి వ్యవసాయంలోకి దేశవ్యాప్తంగా కోటిమంది రైతులను తీసుకురావాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఐదు రాష్ట్రాల్లో కిసాన్ క్రెడిట్ కార్డులను ఇవ్వనున్నట్లు ప్రకటించారు. వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి రూ.1.5లక్షల కోట్లు కేటాయించినట్లు చెప్పారు. పప్పు ధాన్యాలు, నూనె విత్తనాల ఉత్పత్తిలో స్వావలంబన సాధించడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకొని, అధిక దిగుబడిని అందించే 109 నూతన వంగడాలను విడుదల చేస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. అవసరాన్ని బట్టి పది వేల బయో-ఇన్‌పుట్ రిసోర్స్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, వాటికి కేంద్రం చేయూత అందిస్తుందని చెప్పారు. సవరించిన అంచనాల ప్రకారం వ్యవసాయ మంత్రిత్వ శాఖకు రూ.1,16,788.96 కోట్లు కేటాయించారు.

బడ్జెట్‌లో మహిళలకేం చేశారంటే

మహిళల నేతృత్వంలో అభివృద్ధి సాధనకు రూ.3లక్షలకు పైగా కోట్లతో పథకాలను తీసుకువచ్చారు.మహిళలకు కేటాయించినబడ్జెట్‌ను చూస్తే ఆర్థికాభివృద్ధిలో మహిళా సాధికారతను పెంపొందించేందుకు ప్రభుత్వానికి గల నిబద్ధత తెలుస్తుందని మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కార్మిక శక్తిలో మహిళల ప్రాతినిధ్యాన్ని ప్రోత్సహించేందుకు పరిశ్రమలతో ప్రభుత్వం అవగాహన కుదుర్చుకుంటుందని, వర్కింగ్ వుమెన్ హాస్టళ్ళను ఏర్పాటు చేయడానికి, పిల్లల కోసం క్రెష్ వంటి సదుపాయాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటుందని చెప్పారు. పైగా మహిళల్లో నిర్దిష్ట నైపుణ్యాల అభివృద్ధికి, స్వయం సహాయక గ్రూపులకు మార్కెట్ సౌలభ్యాన్ని పెంచేందుకు కూడా పరిశ్రమలు-ప్రభుత్వం భాగస్వామ్యం ఉపయోగపడుతుందన్నారు. మహిళలు కొనుగోలు చేసిన ఆస్తులపై సుంకాలను కూడా తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. సామాజిక న్యాయానికి సంబంధించినంతవరకు అర్హులైన వారందరికీ వివిధ పథకాల ద్వారా లబ్ది పొందేలా చూడాలన్నదే తమ ప్రభుత్వ అభిమతమని చెప్పారు.

ఉపాధి, నైపుణ్యాలకు ప్రధానమంత్రి ప్యాకేజీ

ఈపీఎఫ్‌ఓలో తొలిసారిగా నమోదైన ఉద్యోగులు ప్రభుత్వం నుండి మొదటి నెలలో రూ.15,000 వరకూ అదనపు జీతం పొందుతారు. 'ప్రైమ్ మినిస్టర్ ప్యాకేజ్ ఫర్ ఎంప్లాయిమెంట్ అండ్ స్కిల్లింగ్' పథకంలో భాగంగా ఈపీఎఫ్‌ఓలో తొలిసారి పేరు నమోదు చేసుకున్న ఉద్యోగులకు ఒక నెల జీతం అదనంగా అందిస్తామని ఆర్థిక మంత్రి తెలిపారు. ఈ మొత్తాన్ని మూడు వాయిదాల్లో ఉద్యోగి బ్యాంక్ ఖాతాలో నేరుగా జమ చేస్తామని చెప్పారు. దీనివల్ల 2.10కోట్ల మంది యువత లబ్ది పొందుతారన్నారు. ఉపాధి, నైపుణ్యాల పెంపు, మధ్య తరగతి వర్గాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించామని ఆమె తెలిపారు. రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో ఈ ప్యాకేజీ కింద 4.1 కోట్ల మంది యువతకు ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, ఇతర అవకాశాలు కల్పిస్తామని వివరించారు. ఇందుకోసం రెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విద్య, ఉపాధి, నైపుణ్య చర్యల కోసం రూ.1.48 లక్షల కోట్లు అందజేస్తామని అన్నారు. ఈ ప్యాకేజీలోని ఐదు పథకాల్లో మూడింటికి 'ఉపాధి ఆధారిత ప్రోత్సాహకం' (ఈఎల్‌ఐ) అని పేరు పెట్టామని, తొలిసారి ఉద్యోగి అయ్యే వారికి దీని కింద నెల జీతం అందిస్తామని తెలిపారు. తయారీ రంగంలో ఉపాధి కల్పనకు మరో పథకాన్ని ఉద్దేశించామని, ఉద్యోగితో పాటు యజమానికి కూడా వారి ఈపీఎఫ్‌ఓ కంట్రిబ్యూషన్ ఆధారంగా ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు. ఉద్యోగం వచ్చిన మొదటి నాలుగు సంవత్సరాల వరకూ ఇది అమలులో ఉంటుందని అన్నారు. మూడవ పథకంలో యజమానులకు అవసరమైన మద్దతు అందిస్తామని నిర్మల తెలిపారు. ప్రతి అదనపు ఉద్యోగి కోసం ఈపీఎఫ్‌ఓ కంట్రిబ్యూషన్ కింద చెల్లించే వాటాలో రెండు సంవత్సరాల పాటు నెలకు రూ.3,000 చొప్పున రీయంబర్స్‌మెంట్ చేస్తామని చెప్పారు. నాలుగో పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమ సహకారంతో నైపుణ్యాభివృద్ధికి చర్యలు చేపడతామని అన్నారు. దీనికింద రాబోయే ఐదు సంవత్సరాల్లో 20 లక్షల మంది యువతకు శిక్షణ ఇస్తామని చెప్పారు. ప్రధానమంత్రి ప్యాకేజీలో చివరి పథకంలో భాగంగా ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తామని, రాబోయే ఐదు సంవత్సరాల్లో ఐదు వందల ప్రముఖ కంపెనీల్లో కోటి మందికి ఇంటర్న్‌షిప్ ఇస్తామని వివరించారు.ఏ ప్రభుత్వ పథకాల్లోనూ ఇప్పటివరకు లబ్ది పొందని విద్యార్థులు దేశీయ విద్యా సంస్థల్లో చదువుకోవడానికి రూ.10లక్షల వరకు రుణాలు పొందుతారు.

విద్యుత్‌కు అధిక ప్రాధాన్యం

బడ్జెట్‌లో విద్యుత్ రంగానికి కేంద్రం అధిక ప్రాధాన్యత ఇచ్చింది. దేశంలో కోటి కుటుంబాలు నెలకు 300 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ పొందేందుకు వీలుగా 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' కింద ఇంటి పైకప్పులపై సౌర ఫలకాలను ఏర్పాటు చేస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఉచిత సౌర విద్యుత్ వినియోగం కారణంగా కుటుంబాలు ఏటా రూ.15,000-18,000 కోట్లు ఆదా చేసుకోగలుగుతాయని, మిగులు విద్యుత్‌ను పంపిణీ కంపెనీలకు విక్రయించుకోవచ్చునని తెలిపారు. 2030 నాటికి శిలాజయేతర ఇంధన వనరుల నుండి 50 జీడబ్ల్యూ పునరుత్పాదక ఇంధనాన్ని, విద్యుదుత్పత్తి స్థాపక సామర్ధ్యంలో యాభై శాతాన్ని పొందాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని వివరించారు. ఈ బడ్జెట్‌లో విద్యుత్ మంత్రిత్వ శాఖకు రూ.20,502 కోట్లు కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఈ మంత్రిత్వ శాఖ బడ్జెటరీ వ్యయం రూ.20,671.32 కోట్లు.

రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- ఆటో డ్రైవర్లపై పోలీసు దాడులు ఆపాలి : ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్



నవతెలంగాణ - కరీంనగర్

రవాణా రంగం కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుపై ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే నిర్ణయం చేయాలని, ఆటో డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసుల దాడులు ఆపాలని ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కోతిరాంపూర్ ముకుందలాల్ మిశ్రా భవన్ సీఐటీయూ ఆఫీసులో మంగళవారం పబ్లిక్ ప్రయివేటు రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెలికాని శ్రీనివాస్ అధ్యక్షతన 'రవాణారంగ కార్మికుల సమస్యల'పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. భారతీయ న్యాయ సంహిత చట్టం సెక్షన్ 106(1) రద్దు చేయాలని, రవాణారంగ కార్మికులకు ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఆటో, టాటా ఏసీ కార్మికులు ఉపాధి కోల్పోయారని అన్నారు. ఆటో డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసుల దాడులు పెరుగుతు న్నాయని, ఆటోలపై టాప్ నెంబర్లు లేవని, చాలాన్ పేరుతో దాడులు చేస్తున్నారని, వాటిని ఆపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రవాణారంగంపై 50లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. వీరి సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉచితబస్సు ప్రయాణం పేరుతో మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించడంతో వారు రోడ్డున పడ్డారని తెలిపారు. రవాణారంగ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలన్నారు. ఓలా, ఉబర్, జస్ట్ డయల్ యాప్‌లు రద్దు చేయాలని కోరారు. ట్రాన్స్‌పోర్ట్ రంగం యూనియన్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి మాట్లాడుతూ.. రవాణా రంగ కార్మికుల కోసం కేరళ తరహా యాప్ తీసుకురావాలన్నారు. డీజిల్, పెట్రోల్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ ధరలు తగ్గించాలని కోరారు. వేలాది రూపాయలు ఫైనాన్స్‌లు తీసుకొని వివిధ రకాల వాహనాలు నడుపుతున్న వారు ఇప్పుడు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12వేలు చెల్లిస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ పథకాన్ని అమలు చేయకుండా కార్మికుల పొట్టగొట్టే ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రవాణా రంగ కార్మికుల సంక్షేమ చట్టం చేయాలని, ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో కరీంనగర్ పట్టణ లారీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎంకె.ఆరిఫ్ మొయినుద్దీన్, నాయకులు కనకయ్య, దెయ్యాల శ్రీను, ప్రభాకర్, వీరస్వామి, ముక్కెర శ్రీను, నాగరాజు, సంతోష్, రవి, శ్రీకాంత్ సతీష్ కుమార్, అనంతోజు రమేష్ మల్లేశం, షాబుద్దీన్, అనిల్, దేవయ్య, సంపత్ కుమార్, భాస్కర్ రెడ్డి, శంకర్, శ్రీధర్, నరేష్ పాల్గొన్నారు.

అక్టోబర్ 22 నుంచి ఐద్వా రాష్ట్ర మహాసభ

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



నవతెలంగాణ-కొత్తగూడెం

మహిళల రక్షణ, వారి హక్కుల సాధన, అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు డి.లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా మంగళవారం కెప్టెన్ లక్ష్మీ సెహగల్ 12వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లక్ష్మి మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం పట్టణంలో అక్టోబర్ 22, 23, 24 తేదీల్లో మహాసభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కెప్టెన్ లక్ష్మీ సెహగల్ చేసిన కృషి, త్యాగాలను ప్రతి మహిళా ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. నేటి పురుషాధిక్య సమాజంలో మహిళల శ్రమను చిన్నచూపు చూస్తూ వారి హక్కులకు భంగం కలిగే విధంగా వ్యవహరిస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలపై ఐద్వా నికరంగా పోరాటం చేస్తుందని అన్నారు. పాలకవర్గాల విధానాలపై మహిళల సమానత్వం కోసం దేశవ్యాప్త ఉద్యమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అరాచకత్వాలు, దాడులపై క్షుణ్ణంగా చర్చించి భవిష్యత్తు పోరాటాలకు శ్రీకారం చూడతామన్నారు. మహిళలను, ప్రజలను చైతన్యం చేసి నూతన సమాజం నిర్మించే దానికోసం అభ్యుదయ భావాలతో కలిగిన వ్యవస్థను నిర్మించడానికి ఈ మహాసభల్లో చర్చించబోతున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో 600 మంది ప్రతినిధులతో పాటు ఐద్వా జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు.

ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు బుగ్గవీటి సరళ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళల సాధికారత కోసం 6 గ్యారంటీలు అమలు చేస్తామని, మంచి పాలన అందిస్తామని హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. కానీ అధికారం చేపట్టాక రాష్ట్రంలో గ్యారంటీల అమలు నామమాత్రంగా ఉండటమేకాక, నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెంచి మహిళలపై తీవ్ర భారాన్ని మోపారని ఆరోపించారు. మహిళలు వంటింటికే పరిమితం కావాలని, రాజకీయాలు వద్దని, బానిసల్లాగా చాకిరి చేయాలని బీజేపీ చేస్తున్న వాదనపై ప్రత్యేకంగా ఈ మహాసభలో చర్చించబోతున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి మండలపు జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శి సందకూరి లక్ష్మి, ఉపాధ్యక్షులు లీలావతి, వాణి, కున్సోత్ లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు, మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాటల్లోనే ఆర్భాటాలు

(మొదటిపేజీ తరువాయి)

ఇబ్బందులు పడుతుంటే ఈ బడ్జెట్ వల్ల లబ్ది పొందింది కేవలం బడా వ్యాపార వర్గాలేనని విమర్శించింది. దుర్భర దారిద్ర్యంలో కొట్టుమిట్టాడుతున్న పేదలు ఎదుర్కొంటున్న సమస్యలు వేటినీ ఈ బడ్జెట్‌లో పరిష్కరించలేదని తపన్‌సేన్ పేర్కొన్నారు. వివిధ రకాల రాయితీలపేర్లతో ప్రభుత్వ నిధులు ప్రయివేటు కార్పొరేట్‌సంస్థల జేబుల్లోకి వెళ్ళేలా చేశారని నిరసన వ్యక్తం చేశారు. మహిళా, శిశు సంక్షేమాభివృద్ధికి కేవలం 2.5శాతం కేటాయింపులు పెరిగాయని, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అస్సలు కేటాయింపులే పెరగలేదని అన్నారు. వ్యవసాయ రంగంలో సంక్షోభం తీవ్రంగా వున్న సమయంలో, గ్రామీణ నిరుద్యోగిత పెరిగిపోయిన తరుణంలో ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ ప్రవేశపెట్టడంతో పరిస్థితి మరింత దిగజారిందని వారుపేర్కొన్నారు. కార్మిక సంక్షేమ నిధిలో కోత విధించారన్నారు. గ్రామీణాభివృద్ధి నిధుల్లో కూడా ఏకంగా 20శాతం కోత పెట్టారన్నారు. పంటల బీమా పథకంలోకూడా రూ.1500కోట్ల మేరా కోత విధించారన్నారు. ఆహార, ఎరువుల సబ్సిడీలను దారుణంగా తగ్గించారని విమర్శించారు. ఏ రంగం చూసినా నిధుల కేటాయింపులు అరకొరగానే వున్నాయన్నారు. ఇంధన పరివర్తన ద్వారా ఇంధన భద్రతకు చర్యలు తీసుకోవడమంటే వ్యూహాత్మక ఇంధన రంగాన్ని ప్రయివేటీకరించేందుకు ఉద్దేశించిన చర్యే అని విమర్శించారు. కార్మిక వర్గ తిరోగమన చర్యలతో కూడిన ఈ బడ్జెట్‌ను నిరసిస్తూ ఆందోళనలు, నిరసనలు చేపట్టాల్సిందిగా సీఐటీయూ కార్మిక లోకానికి పిలుపునిచ్చింది.

ఎన్‌పీఆర్‌డీ ఆందోళన

బడ్జెట్‌లో వికలాంగులను అస్సలు పట్టించుకోలేదని జాతీయ వికలాంగుల హక్కుల వేదిక విమర్శించింది. ప్రభుత్వ ప్రాధాన్యతలేవీ సరిగా లేవని, బడ్జెట్ తీరున చూస్తుంటే అర్థమవుతోందని పేర్కొంది. వికలాంగుల సాధికారతా విభాగానికి కేటాయింపులు పెరగలేదని తెలిపింది. బలహీన వర్గాలను, వికలాంటులను పట్టించుకోని ఈ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ రాష్ట్రాల్లో నిరసనలు చేపట్టాల్సిందిగా పిలుపిచ్చింది.

ఎస్ఎఫ్ఐ విమర్శ

భారతదేశ విద్యా రంగం ఎదుర్కొంటున్న కీలక అవసరాలను నెరవేర్చడంలో ఈ బడ్జెట్ విఫలమైందని ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు వి.పి.సాను, ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిశ్వాస్‌లు ఒక ప్రకటనలో విమర్శించారు. స్కూలు విద్యకు బడ్జెట్ కేటాయింపులు చాలా తక్కువగా పెరిగాయని, అంటే ప్రాథమిక విద్యను ప్రభుత్వం పట్టించుకోలేదని అర్థమవుతోందని వారన్నారు. భావి భారత పౌరుల ఆరోగ్యాన్ని, విద్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. బాలల పోషకాహారం పెంపులో కీలక పాత్ర పోషిస్తు్న అంగన్‌వాడీలకు అసలు ప్రాధాన్యతే లేకుండా పోయిందని ఎస్ఎఫ్ఐ విమర్శించింది.

మైనారిటీ సంక్షేమానికి రూ. నాలుగు వేల కోట్లు కేటాయించాలి

- ఆవాజ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా మైనారిటీ సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.నాలుగు వేల కోట్లు కేటాయించాలని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సబ్ ప్లాన్ అమలు చేయాలనీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ. వెయ్యి కోట్లు కేటాయించి, మైనార్టీ నిరుద్యోగులకు, చిన్న చిన్న వ్యాపారాలు, వృత్తులు చేసుకునే వారికి లోన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మైనారిటీల స్థితిగతులను పరి గణనలోకి తీసుకుని అసెంబ్లీలో చర్చ జరపాలని కోరారు. మైనార్టీలు పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత వంటి సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. జస్టిస్ రాజేందర్ సచార్ కమిటీ, సుధీర్ కమిషన్ ఇచ్చిన నివేదికల ప్రకారం ముస్లింలలో 68 శాతం కుటుం బాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయని తెలిపారు. ఫుట్ పాత్‌లపై, చిన్న చిన్న వ్యాపారాలు, వృత్తులు చేసుకునే వారికి బ్యాంకుల నుంచి ఎలాంటి రుణ సదుపాయం అందడం లేదని పేర్కొన్నారు. 98 శాతం ముస్లిం మైనార్టీలు అసంఘటిత రంగంలో, అస్థిర ఆదాయాలు వచ్చే పనులు చేస్తున్నారని తెలిపారు. దీంతో ఆర్థికంగా చితికిపోతూ, అప్పుల పాలవుతూ, పేదరికంలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ తరహాలో మైనార్టీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి, నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. మైనారిటీ మహిళలకు, యువతీ, యువకులకు వృత్తినైపుణ్య శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మైనారిటీ రెసిడెన్షియల్ స్కూళ్లకు నూతన భవనాలు నిర్మించి మరింత సమర్ధవంతంగా నిర్వహించాలని కోరారు ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ మైనార్టీల అభివృద్ధికి రూ.4 వేల కోట్లు కేటాయించి, బడ్జెట్ సబ్ ప్లాన్ అమలు చేస్తామనీ, రూ.1000 కోట్లతో మైనార్టీ నిరుద్యోగులకు రుణాలు ఇస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొన్నదని గుర్తు చేశారు. వక్ఫ్ భూములను రక్షిస్తామని హామీ ఇచ్చిందని పేర్కొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఆవాజ్ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని మంగళవారం హైదరాబాద్‌లోని ఆవాజ్ రాష్ట్ర కార్యాలయంలో సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ మహ మ్మద్ అన్సారీ అధ్యక్షతన నిర్వహించారు. సమా వేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అజీజ్ అహ్మద్ ఖాన్, అతీఖుర్ రహమాన్, షేక్ నబి, గయాసుద్దీన్, రాష్ట్ర సహాయ కార్య దర్శులు రెహమాన్ ఖాన్, జహంగీర్, రాష్ట్ర కోశాధికారి షేక్ అబ్దుల్ సత్తార్, రాష్ట్ర కమిటీ సభ్యులు కలీం, పాషా, ఎం ఎం మక్సూద్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు ప్రాధాన్యతనిచ్చాం

ఇది దేశ హిత బడ్జెట్ : కేంద్ర మంత్రి బండిసంజయ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశహితాన్ని కోరేలా ఉందనీ, తెలంగాణకు ప్రాధాన్యత ఇచ్చారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. ప్రధాని మోడీ ప్రణాళికలకు అద్దం పట్టేలా ఉందని కొనియాడారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మౌలిక రంగాలకు అత్యధిక నిధులు కేటాయింపు భేష్ అని ప్రశంసించారు. వ్యవసాయం, విద్యా రంగాలకు పెట్టపీట వేశారని తెలిపారు. మూడు కోట్ల మందికి ఇండ్లు కట్టించే ప్రణాళిక అద్భుతమని తెలిపారు. తెలంగాణకు నిధులివ్వలేదనటం కాంగ్రెస్, బీఆర్ఎస్ మూర్ఖత్వానికి నిదర్శనమని విమర్శించారు. తెలంగాణ సహా దేశంలోని వెనుకబడిన జిల్లాలకు కేంద్రం నిధుల కేటాయింపు జరిగిందని తెలిపారు. హైదరాబాద్ బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో 210 కిలోమీటర్లు తెలంగాణలో భాగమనే విషయం తెలియదా? అని ప్రశ్నించారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ సాధ్యం కాదని నిపుణులు తేల్చిన సంగతి మర్చిపోయారా? అని నిలదీశారు. రాష్ట్ర విభజన చట్టంలో తెలంగాణ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చే అంశాన్ని పొందుపర్చింది యూపీఏ-2 ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా ఆ పార్టీల నాయకుల వంకర బుద్ధి మారలేదని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర సహాయ సహకారాలపై నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలని కోరారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు గుండుసున్నా

- శాసన సభ సమయాన్ని కూడా పథకాల్లాగే రేవంత్ సర్కార్ ఎత్తేస్తుంది
- 15రోజులు శాసనసభ నిర్వహించాలి
- తొమ్మిదంశాలు స్పీకర్ ముందుంచాం : మాజీ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర మంత్రి నిర్మలా సీతారాబమన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ పేరే లేదనీ, రాష్ట్రానికి గుండు సున్నా చూపించందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని శాసన సభ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి రాష్ట్రానికి మొండి చేయి చూపారనీ, తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ఇంత జరుగుతుంటే రేవంత్ ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఏపీకి అన్ని నిధులు ఇచ్చినందుకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అయితే.. తెలంగాణలో కూడా తొమ్మిది వెనుకబడిన జిల్లాలున్నాయనీ, వాటికి ఎందుకు నిధులు విడుదల చేయటం లేదని కేంద్రాన్ని నిలదీశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం శాసన సభ సమయాన్ని కూడా వాళ్ల పథకాల్లాగే ఎత్తేస్తున్నదని విమర్శించారు. నాలుగు రోజుల్లో బడ్జెట్ సమావేశాలు ముగించాలని చూస్తున్నదని చెప్పారు. గతంలో వీరే 15 రోజులు అసెంబ్లీ సమావేశాలుండాలని డిమాండ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. నిరుద్యోగుల ఎజెండా పెట్టాలని బీఆర్ఎస్ పార్టీ తరపున తాము అడిగామని.. ఇదే విషయాన్ని తెలంగాణ గవర్నర్ దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దారుణాలు, దొంగతనాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీల మీద చర్చ పెట్టాలని తాము అడిగామని చెప్పారు. రుణమాఫీ మీద మొదటి సంతకం అన్నారనీ, ఇప్పుడు అందరికీ ఇవ్వకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. పల్లె ప్రగతి పట్టణ ప్రగతి గాలికొదిలేశారన్నారు. రాష్ట్రం మొత్తం విష జ్వరాలు సోకుతున్నాయని తెలిపారు. స్థానిక సంస్థలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వటం లేదనీ,తదితర తొమ్మిది అంశాలపై చర్చ జరగాలని బీఏసీలో అడిగామని హరిశ్‌రావు చెప్పారు.

పనిదినాలు పెరిగాయి.. బడ్జెట్ పెంపేది? : లిబ్‌టెక్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలో ఉపాధి హామీ పని దినాలు గతేడాది కంటే ఈసారి 5.6 శాతం పెరిగాయనీ, కేంద్ర బడ్జెట్‌లో దానికి నిధుల పెంపు మాత్రం జరగలేదని లిబ్‌టెక్ సంస్థ ప్రతినిధి చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం బడ్జెట్ పది శాతం పెరిగినప్పటికీ ఉపాధి హామీ చట్టానికి మాత్రం నిధులు పెంచకపోవడం సరిగాదని పేర్కొన్నారు. గతేడాది 86 వేల కోట్ల రూపాయల కేటాయింపు చేయగా దానికైన ఖర్చు 1.05 లక్షల కోట్లు అని తెలిపారు. గతేడాది ఖర్చుతో పోల్చితే ఈ సంవత్సరం బడ్జెట్ కేటాయింపు 19,300 కోట్లు తక్కువ అని పేర్కొన్నారు. వేతనాల సవరణను, పనిదినాల పెంపును కేంద్రం పట్టించుకోలేదని తెలిపారు.

తెలంగాణకు తీరని అన్యాయం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం కలిగిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాని మోడీ దేశాన్ని దృష్టిలో పెట్టుకోకుండా పక్షపాత ధోరణితో వ్యవహరించారని విమర్శించారు. అందులో భాగంగానే ఏపీకి నిధులు కేటాయించి తెలంగాణను విస్మరించారని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య విభేదాలు పెంచే విధంగా ఈ బడ్జెట్ ఉందని తెలిపారు. అయితే ఏపీకి నిధులు కేటాయించడం సంతోషమేనని పేర్కొన్నారు. కానీ విభజన హామీల గురించి ప్రస్తావించకపోవడం మోడీ పక్షపాత వైఖరికి నిదర్శనమని విమర్శించారు. తెలంగాణకు నిధులు కేటాయించకుండా అన్యాయంపై రాష్ట్రం నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

ప్రతిపక్ష రాష్ట్రాల పట్ల వివక్ష : మాస్‌లైన్

కేంద్ర బడ్జెట్ మసిపూసి మారేడుకాయ చేసినట్టుగా ఉందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల బడ్జెట్‌గా ఉందని తెలిపారు. ప్రతిపక్ష రాష్ట్రాల పట్ల వివక్షను చూపిందని పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపిందని తెలిపారు. పాలమూరు ప్రాజెక్టుకు నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు. పంటలకు మద్దతు ధరల గురించి ప్రస్తావించలేదని విమర్శించారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి నిర్దిష్ట ప్రణాళిక లేదని తెలిపారు. కార్పొరేట్ వర్గాలకు అనుకూల వైఖరిని కేంద్రం ప్రదర్శించిందని పేర్కొన్నారు.

రేపు కాళేశ్వరానికి వెళతాం

- రెండు రోజులపాటు అక్కడే మకాం
- విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో వాయిదా తీర్మానమిస్తాం
- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయంపై రాహుల్ గాంధీ నోరువిప్పాలి
- కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటులో గళమెత్తాలి : మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో తమ పార్టీపైనా, మాజీ సీఎం కేసీఆర్‌పైనా కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలు చేస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఈ నేపథ్యంలో వాస్తవాలను ప్రజల ముందుంచేందుకు వీలుగా తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు వెళుతున్నట్టు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రతిపాదించే రోజైన గురువారం.. పద్దును సభలో ప్రవేశపెట్టగానే తాము కాళేశ్వరానికి బయలుదేరుతామని అన్నారు. శుక్రవారం వరకూ అక్కడే మకాం వేస్తామని చెప్పారు. బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం అనంతరం మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు విలేకర్ల సమావేశం నిర్వహించారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలేస్తామని ఆయన హెచ్చరించారు. వాటిపై వాయిదా తీర్మానాలను ఇస్తామని తెలిపారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా తదితరాంశాలపై కూడా చర్చకు పట్టుపడతామని వివరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు ఇతర బకాయిలను విడుదల చేయాలంటూ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. పింఛన్లను రూ.4 వేలకు పెంచటంపై రేవంత్ సర్కార్ మాట తప్పిందని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపు తప్పాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని హరీశ్‌రావు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. పౌర సరఫరాలు, ఎక్సైజ్ శాఖల్లో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందని ఆయన ఈ సందర్భంగా ఆరోపించారు. వీటిపై సీఎం రేవంత్, మంత్రులు ప్రజలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందనీ, ఇది ముమ్మాటికీ ముఖ్యమంత్రి రేవంత్ వైఫల్యమేనని ఎద్దేవా చేశారు. ఈ విషయమై పార్లమెంటులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నోరు విప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్, బీజేపీలకు చెరో ఎనిమిది ఎంపీ సీట్లను ఇస్తే... వారందరూ కలిసి తెలంగాణకు 'గుండు సున్నా' తెచ్చారని ఎద్దేవా చేశారు. విలేకర్ల సమావేశంలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, చింతా ప్రభాకర్, విజయుడు, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి కూడా పాల్గొన్నారు.



ఆతిథ్య రంగానికి తీవ్ర నిరాశ

హైదరాబాద్/న్యూఢిల్లీ : కేంద్రం ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్ పట్ల ఆతిథ్య పరిశ్రమ తీవ్ర నిరాశను వ్యక్తం చేసింది. ఈ రంగానికి మౌలిక సదుపాయాల హోదా కల్పించాలనే ప్రధాన డిమాండ్‌ను కేంద్రం పట్టించుకోలేదు. పర్యాటకం, హోటల్ రంగంలో అంతర్జాతీయంగా తీవ్ర పోటీ నెలకొన్న సమయంలో సవాళ్లను అధిగమించేందుకు ఆతిథ్య రంగంలో నిర్మాణాత్మక మార్పులు తెచ్చేందుకు ఎటువంటి ప్రయత్నాలు జరగలేదని పేర్కొంది. టూరిజం పెంచడానికి ప్రచార బడ్జెట్‌ను పెంచాలని, జీఎస్‌టీ రేట్లను తగ్గించాలనే తమ కీలక డిమాండ్లను కేంద్రం పక్కన పెట్టడం నిరాశకు గురి చేసిందని ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఇన్ ఇండియన్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ (ఫెయిత్) కన్సల్టింగ్ సీఈఓ ఆశిష్ గుప్తా పేర్కొన్నారు.

"మేము టూరిజం సంఖ్యను పెంచడానికి సంబంధించి అనేక సిఫారసులు ఇచ్చాము, కానీ అవి పూర్తిగా విస్మరించబడ్డాయి. ఉపాధికి ఊతమిచ్చే ఆతిథ్య రంగానికి తగు ప్రాధాన్యతను ఇవ్వలేదు. మేం ఈ విషయంలో పూర్తి నిరాశకు గురైయ్యాము." అని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ ప్రెసిడెంట్ రాజీవ్ మెహ్రా అన్నారు.

వ్యాపారం మరింత సులభతరం : సీఐఐ

బడ్జెట్ వ్యాపారాలను మరింత సులభతరం చేసేలా ఉందని కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ప్రెసిడెంట్ సంజీవ్ పూరీ అన్నారు. పరిశ్రమల వృద్ధికి, సంస్కరణల్లో ప్రధాన మార్పులను తేనుందన్నారు. బహుళ రంగాలలో విస్తృత పెట్టుబడులకు మద్దతును ఇవ్వనుందన్నారు. ఈ బడ్జెట్ వ్యవసాయం, తయారీ నుంచి సేవల వరకు అనేక రంగాలలోకి చాలా పెట్టుబడులను తీసుకురానుందని వ్యాపారాన్ని సులభతరం చేయడంపై చాలా దృష్టి సారించిందని పూరి పేర్కొన్నారు.

అభివృద్ధికి అనుకూలం.. : ఎఫ్‌టీసీసీఐ

కేంద్ర బడ్జెట్ అభివృద్ధికి అనుకూలంగా ఉందని తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ప్రెసిడెంట్ సురేష్ కుమార్ సంఘాల్ అన్నారు. ఉపాధి, నైపుణ్యాలు, ఎంఎస్‌ఎంఈ, మధ్యతరగతి వంటి నాలుగు ప్రాధాన్యతా రంగాలకు పెద్దపీట వేస్తున్నట్టు ఆర్థిక మంత్రి చేసిన ప్రతిపాదనను తాము స్వాగతిస్తున్నామన్నారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి ఎఫ్‌డీఐ విధానాన్ని సరళీకృతం చేయడాన్ని సురేష్ కుమార్ ప్రశంసించారు. దేశంలో ఉన్నత విద్యకు మద్దతుగా రూ.10 లక్షల రుణ పథకాన్ని ఎఫ్‌టీసీసీఐ మాజీ అధ్యక్షులు మీలా జయదేవ్ స్వాగతించారు. దీని వల్ల చాలా మంది పేదలు ఉన్నత చదువులు చదివేందుకు దోహదపడుతుందని తెలిపారు.

మౌలిక సదుపాయాలకు మద్దతు : సీఎంఏ

కేంద్ర బడ్జెట్ మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన, ఇంధన భద్రతకు ప్రాధాన్యతను ఇచ్చిందని సిమెంట్ తయారీదారుల సంఘం (సీఎంఏ) ప్రెసిడెంట్ నీరజ్ అఖౌరీ పేర్కొన్నారు. రూ.11 లక్షల కోట్ల మూలధన వ్యయం ప్రకటన, వివిధ ముఖ్యమైన ప్రాజెక్టులు, కేటాయింపుల ద్వారా భారతదేశ మౌలిక సదుపాయాలను ఆధునీకరించడానికి ప్రభుత్వ నిబద్ధతను సూచిస్తుందన్నారు. ఇది సిమెంట్, ఇతర నిర్మాణ సామగ్రికి డిమాండ్‌ను పెంచుతుందన్నారు. ఇది వివిధ రంగాలలో భారతదేశ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి దోహదం చేస్తుందన్నారు.

తయారీకి మద్దతు : ఫిక్కీ

దేశాన్ని తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయడానికి వీలుగా బడ్జెట్ ఉందని ఫిక్కీ ప్రెసిడెంట్ అనిష్ షా పేర్కొన్నారు. ప్రపంచంలోనే భారత్‌ను తయారీ కేంద్రంగా మార్చడానికి వీలుగా ఉందన్నారు. జీడీపీలో పెట్టుబడులు 3.4 శాతంగా కొనసాగేలా కేంద్రం దృష్టి కేంద్రీకరించడం సానుకూలాంశమన్నారు.

ఏంజెల్ పన్ను రద్దు హర్షనీయం : టీహబ్ సీఈఓ

కొత్త ఇన్నోవేషన్‌లను ప్రోత్సాహించే విధంగా బడ్జెట్ ఉందని టిహబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాస్ రావు తెలిపారు. అన్ని రకాల పెట్టుబడిదారులకు విధించే ఏంజెల్ పన్ను రద్దు అనేది ఒక కీలకమైన చర్య అని పేర్కొన్నారు. ఇది నూతన ఆవిష్కరణలకు మంచి వాతావరణాన్ని కల్పిస్తుందన్నారు. ఈ టాక్స్ రద్దు అనేది స్టార్టప్‌లకు ప్రయోజనం చేకూరుస్తుందన్నారు.

గురుకుల ప్రిన్సిపాల్ బదిలీలలో భారీ అవకతవకలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని గురుకులాలకు సంబంధించిన ప్రిన్సిపాల్ గ్రేడ్ 1 సాధారణ బదిలీ కౌన్సెలింగ్ సమయంలో అనేక అవకతవకలు జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్పౌజ్ కేసులు, మెడికల్ గ్రౌండ్స్‌కు మొదటి ప్రాధాన్యత ఇచ్చిన, తరువాత, దీర్ఘకాలిక కేసులు (6 సంవత్సరాల కంటే ఎక్కువ) , తక్కువ లేదా అంతకంటే ఎక్కువ క్యాడర్లకు వ్యతిరేకంగా పని చేయడంతో సహా కంపల్సరీ ట్రాన్స్ ఫర్లను పరిగణించాయి. ఉదాహరణకు గ్రేడ్ 1 ప్రిన్సిపాల్ గ్రేడ్ 2 పోస్ట్‌కి లేదా వైస్ వెర్సాకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. స్పౌజ్ కైనా, లేదా మెడికల్‌కి అయినా కొన్ని పాయింట్లు ఇస్తారు. తర్వాత అన్ని రకాలైన పాయింట్లు కలిపి ఎవరికి ఎక్కువ పాయింట్లు ఉంటే వారికి ప్రాధాన్యత ఇచ్చి ఆ విధంగా కౌన్సిలింగ్ కి పిలవాలి, కానీ స్పౌజ్ కేసు వారికి మెడికల్ గ్రౌండ్స్ వారికి, ఇన్ఫినిటీ పాయింట్లు ఇచ్చి మొదటగా వారికి అవకాశం కల్పించడంతో నిజంగా ఎవ్వరికైతే న్యాయం జరగాలో వారికి అన్యాయం జరిగినట్టు తెలుస్తున్నది.



స్పౌజ్ గ్రౌండ్స్

దరఖాస్తుదారులు స్పౌజ్ గ్రౌండ్స్ కిందకు వచ్చారా? అని మౌఖికంగా అడిగారే తప్ప వారి క్లెయిమ్‌లను అధికారులు చూసి వాస్తవమా? కాదా? అని ధృవీకరించకుండానే ఖాళీలను చూపించారు. అభ్యర్థులు చెప్పినది వాస్తవమా? కాదా? అని కూడా చూడకుండానే వారికి ప్రాధాన్యత ఇచ్చి వారికి ముందుగా అవకాశం ఇచ్చారు. ఇందులో అనేక లోపాలు ఉన్నాయి. మిగిలిన అభ్యర్థులు అభ్యంతరం తెలపటంతో వెంటనే కౌన్సెలింగ్‌ను రద్దు చేసి మొదటి నుంచి తిరిగి ప్రారంభించారు.

మెడికల్ గ్రౌండ్స్

క్వాలిఫైడ్ డాక్టర్‌తో మెడికల్ రికార్డ్స్ వెరిఫై చేయించకుండా అభ్యర్థులు ఏది చెప్తే దాన్ని పరిగణనలోకి తీసుకుని వారికి రెండవ ప్రాధాన్యత ఇచ్చారు. దరఖాస్తుదారులు కొంతమంది మెడికల్ ఫైళ్లను తీసుకొచ్చారు. మరి కొంతమంది తీసుకు రాలేదనే విషయాన్ని కూడా పరిశీలించ కుండానే వారికి అవకాశమిచ్చినట్టు సమాచారం. కొంతమంది తప్పుగా వచ్చారు అని అభ్యర్థించిన వెంటనే మళ్లీ అప్పటివరకు జరిగిన ట్రాన్స్ ఫర్లను రద్దు చేసి తిరిగి ప్రారంభించారు. తదుపరి నిర్వహించిన బదిలీలలో కూడా అనేక అవకతవకలు ఉన్నా పట్టించుకోకుండానే బదిలీలను పూర్తి చేశారు.

పారదర్శకత లేకపోవడం

ఇటీవల ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సిన కౌన్సెలింగ్ సాయంత్రం 6:00 గంటలకు ప్రారంభమైంది. తదనంతరం అభ్యర్థుల ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఏ అధికారి అందుబాటులో లేకుండా పోయారు. క్రింది స్థాయి అధికారులు ఖాళీలపై సెక్రటరీ దృష్టి మరల్చి వారు కోరుకున్న వారికి ముందుగా పిలిపించి వారికి ఇష్టమైన ప్లేస్ ఇచ్చారు. కౌన్సిలింగ్ ప్రక్రియ అనేక సార్లు తిరిగి ప్రారంభించడంతో అభ్యర్థుల్లో గందర గోళం నెలకొంది. ఇది దరఖాస్తుదారులలో వారి తుది కేటాయింపుల గురించి పూర్తిగా గందరగోళానికి దారితీసింది.

ఏకపక్ష సవరణలు

బదిలీలకు సంబంధించి కొన్ని కేటాయింపులు సవరించబడ్డాయి, ముందుగా పేర్కొన్న స్పౌజ్ కారణాలలో లోపాలను పేర్కొంటూ ఎలాంటి స్పష్టమైన వివరణ, సమర్థన లేకుండానే సవరణ ఉత్తర్వులతో కొత్త స్థలాలు కేటాయించారు. ఇందులో కొందరు అధికారులు అవినీతికి పాల్పడి ఇష్టా రాజ్యంగా ట్రాన్స్ఫర్ కౌన్సిలింగ్ ప్రక్రియ జరిపినట్టు ఆరోపణలున్నాయి. ఇందులో ఎప్పుడో సంస్థ నుంచి శాశ్వతంగా ఉద్యోగం నుంచి టెర్మినేట్ చేయబడ్డ ఒక అధికారి చక్రం తిప్పుతున్నారనే గుసగుసలు వినబడుతున్నాయి.

నిర్బంధ బదిలీలు

అభ్యర్థులను వారి పాయింట్ల ఆధారంగా పిలిచారు, కానీ ఇది ఎవ్వరూ చెక్ చెయ్యలేదు. అభ్యర్థులు వారి ఇష్ట ప్రకారంగా పాయింట్లను వేసుకొని ముందుగా వెళ్లి వారు కోరుకున్న స్థానానికి బదిలీ అయ్యారు.

ఇది గమనించిన కొందరు సెక్రటరీ వద్ద అభ్యంతరం చెప్పినప్పుడు, సెక్రటరీ వారిని తిట్టి మళ్లీ పిలిచి సరిగా వేసుకుని రమ్మన్నారే కానీ వారు వేసుకున్న పాయింట్లు నిజమా? కాదా? అని చెక్ చేసిన అధికారులు లేరు. అందరి పాయింట్లను రికార్డుల ఆధారంగా సరిచేయమని కొందరు కోరారు. అయినా సరే, పాయింట్లను ఏ అధికారి ధృవీకరించలేదు.

విద్యారంగానికి మొండిచేయి

కేంద్ర బడ్జెట్‌పై ఎస్‌ఎఫ్‌ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర బడ్జెట్‌లో బీజేపీ ప్రభుత్వం విద్యారంగానికి మొండిచేయి చూపించిందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాభివృద్ధి కోసం కనీసం నిధులను కేటాయించలేదని తెలిపారు. పాఠశాల విద్యకు గత బడ్జెట్‌లో రూ.68,804.85 కోట్లు కేటాయించిందనీ, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.71,508.93 కోట్లు కేటాయించిందని వివరించారు. ఉన్నత విద్యకు గత బడ్జెట్‌లో రూ.44,094.62 కోట్లు కేటాయిస్తే, ప్రస్తుతం రూ.53,196.28 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. నూతన విద్యావిధానం-2020ని అమలు చేయాలంటే కేంద్ర బడ్జెట్‌లో ఆరు శాతం నిధులను విద్యారంగానికి కేటాయించాలంటూ సిఫారసు చేస్తే కేవలం రూ.లక్ష కోట్లు కేటాయించిందని విమర్శించారు. యూజీసీకి భారీగా నిధులను తగ్గించిందని తెలిపారు. ఉన్నత విద్యను పూర్తిగా ప్రయివేటుపరం చేసి కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసేందుకు ఈ బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. రానున్న కాలంలో వెయ్యి ఐటీఐలను అభివృద్ధి చేస్తామనీ, విద్యారుణాలను రూ.పది లక్షల వరకు ఇస్తామని ప్రకటించారని తెలిపారు. దేశంలో 20 లక్షల మందికి నైపుణ్య శిక్షణ అందిస్తామన్నారని పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌ను సవరించి విద్యాభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యం : ఏఐఎస్ఎఫ్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. రూ.48 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం రూ.1.25 లక్షల కోట్లు కేటాయించిందని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేందుకే కేంద్రం తక్కువగా కేటాయింపులు చేసిందని పేర్కొన్నారు. కొత్త ఉన్నత విద్యాసంస్థల ఊసేలేదనీ, విశ్వవిద్యాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించలేదని విమర్శించారు. ప్రధాని మోడీ తన కుర్చీని కాపాడుకోవడం కోసం బీహార్, ఏపీకి నిధులు కేటాయించారని తెలిపారు. తెలంగాణకు కేంద్రం అన్యాయం చేయడమంటే బీజేపీ రాష్ట్ర ఎంపీ చేతగానితనమేనని పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

విద్యారంగాన్ని విస్మరించిన కేంద్రం : పీడీఎస్‌యూ

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజావ్యతిరేకమని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ విమర్శించారు. విద్యారంగాన్ని విస్మరించారని తెలిపారు. తెలంగాణకు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం దుర్మార్గమనీ, ఈ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి పది శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. విభజన హామీలను అమలు చేయాలని కోరారు.

సింగరేణి కాంట్రాక్ట్ ఉద్యోగులకు రూ.30 లక్షల ప్రమాద బీమా

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కాలరీస్‌లో పనిచేస్తున్న 25వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు రూ.30 లక్షల ప్రమాదబీమా వర్తింపచేస్తున్నట్టు ఆ సంస్థ సీఎమ్‌డీ ఎన్ బలరాం తెలిపారు. వీరందరికీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో వేతన ఖాతాలు తెరిపించే బాధ్యతను కాంట్రాక్టర్లు తీసుకోవాలని ఆదేశించారు. మంగళవారం సింగరేణిభవన్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగుల సంక్షేమంపై సంస్థ డైరెక్టర్లు, ఏరియా జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. గతంలోనే సింగరేణి ఉద్యోగుల కోసం ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకుల ద్వారా కోటి రూపాయల ప్రమాద బీమా పథకాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. తాజాగా కాంట్రాక్టు కార్మికులకు రూ.30 లక్షల ప్రమాద బీమా వర్తింపజేస్తున్నామన్నారు. అయితే ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల ద్వారా రూ.50 లక్షల వరకు ప్రమాద బీమా సదుపాయాన్ని కాంట్రాక్టు ఉద్యోగులకు వర్తింపజేసే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని తెలిపారు. అలాగే కాంట్రాక్టు కార్మికులకు సింగరేణి ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందిస్తున్నామనీ, వారి కుటుంబ సభ్యులకు కూడా ఆరోగ్య సేవలు అందించేందుకు ఈఎస్ఐ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. తొలివిడతలో కొత్తగూడెం, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం(ఎస్టీపీపీ) లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఈఎస్ఐ ద్వారా వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్మిక చట్టాలు, కోర్టుల ఆదేశాల మేరకు కాంట్రాక్టు ఉద్యోగులందరికీ తప్పనిసరిగా పీఎఫ్, సీఎంపీఎఫ్, పింఛన్ కోసం జీతంలో కొంత రికవరీ చేసి, కాంట్రాక్టర్ల ద్వారా అంతే మొత్తాన్ని కలిపి వారి ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుందనీ, దీన్ని తప్పనిసరి చేస్తామని చెప్పారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల మస్టర్లను కూడా వెబ్ అప్లికేషన్ ద్వారా నమోదు చేసే ప్రక్రియను చేపడుతున్నామని తెలిపారు. ఆగస్టు మొదటివారం నుంచి దీన్ని అమల్లోకి తెస్తామని వివరించారు. సమావేశంలో కొత్తగూడెం నుంచి డైరెక్టర్లు డి.సత్యనారాయణరావు(ఈ అండ్ ఎం), ఎన్.వి.కె.శ్రీనివాస్ (ఆపరేషన్స్, పర్సనల్), జి.వెంకటేశ్వరరెడ్డి, కార్పొరేట్ జీఎంలు, సింగరేణి భవన్ నుంచి జీఎం(కో ఆర్డినేషన్) జి.దేవేందర్ పాల్గొన్నారు.

ట్రేడింగ్ లాభాలపై పన్నులు

- ఇన్వెస్టర్లకు మోడీ షాక్
- షార్ట్ టర్మ్ కాపిటల్ గెయిన్స్‌పై 20శాతం పన్ను



న్యూఢిల్లీ : స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్‌పై వచ్చే లాభాలపై భారీగా పన్నులు వేయాలని మోడీ సర్కార్ నిర్ణయం తీసుకుంది. మంగళవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను రేటును 10 శాతం నుంచి 12.5 శాతానికి పెంచుతూ మంత్రి సీతారామన్ ప్రకటన చేశారు. అలాగే షార్ట్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్‌ను 15 శాతం నుంచి 20 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. అలాగే ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్ లో సెక్యూరిటీస్ ట్రేడింగ్ ట్యాక్స్‌ను 0.01 శాతం నుంచి 0.02 శాతానికి పెంచారు. నాన్ ఫైనాన్షియల్ అసెట్స్, ఇతర ఫైనాన్షియల్ అసెట్స్ ట్యాక్స్ రేట్లు మాత్రం యథాతథంగా ఉంటాయని మంత్రి తెలిపారు. కాగా.. సాధారణ ఇన్వెస్టర్లపై క్యాపిటల్ గెయిన్ మినహాయింపు పరిమితిని సంవత్సరానికి రూ.1 లక్ష నుంచి రూ.1.25 లక్షలకు పెంచారు. ఆదాయపు పన్ను నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి క్యాపిటల్ అసెట్స్‌ను విక్రయించినపుడు లాభం లేదా నష్టం ఉంటుంది. వీటినే మూలధన లాభాలు లేదా నష్టాలు అంటారు. ఇన్వెస్టర్ కంపెనీ షేర్లను ఏడాది లోపు విక్రయిస్తే వాటిని షార్ట్ టర్మ్‌గా, ఏడాది పైబడి షేర్లను విక్రయించకుండా ఉంటే లాంగ్‌టర్మ్ పెట్టుబడులుగా పరిగణిస్తారు.

డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం@రూ.50వేల కోట్లు



న్యూఢిల్లీ : గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి తీవ్ర ఎదురుదెబ్బలు తగిలినప్పటికీ.. ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయాన్ని మాత్రం కొనసాగింపునకే ప్రయత్నిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రూ.50వేల కోట్ల విలువ చేసే పీఎస్‌యుల వాటాలను అమ్మాలని నిర్దేశించుకున్నామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి సీతారామన్ బడ్జెట్‌లో తెలిపారు. గడిచిన 2023-24లోనూ ఇదే స్థాయిలో పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాన్ని పెట్టుకుంది. కాగా.. 30వేల కోట్ల వాటాలను విక్రయించింది. 2024-25లో ఆర్‌బీఐ సహా బ్యాంక్‌ల ద్వారా రూ.1.2 లక్షల కోట్ల డివిడెండ్‌ను ఆశిస్తోన్నట్టు మంత్రి తెలిపారు. ఇతర పిఎస్‌యుల నుంచి రూ.48వేల కోట్ల డివిడెండ్ వచ్చే అవకాశం ఉందని అన్నారు. 2023-24కు గాను ఆర్‌బీఐ నుంచి ఏకంగా రూ.2.11 లక్షల కోట్ల డివిడెండ్ పొందిన విషయం తెలిసిందే.

ఇథియోపియోలో విరిగిపడిన కొండచరియలు

157కు చేరిన మృతుల సంఖ్య

అడిస్ అబాబా : ఇథియోపియోలో ఆదివారం రాత్రి మారుమూల ప్రాంతంలో కొండచరియులు విరిగిపడిన ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య మంగళవారానికి 157కు చేరుకుంది. మంగళవారం కూడా సహాయక చర్యలు కొనసాగాయి. మృతుల్లో చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు కూడా స్థానిక అధికారులు తెలిపారు. దక్షిణ ఇథియోపియాలోని కెంచో షాచా గోజ్జి జిల్లాలో ఆదివారం రాత్రి కొండచరియలలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదం నుంచి ఐదుగుర్ని సహాయక బృందం రక్షించింది. గల్లంతైనవారికోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో ఇథియోపియోలో జూలై నుంచి సెప్టెంబర్ వరకూ కొండచరియలు విరిగిపడ్డం సాధారణ విషయం.

కన్వర్ యాత్రపై ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు : మధ్యప్రదేశ్

భోపాల్ : కన్వర్ యాత్రా మార్గంలో దుకాణాలపై తప్పనిసరిగా యజమానుల పేర్లను ప్రదర్శించాలని ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని మధ్యప్రదేశ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ విషయంలో ఎలాంటి గందరగోళాన్ని వ్యాప్తి చేయవద్దని రాష్ట్రంలోని మున్సిపాలిటీలను రాష్ట్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆదేశించింది. కన్వర్ యాత్రా మార్గంలో ఆహారపదార్థాల దుకాణదారులు యజమానులు తమ పేర్లు, ఇతర గుర్తింపు వివరాలు తప్పనిసరిగా ప్రదర్శించాలని ఇటీవల ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని బిజెపి ప్రభుత్వాలు జారీ చేసిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసిన సంగతి తెలిసిందే. అలాగే యాత్ర సాగే ఢిల్లీ, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

'ఉపాధి'కి మొండిచేయి.. ఆహార భద్రత గాలికి..

- నేడు, రేపు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు : వ్యకాస

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో ఆహార భద్రతను గాలికొదిలేసిందనీ, ఉపాధి హామీ పనులకు మొండిచేయి చూపిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు విమర్శించారు. కేంద్రం తీరును నిరసిస్తూ బుధ, గురువారాల్లో జిల్లా, మండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ పేదలకు, రైతులకు ఇస్తున్న రాయితీలను కుదించి బడా కార్పొరేట్లకు రాయితీలు ప్రకటించడాన్ని తప్పుబట్టారు. నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలను నియంత్రించడానికి చర్యలు తీసుకోకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార భద్రతకు గతేడాది రూ.2.12 లక్షల కోట్లు కేటాయించగా ఈసారి రూ.2.05 లక్షల కోట్లకు కుదించడం ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయడమేనని పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టానికి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలన్న మేధావుల డిమాండ్లను పట్టించుకోలేదని విమర్శించారు. గ్రామీణ ఉపాధి పని దినాలను 200 రోజులకు పెంచాలనీ, పట్టణ ప్రాంతాలకు విస్తరించాలనే డిమాండ్‌ను కూడా విస్మరించిన తీరును ఎండగట్టారు. గతేడాది మూడు కోట్ల ఇండ్లు కట్టిస్తామని చెప్పి బడ్జెట్‌లో రూ.55 వేల కోట్లనే చూపించిందని విమర్శించారు. పసిపిల్లలకు పౌష్టికాహారం అందించే మధ్యాహ్న భోజనం పథకానికి నిధులు తగ్గించడం దారుణమని పేర్కొన్నారు.

రాయల చంద్రశేఖర్ మరణం

- రైతాంగ ఉద్యమానికి తీరని లోటు
- సంయుక్త కిసాన్ మోర్చా నివాళులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాయల చంద్రశేఖర్ మరణం రైతాంగ ఉద్యమానికి తీరని లోటని సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర కమిటీ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర నాయకులు గుర్తు చేసుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో జరిగిన సంస్మరణ సభలో సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్లు టి.సాగర్, పశ్యపద్మ, పి.ప్రభాకర్, మండల వెంకన్న, మామిడాల భిక్షపతి, జక్కుల వెంకటయ్య, వి కోటేశ్వరరావు, దేవరామ్, నర్సింహ్మా వి భూమయ్య, డేవిడ్, రాజు, లాల్ కుమార్, సృజన తదితరులు పాల్గొన్నారు. చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాటాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పాలకులను, ప్రభుత్వాలను ప్రశ్నించి మచ్చలేని విప్లవ నాయకుడిగా ఎదిగిన ఆయన మన మధ్యలో లేకపోవడం బాధాకరమన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం నిబద్ధత కలిగిన ఆదర్శ కమ్యూనిస్టు చంద్రశేఖర్ లాంటి వారిని కోల్పోవడం విప్లవోద్యమానికి తీరని లోటన్నారు. రాయల చంద్రశేఖర్ ఆశయాలను కొనసాగిస్తామని వారు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో వివక్ష

- తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పట్ల వివక్ష చూపించారని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రూ.48 లక్షలా 21 వేల కోట్ల బడ్జెట్‌లో రాష్ట్రానికి శూన్య హస్తాలు చూపించడం బాధాకర మని అసహనం వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్లమెంటు సభ్యులు నిధులు తీసుకు రావడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వాములైన పార్టీలు ప్రాతినిథ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు భారీగా నిధులు కేటాయించారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎంపీలుంటే ఈ పరిస్థితిపై కేంద్రాన్ని నిలదీసేవారని వాపోయారు. విభజన హామీలైన ములుగు యూనివర్సిటీకి అదనపు నిధులు, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ గురించి బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

మరోసారి రైతులను మోసం చేసిన కేంద్రం

- నిరసనకు తెలంగాణ రైతు సంఘం పిలుపు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ రైతులను, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా మోసం చేసేలా ఉందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు, ప్రధానకార్యదర్శి టి.సాగర్ విమర్శించారు. వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పూనుకోవడం దారుణమన్నారు. రైతు వ్యతిరేకంగా ఉన్న ఈ బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ మోసపూరిత వైఖరిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలపాలని రైతాంగానికి పిలుపు నిచ్చారు. రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చేందుకు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదనలు లేవన్నారు. పైగా, ఎరువులకు ఇస్తున్న సబ్సిడీలో కోత పెట్టారని నిరసన తెలిపారు. 14 వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరలను పెంచామని ఆర్థిక మంత్రి ప్రకటించారనీ, కానీ, స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కొనుగోలుకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. కార్పొరేట్లకు లక్షల కోట్ల రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం, దేశంలో సగం మందికిపైగా ఉపాధిని చూపిస్తున్న వ్యవసాయ రంగానికి నిధులు కేటాయించకపోవడం ఆవేదన కలిగిస్తున్నదన్నారు. రుణమాఫీ ప్రస్తావనే తీసుకురాలేదనీ, సహకార రంగాన్ని బడా కార్పొరేట్లకు కట్టబెట్టేలా బడ్జెట్ ఉందన్నారు. ఆహార సబ్సిడీగానీ, వడ్డీమాఫీ పథకానికి గానీ, వ్యవసాయ పరిశోధనలకు గానీ, పెరిగిన బడ్జెట్‌కు అనుగుణంగా కూడా నిధులు పెంచలేదంటూ తప్పుబట్టారు. వడ్డీమాఫీ పథకానికి 2022-23లో రూ.23,000 కోట్లు ఖర్చు చేస్తే, ఇప్పుడు రూ.22,600 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. రైతులకు పెన్షన్ ఇవ్వాలన్న డిమాండ్‌ను కూడా నెరవేర్చలేదని గుర్తు చేశారు. ఉపాధిహామీ చట్టానికి కోతలు పెట్టడాన్ని ఖండించారు.

ఫిజికల్ ఫిట్‌నెస్‌పై స్మితా సబర్వాల్ స్పందించడం తప్పు

- ఎంతో మంది వికలాంగులు ఐఏఎస్‌లుగా రాణించారు
- సీఎంతో చర్చించి చర్యలపై నిర్ణయం తీసుకుంటాం : మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఐఏఎస్ సర్వీసు అధికారిగా ఫిజికల్ ఫిట్‌నెస్‌పై స్మితా సబర్వాల్ స్పందించడం ముమ్మాటికీ తప్పనీ, ఆమె వ్యక్తిగత అభిప్రాయాలను సమాజం మీద రుద్దాలని చూడటం సరిగాదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) అన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు దేశంలోని వికలాంగుల మనసులను గాయపరిచాయనీ, వాళ్లు ఎంతో బాధపడుతున్నారని చెప్పారు. మంగళవారం అసెంబ్లీలో మీడియా ప్రతినిధులతో ఆమె చిట్‌చాట్ నిర్వహించారు. వికలాంగులైన ఎంతో మంది ఐఏఎస్ ఆఫీసర్లుగా ఉన్నత పదవులను అలంకరించి రాణించిన విషయాన్ని గుర్తుచేశారు. పాలనలో ఎన్నో సంస్కరణలు చేశారని చెప్పారు. స్టీఫెన్ హాకింగ్, హెలెన్ కెల్లర్, బ్రెయిలీ లాంటి వాళ్లు చరిత్ర సృష్టించారని తెలిపారు. అనాధిగా ఫ్యూడల్ భావజాలం, ఒక రకమైన మనస్తత్వం ఉన్న వారికి ఇలాంటి ఆలోచనలు వస్తాయనీ, ఇప్పటికైనా అలాంటి ఆలోచనలు మానుకోవాలని హితవు పలికారు. ఇతరుల సమర్థతను గుర్తించాలని సూచించారు. అలా గుర్తించడానికి నిరాకరించే వారికే మానసిక వైకల్యం ఉన్నట్టుగా భావించాలన్నారు.గతంలో కొన్ని వర్గాలను చదువులకు దూరం చేశారనీ, అంబేద్కర్ లాంటి గొప్ప వ్యక్తికే చదువును నిరాకరించిన విషయాన్ని గుర్తుచేశారు. అలాంటి అంబేద్కరే దేశానికి రాజ్యాంగం రాశారన్నారు. స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు సీఎం దృష్టికి వెళ్లి ఉంటాయనీ, ఈ ఘటనపై తాను కూడా సీఎంతో మాట్లాడుతానని చెప్పారు. ఆయనతో చర్చించి ఏం చర్యలు తీసుకోవాలనే దాన్ని నిర్ణయిస్తామన్నారు.

వేతన జీవికి నిరాశే!



న్యూఢిల్లీ : బడ్జెట్‌పై వేతన జీవులు పెట్టుకున్న ఆశలను మోడీ ప్రభుత్వం అందుకోలేకపోయింది. పన్ను శ్లాబుల్లో లతో పాటు, స్టాండర్డ్ డిడక్షన్ లో చేసిన మార్పుల పట్ల ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. ఆ చర్యల వల్ల పెద్దగా ఉపయోగం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం స్టాండర్డ్ డిడక్షన్ మొత్తం 50 వేల రూపాయలు ఉండగా, దానిని 75 వేల రూపాయలకు పెంచుతున్నట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దీనివల్ల 17,500 రూపాయల వరకు ఉద్యోగులకు ఆదా అవుతుందని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. అయితే, ఉద్యోగుల్లో మాత్రం కనీసం లక్ష రూపాయల వరకు మినహాయింపు ఇచ్చి ఉండాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక

స్వల్ప ఊరట పట్ల పెదవి విరుపు

పన్ను శ్లాబుల విషయాని కొస్తే కొత్త పన్ను విధానంలో ఉండే వారికి మూడు లక్షల రూపాయల వరకు ఎటువంటి పన్నూ ఉండదు. గతంలో 3-6 లక్షల శ్లాబులో ఉండే వారికి 5 శాతం పన్ను ఉండేది, ఇప్పుడు ఆ మొత్తాన్ని 7లక్షల రూపాయలకు పెంచారు. గతంలో 6-9 లక్షల రూపాయల శ్లాబులో ఉండేవారికి 10శాతం పన్ను ఉండగా, తాజా శ్లాబుల ప్రకారం 7-10 లక్షల రూపాయల శ్లాబులో ఉండేవారు 10 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. పాత పన్ను విధానంలో కొనసాగుతున్న వారికి ఎటువంటి మార్పులు లేవు. పెన్షనర్లకు 15 వేల రూపాయలుగా ఉన్న స్టాండర్డ్ డిడక్షన్‌ను 25 వేల రూపాయలకు పెంచారు.

కొత్త శ్లాబులు ఇలా...

ఆదాయం (రూ లక్షలలో)	పన్ను (శాతం)
0-3	0
3-7	5
7-10	10
10-12	15
12-15	20
15 లక్షల పైన	30

విద్యారంగానికి నిరాశే : టీపీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి నిరాశే ఎదురైందని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డి విమర్శించారు. విద్యారంగానికి కనీసం కేంద్ర బడ్జెట్‌లో కనీసం పది శాతం నిధులు కేటాయించాలంటూ విద్యాకమిషన్లు సూచించినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత బడ్జెట్‌లో విద్యకు 2.66 శాతం నిధులను కేటాయించిందని వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యకు తక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నదని పేర్కొన్నారు. తగిన నిధులను కేటాయించకుండా అందరికీ నాణ్యమైన విద్యను అందించడం సాధ్యం కాదని తెలిపారు. పేదలకు విద్యను దూరం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా ప్రయివేటీకరణను ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. బడ్జెట్‌లో ఆదాయపు పన్ను మినహాయింపులు పెంచకపోవడం మధ్యతరగతి వేతన జీవులకు నిరాశే మిగిలిందని తెలిపారు.

విద్యారంగానికి ప్రాధాన్యత లేదు : డీటీఎఫ్

విద్యారంగానికి కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యత లేదని డీటీఎఫ్ అధ్యక్షులు ఎం సోమయ్య ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి విమర్శించారు. ఈ బడ్జెట్‌లో విద్యకు 2.6 శాతం నిధులు కేటాయించారని తెలిపారు. తగినన్ని నిధులు కేటాయించకుండా పేద విద్యార్థులకు నాణ్యమైన, సమానమైన విద్య అందించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. విద్యారంగాన్ని పట్టించుకోకపోవడం ద్వారా పేదలు, బలహీనవర్గాలకు అన్యాయం చేసినట్టే అవుతుందని తెలిపారు. ఆదాయపు పన్ను మినహాయింపులో వేతన జీవులకు నిరాశే మిగిలిందని పేర్కొన్నారు. పాత విధానంలోకి శ్లాబులను మార్చకుండా కొత్త విధానంలో కొంత వెసులుబాటు కల్పించడం వల్ల ఒరిగేదేమీ లేదని విమర్శించారు.

మధుపరులకు మద్దతు ఇవ్వని బడ్జెట్ : టీఆర్టీఎఫ్

కేంద్ర బడ్జెట్‌లో వేతన జీవులకు కొంత ఊరట లభించినట్టుగా కనిపించిందని టీఆర్టీఎఫ్ అధ్యక్షులు కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి తెలిపారు. వేతన జీవులు పొదుపు చేసుకునే మార్గాలను పన్ను రూపంలో కేంద్రం భారం పెంచి వేతన జీవులకు నిరాశే మిగిల్చిందని పేర్కొన్నారు. స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేలకు పెంచినా 80సీ మినహాయింపులు ఇవ్వలేదని తెలిపారు.

ఓపీఎస్ ప్రస్తావన లేదు : టీఎస్‌సీపీఎస్‌ఈయూ

కేంద్ర బడ్జెట్‌లో పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్) ప్రస్తావనే లేదని టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఉపాధ్యక్షులు మ్యాన పవన్‌కుమార్ తెలిపారు. సీపీఎస్ రద్దు గురించి ప్రస్తావన లేకపోవడం ఉద్యోగులు, ఉపాధ్యాయులను నిరాశపర్చిందని పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌లో వేతన జీవులకు అన్యాయం జరిగిందని తెలిపారు. పాత పన్ను విధానంలో కూడా రూ.ఏడు లక్షల వరకు పన్ను లేకుండా మినహాయింపునివ్వాలని డిమాండ్ చేశారు. స్టాండర్డ్ డిడక్షన్ రూ.లక్ష వరకు పెంచాలని కోరారు.

నిటి ఆయోగ్‌కు సీఎంలు బాయ్‌కాట్

- 'వివక్షపూరిత' బడ్జెట్ అంటూ నలుగురు ముఖ్యమంత్రుల ఆగ్రహం

న్యూఢిల్లీ : కేంద్రబడ్జెట్ వివక్షపూరితమైనదంటూ..27న జరగాల్సిన నిటి ఆయోగ్ సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తామంటూ నలుగురు ముఖ్యమంత్రులు ప్రకటించారు. వీరిలో తమిళనాడు సీఎం ఎంకె స్టాలిన్, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, కర్నాటకకు చెందిన సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్‌కి చెందిన సుఖ్విందర్ సింగ్ సుఖు ఉన్నారు. "ఈ బడ్జెట్ వివక్షాపూరితమైనది. ప్రమాదకరమైనది. ఇది పూర్తిగా సమాఖ్యస్ఫూర్తికి విరుద్ధంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా అనుసరించాల్సిన ఫెడరలిజం , న్యాయమైన సూత్రాలకు భిన్నంగా ఉన్నది. అని నలుగురు సీఎంలు ప్రకటించారు.

జమ్మూకాశ్మీర్ వార్తాపత్రిక యజమానికి ఊరట

- తరుణ్ బెహ్లాకు సుప్రీంకోర్టు బెయిల్

న్యూఢిల్లీ : అధికార రహస్యల చట్టం కింద ఈ నెల ప్రారంభంలో అరెస్టయిన జమ్మూకు చెందిన వ్యాపారవేత్త, వార్తాపత్రిక యజమాని తరుణ్ బెహ్లాకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కొన్ని షరతులతో ఈ బెయిల్ మంజూరు చేసింది. తనపై కేసు గురించి ఎలాంటి ఇంటర్వ్యూ కానీ, వార్తను కానీ తరుణ్ ప్రచురించకూడదని సుప్రీంకోర్టు షరతు విధించింది. అనుమతి లేకుండా జమ్మూకాశ్మీర్ విడిచివెళ్లకూడదనే షరతు కూడా విధించింది. తరుణ్ బెహ్లా రెగ్యులర్ బెయిల్ పిటీషన్‌ను ఆగస్టు 9కు వాయిదా వేసింది. అలాగే, 'కేసు దర్యాప్తును ప్రారంభించిన దగ్గర నుంచే నిందితుడ్ని దోషిగా చిత్రీకరించకూడదు. కేసు విచారణలో ఉన్న సమయంలోనే కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలను పోలీసులు వెల్లడించాలి. నిందితుడ్ని లేదా అనుమానితున్ని నిర్బంధించకూడదు. దీని వలన నిందితుడు జైలు శిక్షను అనుభవిస్తుంటాడు, కానీ దర్యాప్తు నిజమైన ప్రయోజనం నెరవేరదు' అని జస్టిస్ రాహుల్ భర్తి నేతృత్వంలోని ధర్మాసనం తన బెయిల్ తీర్పులో పేర్కొంది.

భద్రత ఉపసంహరించుకున్న వ్యక్తుల జాబితాను ప్రచురించినందుకు ఈ నెల 10న జమ్మూ నగరంలోని అతని నివాసం నుంచి తరుణ్ బెహ్లాను పోలీసులు అరెస్టు చేశారు. అతనికి చెందిన నివాసాల్లోనూ పోలీసులు సోదాలు నిర్వహించారు.

ఉపాధి, నైపుణ్యం కోసం ప్రధానమంత్రి ప్యాకేజీ

న్యూఢిల్లీ : ఈపీఎఫ్‌ఓలో తొలిసారిగా నమోదైన ఉద్యోగులు ప్రభుత్వం నుండి మొదటి నెలలో రూ.15,000 వరకూ అదనపు జీతం పొందుతారు. 'ప్రైమ్ మినిస్టర్ ప్యాకేజ్ ఫర్ ఎంప్లాయిమెంట్ అండ్ స్కిల్లింగ్' పథకంలో భాగంగా ఈపీఎఫ్‌ఓలో తొలిసారి పేరు నమోదు చేసుకున్న ఉద్యోగులకు ఒక నెల జీతం అదనంగా అందిస్తామని ఆర్థిక మంత్రి తెలిపారు. ఈ మొత్తాన్ని మూడు వాయిదాల్లో ఉద్యోగి బ్యాంక్ ఖాతాలో నేరుగా జమ చేస్తామని చెప్పారు. ఉపాధి, నైపుణ్యం, ఎంఎస్‌ఎంఈలు, మధ్య తరగతి ప్రజలపై బడ్జెట్ దృష్టి సారించిందని ఆమె తెలిపారు. రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో ఈ ప్యాకేజీ కింద 4.1 కోట్ల మంది యువతకు ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, ఇతర అవకాశాలు కల్పిస్తామని వివరించారు. ఇందుకోసం రెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విద్య, ఉపాధి, నైపుణ్య చర్యల కోసం రూ.1.48 లక్షల కోట్లు అందజేస్తామని అన్నారు.

ఈ ప్యాకేజీలోని ఐదు పథకాల్లో మూడింటికి 'ఉపాధి ఆధారిత ప్రోత్సాహకం' (ఈఎల్ఐ) అని పేరు పెట్టామని, తొలిసారి ఉద్యోగి అయ్యే వారికి దీని కింద నెల జీతం అందిస్తామని తెలిపారు. తయారీ రంగంలో ఉపాధి కల్పనకు మరో పథకాన్ని ఉద్దేశించామని, ఉద్యోగితో పాటు యజమానికి కూడా వారి ఈపీఎఫ్‌ఓ కంట్రిబ్యూషన్ ఆధారంగా ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు. ఉద్యోగం వచ్చిన మొదటి నాలుగు సంవత్సరాల వరకూ ఇది అమలులో ఉంటుందని అన్నారు.

మూడవ పథకంలో యజమానులకు అవసరమైన మద్దతు అందిస్తామని నిర్మల తెలిపారు. ప్రతి అదనపు ఉద్యోగి కోసం ఈపీఎఫ్‌ఓ కంట్రిబ్యూషన్ కింద చెల్లించే వాటాలో రెండు సంవత్సరాల పాటు నెలకు రూ.3,000 చొప్పున రీయంబర్స్‌మెంట్ చేస్తామని చెప్పారు. నాలుగో పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమ సహకారంతో నైపుణ్యాభివృద్ధికి చర్యలు చేపడతామని అన్నారు. దీనికింద రాబోయే ఐదు సంవత్సరాల్లో 20 లక్షల మంది యువతకు శిక్షణ ఇస్తామని చెప్పారు. ప్రధానమంత్రి ప్యాకేజీలో చివరి పథకంలో భాగంగా ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తామని, రాబోయే ఐదు సంవత్సరాల్లో ఐదు వందల ప్రముఖ కంపెనీల్లో కోటి మందికి ఇంటర్న్‌షిప్ ఇస్తామని వివరించారు.



వ్యవసాయానికి రూ.1.52 లక్షల కోట్లు

వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు బడ్జెట్‌లో రూ.1.52 లక్షల కోట్లు కేటాయించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకొని, అధిక దిగుబడిని అందించే 109 నూతన వంగడాలను విడుదల చేస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. అవసరాన్ని బట్టి పది వేల బయో-ఇన్‌పుట్ రిసోర్స్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, వాటికి కేంద్రం చేయూత అందిస్తుందని చెప్పారు. సవరించిన అంచనాల ప్రకారం వ్యవసాయ మంత్రిత్వ శాఖకు రూ.1,16,788.96 కోట్లు కేటాయించారు.

ఐటీ చట్టంపై సమగ్ర సమీక్ష

ఐటీ చట్టంపై సమగ్ర సమీక్ష జరుపుతామని నిర్మలా సీతారామన్ చెప్పారు. అందరూ అర్థమయ్యేలా చదువుకునేందుకు, వ్యాజ్యాల సంఖ్యను తగ్గించేందుకు ఈ సమీక్ష అవసరమని అన్నారు. స్టార్టప్ కంపెనీలకు ఊతమిచ్చేందుకు ఏంజెల్ పన్నును రద్దు చేస్తామని ఆమె ప్రతిపాదించారు. విదేశీ కంపెనీలపై కార్పొరేట్ పన్ను రేటును 40% నుండి 35%కి తగ్గిస్తామని తెలిపారు.

బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సమగ్రాభివృద్ధి కోసం 'పూర్వోదయ' పథకాన్ని చేపడతామని ఆర్థిక మంత్రి చెప్పారు. బడ్జెట్‌లో మూలధనపు వ్యయ లక్ష్యాన్ని రూ.11.11 లక్షల కోట్లుగా చూపారు.

విద్యుత్‌కు అధిక ప్రాధాన్యం

బడ్జెట్‌లో విద్యుత్ రంగానికి కేంద్రం అధిక ప్రాధాన్యత ఇచ్చింది. దేశంలో కోటి కుటుంబాలు నెలకు 300 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ పొందేందుకు వీలుగా 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' కింద ఇంటి పైకప్పులపై సౌర ఫలకాలను ఏర్పాటు చేస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఉచిత సౌర విద్యుత్ వినియోగం కారణంగా కుటుంబాలు ఏటా రూ.15,000-18,000 కోట్లు ఆదా చేసుకోగలుగుతాయని, మిగులు విద్యుత్‌ను పంపిణీ కంపెనీలకు విక్రయించుకోవచ్చునని తెలిపారు. 2030 నాటికి శిలాజేతర ఇంధన వనరుల నుండి 50 జీడబ్ల్యూ పునరుద్పాదక ఇంధనాన్ని, విద్యుదుత్పత్తి స్థాపక సామర్థ్యంలో యాభై శాతాన్ని పొందాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని వివరించారు. ఈ బడ్జెట్‌లో విద్యుత్ మంత్రిత్వ శాఖకు రూ.20,502 కోట్లు కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఈ మంత్రిత్వ శాఖ బడ్జెటరీ వ్యయం రూ.20,671.32 కోట్లు.

ఎన్డీఏను కాపాడుకునేందుకే ఈ బడ్జెట్

- ఎంపీ మల్లు రవి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలోని ఎన్డీయే సర్కార్‌ను కాపాడుకునేందుకు పెట్టిన బడ్జెట్‌గా మోడీ బడ్జెట్ ఉందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి విమర్శించారు. ఈ దిశలో ఎన్డీయేలో కీలక భాగస్వాములుగా ఉన్న ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల కోసమే బడ్జెట్ పెట్టినట్టు ఉందన్నారు. వాళ్ళ ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకే ఈ రెండు రాష్ట్రాలకు కేటాయిం పులు చేశారని ఆరోపించారు. బడ్జెట్ ప్రసంగం అనంతరం ఢిల్లీ తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, గడ్డం వంశీకృష్ణ, కడియం కావ్య, బలరాం నాయక్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ... నిర్మలా సీతారామన్ బడ్జెట్ తీవ్ర నిరాశకు గురిచేసిందని అన్నారు. విభజన చట్టం గురించి చాలాసార్లు ప్రస్తావించినా తెలంగాణ అన్న పదం వాడకపోవడం శోచనీయమన్నారు. అలాగే విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీల ప్రస్తావన లేకపోవడం దారుణమని తెలిపారు. హైదరాబాద్ మినహా 9 జిల్లాలు వెనుకబడిన జిల్లాలుగా గుర్తించినప్పటికీ... తెలంగాణకు ప్రత్యేక కేటాయింపులు లేవని, ఈ విషయంలో కేంద్ర వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు నిధుల కేటాయింపు లో తమకు అభ్యంతరం లేదని, కానీ తెలంగాణకు కేటాయింపులు లేకపోవడం బాధాకరమని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి పూర్తి చేయాలని నేరుగా సీఎం ప్రధాని, కేంద్ర మంత్రులకు రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని తెలిపారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచారని, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా... తెలంగాణకు దక్కింది శూన్యమని ఎద్దేవా చేశారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై బీజేపీ ఎంపీలు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణపై కేంద్రం చూపిస్తోన్న వైఖరిని నిరసిస్తూ... వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా తెలంగాణ హక్కుల సాధనకు అన్ని పార్టీల ఎంపీలంతా కలిసికట్టుగా పోరాడేందుకు ముందుకు రావాలని సూచించారు. బీజేపీ, ఎంఐఎం ఎంపీలను కలిసి ఉమ్మడి పోరాటంపై చర్చిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నేతత్వంలో తెలంగాణ హక్కుల సాధనకు అలుపెరుగని పోరాటం చేస్తామన్నారు.

తెలంగాణ మోడీ మొండిచేయి... ఎంపీ కడియం కావ్య

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ప్రధాని మోడీ మొండిచేయి చూపించారని వరంగల్ ఎంపీ కడియం కావ్య ఫైర్ అయ్యారు. తెలంగాణ ఏర్పాటునే ఓర్వలేని మోడీ, రాష్ట్రానికి నిధులు కేటాయించడంలోనూ కపటప్రేమ చూపారని విమర్శించారు. నిధులు లేక ఆర్థిక ఇబ్బందుల్లో రాష్ట్రం ఉందని.. ఈ టైంలో కేంద్ర బడ్జెట్ కొంత ఉపశమనం కలిగిస్తుందని భావించినట్టు చెప్పారు. కానీ మరోసారి కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర నిరాశే ఎదురైందని దుయ్యబట్టారు.

బీజేపీ ఎంపీలను ఘెరావ్ చేయాలి : ఎంపీ బలరాం నాయక్

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశాక రాష్ట్ర ప్రజలకు బీజేపీ ఎంపీలు ఎలా మొఖం చూపిస్తారని ఎంపీ బలరాం నాయక్ ప్రశ్నించారు. రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు సాధించడంలో విఫలమైన బీజేపీ ఎంపీలను ప్రజలు ఘెరావ్ చేయాలని పిలుపునిచ్చారు. బడ్జెట్‌లో సరైన నిధులకు కృషి చేయని కేంద్రమంత్రి పదవులు ఎందుకు? అని నిలదీశారు. తెలంగాణ ప్రజలపై ఎన్డీయే సర్కార్ చిన్నచూపు చూపించడం బాధాకరమన్నారు.

కనీసం 18 రోజులైనా నిర్వహించాలని కోరాం

- నాలుగైదు రోజులు సభను నడిపి మమ అనిపించే ప్రయత్నం : ఏలేటి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్ సమావేశాలను కనీసం 18 రోజులైనా నిర్వహించాలని బీఏసీ సమావేశంలో కోరామని బీజేపీ ఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం అసెంబ్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం నాలుగైదు రోజులు సమావేశాలు నిర్వహించి మమ అనిపించే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. వ్యవసాయం, సాగునీటి రంగం, ఉద్యోగ నోటిఫికేషన్లు-ఉపాధి, మహిళకిచ్చిన హామీలు, విద్యారంగం, పంచాయతీరాజ్ సమస్యలు, ఎస్సీ,ఎస్టీలకిచ్చిన హామీల అమలు-వర్గీకరణ, పౌరసరఫరాల శాఖలో అవినీతి అక్రమాలు, గృహ నిర్మాణ శాఖ - ఇచ్చిన హామీలు, పింఛన్లు, భూమి, విద్యుత్, ఎక్సైజ్, బీసీ సంక్షేమం, వైద్యారోగ్యం, ఆటోడ్రైవర్లను ఆదుకుంటామనే హామీ, ప్రజాదర్బారు నిర్వహణ, చేనేత, ఇలా ఒక్కో అంశంపై కనీసం ఒక రోజు సమయం కేటాయించి చర్చిస్తే బాగుంటుందని బీఏసీకి సూచించామన్నారు.

ప్రాధాన్యతాంశంగా తెలంగాణ ఫ్యూచరిస్టిక్ ఎక్స్ పీరియన్స్ కేంద్రం

- ఐటీ పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఫ్యూచరిస్టిక్ ఎక్స్ పీరియన్స్ కేంద్రం ఏర్పాటును ప్రాధాన్యతాంశంగా పరిశీలిస్తున్నట్టు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఫ్యూచరిస్టిక్ కేంద్రంపై పలువురు పారిశ్రామికవేత్తలిచ్చిన ప్రజెంటేషన్‌ను మంత్రి తిలకించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవిష్కరణకు ఖర్చయ్యే రూ.500 కోట్ల నిధులను సమకూర్చేందుకు ఏదైనా వాణిజ్య సంస్థ ముందుకొస్తే ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుందని తెలిపారు. భారీ మాల్ తరహాలో ఉండే ఈ కేంద్రంలో సమావేశ మందిరాలు, తెలంగాణ చరిత్ర, సాధించిన అభివృద్ధి, భవిష్యత్తు గమ్యాల గురించి అవగాహన కల్పించే విభాగాలుంటాయని వెల్లడించారు. పర్యాటకులను విశేషంగా ఆకర్షించేలా ఈ కేంద్రాన్ని నిర్మించనున్నట్టు తెలిపారు.

పర్యాటకరంగ అభివృద్ధికి చర్యలు

- తెలంగాణ టూరిజం చైర్మెన్ పటేల్ రమేష్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు చేపట్టామని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ (టీజీటీడీసీ) చైర్మెన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని బేగంపేటలో ట్రావెల్ ఏజెంట్లు, భూటాన్ పర్యాటక శాఖ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణను దేశంలోనే అత్యధిక టూరిస్టులు కోరుకునే పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు కొత్త ఆలోచనలతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. టీజీటీడీసీ ఎండీ ఎన్.ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రారంభంలో ఇన్‌బౌండ్, అవుట్‌బౌండ్ టూర్ ప్యాకేజీలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భూటాన్ టూరిజంతో ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఆపరేటర్లు తమ పర్యాటకాన్ని విస్తరించవచ్చుని అభిప్రాయపడ్డారు. భూటాన్ మాజీ విద్యాశాఖ మంత్రి ఠాకూర్ పౌడ్యేల్ మాట్లాడుతూ తమ దేశంలోని సహజ, సాంస్కృతిక ప్రాంతాలు టూరిస్టులను కట్టిపడేస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ, బూటాన్‌లు దేశీయ, అంతర్జాతీయ కార్యకలాపాలను నిర్వహించడానికి పరస్పర అంగీకార అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు

రైతు రుణమాఫీపై బీజేపీ తప్పుడు ప్రచారం

- ఎమ్మెల్యే వంశీకృష్ణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రైతు రుణమాఫీపై బీజేపీ ఎమ్మెల్యేలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే వంశీకృష్ణ విమర్శించారు. మంగళవారం శాసన సభ మీడియా పాయింట్‌లో షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మూడు విడుతల్లో రైతు రుణమాఫీని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్నదని చెప్పారు. రేషన్ కార్డుకు ఏమాత్రం సంబంధం లేదు. పట్టా పాస్ బుక్ ఇందుకు ప్రాతిపదికని చెప్పారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రైతు రుణ మాఫీపై బీజేపీ వారు ఒక్కసారైనా మాట్లాడారా? అని నిలదీశారు. రూ. 31 వేల కోట్లు రుణ మాఫీ చేసిన ముఖ్యమంత్రి దేశ చరిత్రలో ఎవరూ లేరని చెప్పారు. తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలువనున్నదన్నారు.

చైర్మెన్ మల్‌రెడ్డి రాంరెడ్డికి సన్మానం

నవతెలంగాణ -ఎల్బీనగర్



రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన మల్‌రెడ్డి రాంరెడ్డిని మంగళవారం రంగారెడ్డి జిల్లా కోర్టు సీనియర్ బార్ అసోసియేషన్‌లో రంగా రెడ్డి జిల్లా అడ్వకెట్స్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు అడ్వకెట్స్ పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ చామల జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-పెద్ద అంబర్‌పేట



భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను పెద్ద అంబర్‌పేట్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కంచర్ల సత్యనారాయణ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్తపెల్లి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జైపాల్ రెడ్డి, సురేందర్ రెడ్డి, సాకేత్ రెడ్డి, సత్యం రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, శేఖర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

8 మంది ఎంపీలను గెలిపిస్తే..

బీజేపీ ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ 'గుండు సున్నానా'..?

• మధుయాష్కీ గౌడ్



నవతెలంగాణ-హయత్‌నగర్

8 మంది ఎంపీలను గెలిపిస్తే.. బడ్జెట్‌లో తెలంగాణకు బీజేపీ ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ 'గుండు సున్నానా'..? టీపీసీసీ క్యాం పెయిన్ కమిటీ చైర్మెన్ మధు యాష్కీ గౌడ్ ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధి కారంలోకి వచ్చినప్పటి నుంచీ తెలం గాణకు బడ్జెట్లో అన్యాయమే జరుగుతుందని విమ ర్శించారు. సమైఖ్య రాష్ట్రంలో అభివృద్ధిలో అన్యాయం, వివక్షలను సహించలేకనే తెలంగాణ ఉద్యమం పురుడు పోసుకుని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన పదేండ్ల కాలంలో అదే వివక్ష కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై స్పందిస్తూ నీళ్ల, నిధులు, నియా మకాల విషయంలో అన్యాయాలపై తెలంగాణ సమా జం పోరాడిందని, తెలంగాణ ఏర్పడిన తర్వాత దుం దృష్టవశాత్తు కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తెలంగాణకు నీళ్ల, నిధులు, ప్రాజెక్టుల కేటాయింపులలో తీరని అన్యాయం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి సహాయం చేసి ఆదుకోవాల్సిన కేంద్రం.. తెలంగాణ పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు మొండి చేయి చూపించారని విమర్శించారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలను గెలిపిస్తే, ప్రజలకు ఇచ్చే రిటర్న్ గిఫ్ట్ గుండు సున్నేనా అని ప్రశ్నించారు .ప్రభుత్వాన్ని కాపాడుకోవడం కోసం కొన్ని రాష్ట్రాలకు ప్రత్యేక ప్యాకేజీలు ఇచ్చి, మిగతా రాష్ట్రాల పట్ల వివక్ష చూపడం సమంజసం కాదన్నారు. మరీ ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీల పాలిత రాష్ట్రాల పట్ల బడ్జెట్లో తీవ్ర వివక్ష కనిపించిందన్నారు. దేశమంటే కొన్ని రాష్ట్రాల అభివృద్ధి మాత్రమే కాదని, అన్ని రాష్ట్రాలు అభివృద్ధి సాధించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్న విషయాన్ని మర్చిపోవద్దని సూచించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రత్యేకంగా రూపాయి కూడా కేటాయించకపోవడం విడ్డూరమన్నారు. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బీజేపీ ఎంపీలు తెలంగాణ ప్రజలకు ఏ మొహం పెట్టుకొని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. తెలంగాణ పట్ల మోడీ ప్రభుత్వ వివక్ష ఎంత ఉందో ప్రజలు ఈ సందర్భంగా గమనించాలని కోరారు. బీజేపీ ఎంపీలను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హెూదా, కొత్త రైల్వే లైన్లు, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఐటీఐ ఆర్ ప్రాజెక్టుల ఊసే లేదన్నారు.

మహిళలకు అండగా షీ టీం

• సీపీ సుధీర్ బాబు

నవతెలంగాణ-హయత్‌నగర్

మహిళలను, యువతులను, బాలికలను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుంటామని, మహిళలకు అండగా షీ టీం ఉందని రాచకొండ సీపీ జి.సుధీర్ బాబు అన్నారు. రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఈవ్ టీజర్లకు ఎల్బీనగర్‌లో ఉన్న రాచకొండ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రాచకొండ కమిషనరేట్ పరిధిలో మహిళలను, యువతులను వేధింపులకు గురిచేస్తున్న 158 (మేజర్స్-82, మైనర్స్-76) మందిని షీ టీమ్స్ పట్టుకున్నారని తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుండి 15 వ తేదీ వరకు 195 ఫిర్యాదులు అందాయని రాచకొండ విమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టి. ఉషా విశ్వనాథ్ తెలిపారు. ఫిర్యాదులపై విచారణ చేపట్టి దర్యాప్తు పూర్తి చేశామన్నారు.

అందిన ఫిర్యాదులలో..

ఫోన్ల ద్వారా వేధించినవి-34, సోషల్ మీడియా యాప్స్ ద్వారా-43, నేరుగా వేధించినవి- 118..వాటిలో క్రిమినల్ కేసులు-17, పెట్టి కేసులు-58, 95మందికి కౌన్సిలింగ్ ఇచ్చారని వెల్లడించారు.

అవగాహన కార్యక్రమాలు..

ఈ నెల 1వ తేదీ నుండి 15 వరకు షీ టీమ్స్ రాచకొండ మొత్తం 57 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. దాదాపు 8655 మందికి మహిళా చట్టాలు, హక్కులు, నేరాలు, జాగ్రత్తల గురించి వివరించి అవగాహన కల్పించారని వివరించారు.

మెట్రో-రైల్ డెకాయ్ ఆపరేషన్స్

రాచకొండ షీ టీమ్స్ మెట్రో రైళ్లలో డెకాయ్ ఆపరేషన్సు నిర్వహించి, మహిళా కంపార్ట్మెంట్‌లోకి వెళ్ళి ప్రయాణిస్తున్న (07) మంది పురుషులను పట్టుకుని మెట్రో స్టేషన్ అధికారుల ద్వారా ఫైన్ వేయించినట్టు తెలిపారు.

డెకాయ్ ఆపరేషన్స్

షీ టీమ్స్ రాచకొండ తమ పరిధి ఏరియాలలో డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించి.. రోడ్డు మీద వెళ్తున్న మహిళలను, ఆడపిల్లలను వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న 120 మంది పోకిరీలను అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ ఇచ్చినట్టు తెలిపారు. ఆడవారికి ఎదురయ్యే భౌతిక పరమైన, సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే దాడులు, లైంగిక వేధింపులు, ప్రయాణ సమయాల్లో వేధింపులు వంటి ఇబ్బందుల నుంచి రక్షించేందుకు రాచకొండ షీ టీమ్ పోలీసులు ఇరవై నాలుగు గంటలూ అందుబాటులో ఉంటున్నారని



పేర్కొన్నారు. పురుషులు ఆడవారి పట్ల బాధ్యతగా, మర్యాదగా నడుచుకోవాలని, వారికి అండగా నిలవాలని సూచించారు. పలు రకాల అవసరాలతో ఇంటి నుంచి బయటకు వచ్చే స్త్రీలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకూడద న్నారు. స్త్రీలను గౌరవించడం తమ వ్యక్తిత్వంలో భాగం కావాలని, ఆడవారిని ఇబ్బందులు పెట్టే వారిని ఉపేక్షించేది లేదని, అటువంటి వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు వేధింపులకు గురి అయినప్పుడు వెంటనే షీ టీమ్స్‌ను, రాచకొండ వాట్సాప్ నెంబర్ 8712662111 ద్వారా లేదా ప్రాంత షీ టీమ్ అధికారుల నంబర్లు భువనగిరి ఏరియా- 8712662598, చౌటుప్పల్ ఏరియా - 8712662599, ఇబ్రాహీం పట్నం ఏరియా - 8712662600, కుషాయిగూడ ఏరియా - 8712662601, ఎల్బీనగర్ ఏరియా - 8712662602, మల్కాజిగిరి ఏరియా - 8712662603, వనస్థలిపురం ఏరియా - 8712662604 నెంబర్లకు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విమెన్ సేఫ్టీ ఏసీపీ వెంకటేశం, అడ్మిన్ ఎస్ఐ రాజు, షీ టీమ్స్ సిబ్బంది, కౌన్సిలర్స్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర పాత నేరస్తుడు అరెస్ట్

• 12కేసుల్లో నిందితుడు
• 100 శాతం సొత్తు రికవరీ చేసిన హయత్ నగర్ పోలీసులు

నవతెలంగాణ-హయత్ నగర్

అంతరాష్ట్ర పాత నేరస్తుడిని హయత్ నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి 23తులాల బంగారం, 2లక్షల నగదు, ఒక కెమెరా, ఫోన్, కార్ స్వాధీనం చేసుకున్నారు. హయత్ నగర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎల్బీనగర్ జోన్ డీసీపీ ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. గత నెలలో హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు ఇండ్లల్లో జరిగిన దొంగతనం కేసుల్లో ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేస్ నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. పెద్ద అంబర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారన్నారు. అనుమానస్పదంగా కనిపించిన ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నంకు చెందిన షేక్ అజీజ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. నిందితుడిపై జనవరి 2024 నుండి ఇప్పటి వరకు 12 కేసులు నమోదైనట్టు వెల్లడించారు. హయత్ నగర్‌లో మూడు, కొయ్యల గూడెంలో ఒకటి, నిజామాబాద్‌లో ఒకటి, ఆంధ్రప్రదేశ్ పెనమలూరు స్టేషన్ పరిధిలో 7కేసులు నమోదు అయినట్టు పేర్కొన్నారు. నిందితుడిపై 2008 నుండి 2013 వరకు 50 కేసులు నమోదైనట్టు తెలిపారు. అతని వద్ద నుండి 23తులాల బంగారం, ఒక కార్, కెమెరా, 2లక్షల నగదు,సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అతనికి సహకరించిన అమలాపురానికి చెందిన పతివాడ లోవరాజు పరారీలో ఉన్నాడని చెప్పారు. ఈ సమావేశంలో వనస్థలిపురం ఏసీపీ కాశీ రెడ్డి, హయత్ నగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్ఐ వెంకట్ రెడ్డి, ఏఎస్ఐ పెంటా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఓబీసీలకు
ప్రత్యేక మంత్రిత్వ శాఖను ప్రకటించలేదు

సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామ కూర రాజు



నవతెలంగాణ-హయత్‌నగర్

దేశంలో 50 శాతానికి పైగా జనాభా ఉన్న ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఎప్పటినుంచో దేశవ్యాప్తంగా డిమాండ్ చేస్తున్నా ప్రకటించలేదని సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామ కూర రాజు విమర్శించారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఓబీసీల ఫెలోషిప్‌లు పెంచాలని, ఉన్నత విద్యలో ఓబీసీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని దేశవ్యాప్తంగా పోరాటాలు చేస్తున్నారు కానీ.. కేంద్ర ప్రభుత్వం ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ప్రకటించలేదని అన్నారు. జాతీయ బీసీ కమీషన్ ఏర్పాటు చేసిన బడ్జెట్ కూడా ఏమూలకు సరిపోదని, గత 2016 నుంచి కేవలం వెయ్యి మంది విద్యార్థులకు మాత్రమే ఫెలోషిప్‌లు ఉన్నత విద్యలో మంజూరు చేస్తోందన్నారు. అవి ఏమాత్రం పెంచలేదన్నారు. దేశవ్యాప్తంగా పదివేలకు పైగా ఫెలోషిప్‌లు మంజూరు చేయాలని కోరారు. ఇంటర్ షిప్‌లతో ఎవరి జీవితాలు బాగుపడవు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులను ఆదుకునేందుకు, ఉపాధి కల్పించేందుకు శాశ్వత ప్రణాళికలు చేపట్టలేదన్నారు. ఇంటర్నెట్ షిప్ పథకం నిరుద్యోగులకు శాశ్వత ప్రయోజనాలు చేకూరవని అన్నారు. దేశంలో కోట్లాది మంది నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు చేపట్టలేదని అన్నారు.

వీధి కుక్కల బెడద, వాటి సంరక్షణపై సమావేశం



నవతెలంగాణ- బడంగ్‌పేట్

తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మున్సిపల్ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ అధికారులు, పశువైద్య శాఖ అధికారులు, ప్రముఖ జంతు సంరక్షణ, బ్ల్యూ క్రాస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థలతో వీధి కుక్కల బెడద, వాటి సంరక్షణపై మంగళవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా దాన కిషోర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఆపెక్స్ కమిటీ ఏర్పాటు చేయ నున్నట్లు తెలిపారు. ఈ కమిటీలో వీధి కుక్కలకు రెండు షెల్టర్ హెూములు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. అందులో వాటికి కమిటీ సభ్యులుగా మేయర్‌ను నియమించినట్టు చెప్పారు. ఆ షెల్టర్ హోమ్ ఆహార ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ మున్సిపల్
కార్పొరేషన్ ఆర్‌వోగా వేణుగోపాల్ రెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆర్‌వోగా వేణుగోపాల్ రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్‌వోగా పనిచేసిన చంద్రశేఖర్ రెడ్డి మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లాడు. తుర్కయంజాల్ మున్సిపల్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న వేణుగోపాల్ రెడ్డి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో మున్సిపల్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

పేదలకు అన్నదానం చేయడం అభినందనీయం



• ముజీబ్‌ని ప్రశంసించిన మారం జగదీశ్వర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చే నిరుపేద రోగుల సహాయకుల కోసం అన్నదానం కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ అన్నారు. అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) ఆధ్వర్యంలో మంగళవారం మెహదీ నవాబ్ జంగ్ క్యాన్సర్ ఆస్పత్రి ఆవ రణలో టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగ దీశ్వర్, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకట్, కొత్త గూడెం అధ్యక్షులు రామారావు సమక్షంలో సుమారు 600 నిరుపేద రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ దానంలో అతి గొప్పదానం అన్నదానమని, ప్రతినెల పేదలకు అన్నదానడం చేయడం, దేవుడు ముజీబ్‌కి ఇచ్చిన వరం అని కొనియాడారు. తల్లీదండ్రుల పేరుతో ప్రతి నెల సేవా కార్యక్రమం నిర్వహించడంపై మనసారా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.విక్రమ్ కుమార్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్.రాజ్‌కుమార్, నాయకులు హరిబాబు, వైదీక్ శాస్త్ర, శ్రీధర్ నాయుడు, ఏపీఆర్వో మొహమ్మద్ వహీద్, ఆస్పత్రి సభ్యులు శివకుమార్, శేఖర్, పబ్లిక్ గార్డెన్ అధ్యక్షులు ముహమ్మద్ మొయినుద్దీన్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

• బ్యాంక్ అఫ్ బరోడా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శైలెందర్





నవతెలంగాణ -ఎల్బీనగర్

విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని బ్యాంక్ అఫ్ బరోడా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శైలెందర్, సర్వీస్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ రవి కుమార్ అన్నారు. బ్యాంక్ అఫ్ బరోడా ఫార్మేషన్ డే సందర్భంగా బ్యాంక్ ఆఫ్ బరోడా సర్వీస్ బ్రాంచ్ ఆధ్వర్యంలో మోహన్ నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బాగ్స్, మైక్ సెట్‌ను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. అనంతరం మోహన్ నగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు చేయూతనందించిన బ్యాంక్ ఆఫ్ బరోడా సర్వీస్ బ్రాంచ్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. పాఠశాల హెడ్మాస్టర్ కట్టా ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీనియర్ మేనేజర్ ఎ. ఆనంద్ కుమార్, మేనేజర్ వి. రామారావు, అమూల్య, యోగ టీచర్ శ్రీదేవి, ఉపాధ్యాయులు బి. శోభారాణి, సునీతా, అరుణాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

నవతెలంగాణ-హయత్ నగర్

మన్సూరాబాద్ చౌరస్తాలో ఉన్న మన్సూరాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ హయత్ నగర్ సెంటిన్నియల్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్, పలకలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి హాజరై మాట్లాడారు. పేద పిల్లలకు లయన్స్ క్లబ్ ఆఫ్ హయత్ నగర్ సెంటిన్నియల్ కమిటీ సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నోట్ బుక్స్ అందజేయడం అభినందనీయమన్నారు. ఒక లక్ష్యం పెట్టుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలకు కావాల్సిన సౌకర్యాల కల్పనకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. లయన్స్ క్లబ్ సంస్థ ముమ్ముందు సమాజానికి ఉపయోగపడే మంచి సేవా కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు త్రిలోక్‌నాథ్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లు చంద్రశేఖర్, భగవాన్ రెడ్డి, కార్యదర్శి మల్లా రెడ్డి, కోశాధికారి బాలస్వామి మాణిక్ రెడ్డి, మల్లా రెడ్డి, ఉపాధ్యాయురాలు సరిత, స్థానిక నాయకులు నాంపల్లి శంకరయ్య, యంజాల జగన్, పాతూరి శ్రీధర్ గౌడ్, నవీన్ పాల్గొన్నారు.

ఐఎస్‌సదన్‌లో
బోనాల చెక్కులు పంపిణీ

నవతెలంగాణ - సంతోష్‌నగర్

బోనాల పండుగ సందర్భంగా ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని యాకుత్‌పూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి సామ సుందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు భాస్కర్ రెడ్డితో కలిసి మంగళవారం సింగరేణి కాలనీ శ్రీదండి మరియమ్మ ఆలయం, వీర హనుమాన్ ఆలయం కమిటీ సభ్యులకు, నిర్వాహకులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోనాల పండుగను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం..అన్ని ఆలయాలకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గం ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో బోనాల పండుగను జరుపు కోవాలని సూచించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఆలయాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



బోనాల ఏర్పాట్లకు నిధులు విడుదల చేయాలి

కార్పొరేటర్ అరుణ సురేంద్రనాథ్ యాదవ్

నవతెలంగాణ- నాగోల్

ఆగస్టు మాసంలో జరిగే బోనాల ఉత్సవాల ఏర్పాట్లకు సకాలంలో నిధులను విడుదల చేయాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్‌ను కార్పొరేటర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల పండుగ సందర్భంగా తగిన ఏర్పాట్లు, అదే విధంగా వీధి లైట్ల మరమ్మత్తులను చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. స్పందించిన కమిషనర్.. నిధులను సకాలంలో విడుదల చేసి, అన్ని వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ వెంట బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేంద్రనాథ్ యాదవ్ తదితరులు ఉన్నారు.



జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్

నవతెలంగాణ-వనస్థలిపురం



జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఐఏఎస్‌ను జీహెచ్ఎంసీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

మానవ మనుగడకు మొక్కలే జీవనాధారం

● నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర

మానవ మనుగడకు మొక్కలే జీవనధారమని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ కొమిరెల్లి అనిత సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్వీ నగర్ కాలనీలోని శ్రీసాయి అభయ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో చేపట్టిన మొక్కలు పంపిణీకి ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి, పంజల నర్సింహ, నాయుడు, భీమా నాయక్, నర్సింహ, వీరయ్య చారి, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్నం భోజన పథకాన్ని అక్షయపాత్రకు అప్పగించొద్దు'



నవతెలంగాణ-మల్కాజిగిరి

మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు అప్పగించడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన చేసినట్టు సీఐటీయూ మల్కాజిగిరి మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించే కుట్ర చేస్తుందన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్ర, తదితర సంస్థలకు అప్పజెప్పే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. సీఐటీయూ యూనియన్ నాయకత్వంలో నిరాహార దీక్షలు చేస్తున్న వారికి మద్దతుగా మంగళవారం అన్ని మండల కేంద్రాల్లో నిరసన చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మల్కాజిగిరి మండల నాయకురాలు సువర్ణ, పద్మ అరుణ, నాగేశ్వరి, మంగ, సుశీల, శశికళ, జమిలి పాల్గొన్నారు.

విద్యార్థినికి సర్టిఫికెట్లు ఇప్పించిన న్యాయవాది



నవతెలంగాణ-కాప్రా

అనారోగ్యంతో బీఫార్మసీ కోర్సును మధ్యలోనే వదిలి వేసిన సంఘవి అనే విద్యార్థినికి ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్న కళాశాల యజమాన్యం నుంచి హైకోర్టు న్యాయవాది సుంకర నరేష్ మంగళవారం సర్టిఫికెట్లు ఇప్పించారు. వివరాల్లోకి వెళ్లితే.. దమ్మాయిగూడకు చెందిన మల్లారపు సంఘవి గౌడ్ 2016 సంవత్సరంలో తీగల రామ్‌రెడ్డి కళాశాలలో బీఫార్మసీ కోర్సులో చేరింది. మొదటి సంవత్సరం సెమిస్టర్ పరీక్షలు రాసిన తర్వాత ఆరోగ్య సమస్యలతో చదువు మధ్యలో ఆపి వేసింది. అప్పటి నుంచి ఆమె ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లు వెనక్కి తిరిగి ఇవ్వాలని కాలేజీ యాజమాన్యాన్ని కోరింది. ప్రభుత్వం నుండి వారికి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదన్న సాకుతో సర్టిఫికెట్లను ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. దీంతో సంఘవి హైకోర్టు న్యాయవాది, వెన్నెల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకర నరేష్ ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్న విద్యార్థులకు అండగా నిలుస్తున్నారని తెలుసుకున్న ఆయనను ఆశ్రయించింది. ఈ విషయమై హైకోర్టులో కేసు వేయడంతో కాలేజీ యాజమాన్యం దిగి వచ్చి విద్యార్థినికి మంగళవారం ఒరిజినల్ సర్టిఫికెట్లను అప్పగించారు. దీంతో సంఘవి సుంకర నరేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పనులు నాణ్యతతో చేయాలి : కార్పొరేటర్



నవతెలంగాణ-కాప్రా

వివిధ కాలనీల్లో చేస్తున్న డ్రయినేజీ పనులను నాణ్యతతో చేయాలని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్ అన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి నాగార్జున కాలనీ రోడ్డు నెంబర్ వన్‌లో ములుగు సంజీవరెడ్డి, శ్రీరాములు ఇంటివద్ద డ్రయినేజీ పూర్తిగా ధ్వంసమై డ్రయినేజీ నీరు ఇండ్లల్లోకి వస్తున్నదని కాలనీవాసులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేయడంతో స్పందించారు. మంగళవారం యూజీడీ సెక్షన్ ఏఈతో మాట్లాడి డ్రయినేజీకి చాంబర్‌కు మరమ్మతులు చేయించారు. పనుల్లో నాణ్యత తగ్గకుండా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆమె వెంట నాయకులు, కాలనీవాసులు, ఉన్నారు.

పలు కాలనీల్లో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ డివిజన్ కౌకూర్‌లోని వివిధ కాలనీల సమస్యలను పరిష్కరించాలని, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పూర్తి చేయాలని రెసిడెంట్స్ సంక్షేమ సంఘం సభ్యుల అభ్యర్థన మేరకు కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ మంగళవారం పలు కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల వచ్చిన వీధిలైట్లు, రోడ్లు, ఎవెన్యూ ప్లాంటేషన్, కొత్త కాలనీల్లో డ్రయినేజీ, ఔట్‌లెట్ సమస్యలపై ప్రతిపాదనలు, పనుల మంజూరుకు అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, శ్రీశైలం, మల్లికార్జున్, లడ్డూ, శ్రీనివాస్, కవిత, సంజీవ, పప్పుభాయి, వీవీఆర్, శివరాజ్, గౌతం, శకుంతల నాయుడు, వెంకటేష్, బాబు అన్న, రూపేందర్‌రెడ్డి, సాయి, విష్ణు, ఆంజనేలు, రమేష్ పాల్గొన్నారు.

భూగర్భ డ్రయినేజీ నిర్మాణ పనులు పరిశీలన



నవతెలంగాణ-కాప్రా

నాచారం ఓల్డ్ విలేజ్‌లో కొనసాగుతున్న భూగర్భ డ్రయినేజీ నిర్మాణ పనులను నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హనుమాన్ టెంపుల్ వెనుక సైడ్ నుండి ప్రతిభా స్కూల్ ముందున్న ట్రంక్ లైన్ వరకు కొత్త లైన్ ఏర్పాటు పనులను ప్రారంభించినట్టు తెలిపారు. వారంలోగా పనులు పూర్తవుతాయని, వెంటనే సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని కార్పొరేటర్ శాంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ వేణుగోపాల్, బీఆర్ఎస్ నాయకులు సాయి జన్ శేకర్, ముత్యంరెడ్డి, విఠల్ యాదవ్, కట్టబుచ్చన్న గౌడ్ పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా పరిధిలోని గాంధీనగర్‌లో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో వైరల్ వ్యాధుల బారిన పడకుండా ప్రభుత్వం ప్రజల వద్దకే ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి రమాదేవి మాట్లాడుతూ.. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, జనరల్ చెకప్‌లు, మందుల పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్న కుమారి, పీహెచ్ఎన్ ఉష, ఎంపీహెచ్ఈవో శ్యామ్ సుందర్, ఏఎన్ఎంలు రాణి , ప్రమీల, ఆశావర్కర్లు ప్రసన్న, రాధికా, సుధా, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్‌రెడ్డి, గాంధీనగర్ వాసులు కిష్టయ్య, శివ రామకృష్ణ, సత్యనారాయణ, పాల్గొన్నారు.

తొట్టెల ఉరేగింపులో పాల్గొన్న పరమేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్‌లోని గాంధీనగర్‌లో బోనాల పండుగ సందర్భంగా చేపట్టి ఫలహారపు బండి, తొట్టెల ఊరేగింపులో కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి మందు ముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాప్రా, గాంధీనగర్ వాసులకు శుభాకాంక్షలు తెలిపారు. ఫలహారపు బండి ఊరేగింపునకు ఏర్పాట్లు చేసిన కాంగ్రెస్ నాయకులు, గాంధీనగర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణను అభినందించారు. కార్యక్రమంలో కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, నాయకులు పవన్ కుమార్, విఠల్ నాయక్ , మల్లారెడ్డి, నరేందర్ గౌడ్, లల్లూ, బాబన్న, లోక్ సత్తా నాయకులు శివరామ కృష్ణ, సీపీఐ(ఎం) నాయకులు కె. వెంకట్, గాంధీనగర్ వెల్ఫేర్, ఆది జాంబవ వెల్ఫేర్, గాంధీనగర్ యూత్ అసోసియేషన్ల ప్రతినిధులు మహేష్, సత్యనారాయణ, నర్సింగ్ రావ్, భిక్షపతి, యాదగిరి పాల్గొన్నారు.

పల్లె దవాఖానాలు ప్రజలకు ఉపయోగపడాలి

● మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-ఘట్కేసర్

పల్లె దవఖానాలు పేద ప్రజలకు ఉపయోగపడేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలని, ఔట్ పేషెంట్ల శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఘట్కేసర్‌లోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలోని అన్ని విభాగాలను సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీలోని సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, జనాభా ప్రాతిపదికన వైద్యులను అందుబాటులో ఉంచాలన్నారు. ల్యాబ్‌లను, రిజిస్టర్లను తనిఖీ చేశారు. డయాలసిస్ విభాగంలో ఎంతమంది పేషెంట్లు వచ్చారని అడిగి తెలుసుకున్నారు. పోచారం మున్సిపాలిటీలోని పల్లె దవఖానాను సందర్శించారు. వారంలో రెండు సార్లు బస్తీల్లో క్యాంపులు ఏర్పాటు చేయాలని కమిషనర్, ఎఎన్ఎంలను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రతాపసింగారంలో అంగన్‌వాడీ కేంద్రంతో పాటు ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి, మున్సిపల్ చైర్మెన్ కొండల్ రెడ్డి, ముల్లి పావని జంగయ్య యాదవ్, కమిషనర్లు వేమనారెడ్డి, సాబేర్ అలీ, అశవర్కర్లు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేపలు పట్టడానికి వెళ్లి యువకుడు మృతి



నవతెలంగాణ-మేడ్చల్

చేపలు పట్టడానికి వెళ్లిన యువకుడు మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పూడూరు గ్రామానికి చెందిన మురళి గౌడ్ (28) గ్రామంలోని పెద్ద చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్థానిక మత్స్యకారుల సహాయంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా వారం రోజుల వ్యవధిలో గ్రామానికి చెందిన ఇద్దరి యువకులు చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి మృత్యు వాత పడడం పట్ల పలువురు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే గ్రామపంచాయతీ అధికారులు స్పందించి మత్స్యకారులు తప్ప.. ఇతరులు ఎవరూ చేపలు పట్టకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చెయ్యి

● కిషన్‌రెడ్డి, బండి సంజయ్ రాజీనామా చేయాలి

● సీపీఐ(ఎం) జవహర్ నగర్ కార్యదర్శి శివన్నారాయణ



నవతెలంగాణ-జవహర్ నగర్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ తెలంగాణకు మొండి చెయ్యి చూపించారని జవహర్ నగర్ సీపీఐ(ఎం) కార్యదర్శి శివన్నారాయణ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ములుగులో ట్రైబల్ యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, అధిక నిధులు రాబట్టడంలో విఫలమైనందుకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌తో పాటు బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రాంతాలను రాష్ట్రాలను సమానంగా చూడాల్సిన దేశ ప్రధాని, ఆర్థిక మంత్రి, ఆంధ్రప్రదేశ్, బీహార్, రాష్ట్రాల ముఖ్యమంత్రులకు భయపడి పదవి కాపాడుకోవడానికి వారికి అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించారని విమర్శించారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటీ ప్రస్తావన లేదని, నీటిపారుదల ప్రాజెక్టులకు నిధులు కేటాయించలే దన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగ సమస్యకు పరిష్కార మార్గాలు చేపట్టలేదని తెలిపారు. విద్య వైద్యా నికి నామమాత్రంగా నిధులు కేటాయించారని, రైతులకు గిట్టుబాటు ధరల ఊసే ఎత్తలేదన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన బీజేపీకి భవిష్యత్తు ఉండదన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి గుండు సున్నా

● కార్పొరేటర్ బన్నాల గీత



నవతెలంగాణ-ఉప్పల్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ రాష్ట్రానికి మరోసారి తీరని అన్యాయం జరిగిందని కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఈ బడ్జెట్‌లోనైనా తెలంగాణకు న్యాయం చేస్తారని, తెలంగాణ పారిశ్రామిక రంగానికి, పేదలకు, తెలంగాణలోని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు పెద్ద పీట వేస్తారని ప్రజలు ఆశించారని పేర్కొన్నారు. కానీ ప్రజల ఆశలపై నీళ్లు చల్లారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిది ఎంపీ సీట్లు గెలిపిస్తే ఎనిమిది రూపాయలు కూడా తెలంగాణకు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ప్రజలను కేంద్రం మోసం చేసిందని వాపోయారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై కక్ష సాధింపు

● వికసిత భారత్‌లో తెలంగాణ భాగం కాదా?

● కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

● కాంగ్రెస్ జవహర్ నగర్ అధ్యక్షులు శ్రీకాంత్



నవతెలంగాణ - జవహర్‌నగర్

వికసిత భారత్‌లో తెలంగాణ భాగం కాదా అని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు మేలు చేసేందుకే కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టారని ఎద్దేవా చేశారు. ప్రధాని పీఠం కుర్చీ కాపాడుకోవడానికే ఇలా చేశారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నిధులు కేటాయించారని, బడ్జెట్ ప్రసంగంలో నిధులు ప్రకటించకపోగా కనీసం తెలంగాణ పేరును కూడా ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ అభివృద్ధి కొరకు రాజకీయాలను పక్కకు పెట్టి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వర్గ బృందం పలమార్లు బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం, మెట్రో, మూసీ రివర్, ఐటీఐఆర్, రీజినల్ రింగ్ రోడ్డు, లకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రధానమంత్రితో సహా కేంద్ర మంత్రి వర్గానికి కలిసి విన్నవించినా వివక్షనే చూపించారన్నారు. తెలంగాణ ప్రజలు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకుని ఎనిమిది ఎంపి సీట్లు గెలిపిస్తే రెండు కేంద్ర మంత్రి పదవులు ఉన్నా తెలంగాణకు నిధులు తీసుకురాకపోవడం సిగ్గుచేటన్నారు. బీజేపీ నాయకులు ఏం ముఖం పెట్టుకొని తిరుగుతారని ప్రశ్నించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, సరైన సమయంలో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



● శామీర్‌పేట మండల ప్రత్యేకాధికారి సైదులు

● బొమ్మరసిపేటలో పర్యటన

నవతెలంగాణ-హైదరాబాద్‌డెస్క్

ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని శామీర్‌పేట మండల ప్రత్యేక అధికారి సైదులు వంట చేసేవాళ్లకు సూచించారు. మంగళవారం శామీర్‌పేట మండలంలోని బొమ్మరాసిపేటలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జిల్లా పరిషత్తు, ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రం, నర్సరీని సందర్శించారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో చారు పలుచగా ఉండడం, పప్పు, కూరగాయలు సరిగా వేయకపోవడంతో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ అనుసరించాలని సూచించారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్ పరిశీలించి గైర్హాజరైన విద్యార్థులు ఎందుకు రాలేదని తల్లిదండ్రులకు ఫోన్ చేసి తెలుసుకోవాలని సూచించారు. ఫీల్డ్‌లోకి వెళ్లి విద్యార్థులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో పది మంది పిల్లలకు ఆరుగురు మాత్రమే హాజరు కావడంతో పూర్తిస్థాయిలో పిల్లలు వచ్చేలా చూడాలని అంగన్వాడీ టీచర్‌కు సూచించారు. వర్షాలు కురుస్తుండడంతో ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మమత భాయి, ఎంపీఓ సునీత, పంచాయతీ కార్యదర్శి దేవేందర్ రావు పాల్గొన్నారు.

ఘనంగా శివంకు బాబు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-మల్కాజిగిరి

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని పీవీఎన్ కాలనీ ఫ్యూచర్ ఫౌండేషన్‌లో జీఎస్‌వీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో మైనంపల్లి శివంకు బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్ కేక్ కటింగ్ చేశారు. పిల్లలకు పండ్లు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, సంతోష్ రాందాస్, కన్నా, జీడీ చరణ్ జిత్ గౌడ్, పార్థసారథి, అజాం భాయ్, రఘు యాదవ్, సంజయ్, యాదగిరి, కిషోర్, రాజు, సందీప్ గౌడ్ ఫారుక్, ఇస్తారి, పాల్గొన్నారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-మేడ్చల్

భారతీయ మజ్దూర్ సంఘ్ 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం మేడ్చల్ పట్టణంలోని బీఎంఎస్ కార్యాలయంలో నిర్వహించారు. అంతకుముందుకు బైక్ ర్యాలీతో కార్యాలయానికి చేరుకొని జెండా ఎగరవేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బీఎంఎస్ రాష్ట్ర నాయకులు లిఖిత్ కుమార్, సత్యనారాయణ, బీఎంఎస్ నిర్మాణ మజ్దూర్ సంఘ్ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. దేశంలోనే అతిపెద్ద యూనియన్‌గా బీఎంఎస్ అవతరించిందన్నారు. కార్మికుల సంక్షేమం కోసం బీఎంఎస్ యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఏ రాజకీయ పక్షానికి సంబంధం లేకుండా కార్మికుల శ్రేయస్సు కోసం భారతీయ మజ్దూర్ సంఘ్ పనిచేయడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రయివేట్ ట్రాన్స్ పోర్ట్ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు లిఖిత్ కుమార్, నిర్మాణ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు వి.తిరుపతి రెడ్డి, కార్యదర్శి గంగాధర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ భార్గవ్, ఉపాధ్యక్షుడు ఏడుకొండలు, కోశాధికారి నరసింహ రెడ్డి, నాయకులు కేశవులు, కృష్ణారెడ్డి, జి.చెన్నా రెడ్డి, జి.వెంకటేశ్వర్లు, ఎస్.రసూల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ పెద్ద చెరువు కట్టపై సీసీ రోడ్డు వేయాలి

● కాంగ్రెస్ నాయకుడు ఎర్ర విజయ్ రావు



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని పెద్ద చెరువు కట్టపై సీసీ రోడ్డు వేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు. మేడ్చల్ పట్టణంలోని జాతీయ రహదారి 44పై ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. దీంతో చెక్ పోస్ట్ నుండి మేడ్చల్ రావడానికి ఇరుకైన రోడ్లతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మరో ప్రత్యామ్నాయ మార్గంగా మేడ్చల్ పెద్ద చెరువు కట్టపై నుండి వాహనదారులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. వర్షాకాలం సందర్భంగా కురుస్తున్న వానలతో మట్టిరోడ్డు పూర్తిగా బురదమయమై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే విషయమై మున్సిపల్ కాంగ్రెస్ నాయకుడు ఎర్ర విజయ్ రావు మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గతంలో మాజీ మంత్రి మల్లారెడ్డి తుమ్మ చెరువు కట్టపై తన సొంత నిధులతో సీసీ రోడ్డు వేయించారని తెలిపారు. అదేవిధంగా మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి పెద్ద చెరువు కట్టపై సైతం సీసీ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు.

బీసీ కుల గణన వెంటనే చేపట్టాలి : వెంకట్‌రెడ్డి



నవతెలంగాణ-కీసర

రాష్ట్రంలో బీసీ కుల గణన వెంటనే ప్రారంభించాలని, వెనుకబడిన వర్గాలకు న్యాయం చేస్తానన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రిజర్వేషన్ 23 శాతం నుంచి 42 శాతానికి పెంచి బడుగు బలహీన వర్గాలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కీసరలో బీజేపీ నేతలు మీడియాతో మాట్లాడుతూ.. బీసీ డిక్లరేషన్ అయ్యాక స్థానిక ఎన్నికలకు వెళ్లాలన్నారు. మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ చేసిన విధంగానే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన నమ్మించి మోసం చేసే పద్ధతినే రేవంత్ రెడ్డి అవలంబిస్తున్నారని అన్నారు. మొదటి అసెంబ్లీలోనే బీసీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేస్తామని, బీసీలలో ఉద్యోగం లేని యువతకు, ఉన్నత చదువుల నిమిత్తం వివిధ కులాల వారీగా రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకోకపోతే ప్రజలు గోరీ కడతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు మెట్టు కృష్ణ యాదవ్, కోల బాల్ రాజ్ యాదవ్, వెంకట్ రెడ్డి తదితరులున్నారు.

శ్రీనల్ల పోచమ్మ మహంకాళి బోనాల పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

శ్రీ శ్రీ నల్ల పోచమ్మ మహంకాళి ఆలయం 102వ వార్షిక బోనాల మహోత్సవంలో భాగంగా పోస్టర్‌ను ఆవిష్కరించి, ఘటాల ఊరేగింపును ప్రారంభించారు. సబ్జిమండిలోని నల్ల పోచమ్మ, మహంకాళి ఆలయ ఘటం ఊరేగింపు మంగళవారం వైభవంగా నిర్వహించారు. టప్పా చబుత్ర, లోథ్ క్షత్రియనగర్, మల్లెమెట్ నటరాజ్ నగర్, కుమ్మరవాడి, తదితర వీధుల గుండా సాగిన ఘటం ఊరేగింపునకు అన్ని ప్రాంతాల్లో ప్రజలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్యాట నందకిషోర్, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కుడుముల రాకేష్, కోశాధికారి కట్టా శ్రీనివాస్, సలహాదారులు కట్ట రాజయ్య, సేనాపతి చంద్రశేఖర్, గూడబోయిన శివరత్నం, జలగరి వేణు, కట్ట శివరాజ్, బుర్ర వేణు కుమార్, కట్ట నర్సింగ్ రావు, అవుశెట్టి, ఎస్.శ్యామ్ సుందర్, గుడుమని అశోక్ కుమార్, గాండ్ల నిరంజన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా 'సార'



నవతెలంగాణ-సిటీబ్యూరో

సెవెన్ రేస్ ఫౌండర్ డాక్టర్ సారా పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 150 మంది విద్యార్థులను ఆయా విద్యాసంస్థల్లో చేర్పించి ఫీజు చెల్లించారు. కాప్రా ప్రభుత్వ స్కూల్‌లో చదివి 9.5 మార్కులు సాధించిన మానస అనే విద్యార్థిని సోమవారం ఈసీఐఎల్‌లోని గీతం జూనియర్ కాలేజీలో ఫీజు చెల్లించి కాలేజీలో చేర్పించారు.

ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవంలో జిట్ట సునీల్ కుమార్



నవతెలంగాణ-కూకట్ పల్లి

కూకట్‌పల్లి మెట్రో హుండా ట్రాక్ పార్కింగ్ వద్ద ఆటో యూనియన్ వారు ఏర్పాటు చేసిన శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో జరిగిన కళ్యాణ మహోత్సవంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు జిట్టా సునీల్ కుమార్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలో నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జ్, ఇతర కాంగ్రెస్ నాయకులు,ఆటో యూనియన్ నాయకులు తదితరులు ఉన్నారు.

విద్యార్థినులకు అవగాహన సదస్సు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి, వివేకానందనగర్‌లో గల ప్రగతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులకు, ఋతు సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాన్ క్రైండ్ ఫార్మా డాక్టర్ హరిత ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు సూచనలు సలహాలు చేశారు. ఇందులో భాగంగా విద్యార్థినీలకు పౌష్టికాహారం, శారీరక, మానసిక దృఢత్వము, పిరియడ్స్ సమయంలో వచ్చే సమస్యల పైనఉన్న సందేహాలను డాక్టర్ హరిత నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రవీందర్ రావు, ప్రిన్సిపాల్ హిమబిందు, అధ్యాపకులు అస్మా, అధ్యాపకులు, మాన్ క్రైండ్ ఫార్మా నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపొందించాలి

- ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పచ్చదనం పెంపొందించాలి.. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ ప్రసూన నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె.నాగేంద్రబాబు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీవాసులు, సిద్ధార్థ స్కూల్ విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతతో చెట్లను నాటి సంరక్షిస్తే పచ్చదనం పెంపొందుతుందని, ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఎల్లా గౌడ్, విజయ హరీష్, కాలే గణేష్, సంజీవ్, ప్రసూన నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రాంచందర్, ప్రధాన కార్యదర్శి సిద్దులు గౌడ్, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సాగర్ రెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి

- కార్పొరేటర్ రావుల శేషగిరి
- కూలిన పాఠశాల ప్రహరీ పరిశీలన



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గాజులరామారం డివిజన్ పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలలలో మెరుగైన వసతులు కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. గత వారం పది రోజులుగా కురుస్తున్న వర్షా ప్రభావానికి డివిజన్‌లోని ఉమాదేవి నగర్ ప్రాంతంలో గల హనుమాన్ గుడి, ప్రభుత్వ పాఠశాల మధ్యలో ఉన్న ప్రహరీ కూలిపోయింది. ఈ విషయాన్ని స్థానిక కాలనీవాసులు కార్పొరేటర్‌కు తెలుపడంతో మంగళవారం పాఠశాలను స్థానికులతో కలిసి పరిశీలించారు. జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం ఏ విధంగా జరుగుతున్నదని.. పాఠశాల ఉపాధ్యాయులను వాకబు చేశారు.ఆహార భద్రత, బాత్‌రూమ్‌లు, పరిసరాల పరిశుభ్రత ఇతరత్రా సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే కాంక్రీట్‌తో గోడను నిర్మించేందుకు చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. రానున్న బోనాల పండుగ ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో కొన్ని మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమాదేవినగర్ సంక్షేమ సంఘం సభ్యులు పి.సమ్మయ్య యాదవ్,కూరపాటి కరుణాకర్ రాజు,ఎస్.కష్ణమూర్తి గుప్తా, పి.రాములు గౌడ్, శంకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందనగర్‌లో జెడ్‌సీ అపూర్వ చౌహాన్ పర్యటన



నవతెలంగాణ-కూకట్‌పల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు, డివిజన్‌లోని పలు సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం ఇచ్చిన నేపథ్యంలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావుతో కలిసి డివిజన్‌లో పర్యటించారు. సోమవారం కూకట్‌పల్లి జెడ్‌సీని కలిసి పలు సమస్యలు వివరించగా స్పందించిన జెడ్‌సీ మంగళవారం డివిజన్‌లో పర్యటించారు. మాధవరం కాలనీ కల్వర్టు అప్రోచ్ రోడ్డు వడ్డేపల్లి ఎంక్లేవ్ దగ్గర ,సెంట్రల్ మీడియంలో మొక్కలు నాటడం, పలు సీసీ రోడ్లు, బోనాల సందర్భంగా చిత్తారమ్మ గుడిలోని పలు పనులు చేపట్టాలని, వాటర్ స్టాగ్నెంట్ పాయింట్స్ అయిన దీనబంధు కాలనీ వంతెన, ఈనాడు కాలనీ, వివేకానంద నగర్ కాలనీలోని అనుపమ బ్యాక్ సైడ్ రోడ్డు సందర్శించి పెండింగ్ పనులు అతి త్వరగా పూర్తి చేసి సమస్యలు పరిష్కరించాలని, మంజూరైన పనులను కాంట్రాక్టర్లతో మాట్లాడి త్వరగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

చెత్తాచెదారాలను శాశ్వతంగా తొలగించండి

- బీరప్పనగర్ బస్తీవాసులు
- స్థానికులతో కలిసి ఉప కమిషనర్ మల్లారెడ్డి పర్యటన

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



జగద్గిరిగుట్ట డివిజన్ బీరప్ప నగర్ ప్రాంతం ఖాళీ స్థలంలో చెత్తా చెదారాలు వివిధ ప్రాంతాల నుంచి పారేస్తుండడంతో దోమలు ఈగలు వ్యాప్తి చెంది ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని స్థానిక బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ జెకె.శేఖర్ యాదవ్ గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డికి సమస్యను తెలపడంతో ఆ ప్రాంతంలో స్థానికులతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా డి.సి. మల్లారెడ్డి మాట్లాడుతూ రోడ్ల మరమ్మత్తులతోపాటు,బస్తీ చివర్లో ఉన్న చెత్త చెదారాలను వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశా లు జారీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసు కుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గుజ్జుల పాపిరెడ్డి, ఓరుగంటి కష్ణా గౌడ్, జి.సుధాకర్ రావు,గండి రాజు యాదవ్, ఏ.వేణు యాదవ్,మహేష్ యాదవ్, ఉపేందర్ రెడ్డి,గోవర్ధన్ గౌడ్, లక్ష్మణ్, గోపాల్, సత్యనారాయణ యాదవ్,రామ్ చందర్, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు మేలు చేసే బడ్జెట్

- సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం



నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ప్రజలని నిరాశపర్చిందనీ, కార్పొరేట్లకు మేలు చేసే బడ్జెట్‌లా ఉందని సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న నిరుద్యోగం, అధిక ధరలు, ఇతర దైనందిన సమస్యల గురించి ఈ బడ్జెట్ పట్టించుకోలేదన్నారు. ఉపాధి కల్పనకి పెట్టిన ప్రోత్సాహకాలు కార్పొరేట్లకు ప్రభు త్వ సొమ్మును బదిలీ చేసేదిగా ఉన్నది, తప్ప నిరుద్యోగ సమస్యను పరిష్కరించేదిగా లేదన్నారు. ఈ బడ్జెట్‌ను చూస్తుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్యోగ కల్పన నుంచి వైదొలిగినట్టుగా కనబడుతుందన్నారు. ధరలు తగ్గించడానికి కూడా ఈ బడ్జెట్ తగిన ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. విద్య, వైద్య శాఖలకు బడ్జెట్‌లో తగిన కేటాయింపుల్లేవన్నారు. ప్రజల గృహ వసతికి సంబంధిం చిన ఆవాస్ యోజనకు కూడా నిధులు పెద్దగా కేటాయిం చలేదని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ తమ రాజకీయ ప్రయోజ నాలను నెరవేర్చుకునేందుకు, కొన్ని రాష్ట్రాలకు ప్రాధాన్యాన్ని ఇచ్చినట్టుగా కనిపిస్తుంద న్నారు. రాష్ట్ర విభజన అంశాల్లో తెలంగాణకు కేంద్ర బడ్జెట్ మొండి చేయి చూపిందన్నారు. తెలంగాణ నుంచి గెలుపొందిన బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు తెలంగాణ సమాజానికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అభివద్ధికి తోడ్పడే ఐటీఐఆర్ ప్రాజెక్టు ఊసేలేదన్నారు. ఈ బడ్జెట్ కార్పొరేట్ ప్రయోజ నాలు, తమ రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చటానికి ఉద్దేశించినట్టుగా ఉంది తప్ప ప్రజలకి ఉపశమనం కలిగించేదిగా లేదన్నారు. ఈ బడ్జెట్‌ను సీపీ(ఐ)ఎం మేడ్చ ల్- మల్కాజిగిరి జిల్లా కమిటీ తీవ్రంగా నిరసిస్తున్నట్టు తెలిపారు.

విద్యాభివృద్ధిపై ధ్యాసేదీ..?

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్

నవతెలంగాణ-సిటీబ్యూరో



విద్యాభివృద్ధికి 10శాతం నిధులు కేటాయించాలి, కానీ ఈ కేంద్ర బడ్జెట్ విద్యా రంగానికి అనుకున్నంత స్థాయిలో బడ్జెట్ కేటాయించకపోవడం సిగ్గుచేటు అని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్ అభిప్రాయపడ్డారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ విధానాలను ఎక్కడ ప్రశ్ని స్తారో..? అని అధిక నిధులు కేటాయించకుడా మోడీ ప్రభుత్వం విద్యాభివృద్ధిని అడ్డుకుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలు, నూతన ప్రభుత్వ యూనివర్సిటీ లు, మెడికల్ కళాశాలలు లాంటి విద్యాసంస్థల అభివద్ధి కోసం బడ్జెట్ ఉండాలి తప్పితే, ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేలా ఉండటం సరికాదన్నారు. రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయింపులు చేయకపోవడం చూస్తుంటే, మోడీ ప్రభుత్వం రాష్ట్రం పట్ల కక్షపూరితమైన రాజకీయం చేస్తుందన్నారు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు రాష్ట్రాభివృద్ధికి ఏమీ చేయలేదన్నారు. రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో గుండు సున్నా కేటాయింపులకు నిరసనగా బీజేపీ మంత్రులు, ఎంపీలు వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివద్ధికి ఎంపీలు, కేంద్ర మంత్రులు వ్యతిరేకమా..? అని ప్రశ్నించారు. ఓట్ల కోసమే అబద్ధాల హామీలతో గెలిచారా..? రాష్ట్రాభివృద్ధి కోసం పార్లమెంట్‌లో మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. బడ్జెట్‌లో బీజేపీ పాలిత రాష్ట్రాలకు ప్రాధాన్యత ఇవ్వడం అంటే ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న ట్టేన్నారు. కేంద్ర బడ్జెట్ ఆశాజనకంగా లేదనీ, కార్పొరేట్ సంస్థలని పెంచి పోషించేలా ఉందని అభిప్రాయపడ్డారు. పేద, బడుగు, బలహీన ప్రజలు, విద్యార్థుల అభివద్ధి సరిపోయే స్థాయిలో బడ్జెట్ కేటాయించాలని కోరారు. విద్యారంగ అభివద్ధికి కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం కేటాయించాలనీ, లేనిపక్షంలో రాష్ట్రంలో ఉన్న బీజేపీ కేంద్ర మంత్రులు, ఎంపీలను ఎక్కడికక్కడే అడ్డుకుంటామని హెచ్చరించారు. ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించే బాధ్యత రెవిన్యూ అధికారులదే

- మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



ప్రభుత్వ భూములను పరిరక్షించే బాధ్యత రెవెన్యూ అధికారులపైనే ఉందని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ మండలం, పేట్ బషీరాబాద్ గ్రామంలోని సర్వే నంబర్ 25/1, 25/2 లలోని ప్రభుత్వ స్థలాలను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, మల్కాజిగిరి ఆర్డీఓ శ్యాంప్రకాష్, కుత్బుల్లాపూర్ తహశీల్దార్ రెహమాన్ ఖాన్, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ రేణుకా దేవి తో కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆయా సర్వే నెంబర్లలో సుమారు 38 ఎకరాలు హెచ్ఎండీఏకు కేటాయించినట్టు, అలాగే సుమారు 7 ఎకరాలు ఆర్‌జీకే హౌసింగ్ సొసైటీకి అప్పగించినట్లు తెలిపారు. సర్వే నెంబర్లు 25/1, 25/2లలోని ప్రభుత్వ స్థలంలో విచ్చలవిడిగా వెలిసిన అక్రమ కట్టడాలను తొలగించాలని అధికారులకు ఆయన ఆదేశించారు. హెచ్ఎండీఏ , ఆర్‌జీకే సంస్థలు ప్రభుత్వ స్థలాలను తమ ఆధీనంలోకి తీసుకునే వరకు రెవిన్యూ అధికారులు ఆయా భూములను కాపాడాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలను కాపాడేం దుకు త్వరలోనే రక్షణ కంచెను ఏర్పాటు చేస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్ని స్తున్న అక్రమ నిర్మాణాలు చేపట్టినా ఎవరినీ ఉపేక్షించేది లేదని చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేఎల్ఎం యాజమాన్యంపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి



- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కేఎల్ఎం యాజమాన్యంపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. మంగళవారం సురారం ఇన్‌స్పెక్టర్ భరత్ కుమార్‌కు సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వారం గాజులరామరం డివిజన్, లాలసాహెబ్ గూడకు చెందిన దారం పద్మావతి కుమారుడు దారం నర్సింగరావు పై కేఎల్ఎం యూనివర్సిటీ సిబ్బంది దాడి చేసి, తీవ్ర గాయాల పాలు చేశారని.. అలాగే నిందితులు "మా యాజమాన్యం మిమ్మల్ని చంపి పేగులు మెడలో వేసుకోమన్నారు" అని బెదిరించారని పోలీస్‌స్టేషన్‌లో వీడియోలో దారం పద్మావతి చెప్పిందన్నారు. కానీ పోలీస్ వారు కేవలం సిబ్బంది పై బెయిలబుల్ కేస్ వేసి, యాజమాన్యం పై ఎలాంటి కేసు నమోదు చేయకపోవడం దురదష్టకరమని కావున యాజమాన్యం, సిబ్బందిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం భూమికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు వల్ల నిందితులకు ఎలాంటి ఇబ్బంది లేదని కావున హత్యాయత్నం కింద కేసు నమోదు చేస్తే భవిష్యత్తులో మరెవరూ ప్రజల పైన దాడి చేయరని,కేవలం చిన్న చిన్న కేసులు ఉండటం వల్ల కబ్జాదారులు భయపడటం లేదని,గత ప్రభుత్వంలోలాగే ఈ ప్రభుత్వంలో కూడా పేద ప్రజల కు న్యాయం జరగట్లేదన్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, సీపీఐ నాయకులు చంద్ర మోహన్, బాలయ్య,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సాయన్న అంటే కంటోన్మెంట్.. కంటోన్మెంట్ అంటే సాయన్న

- ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



సాయన్న ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేపట్టిన సంక్షేమం, అభివద్ధితో సాయన్న అంటే కంటోన్మెంట్.. కంటోన్మెంట్ అంటే సాయన్న అనే విధంగా ఉండేదని.. ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. కంటోన్మెంట్‌ను ఇంటి పేరుగా మార్చుకొని కంటోన్మెంట్ సాయన్నగా ప్రజలందరి మన్ననలను పొందిన నాయకుడు సాయన్న అని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత మతికి సంతాపం తెలుపుతూ సభలో ప్రవేశపెట్టిన తీర్మానంపై మంగళవారం ఎమ్మెల్యే మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలోని 294 నియోజకవర్గాలలోని నాయకులకు సుపరిచితుడు సాయన్న అన్నారు. సాయన్న మొట్టమొదటి సారిగా ఎమ్మెల్యేగా (2014) ఎన్నికైనప్పుడు అసెంబ్లీలో ఎటువంటి ప్రశ్నలు అడగాలి, ఎలా విషయాన్ని రాబట్టాలి అనేదానిపై వారిచ్చిన సూచనలు ఎంతో బాగుండేదన్నారు. 2016లో కవాడిగూడ కార్పొరేటర్ గా గెలిచిన సాయన్న కుమార్తె లాస్య నందిత డివిజన్‌ను ఎంతో అభివద్ధి చేశారన్నారు. అయితే సాయన్న మతితో అనివార్యమైన ఎన్నికలలో వారి కూతురుగా కుమారి లాస్య నందిత బీఆర్ఎస్ తరఫున గెలిచారని చెప్పారు. ఎన్నికైన నాటి నుండి నగరంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను కలిసినపుడు నియోజకవర్గ అభివృద్ధిపై ఆమెకున్న తాపత్రయం కనపడిందని.. వారి తాపత్రయం, మంచి పేరు సంపాదించాలనే ఆశకు విధి ఇంకొకలా ఆలోచించిందన్నారు. లాస్య నందిత మతి చెందారనే విషయం ఎంతగానో కలిచివేసిందన్నారు ఈ సందర్భంగా లాస్య నందిత ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలియజేశారు.

పేద విద్యార్థులకు చేయూత అభినందనీయం

- గాంధీనగర్ ఐలా అధ్యక్షులు, పవర్ టెక్ ట్రాన్స్‌ఫార్మర్స్ అధినేత పైడిపల్లి స్వామిగౌడ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు చేయూతనందించేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని గాంధీనగర్ ఐలా అధ్యక్షులు, పవర్ టెక్ ట్రాన్స్‌ఫార్మర్స్ అధినేత,సంఘ సేవకులు పైడిపల్లి స్వామిగౌడ్ అన్నారు. ప్రముఖ సంఘ సేవకులు వి.వి.ఈ. ట్రాన్స్‌ఫార్మర్స్ అధినేత ఈళ్ల వినోద్ తన తండ్రి వి.వి.ఈ. ట్రాన్స్‌ఫార్మర్స్ వ్యవస్థాపకులు దివంగత ఈళ్ల నారాయణ రావు సంస్మరణ సభలో భాగంగా మంగళవారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలోని పేద విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ ను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ మాట్లాడుతూ ఇటువంటి గొప్ప సేవలందిస్తున్న వినోద్‌ను అభినందించారు.పేద విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు.ఈ.వినోద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు తనవంతుగా సేవలందించినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా సామాజిక సేవలు విస్తతం చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు జల్ద లక్ష్మి నాథ్,వి.వి.ఈ.ట్రాన్స్ఫార్మర్స్ ప్రతినిధి వేంకటేశ్వర్ రావు, స్థానిక నాయకులు తిమ్మయ్య, జగన్, రామ్ చందర్, శ్రీను,సందీప్,సాయి,ఆనంద్ పాల్గొన్నారు.

విద్యతోనే వికాసం

- స్కూల్ యూనిఫాంల పంపిణీలో ఎమ్మెల్యే గాంధీ



నవతెలంగాణ-కూకట్ పల్లి

విద్యతోనే వికాసం, విద్యతోనే ఆత్మవిశ్వాసం,ప్రతి తరగతి గది తరగని విజ్ఞాన గని అని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అన్నారు. వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ కాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ లను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో అవసరమైన మరమ్మతు పనులను దాదాపు పూర్తి చేయడం జరిగిందని, తరగతి గదులను అలంకరించి, ప్రవేశ ద్వారాలకు మామిడి తోరణాలు కట్టి పండగ వాతావరణంలో, విద్యార్థులకు స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేయడం జరిగిందని చెప్పారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి ,తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని, సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని, తన వంతు కృషి, సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలని ఎమ్మెల్యే కోరారు. ప్రధానోపాధ్యాయులు మస్తాన్ వలీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయినేనీ చంద్రకాంత్ రావు,హరినాథ్, లక్ష్మీ నరసయ్య, సత్యనారాయణ, శ్యామ్ రావు, చంద్రమోహన్, దుర్గ, సురేష్,ఎర్ర లక్ష్మయ్య, శివ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి కళాశాలలో ఆరోగ్య సంరక్షణ సదస్సు

నవతెలంగాణ-దుండిగల్



మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఎ.ఐ.సి.టి.ఈ-వాణి వారి ప్రాయోజిత సదస్సును ఘనంగా ప్రారంభించారు. డీప్ లెర్నింగ్ సాంకేతికత ద్వారా ఆరోగ్య సంరక్షణ అప్లికేషన్స్ ఉపయోగాన్ని తెలుగు భాషలో తెలియజేయడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ జక్కుల త్రిశూల్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఆధునిక ప్రపంచంలో ప్రతి ఒక్క సాంకేతికతను మాత భాషలో అనువదించి భోదించాలంటే చాలా కష్టతరమైన విషయం అన్నారు. అలాంటిది డీప్ లెర్నింగ్ టెక్నాలజీని ఉపయోగించి ఆరోగ్య సంరక్షణ అప్లికేషన్స్ మన మాత భాష తెలుగులో బోధించడం మన కళాశాలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ అప్లికేషన్లను తెలుగులో మంచి వివరణ ఇవ్వగలిగిన వక్తల ద్వారా ఉపన్యాసాలు పొందడం సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా హెల్త్ కేర్ అప్లికేషన్స్ మీద అవగాహన అందించడం, ప్రతి ఒక్కరూ. సద్వినియోగించుకోవాలని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్. లోకనాధం మాట్లాడుతూ ఎ.ఐ.సి.టి.ఈ.- వాణి ప్రాయోజిత సదస్సు కోసం 100 ఇంజినీరింగ్ కళాశాలలు దరఖాస్తు చేసుకుంటే అందులో నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎంపికవ్వడం గర్వకారణంగా ఉందన్నారు. కళాశాల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ట్రైనింగ్స్, వర్క్‌షాప్స్, సెమినార్స్ ఇలా విద్యార్థులకు అధ్యాపకులకు ఉపయోగకరమైన ఎన్నో సాంకేతికతకు సంబంధించిన డెవలప్మెంట్ కార్యక్రమాలకు తమ కళాశాల వేదిక అవ్వడం అదష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ముఖ్య అతిథులుగా హాజరైన వక్తలు డైరెక్టర్, మిల్ స్టార్ ఆర్.ఎఫ్. అండ్ మైక్రోవేవ్ సిస్టమ్స్ ప్రయివేటు లిమిటెడ్ అధినేత - వింగ్ కమాండర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని అన్ని రకాల రోగాల బారి నుండి రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉంటుందని, డీప్ లెర్నింగ్ టెక్నాలజీని ఉపయోగించుకొని హెల్త్ కేర్ అప్లికేషన్స్ ఎలా ఉపయోగించాలో సామాన్యులు కూడా అవగాహన పొందవచ్చు అన్నారు. తద్వారా తమ ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని తెలిపారు. గౌరవ అతిథి సి.ఎస్.ఐ. హైదరాబాద్ - అధ్యాయం సభ్యురాలు రమ ఎస్.పట్నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు టెక్నాలజీ మీద మంచి పరిజ్ఞానం పెంచుకుంటే వారు భవిష్యత్తులో ఎలాంటి సమస్యలకైనా చాలా సులభమైన పద్ధతుల ద్వారా పరిష్కారాలు పొందవచ్చని తెలిపారు. అదేవిధంగా డీప్ లెర్నింగ్ ఉపయోగించుకొని ఆరోగ్య సంరక్షణ అప్లికేషన్లు ఎలా పని చేస్తాయి, ఒక మనిషి జీవన విధానంలో వాటి ప్రాముఖ్యత ఏంటి అనే అంశాల మీద ప్రసంగించడం చాలా గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ నర్సింహా రెడ్డి, సెక్రటరీ జక్కుల త్రిశూల్ రెడ్డి, ట్రెజరర్ త్రిలోక్ రెడ్డి, డైరెక్టర్ డా. ఏ.మోహన్,ప్రిన్సిపాల్ డా.లోకనాధం, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డీన్ డా.దిలీప్ కుమార్ రెడ్డి, సి.ఎస్.ఈ. హెచ్.ఓ.డి. డా.జి.రాము, డీన్ డా.రామ సుబ్బారెడ్డి, డీన్ - అకాడమిక్స్ శ్రీలక్ష్మి, ఫ్యాకల్టీలు పురుషోత్తం, డా.కవిత నల్లమోతు, జి.సునీల్ కుమార్, డా.నిడమానూరు శ్రీనివాస్, నవాజుద్దీన్, నిరోషా, అపర్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బీజేపీ ఎంపీలు వెంటనే రాజీనామా చేయాలి

- సీపీఐ(ఎం) నగర నాయకులు మహేందర్

నవతెలంగాణ-అంబర్‌పేట



తెలంగాణ ప్రాంత బీజేపీ ఎంపీలు వెంటనే రాజీనామా చేయాలని లేదంటే నిధులు తేవాలని లేనియెడల తెలంగాణ ప్రజలకు క్షమాపణ కోరాలని సీపీఐ(ఎం) నగర నాయకులు మహేందర్ అన్నారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2 గంటల ప్రసంగంలో తెలంగాణ పదాన్ని ప్రస్తావించలేదన్నారు. కేంద్రప్రభుత్వం.. తెలంగాణలోని ఒక ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటిం చాలని డిమాండ్ చేశారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణ హామీలు అమలు చేయాలని, ఐఐఎం, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం వెంటనే ప్రకటించాలన్నారు. మోడీ ప్రభుత్వంపై చంద్రబాబు, నితీష్‌కుమార్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ఎంపీలు తెలంగాణ హక్కు ల కోసం నిధుల కోసం పోరాడాలని లేనియెడల రాబోయే రోజులలో ఎంపీల ఇంటి ముందు నిరసన ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

12

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
బుధవారం | జులై 24, 2024 | www.navatelangana.com

కేంద్ర బడ్జెట్ బీహార్, ఏపీ రాష్ట్రాల బడ్జెట్‌లా ఉంది

- టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్



నవతెలంగాణ-ఓయూ

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బీహార్, ఏపీ రాష్ట్రాల బడ్జెట్‌లా ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. మంగళ వారం ఆయన మాట్లాడుతూ తెలంగాణకు అన్ని రంగాల్లో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని.. రాష్ట్రానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించ లేదన్నారు. మోడీ , బిహార్, అస్సాం, ఏపీ రాష్ట్రాలకు కేటాయించిన నిధులు తెలంగాణకు ఇవ్వలే దన్నారు. రైలు మార్గాలు లేని జిల్లాలకు మార్గం చూపలేదని, విద్యా, వైద్య, రంగాల్లో అభివద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించకపోవడం దారుణం అన్నారు. విద్యా, వైద్యం, నివాసాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, మొబైల్, చార్జర్, బెల్టులు, చెప్పులు, వీటికి ప్రాధాన్యత ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. మోడీ తన కుర్చీని కాపాడుకునే బడ్జెట్‌లాగా ఉందని, సామాన్యులకు ఉపయాగం లేదన్నారు. అదానీ, అంబానీ లకు ఉపయోగ పడేలా బడ్జట్ ఉందన్నారు.



సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయం లో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.' ముఖ్య అతిథిగా కంట్రోల్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, కార్పొరేటర్ కొంతం దీపిక హాజరయ్యరు. వారు మాట్లాడుతూ తెలంగాణ అతిపెద్ద పండుగగా పిలవడే బోనాల జాతర ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్, నర్సింగ్, ఉద్యోగులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవతెలంగాణ-బేగంపేట్

ప్రజల గుండెల్లో సాయన్న కుటుంబానికి శాశ్వత స్థానం

- ఎమ్మెల్యే లాస్య నందితకు ఎమ్మెల్యే శ్రీ గణేష్ నివాళి



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలకు సాయన్న కుటుంబం చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సంతాప తీర్మానంపై ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే లాస్య నందితకు, సాయన్నకు నివాళులర్పించారు. జనం గుండెల్లో ఆ కుటుం బానికి శాశ్వత స్థానం ఉంటుందని తెలిపారు. సాయన్న కుటుంబంతో సుదీర్ఘ అనుబంధాన్ని ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు,.



సనత్ నగర్ హనుమాన్ దేవస్థానంలో ఈనెల 28 ఆదివారం జరగనున్న బోనాలకు హాజరుకావాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వారి స్వగృహంలో కార్పొరేటర్ కొలను లక్ష్మి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పరశురాం రవీంద్రాచార్యులు, సరస్వతి ఆలయ అర్చకులు సునీల్ జోషిలు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసరాజ్, బీఆర్ఎస్ పార్టీ సనత్ నగర్ డివిజన్ అధ్యక్షులు కొలను బాల్ రెడ్డి, ఆలయ సూపర్వైజర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బేగంపేట

కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయండి

- నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు



నవతెలంగాణ-బంజారాహిల్స్

నిమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను సీనియార్టీ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఆరోగ్య శఖ మంత్రి దామోదర రాజనర్సింహను నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయ కులు కోరారు. మంగళవారం బంజారా హిల్స్‌లోని మంత్రుల నివాసంలో మంత్రి దామోదర రాజ నర్సింహను నిమ్స్ సీఐటీయూ అధ్యక్షులు వెంకటేష్ ఆధ్వర్యంలో బందం కలిసి వినతిపత్రం అంద జేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రానికి తలమానికంగా ఉన్న నిమ్స్ హాస్పటల్‌లో సుమారు 1,350 మంది కార్మికులు కాంట్రాక్టు పద్ధతిలో గత 30-35 సంవత్సరాల నుండి పనిచేస్తున్నారని తెలిపారు. వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని కోరారు. ఈ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ గత ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు చాలాసార్లు విన్నవించుకున్నా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందన్నారు. కావున తమరు సానుకూల దక్పథంతో నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ, అంకిత భావాన్ని గుర్తించి సీనియార్టీ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని కోరారు. రెగ్యులరైజ్ చేసేలోపు నిమ్స్ యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులకు డైరెక్టుగా వేతనాలు చెల్లించేలా చొరవ చూపాలన్నారు.

ప్రస్తుతం నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులకు పెరిగిన వీడిఏ పాయింట్స్‌తో కలుపుకొని నెలకు (26 రోజులకు) రూ 16,237/- లు ప్రతి కార్మికునికి గ్రాస్ శాలరీ ఇస్తున్నారని.. దీని ప్రకారం ప్రతి కార్మికునికి రోజుకు రూ.624-50 పై.ల వేతనం ఇవ్వాలన్నారు. కానీ జీవో 68 ప్రకారం రోజుకు రూ.568.92 పై.లు చొప్పున నెలకు (26 రోజులకు) వేతనం రూ.14,792/- లు ఇస్తున్నా రాని మంత్రికి తెలిపారు. కనీసవేతనం కంటే అదనంగా ఉన్న డబ్బు రూ. 1,445/- ను ఫిక్స్ అలవెన్స్‌గా ఇస్తున్నారని.. ఒకే వేతనాన్ని రెండు భాగాలు చేయడం వలన కార్మికులకు చాలా నష్టం జరుగుతున్నదని తెలిపారు. నిమ్స్ యాజమాన్యం 2023 సెప్టెంబర్ కంటే ముందు ఉన్న వేజ్ స్ట్రక్చర్ మార్చడం వల్ల కార్మికునికి ప్రతిరోజు ఇచ్చే వేతనం తగ్గిందని, పండుగ సెలవులకు "ఇచ్చే వేతనం తగ్గి డబల్ డ్యూటీలకు ఇచ్చే వేతనం తగ్గిందని కావున ఫిక్స్ అలవెన్స్ పేరుతో చూపిస్తున్న రూ.1,445/- లను గ్రాస్ శాలరీలో కలిపి ఇవ్వాలని కోరుతున్నామని తెలిపారు.

2023 సెప్టెంబర్ కంటే ముందు ఉన్న వేజ్ స్ట్రక్చర్ పద్ధతిని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులు చేస్తున్న సేవలకు గుర్తింపుగా గతంలో ఒప్పుకున్న విధంగా రిటైర్ అయిన కార్మికులకు - ఉచితంగా వైద్య సౌకర్యం ఆరోగ్యశ్రీతో కార్మికుల వైద్యానికి ఎలాంటి లింకు పెట్టొద్దని మనవి చేస్తున్నామన్నారు. రిటైర్ అయిన కార్మికులకు గ్రాడ్యుటి చెల్లించాలని కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. ప్రధాన కార్యదర్శి ఈ నరసింహ, వెంకటేష్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చెయ్యి

- బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు



నవతెలంగాణ-ఓయూ

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయిం చింది శూన్యం అని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో కేవలం కొన్ని రాష్ట్రాలకు మాత్రమే పెద్దపీట వేశారని.. బడ్జెట్ మొత్తంలో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం చాలా బాధాకరం అన్నారు. నాటి ఆంధ్రప్రదేశ్ పునర్విజన చట్టంలో దాదాపు 35 హామీల పైన నిర్ణయం తీసుకోవాలని గతంలో కేసీఆర్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారని, అనేకసార్లు అభ్యర్థిస్తూ లేఖలు కూడా రాశారని గుర్తు చేశారు. ములుగు యూనివర్సిటీకి అదనపునిధులు లేవు.. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ లేదు.. కాజీ పేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ అసలు ఊసే లేదన్నారు. రాష్ట్రంలోని కాళేశ్వరం ప్రాజె క్టుకు జాతీయ హెూదా ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోలేవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐఐఎం. ఐసర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ వంటి కేంద్ర జాతీయ సంస్థలను ఇవ్వమని మాజీ సీఎం కేసీఆర్ కోరినప్పటికీ ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు.

తెలంగాణలోని 16 స్థానాలను బీజేపీ, కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీలకు ఇస్తే ఏం జరిగిందో తెలంగాణ ప్రజలు ఒకసారి ఆలోచించాలన్నారు. పక్కనే ఉన్న 16 స్థానాలు ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు, బీహార్‌కు దక్కిన నిధులు చూడాలని.. తెలంగాణ దక్కింది సున్నా అన్నారు. తెలంగాణ తరుపున పార్లమెంట్లో కూర్చున్న బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు కేంద్ర మంత్రులు ఒక్క మాట కూడా పార్లమెంట్‌లో మాట్లాడలేదని.. అంటే వారికి వారి ప్రాంతం మీద ఉన్న ప్రేమ అర్థం అవుతుందన్నారు. 8 మంది ఎంపీలను ఇచ్చినా బీజేపీ ప్రభుత్వం గుండు సున్నా నిధులు ఇచ్చినందుకు తెలంగాణ ప్రజలు తప్పకుండా బుద్ధి చెప్తారన్నారు.



నేడు, రేపు లాల్ బజార్ మహంకాళి జాతర



నవతెలంగాణ-కంటోన్మెంట్

తిరుమలగిరి లాల్ బజార్ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో బుధవారం గురువారాలలో అమ్మవారి జాతర నిర్వహిస్తున్నట్లు ఈవో సత్య చంద్రారెడ్డి, కమిటీ చైర్మెన్ మురళి ముదిరాజ్,. సభ్యులు పేర్కొన్నారు. మంగ ళవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం వారు మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు కూడా చెప్పారు. అమ్మవారి దర్శనం కోసం పలువురు వీఐపీల కూడా రానున్నారని చెప్పారు. చారిత్రాత్మ అయినాయి అమ్మవారి ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో ప్రతి ఏటా సికింద్రాబాద్ బోనాల తర్వాత వచ్చే బుధవారం గురువా రాల్లో రెండు రోజులపాటు జాతర నిర్వహిస్తారని తెలిపారు సికింద్రాబాద్ అమ్మవారి జాతర తర్వాత ఆ ఘటాలను ఇక్కడికి తీసుకొచ్చి బోనాలు జాతర చేసే ఆనం అయితే అనాదిగా వస్తోందని అన్నారు వైభవంగా జరిగే ఈ బోనాలు జాతరకు తిరుమలగిరి వాసులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారని వారు వివరించారు.

ఆరోగ్య సంరక్షణ రంగానికి ప్రాధాన్యత

- అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతా రెడ్డి



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఆరోగ్య సంరక్షణ రంగానికి ప్రాధాన్యత ఇచ్చారని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతా రెడ్డి తెలిపారు. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను పెంపొందించాలన్న ప్రభుత్వ నిబద్ధతకు ఈ బడ్జెట్ నిదర్శన మన్నా రు. దశలవారీ తయారీ కింద ఎక్స్-రే ట్యూబ్‌లు, ఫ్లాట్ ప్యానెల్ డిటెక్టర్‌ల కోసం ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీ (బీసీడీ)లో మార్పు గొప్ప వ్యూహాత్మక చర్య అన్నారు. ఇది ఖర్చులను తగ్గిస్తుందన్నారు. దేశీయ తయారీ సామర్థ్యాన్ని పెంచుతుం దన్నారు.క్యాన్సర్ మందులపై కస్టమ్స్ డ్యూటీల మినహాయింపు ఇచ్చారన్నారు. మూడు క్యాన్సర్ మందులపై ఈ మినహాయింపు కలదన్నారు. ఒక ప్రధాన ఆరోగ్య సవాలుకు చికిత్స సౌలభ్యం, స్థోమతను మెరుగుపరచడంలో ఒక ముఖ్యమైన దశ అన్నారు. ఈ చర్య క్యాన్సర్ రోగి ఆర్థిక ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుందని తెలిపారు. ఈ మధ్యంతర బడ్జెట్‌లో ప్రభుత్వం ఆరోగ్య రంగానికి రూ.90,171 కోట్లు కేటాయించిందని తెలిపారు. దేశంలో ఆరోగ్య సంరక్షణ వ్యూహాలను అభివద్ధి చేయడానికి ఈ పెట్టుబడి కీలకమన్నారు. బడ్జెట్‌లో ఇప్పటికే 70 ఏండ్లు పైబడిన వ్యక్తులకు రూ. ఐదు లక్షల వరకు ఆరోగ్య కవరేజీని ప్రకటించిందన్నారు. ఆరోగ్య సంరక్షణ కోసం కీలకమైన ఇన్నోవేషన్ ఫండ్‌ను కూడా ప్రకటించిందని తెలిపారు. ఈ చర్యలు మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి దోహదపడతాయని పేర్కొన్నారు.

నైపుణ్యాలకు పెద్దపీట హర్షణీయం

- ప్రిన్సిపాల్ ప్రో.రవి కుమార్



నవతెలంగాణ- ఓయూ

బడ్జెట్‌లో విద్యా సంస్థల అభివృద్ధి కి నిధులు కేటాయింపు అభినందనీయం అని కామర్స్ సీనియర్ ప్రొఫెసర్, సికింద్రాబాద్ పీజీ కళశాల ప్రిన్సిపాల్ ప్రో.జాస్తి రవి కుమార్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కేటాయింపులు నిరాశ కలిగించినప్పటీ యువత లో నైపుణ్యాలను పేపొందించటానికి వివిధ పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు.దీనిలో 20 లక్షల మంది యువతకు 1000 సంస్థలను నేటి నైపుణ్యాలను తగ్గట్టుగా అభివృద్ధి చేయాలని చూడటం నిజంగా అభినందనియం అన్నారు. ఉత్పత్తిని పెంచడానికి వాతావరణం తట్టుకునే విదంగా వివిధ వంగడాలు అభివృద్ధి చేయడానికి వ్యవసాయ ఆధా రిత పరిశోధన అనేవి రైతులకు చాలా ఉపయోగకరం అనిఅభిప్రాయం వ్యక్తం చేశారు. ఇక ఈ బడ్జెట్ కేటాయింపులో రాష్ట్రనికి తీవ్రమైన నిరాశే మిగిలిందన్నారు.

నాన్ నెట్ ఫెలోషిప్ మంజూరు చేయాలి

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి విద్యార్థుల వినతి



నవతెలంగాణ-ఓయూ

పరిశోధక విద్యార్థులకు నాన్ నెట్ ఫెలోషిప్ మంజూరు చేయాలని, పెండింగ్ లో ఉన్న మెస్ బకాయిలు రద్దు గురించి ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిల దృష్టికి తీసుకెళ్లా లని ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్‌కు మంగళవారం ఓయూ విద్యార్థులు వినతిపత్రం అందజే శారు.టీఎస్ పీ జేఏసీ ఫౌండర్ ప్రెసిడెంట్, టీజీ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ కోఆర్డినేటర్, ఓయూ పొలిటికల్ సైన్స్ రీసెర్చ్ స్కాలర్ కాంగ్రెస్ నాయకుడు వలిగొండ నరసింహతో పాటుగా రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థి ప్రతిని ధుల బందం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో వారిని కలిసి విన్నవిం చారు రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలలో పరిశోధక విద్యార్థులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం, కేంద్ర బీజేపీ ప్రభుత్వం పాలనలో పరిశోధన విద్యకు కావాల్సిన ఆర్థిక ప్రోత్సాహాలు ఫెలోషిప్స్ అందించలేదని, మొదటి తరం గ్రామీణ ప్రాంతాల నుండి ఉన్నత చదువుల కోసం తెలంగా ణలోని ఉస్మానియా, కాకతీయ ,పాలమూరు, మహాత్మ గాంధీ, తెలంగాణ ,శాతవాహన వంటి యూనివర్సిటీలలో పరిశోధన చేస్తున్నటువంటి విద్యార్థులు ఆర్థిక పరిస్థితుల వల్ల అర్థాంతరంగా తమ పరిశోధనలు మధ్యలోనే ఆపేశా రని తెలిపారు. మరికొద్ది మంది పరిశోధనలు కొనసాగిం చలేక తీవ్ర మానసిక వేదనను అనుభవిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నాన్-నెట్ ఫెలోషిప్ మంజూరు చేసి మెస్ బకాయిలు రద్దు వంటి వాటి గురించి సీఎం రేవం త్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రివర్గం దష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఈ మేరకు వారు సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. పరిశోధక విద్యార్థులు, ఎకనామిక్స్ స్కాలర్ పెర్ల బాలు, పొలిటికల్ సైన్స్ స్కాలర్ కె . చంద్రశేఖర్ ,ఎస్ఎస్‌యూఐ ఓయూ ప్రెసిడెంట్ మెడ శీను, విద్యార్థులు మామిడాల రవి, పార్థు ,అభిలాష్ పాల్గొన్నారు.

శిశు విహార్ ఆయమ్మలకు వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

శిశు విహార్‌లో పనిచేయు ఆయమ్మలు మే, జూన్‌లలో పనిచేశారని.. ఆ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐట 'యూ నాయకులు డిమాండ్ చేశారు. ముషీరాబాద్‌లోని కార్మిక శాఖ ఆఫీసులో, జంట నగరాల జేసీఎల్ శ్యాంసుందర్ రెడ్డికి మంగళవారం వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర ఉపాధ్యక్షులు రాపర్తి అశోక్ మాట్లాడుతూ ఆయమ్మలు వేతనాలు లేక ఆయమ్మలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పిల్లలను స్కూలుకు కాలేజీలకు పంపలేక కార్మికుల బతుకులు భారంగా తయార య్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో రెండు నెలల వేతనాలు రాకుంటే ఇంటి కిరాయిలు కట్టలేదని ఇంటి యజమానులు ఇండ్లు ఖాళీ చేయాలని అంటున్నారని, అవమానాలు భరించలేక పోతున్నామని ఆయమ్మలు ఆవేదన వెలిబుచ్చారన్నారు.కనీస వేతనాలు నెలకు రూ. 26000 ఇవ్వాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ,ప్రతి నెల ఇచ్చే 14,500 లు కూడా ప్రతినెలా ఇవ్వటం లేదన్నారు. కొత్తగా అధికారంలో వచ్చిన రేవంత్ రెడ్డి ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు ఇస్తానని చెప్పి, రెండు నెలల వేతనాలు ఇవ్వలేదని తెలిపారు. మాటలు కోటలు దాటుతున్న చేతలు మాత్రం గల్లీ దాటనట్టుగా రాష్ట్ర ప్రభుత్వం వైఖరి ఉందని... కాబట్టి కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని,ప్లే స్లిప్పులు ఇవ్వాలని, డబల్ డ్యూటీలకు డబుల్ వేతనాలు ఇవ్వాలని కో రారు. వెంటనే వేతనాలు చెల్లించని యెడల అమీర్‌పేట్ మైత్రివనం వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. నాయకులు ఈ. తార, సుశీల, శ్యామలీల పాల్గొన్నారు.

రోడ్డుపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించండి

- తెలుగు యువత నాయకుడు గుర్రం రామకృష్ణ



నవతెలంగాణ-కంటోన్మెంట్

స్వాగత్ నగర్ సూరారం కాలనీ ,15 ఫీట్ల రోడ్లో రోడ్డు మీద ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేసి కాలనీవాసులకు కలిగిస్తున్నారని ఇబ్బంది కలిగిస్తున్నారని దాన్ని వెంటనే తొలగించాలని తెలుగు యువత నాయకుడు గుర్రం రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కాలనీ వాసులతో కలిసి కుత్బుల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం ఇచ్చారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ రోడ్డులో స్కూల్ పిల్లలు వందల మంది తిరుగుతూ ఉంటారని, పక్కన ఖుషి స్కూల్ ,. సిరి ఫ్యూచర్ స్కూల్ ఉన్నా రెసిడెన్షియల్ ఏరియాలో ట్రాన్స్‌ఫారం పెట్టడం చాలా ప్రమాదకరం అన్నారు. వెంటనే ట్రాన్స్‌ఫారంను తీసివేయాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం ఇచ్చినట్టు తెలిపారు. ఆ పత్రులను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ అమ్రపాలి, ఇంకా స్థానిక జోనల్ కమిషనర్ కమిషనర్ అపూర్వకు చౌహన్ , మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కి వినతి పత్రాలు ఇచ్చామన్నారు. పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు

కాలుష్యం నుంచి మా గ్రామాలను కాపాడండి



- ముఖ్యమంత్రికి ఐదు గ్రామాల జేఏసీ విజ్ఞప్తి

నవతెలంగాణ-బంజారా హిల్స్

కాలుష్యంతో సతమతమవుతున్న తమ గ్రామాలను కాపాడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలోని ఐదు గ్రామాల జేఏసీ విజ్ఞప్తి చేసింది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ఖజిపల్లి, గడ్డపోతారం, కిష్టయ్య పల్లి,ఆలీ నగర్, గండిగూడెం జేఏసీ నాయకులు రమాకాంత్ దండే,మహేష్,నాగరాజు,రైజ్,కిరణ్‌లు మాటా డారు. తమ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫార్మా, కెమికల్ పరిశ్రమలు నిబంధనలు పాటించకపోవడంతో ఆ ప్రాంతా లలో నివసిస్తున్న ప్రజలు, మూగజీవాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. నిబంధనల ప్రకారం పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను పూర్తిస్థాయిలో శుద్ధి చేసి బయటికి వదలాల్సి ఉండగా అక్కడ అది జరగడం లేదన్నారు. దాంతో వాయు కాలుష్యంతో పాటు చెరువులు, భూమి కూడా కాలుష్య కారకంగా మారి సుమారు ఐదు గ్రామాలు.. 30 వేల మంది ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడటమే కాక మూగజీవాలు అంతరించిపోతు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలువురు ప్రజా ప్రతినిధులను కలిసి విన్నవించినా స్పందన లేకుండా పోయిందని చెప్పారు. కాలుష్యానికి కారణం అవుతున్న 31 ఫార్మా, కెమికల్ పరిశ్రమలను మూసివేయడం లేదా తమ ప్రాంతం నుంచి తరలించి తమను రక్షించాలని వారు ప్రాధేయపడ్డారు. కాగా ఖజిపల్లి గ్రామాన్ని సినీ నటుడు ప్రభాస్ దత్తత తీసుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్, ఎండీ హుస్సేన్ జితేందర్, వెంకట్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులు, వివిధ శాఖల అధికారులకు కృతజ్ఞతలు

- టీపీసీసీ కార్యదర్శి కోట నీలిమ



నవతెలంగాణ-బేగంపేట్

బల్కంపేట, ఉజ్జయిని మహంకాళి దేవాలయం జాతర విజయవంతంగా జరగడం ఎంతో సంతోషంగా ఉందని టీపీసీసీ కార్యదర్శి కోట నీలిమ అన్నారు. భక్తులు, వివిధ శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. భక్తుల, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో బల్కం పేట ఉజ్జయిని మహంకాళి దేవాలయం జాతరను ఎంతో బ్రహ్మాండంగా నిర్వహిం చామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ దేవాలయాలకు చెక్కులను ముందే పంపిణీ చేయడం వల్ల దేవాలయాలు అందంగా ముస్తాబయ్యాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్ ఎప్పటికప్పుడు వివిధ శాఖ అధికారులతో మాట్లాడుతూ జాతరను ఎలా విజయవంతం చేయాలో ఏమేం అవసరాలు ఉంటాయి.. భక్తులకు ఎలాంటి లోటు రాకుండా మంచినీరు టిఫిన్స్ అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ప్రత్యేకంగా పోలీస్ శాఖ, శానిటేషన్ విభాగం ఎంతో అద్భుతంగా పనిచేశారని వారికి ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేస్తున్నానని, పేరు పేరునా వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి

- డిప్యూటీ డీఈఓ సామెల్ రాజు





నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ప్రజానాట్యమండలి హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ,యూసఫ్ గూడ చెక్ పోస్ట్‌లోని ప్రభుత్వ హైస్కూల్లో డ్రగ్స్, మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహిం చారు. ముఖ్యఅతిథిగా డీఈఓ సామెల్ రాజు పాల్గొని ప్రారంభించారు . డ్రగ్స్ మత్తు పదార్థాల ఆహ్వాన సంఘం నాయకులు టి. రఘు అధ్యక్ష తన జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో సామెల్ రాజు మాట్లాడుతూ సమాజంలో యువత డ్రగ్స్ మత్తు పదార్థాలకు బానిసగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. మన ఇంటి పక్కల రోడ్లమీద డ్రగ్స్ గంజాయి వాడుతున్నారని తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్స్ మత్తు పదార్థాలు వాడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్న విద్యార్థులకి, యువతకి అవగాహన కల్పించే బాధ్యత తల్లిదండ్రులది, టీచర్లది అని అన్నారు. ఒకప్పుడు దేశ అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించిన యువత ఇప్పుడు డ్రగ్స్ మత్తు పదార్థాల వ్యసనాల్లో, మత్తులో ఊగిసలాడుతూ జీవితాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసుకుంటూ వారి జీవితాన్ని వారే నిర్వీర్యం చేసుకుంటున్నారన్నారు. స్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం నరసింహ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి తన జీవితంలో ఉన్నతమైన స్థితికి వెళ్లడానికి టార్గెట్ ఉండాలని.. ఆ టార్గెట్ రీచ్ అవ్వడానికి కష్టపడి చదవాలన్నారు. మత్తు పదార్థాలు వాడితే జైలుకు వెళ్లే ప్రమాదం ఉందన్నారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు చాక్లెట్ల రూపంలో గానీ ఏ రూపంలో పదార్థాలు ఇచ్చినా తీసుకోవద్దని సూచించారు.

స్కూల్ హెచ్ఎం రమణ మాట్లాడుతూ, డ్రగ్స్ తీసుకోవడం వల్ల విచక్షణ కోల్పోతారని, అరవడం, కేకలు వేయడం, డిప్రెషన్ లోకి వెళ్లిపోవడం జరుగుతుందన్నారు. ఈ డ్రగ్స్ మాఫియా స్కూల్ లో చదువుకునే చిన్న చిన్నపిల్లలకు కూడా వదలకుండా చాక్లెట్ల రూపంలో డ్రగ్స్ ను అంటిస్తూ వ్యాపారానికి కొనసాగిస్తున్నారన్నారు. డ్రగ్స్ ను సరఫరా చేస్తున్న వారిని జైల్లో పెట్టి కఠిన శిక్షలు విధించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు . ఆహ్వాన సంఘం ప్రధా న కార్యదర్శి నాగటి మారన్న ,ప్రజానాట్య మండలి నగర ఉపాధ్యక్షులు పి సునీత, , ఎండి వసీంవద్దిన్, నగర సహాయ కార్యదర్శి టి. రఘు, స్కూల్ టీచర్స్ టీ నాగరాజు, విశ్వేశ్వర్ రావు, వడ్డేశ్వరరావు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు

జలమండలిలో ముగ్గురికి కారుణ్య నియామకాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలిలో ముగ్గురికి కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు లభించాయి. బోర్డులో విధులు నిర్వర్తిస్తూ మరణించిన ముగ్గురి ఉద్యోగుల వారసులకు వారి వారి విద్యార్హతలు బట్టి, కారుణ్య నియామకం కింద ఉపాధి కల్పించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్ రెడ్డి ఈ నియామక పత్రాలను మంగళవారం వారికి అందించారు. ఈ సందర్భంగా ఆయన వారికి శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడి పని చేసి బోర్డుకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ డైరెక్టర్ వాసుదేవనాయుడు, పీ అండ్ ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

జయరాంకు బెస్ట్ సపోర్టివ్ పీఆర్ అవార్డు



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలుగు రాష్ట్రాల్లోని పీఆర్ రంగంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు సాధించుకున్న పబ్లిక్ రిలేషన్స్ ప్రొఫెషనల్, మీడియా మానియా పీఆర్ కమ్యూనికేషన్స్ వ్యవస్థాపకుడు జి.జయరాం ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. నగరంలో ఐకాన్ సంస్థ నిర్వహించిన ఐ లవ్ హెచ్‌ఆర్ అవార్డ్స్ కాన్క్లేవ్ అండ్ ఎక్స్‌పోలో ప్రతిష్టాత్మకమైన 'బెస్ట్ సపోర్టివ్ పీఆర్' అవార్డును ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చౌదరి చేతుల మీదుగా అందుకున్నారు. జయరాం అవార్డు పబ్లిక్ రిలేషన్స్, కమ్యూనికేషన్ రంగంలో అతని అసాధారణమైన నిబద్ధతను గుర్తించింది. ఇలాంటి ప్రతిష్టాత్మకమైన వేదిక నుంచి ఈ అవార్డును అందుకోవడం గర్వంగానూ, గౌరవంగానూ భావిస్తున్నాను అని జయరాం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఐటీ, ఈఅండ్‌సీ పరిశ్రమలు, వాణిజ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

అన్ని వర్గాలనూ నిరాశపర్చిన బడ్జెట్..!

నవతెలంగాణ-సిటీబ్యూరో

కేంద్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌పై అన్ని వర్గాల ప్రజలను నిరాశపర్చింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 48.21 లక్షల కోట్ల బడ్జెట్‌పై సామాన్యులు పెదవి విరుస్తున్నారు. ఇది కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా, పేద, మధ్య తరగతి వర్గాలకు వ్యతిరేకంగా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సామాన్యులు ఉపయోగించి వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతాయి. బంగారం, వెండి, సెల్‌ఫోన్లు వాటి ఛార్జర్లపై కస్టమ్ డ్యూటీని తగ్గిస్తున్నట్టు బడ్జెట్‌లో ప్రకటించినా.. దానివల్ల పేదలకు ఎలాంటి ఉపయోగం లేదు. కార్మికులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలకు ఈ బడ్జెట్‌లో ఎలాంటి పరిష్కారం చూపలేదు. గతంలో సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామని నిరుద్యోగులను మోసం చేసి.. ఇప్పుడు కొత్తగా రాబోయే





ఐదేండ్లలో నాలుగు కోట్ల 10 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని మరోసారి మోస పూరిత ప్రకటనలే చేశారు. డ్రైవర్ల సంక్షేమాన్ని గాలికివదిలేసింది. ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశే కలిగించింది. ఈ బడ్జెట్ సంపన్నులను మరింత సంపన్నులను చేయడం, పేదలను మరింత పేదలుగా చేయడం లక్ష్యంగా ఉందని పలువురు పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నేతలు పేర్కొన్నారు. మొత్తంగా ఈ బడ్జెట్ నగర జీవికి నిరాశనే మిగిల్చింది.

నగరాభివృద్ధిలో కీలకమైన ప్రాజెక్టులు మొండిచేయి..!

ఇక నగరాభివృద్ధిలో కీలకమైన ప్రాజెక్టులకు ఈ బడ్జెట్‌లో కేంద్రం మొండి చేయ్యి చూపింది. మెట్రో రైలు విస్తరణ, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు, ఐటీఐఆర్, రిజినల్ రింగు రోడ్డు, రోడ్ల అభివృద్ధి, ఎంఎంటీఎస్‌కు నిధుల కేటాయింపులకు సంబంధించి ఊసేత్తేకపోవడం అత్యంత దారుణం. ఇది నగరంతో పాటు తెలంగాణకు తీరని అన్యాయం చేసినట్టే.

ఎమ్మెల్యే కూనంనేనికి పార్ట్ టైమ్ టీచర్స్ వినతిపత్రం



వినతి పత్రం అందజేస్తున్న పార్ట్ టైం టీచర్లు

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం టీచర్లందర్నీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్టుగా అప్ గ్రేడ్ చేయాలని, అంశాన్ని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కోరారు. మంగళవారం తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ హిమాయత్ నగర్‌లోని సీపీఐ ఆఫీసులో ఈ మేరకు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో 12 నెలలు పని చేస్తూ కేవలం ఆరు నెలలు మాత్రమే వేతనాలు తీసుకుని ఒక నయా వెట్టి చాకిరి విధానం యూనివర్సిటీలలో కొనసాగుతుందని గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించిన కూడా పరిష్కారం లేకుండా బూడిదలో పోసిన పన్నీరు అయిందని వాపోయారు. గత నియంతత్వ ప్రభుత్వం యూనివర్సిటీ పార్ట్ టైం టీచర్లను పట్టించుకోలేదని కనీసం ప్రజాపాలనలోనైనా పార్ట్ టైం టీచర్లకు న్యాయం చేయాలని కోరారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోమేశ్వర్ బోనకుర్తి, కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ ఆరుట్ల జానకి రెడ్డి,వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ బి శంకర్,డాక్టర్ జూలు నాగేశ్వర్,డాక్టర్ యుగేందర్, డాక్టర్ విష్ణు భూపతి,జాయింట్ సెక్రెటరీ డాక్టర్ ప్రకాష్,డాక్టర్ చంద్రశేఖర్,డాక్టర్ జీవన్, డాక్టర్ కర్ణాకర్,డాక్టర్ మధు డాక్టర్ సుందర్ పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రఖ్యాత ఉన్నత విద్యా సంస్థ థామస్ మోర్ యూనివర్సిటీ తొలిసారిగా భారతదేశానికి వస్తోంది. ఇక్కడున్న విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్య అవకాశాల కోసం, ఇంకా విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు అందించడానికి ఈ యూనివర్సిటీ ఎంతో ఉత్సాహంగా ఉంది. ఈ సందర్భంగా స్మార్ట్ అడ్వంచర్స్ ప్రెసిడెంట్ పవన్ శ్రీవాస్తవ మాట్లాడుతూ 'థామస్ మోర్ యూనివర్సిటీతో భాగస్వామ్యం ఈ పర్యటన భారతీయ విద్యార్థులకు విభిన్న, సంపూర్ణ మార్పును అందించే విద్యానుభావాలను అందించాలన్న మా నిబద్ధతను బలోపేతం చేస్తుంది. భారతదేశం, ఇతర దేశాల విద్యాసంస్థల మధ్య భాగస్వామ్యాలకు తలుపులు తెరుస్తుంది' అని చెప్పారు. థామస్ మోర్ యూనివర్సిటీ వివిధ విభాగాల్లో అసాధారణమైన అకాడమిక్ ఆఫర్లు, ప్రత్యేక కోర్సులకు ప్రసిద్ధి చెందింది. ఇందులో భాగంగా ఈ నెల 24వ తేదీన పార్క్ హయత్ హోటల్‌లో, 25న విజయవాడలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. ఈ ప్రత్యేక అవకాశం విద్యార్థులు యూనివర్సిటీ ప్రతినిధులతో నేరుగా మాట్లాడేందుకు, అందుబాటులో ఉన్న వివిధ రకాల కోర్సుల గురించి అన్వేషించడానికి వీలు కల్పిస్తుంది.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి



నవతెలంగాణ-బోడుప్పల్

రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోట చేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మోహన్ (26) నగరంలోని నాచారంలో ఉంటూ ఎలక్ట్రీషిన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం బైక్‌పై ఇంటి నుంచి మేడిపల్లి వైపు వెళ్తుండగా హైదరాబాద్ నుంచి వరంగల్ వెళ్తున్న హన్మకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మేడిపల్లి అనుటెక్స్ షాపింగ్ మాల్ సమీపంలోకి రాగానే వెనుక నుండి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మోహన్‌కు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు గాంధీ దవాఖానాకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నటు పోలీసులు తెలిపారు.

ఫీజుల పెంపుపై విద్యార్థుల ఆగ్రహం

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్శిటీ పరిధిలోని ప్రయివేటు న్యాయ కళాశాలాలో , ప్రతి సారీ సెమిస్టర్ల పరీక్షల , సెమిస్టర్ ఫీజులు, యూనివర్సిటీ నోటిఫికేషన్ ప్రకారం కాకుండా ఇష్టం వచ్చినట్లు ఎక్కువ ఫీజులు వసూల్ చేయడం జరుగుతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు దీనిపై రిజిస్ట్రార్ , కంట్రోలర్ దృష్టికి తీసుకువెళ్లిన యూనివర్సిటీ అధికారులు స్పందించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందిచక పోవడంపై వెనుక న్యాయ విద్యార్థులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. యూనివర్సిటీ అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సింది గా కోరుతున్నారు.వెంటనే పెంచిన ఫీజులు తగ్గించాలని వారు కోరుతున్నారు.ప్రయివేటు న్యాయ కళాశాలాలో ఫీజులు నియంత్రణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పటాన్‌చెరు-దిల్‌సుఖ్‌నగర్ రూట్‌లో ప్రతి 22 నిమిషాలకో ఏసీ బస్సు

- **గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు**



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగర ప్రయాణికులకు టీజీఎస్‌ఆర్టీసీ గుడ్‌న్యూస్ అందించంది. పటాన్‌చెరు-దిల్‌సుఖ్‌నగర్ మార్గంలో పది ఎలక్ట్రిక్ ఏసీ మెట్రో లగ్జరీ బస్సులను నడుపుతున్నట్టు ప్రకటించింది. ఈ ఏసీ బస్సులు ఈనెల 25వ తేదీ నుంచి ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని తెలిపింది. పటాన్‌చెరు- దిల్‌సుఖ్‌నగర్ రూట్లో ప్రతి 22 నిమిషాలకో ఏసీ బస్సు అందుబాటులో ఉంటుందని, ప్రయాణికులు వినియోగించుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు సూచించారు. 217డి నంబర్‌తో నడిచే ఈ బస్సులు లింగంపల్లి, గచ్చిబౌలి, మెహిదిపట్నం, లక్డీకాపూల్, అబిడ్స్, గ్రామర్ స్కూల్, కోఠి, మలక్‌పేట్ మీదుగా దిల్‌సుఖ్‌నగర్ వరకు రాకపోకలు కొనసాగిస్తాయి. లింగంపల్లి నుంచి తొలి బస్సు ఉదయం 5గంటలకు, చివరి బస్సు రాత్రి 10:03 గంటలకు దిల్‌సుఖ్‌నగర్‌కు బయల్దేరనుంది. దిల్‌సుఖ్‌నగర్ నుంచి తొలి బస్సు ఉదయం 6:40 గంటలకు, చివరి బస్సు రాత్రి 11:53 గంటలకు పటాన్‌చెరుకు బయల్దేరనుంది. ఈ మార్గంలో ప్రయాణించే సామాన్య ప్రజలు, ఐటీ ఉద్యోగులు, ప్రజలు వారు ఈ బస్సులను వినియోగించుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరారు.

ఓయూలో స్మితా సభర్వాల్ చిత్రపటం దహనం



నవతెలంగాణ-ఓయూ

వికలాంగులను కించపరిచేలాగా అనుచిత వ్యాఖ్యలు చేసిన స్మితా సబర్వాల్ వెంటనే వికలాంగ లోకానికి క్షమాపణలు చెప్పాలని తెలంగాణ వికలాంగుల హక్కుల సమితి డిమాండ్ చేసింది. రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా వికలాంగులు నిరసనలు తెలుపుతున్నా ఆమె స్పందించకపోవడంతో మంగళ వారం ఓయు ఆర్ట్స్ కళాశాల ఎదుట తెలంగాణ వికలాంగుల హక్కుల సమితి ఆధ్వర్యంలో స్మితా సభర్వాల్ చిత్రపటాలను దివ్యాంగ విద్యార్థి నాయకులు దహనం చేశారు. అనంతరం యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో స్మితా సభర్వాల్ పై కేసు నమోదు చేయాలని ఓయూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ కు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో వెంటనే ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టీవీహెచ్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షులు బాణాల వెంకటయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం వెంకన్న, దివ్యాంగ రీసెర్చ్ స్కాలర్స్ సుమన్, ఆంజనేయ గౌడ్, పాండురంగ, నరేష్, స్వామి నాయక్, నాగరాజ్, జహంగీర్, సైదులు, వీరేష్ పాల్గొన్నారు.



కట్ట మైసమ్మ ఆలయంలో డిప్యూటీ మేయర్ పూజలు



నవతెలంగాణ-ఓయూ

ఆషాఢ మాసం బోనాల సందర్భంగా మంగళవారం జీహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలోని కట్ట మైసమ్మ అమ్మ వారి ఆలయంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలంతా సుభిక్షంగా, ఆయురారోగ్యాలతో వర్థిల్లాలని నిండు మనసుతో కోరుకున్నట్టు డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు, కాంగ్రెస్ నేత మోతె శోభన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వేదపండితులు వారికి ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

విద్యా సంస్థలు డ్రగ్స్‌కు అడ్డాగా మారడం దురదృష్టకరం

- **జాజుల లింగంగౌడ్**



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలోని ప్రముఖ కార్పొరేట్ స్కూల్,ఇంజనీరింగ్ కళాశాలలు డ్రగ్స్ కు అడ్డాగా మారడం దురదష్టకరమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్స్‌తో కూడిన మత్తు పానీయాలకు యువత అలవాటు పడి జీవితాలను పాడు చేసుకుంటున్నారని తెలిపారు. కావున డ్రగ్స్ మాఫియాను అరికట్టాలంటే విద్యాశాఖ, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సంయుక్త ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు ప్రముఖ విద్యాసంస్థల్లో విస్తత తనిఖీలు చేపట్టి నిఘా పెంచాలన్నారు. డ్రగ్స్‌ను పసికట్టే శునకాలతో తనిఖీలు చేపట్టాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.







జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని దుర్గాభవాని నగర్‌లో ఏర్పాటు చేసిన బోనాల పండగ ఉత్సవాలకు ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్, ఎమ్మెల్యే అభ్యర్థి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయ రెడ్డి, ఆ పార్టీ నాయకులు మోహన్ యాదవ్ తదితరులు హాజరై బోనాల ఉత్సవాల్లో భాగస్వాములయ్యారు. స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ సైతం బోనాల పండుగకు హాజరై ప్రత్యేక పూజలు పలారం బండి ఊరేగింపులో పాల్గొన్నారు. పల్లపు గోవర్ధన్ రాజ్ బోనాల ఉత్సవాల్లో భాగస్వాములై ప్రత్యేక పూజ నిర్వహించారు.

- నవతెలంగాణ, బంజారాహిల్స్

బడ్జెట్‌లో కార్మికులకు ఒరిగిందేమీ లేదు

- **సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్**



నవతెలంగాణ-సిటీబ్యూరో

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 48.21 లక్షల కోట్ల బడ్జెట్‌లో కార్మికులకు ఒరిగిందేమీ లేదు. విదేశీ కార్పొరేట్ శక్తులకు మాత్రం 40 శాతం నుంచి 35 శాతానికి పన్ను తగ్గించారు. గతంలో సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామని నిరుద్యోగులను మోసం చేశారు. ఇప్పుడు కొత్తగా రాబోయే అయిదేండ్లలో నాలుగు కోట్ల 10 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని మరోసారి మోసపూరిత ప్రకటనలు చేశారు. బడ్జెట్ ప్రసంగంలో ఉపాధి కల్పన కోసం అనేక చర్యలు తీసుకుంటున్నట్టు ప్రకటనలు చేశారు. వాటి అమలు ప్రశ్నార్థకంగా ఉన్నది. కార్మికులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలకు ఈ బడ్జెట్‌లో ఎలాంటి పరిష్కారం చూపలేదు. కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, రెగ్యులరైజ్ చేయడం, స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించడం, కనీస వేతనాలు అమలు చేయడం వంటి వాటిని గాలికి వదిలేశారు. రైల్వేలో పని చేస్తున్న ఏడు లక్షల మంది కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత గురించి ఎలాంటి ప్రస్తావన లేదు. ఈ బడ్జెట్ కార్మిక వ్యతిరేక బడ్జెట్. కార్మికులు, ఉద్యోగులు రానున్న కాలంలో పోరాటాలకు సిద్ధం కావాలి.

అసెంబ్లీలో వీఆర్వోల సమస్యలు ప్రస్తావించండి

● ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామికి వినతి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

శాసనసభ సమావేశాలలో వీఆర్వోల సమస్యల ను ప్రస్తావించాలని తెలంగాణ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ జేఏసీ చైర్మెన్ సతీష్ కోరారు. అలాగే గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారి లేక ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని శాసనసభలో వీఆర్వోల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారి వెంట సెక్రటరీ జనరల్ పల్లెపాటి నరేష్, వైస్ చైర్మెన్ చింతల మురళి, ప్రతిభ ,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'నిజాం కళాశాలలో బోనాల పండుగ'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

నిజాం కళాశాలలో మంగళవారం అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ నిర్వహించారు. కళాశాలలోని అమ్మవారి దేవాలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. ప్రిన్సిపాల్ ఆఫీసు నుంచి అమ్మవారి ఆలయం వరకు మహిళా ఉద్యోగులు బోనాలతో ర్యాలీగా అమ్మవారి టెంపుల్ వరకు వచ్చారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఓఎస్డీ, ప్రొఫెసర్ బి.రెడ్యా నాయక్, కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ బి.బీమా, వైస్-ప్రిన్సిపాల్ జి.ఉపేందర్ రెడ్డి, గన్ ఫౌండ్రీ కార్పొరేటర్ సురేఖ, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ బోయ కుమార్, మీడి యా కో-ఆర్డినేటర్ పరంధాములు, డాక్టర్ హేమ లత, కేర్ టేకర్ ఎల్.నవీన్, ప్రోగ్రామర్ యాదగిరి, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు, రమేష్, నరసింహా, మహాలక్ష్మి, రాజేశ్వరి, శారద, లలిత, లక్ష్మి పద్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

'అంగరంగ వైభవంగా కల్లు సాక ఘటం బోనాల వేడుక'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్, కార్యనిర్వాక అధ్యక్షులు బబ్బురి బిక్షపతి గౌడ్ ల ఆధ్వర్యంలో మంగళవారం గోల్కొండ కోటలో 11వ కల్లు సాక ఘటం బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, డాక్టర్ వి.శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మెన్ నేరెళ్ల శారద గౌడ్, గౌడ హాస్టల్ చైర్మెన్ మోతి చక్రవర్తి గౌడ్‌లు హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 ఏండ్ల క్రితమే గోల్కొండ కోటలో ఎల్లమ్మ గుడి కట్టించార న్నారు. ఆయన స్వయంగా తాటి చెట్టు ఎక్కి ఎల్లమ్మకు కల్లును సాక పోసేవాడని తెలిపారు. పాపన్న మొదటి బోనం ఇక్కడ నుంచి వెళ్లాకే హైదరాబాద్ ఇతర రాష్ట్రమంతా బోనాల వేడుకలు ప్రారంభమయ్యేవని చెప్పారు. తొలి హిందూ చక్రవర్తిగా పాపన్న ఆషాడ బోనాలకు ఆద్యుడిగా నిలిచాడని పేర్కొన్నారు.ఈ సంస్కృతిని గౌడ ఐక్య సాధన సమితి గత 11 ఏండ్లుగా కొనసాగిస్తూ, పాపన్న స్ఫూర్తికి వారసులుగా నిలిచారని అభినందించారు. అనంతరం అంబాల నారాయణ గౌడ్ మాట్లాడుతూ గోల్కొండ కోటను ఏలిన పాపన్న గౌడ్ ఎల్లమ్మ గుడిని ప్రతిష్టించి ప్రజలకు విందు భోజనం ఏర్పాటు చేయడం తమకు ఆదర్శమన్నారు. పాపన్న స్ఫూర్తితో రాష్ట్రమంతటా గౌడ సోదరులు కల్లు సాక ఘటం బోనాల వేడుకలను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లె లక్ష్మణరావు గౌడ్, గోపా అధ్యక్షులు బండి సాయన్న గౌడ్, కార్యదర్శి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, రాష్ట్ర గౌడ్ సంఘాల సమన్వయ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిలి వెంకన్న గౌడ్, హైకోర్టు సీనియర్ న్యాయవాది గుండ్రాతి శారద గౌడ్, అఖిల భారతీయ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కూరల వేములయ్య గౌడ్, జై గౌడ సేన జాతీయ అధ్యక్షులు మోర్ల ఏడుకొండలు గౌడ్, సర్వాయి పాపన్న మోకు దెబ్బ అధ్యక్షులు జక్కే వీరస్వామి గౌడ్, గౌడ హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షులు నక్క కృష్ణ గౌడ్, బింగి ఇందిరా గౌడ్, విజయ రాణి గౌడ్, పచ్చిమట్ల మానస గౌడ్, బత్తిని కీర్తిలతా గౌడ్, ప్రజ్వల గౌడ్, నారాయణ గౌడ్, శివకుమార్, నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం హేయమైన చర్య

● కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరీ సతీష్



నవతెలంగాణ-ముషీరాబాద్

బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం హేయమైన చర్య అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై మంగళవారం పత్రిక ప్రకటన ద్వారా స్పందిస్తూ గౌరీ సతీష్ మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశపెట్టినటువంటి బడ్జెట్ ఏదైతే ఉందో రాష్ట్ర ప్రజల యొక్క ఆకాంక్షలను కాలరాసినట్టుగా ఉండడం దురదృష్టకరం తెలంగాణ ప్రాంతం నుంచి ఎనిమిది మంది ఎంపీలను ఇచ్చినటువంటి తెలంగాణ ప్రజల యొక్క మనోభావాలను దెబ్బతీసే విధంగా పార్లమెంటు బడ్జెట్ కాపీలలో ఎక్కడ కూడా తెలంగాణ రాష్ట్రం యొక్క పదాన్ని కూడా వాడకపోవడం తెలంగాణ రాష్ట్రానికి ఎలాంటి నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. బీజేపీ తెలంగాణ ప్రజలను ఓట్ల యంత్రాలుగా భావిస్తున్నారు. రాష్ట్రం ఎంపీలు మంత్రులు మోడీని ఒప్పించి తెలంగాణ రాష్ట్రానికి రావలసినటు వంటి నిధులు కేటాయించే విధంగా ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

డ్రగ్స్‌ను నిర్మూలించడంలో విద్యార్థులు సైనికుల్లా పని చేయాలి



● ఓయూ ఓఎస్డీ, ప్రొఫెసర్ బి.రెడ్యా నాయక్

● నిజాం కళాశాలలో యాంటీ డ్రగ్స్ పై అవగాహన ర్యాలీ

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించడంలో విద్యార్థులు, యువత సైనికుల్లా పని చేయాలని ఓయూ ఓఎస్డీ, ప్రొఫెసర్ బి.రెడ్యా నాయక్ సూచించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిజాం కళాశాల ప్రాంగణంలో యాంటీ డ్రగ్స్ పై అవగాహన సదస్సు, ర్యాలీని విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా బి.రెడ్యా నాయక్ మాట్లాడుతూ సమాజ హితం కోసం సామాజిక స్పృహతో డ్రగ్స్ సరఫరాను, వాడకాన్ని అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల వ్యక్తుల జీవితాలే కాకుండా ఆయా కుటుంబాలు, దేశం, సమాజం ప్రమాదంలో పడుతుందన్నారు. డ్రగ్స్ అలవాటు, అడిక్షన్‌గా మారుతుందని డ్రగ్స్ వాడకుండా ఉండడమే కాకుండా డ్రగ్స్ ఎక్కడ కనిపించినా అరికట్టేందుకు విద్యార్థులు తమ వంతు పాత్రను పోషించాలని సూచించారు. అనంతరం నిజాం కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ బి.బీమా మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడంలో నిజాం కళాశాల ముందు వరుసలో ఉంటుందని, ఈ క్రమంలోనే విద్యార్థులు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలను, విద్యార్థులను చైతన్యం చేస్తున్నారని వివరించారు. గన్ ఫౌండ్రీ కార్పొరేటర్ సురేఖ మాట్లాడుతూ డ్రగ్స్ వాడకాన్ని అరికట్టడంలో విద్యార్థులు సామాజిక బాధ్యతగా వ్యవహరించాలని ఆమె సూచించారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ విద్యాధర్ మాట్లాడుతూ డ్రగ్స్ సరఫరాతో పాటు వాడకం అంతర్జాతీయంగా టెర్రరిజాన్ని తయారు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాం కళాశాల వైస్-ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ జి.ఉపేందర్ రెడ్డి, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ చిన్నాల వెంకటేశ్వర్లు, డాక్టర్ మంజుల, ఈఓసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ తిరుపతి, అకాడమిక్ అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కవిత, డిప్లమా కోర్సెస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జలమండలిలో బదిలీల ప్రక్రియను వెంటనే ఆపాలి



నవతెలంగాణ-ముషీరాబాద్

జలమండలిలో బదిలీల ప్రక్రియను వెంటనే ఆపాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, తెలంగాణ వాటర్ వర్క్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు రాంబాబు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డికి పల్లా రాజేశ్వర్ రెడ్డి రాసిన లేఖలు యూనియన్ అధ్యక్షులు రాంబాబు యాదవ్ తన కార్యాలయంలో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు యాదవ్ మాట్లాడుతూ. జలమండలిలో జనరల్ ట్రాన్సుఫార్‌ల ప్రక్రియను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. లేనియెడల జలమండలి ఎండి కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఇరిగేషన్ డిపార్టుమెంట్ లో అత్యవసర పనుల కారణంగా జనరల్ ట్రాన్సుఫార్లను ఆపడం జరిగిందన్నారు. అటువంటిది జలమండలి కూడా అత్యవసర సేవలను అందిస్తుంది అటువంటి తరుణంలో జనరల్ ట్రాన్సుఫార్లను ఎందుకు ఆపారని ప్రశ్నించారు. పదవుల బదిలీ ప్రక్రియను వెంటనే ఆపాలి అని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి. నారాయణ, లక్ష్మీనారాయణ, జంగయ్య, కొమరయ్య, ఉదయ్ కుమార్, అంజయ్య, ప్రేమ్ కుమార్, యాదగిరి, శంకర్, వినయ్ కుమార్, షబ్బీర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు

'ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి'



● ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం డిమాండ్ చేశారు. మంగళవారం హిమాయత్ నగర్ లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో 'ఆటో డ్రైవర్ల సమస్యలపై' రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో మీటర్ చార్జీలు పెంచడం, సామాజిక భద్రత కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడం, ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సహాయం వంటివి తెలంగాణ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆటోరిక్షా డ్రైవర్లు స్వయం ఉపాధి కార్మికులుగా తక్కువ ఆదాయంతో పేదరికం, ఆర్థిక అనిశ్చితితో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లకు గిరికీలు దొరకక పొట్ట గడవడం కష్టమైతుందన్నారు. దీనికి తోడు ఇంధన, నిత్యావసర వస్తువుల ధరలు అమాంతంగా పెరగడం, రోడ్ టాక్స్, ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసుల జరిమానాలు భరించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆటో, క్యాబ్ మీటర్ చార్జీలు పెంచాలని, రవాణా రంగా కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ ఫైనాన్సియర్ల ఆగడాలు అరికట్టాలని, కొత్త ఆటో పర్మిట్లను జారీ చేయాలని, ప్రతి ఆటో కార్మికుడికి ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సమయం అందించాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని, ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31న హైదరాబాద్, ఇందిరాపార్క్, ధర్నా చౌక్ వద్ద వేలాది మంది రవాణా రంగా కార్మికులతో రాష్ట్ర వ్యాప్త భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి రవాణా రంగా కార్మికులు ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.జమలయ్య, ఉపాధ్యక్షులు మోహన్ రావు, ఎండి. ఇమ్రాన్, కార్యదర్శి సామల భాస్కర్, సహాయ కార్యదర్శి కె.చందు, క్యాబ్స్ యూనియన్ రాష్ట్ర నేతలు బైరగోని రాజు గౌడ్, బి.తిరుమలేష్ గౌడ్, ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, యూనియన్ రాష్ట్ర నేతలు శ్రీనివాస్, సిహెచ్.జంగయ్య, బిక్షపతి యాదవ్, కృష్ణమూర్తి, ఒమర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్.. సామాన్య, పేద ప్రజల వ్యతిరేక తిరోగమన బడ్జెట్



ఎం.శ్రీనివాస్, కార్యదర్శి, గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ప్రజలపై మరిన్ని కష్టాలను విధించడమే కాకుండా పెట్టుబడి, ఉపాధి కల్పన స్థాయిలను అణచివేస్తున్నది. ఈ బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీలో రూ.24,894 కోట్లు, ఆహార సబ్సిడీలో రూ.7,082 కోట్లు కోత విధించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం మరింత నిర్లక్ష్యం చేసింది. ఈ పథకానికి బడ్జెట్ కేటాయింపులు రూ.86వేల కోట్లు మాత్రమే. ఇది 2023లో ఖర్చు చేసిన దానికంటే తక్కువే. ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి నాలుగు నెలల్లో ఇప్పటికే రూ.41,500 కోట్లు ఖర్చు చేయగా.. మిగిలిన ఎనిమిది నెలలకు కేవలం రూ.44,500 కోట్లు మాత్రమే మిగిలాయి. ఇది గ్రామీణ భారత దేశంలోని నిరుద్యోగ సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఏమాత్రం సరిపోదు.

నిరుద్యోగాన్ని పరిష్కరించే పేరుతో ఈ బడ్జెట్ జిమ్మిక్‌కు పూనుకుంది. ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్‌సెంటివ్‌గా ప్రవేశపెట్టిన కొత్త పథకం, కొత్త ఉపాధిని సృష్టించే పేరుతో కార్పొరేట్‌లకు సబ్సిడీ ఇచ్చే మరో మార్గం ఇది. ఇటువంటి జిమ్మిక్‌లతో ఉపాధి సృష్టించబడదు. గతంలో కార్పొరేట్ రంగం ఆర్జించిన భారీ లాభాల వల్ల ప్రజలలో కొనుగోలు శక్తి తగ్గిపోవడం వల్ల ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ లేకపోవడం వల్ల ఉత్పత్తిలో పెట్టుబడులు రాలేదు. నిరుద్యోగ సమస్య పరిష్కరించబడ లేదు. 2022 సంవత్సరాల్లో స్కిల్ ప్రమోషన్ స్కీమ్‌ల ద్వారా శిక్షణ పొందిన యువతలో 18 శాతం మందికి మాత్రమే ప్లేస్‌మెంట్ లభించింది. మరోసారి, ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తే తప్ప ఉద్యోగ అవకాశాలు పెరగవు. రాష్ట్రాలకు ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లు(పన్ను పంపిణీ కాకుండా) రూ.2022-23లో 1,72,760 కోట్లు, 2023-24లో రూ.1,40, 429 కోట్లు కాగా ఈ బడ్జెట్ దానిని రూ.1,32, 378 కోట్లకు మరింతగా తగ్గించారు. దీనివలన రాష్ట్రాలు ఆర్థికంగా మరింత బలహీన పడతాయి. ఈ బడ్జెట్ సంపన్నులను మరింత సంపన్నులను చేయడం, పేదలను మరింత పేదలుగా చేయడం లక్షయంగా ఉంది. భారత దేశంలోని కుబేరులపై సంపద లేదా వారసత్వ పన్ను ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకో లేదు. ప్రజలపై పరోక్ష పన్ను భారానికి ఎలాంటి ఉపశమనాన్ని ఇవ్వడానికి నిరాకరించింది. ప్రజల, ఆర్థిక వ్యవస్థ ముఖ్యమైన సమస్యలను పరిష్కరించడంలో బడ్జెట్ విఫలమైంది.

బడ్జెట్‌లో డ్రైవర్ల సంక్షేమానికి మొండిచేయి

కె.అజయ్‌బాబు, నగర కార్యదర్శి, ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్-సీఐటీయూ



దేశంలోని సుమారు 10 కోట్ల మంది డ్రైవర్ల సంక్షేమాన్ని కేంద్ర బడ్జెట్ విస్మరించింది. వారి సంక్షేమానికే ప్రత్యేక కేటాయింపులు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్, దేశవ్యాప్తంగా ఉన్న డ్రైవర్స్ చేసిన విజ్ఞప్తిని ఈ నేతలు, యూనియన్ బడ్జెట్ పట్టించుకోలేదు. గతంలో ప్రధాని.. జాతీయ రహదారులపై డ్రైవర్లకు విశ్రాంతి, ఇతర అవసరాలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని ఇచ్చిన వాగ్దానానికీ న్యాయం చేకూర్చ లేదు. అదే సమయంలో ఈ బడ్జెట్ గూడ్స్ రవాణా క్యారిడేర్ల నిర్మాణం, వాటికి మౌలిక సదుపాయాలు కల్పన పేరుతో రోడ్డు రవాణా వ్యవస్థని కార్పొరేట్లకు అప్పగించే దిశగా చర్యలు తీసుకుంది. బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ మోడ్‌లో రోడ్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని, నిర్వహణను వారికి దారాదత్తం చేయడానికి పూనుకుంది.

వేతన జీవులను నిరాశపర్చిన కేంద్ర బడ్జెట్

ఏ.శ్యామ్ సుందర్, ప్రధాన కార్యదర్శి, టీఎస్‌యూటీఎఫ్, హైదరాబాద్ జిల్లా



పాత పన్నుల విధానంలో ఎలాంటి మార్పు చేయకుండా, కొత్త పన్నుల విధానంలో మాత్రమే మార్పులు చేయడం వల్ల వేతన జీవులకు ఎలాంటి ఊరట కలగలేదు. సీపీఎస్ విధానంలో మార్పులు తెస్తామని చెబుతూనే పాత పెన్షన్ విధానంపై ఒక్కమాట బడ్జెట్‌లో లేకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశకలిగించింది. ఉద్యోగుల ఇన్‌కమ్ ట్యాక్స్ సంబంధించి పాత విధానం కంటే కొత్త విధానంలో పన్ను ఎక్కువగా చెల్లించాల్సి రావడంతో ఉద్యోగులు పాత విధానానికే మొగ్గు చూపుతారు. ఈ దఫా అయినా పాత విధానంలో పన్నులు చెల్లించేవారికి రాయితీ ఇస్తారని అందరూ ఆశించిన.. వారికి నిరాశనే మిగులుస్తూ మరోసారి కొత్త పన్నుల విధానానికే రాయితీలు ప్రకటించడం ఉద్యోగులను తీవ్ర ఆగ్రహావేశాలకు గురిచేసే విధంగా ఉంది. విద్యారంగానికి కేటాయింపులు బడ్జెట్‌లో 6శాతం కేటాయించాల్సి ఉండగా, ప్రస్తుత బడ్జెట్‌లో 3.25శాతం నిధులను మాత్రమే కేటాయించి ప్రభుత్వ విద్యా రంగానికి ప్రాధాన్యత లేదన్నట్టు వ్యవహరించింది.

విద్యారంగాన్ని విస్మరించిన కేంద్ర బడ్జెట్

● పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ



నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా రంగాన్ని విస్మరించింది తెలంగాణ రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం చాలా దుర్మార్గమని పీడీఎస్‌యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ అన్నారు. ఈ మేరకు మంగళవారం పత్రిక ప్రకటన ద్వారా కేంద్ర బడ్జెట్‌పై స్పందిస్తూ పార్లమెంట్‌లో నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకమైనది. దేశ భవిష్యత్తుకు, దేశ అభివృద్ధికి దిక్సూచి అయిన విద్యారంగానికి కేవలం 1,25,638 కోట్లు మాత్రమే కేటాయించి పూర్తిగా విద్యారంగాన్ని విస్మరించారు. తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారు. విభజన హామీలలో భాగంగా తెలంగాణ కేటాయించాల్సిన ఐఐఎం, ఐఐఐటి, నవోదయ, కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు బడ్జెట్‌లో చోటు దక్కలేదు. ఇద్దరు కేంద్ర మంత్రులు ఆరు మంది ఎంపీలు అధికార పార్టీలో ఉండి కూడా తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తుంటే స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. తక్షణమే బడ్జెట్‌ను సవరించి విద్యా రంగానికి 10 శాతం నిధులు కేటాయించాలి. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన విభజన హామీలు అమలు చేయాలి. ఈ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి జరిగిన అన్యాయంపై రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని మోడీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం



నవతెలంగాణ-అంబర్‌పేట

తెలంగాణకు అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలు ఎన్నడూ లేని విధంగా బీజేపీ, కాంగ్రెస్‌కి సరి సమానమైన ఎంపీలను గెలిపిస్తే వారి ఇరువురు కూడా తెలంగాణ ప్రయోజనాలు కేంద్రానికి తాకట్టు పెట్టారని బీఆర్‌టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిరంజన్ పూలే అన్నారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను కేంద్ర ప్రభుత్వం వెన్నుపోటు పొడిచారని రాష్ట్ర ఎంపీలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు 15 వేల కోట్లు, బీహార్‌కు కేటాయించిన బడ్జెట్ చూస్తే తెలంగాణ ఎంపీలు తలదించుపోవాల్సిందే పేరుకే గొప్పతప్ప తెలంగాణ ప్రయోజనాలు వారికి పట్టవు అని అన్నారు. త్వరలోనే రాష్ట్ర కమిటీ సమావేశం నిరసన కార్యక్రమాలు చేపడతామని ఇప్పటికైనా బడ్జెట్‌పై కేంద్ర ప్రభుత్వం పునరాలోచించుకోవాలన్నారు.

'బడ్జెట్ సమావేశాల్లో ఉద్యమకారుల డిమాండ్లను నెరవేర్చాలి'

● తెలంగాణ ఉద్యమకారుల సమితి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల సమితి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో 1969 నాటి తెలంగాణ ఉద్యమకారులు, 2001 నుండి పని చేసిన ఉద్యమకారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల సమితి నాయకులు, ఉద్యమ నాయకులు సుల్తాన్ యాదగిరి, ప్రఫుల్ రామిరెడ్డి, రంగారెడ్డి, కె.సి.ఎస్.ప్రసాద్, ఎం.వెంకటస్వామి, వెంకట నారాయణ తదితరులు మాట్లాడుతూ తెలంగాణ సమరయోధుల విస్తృత కమిటీని అధికారికంగా ఏర్పాటు చేయాలని, తెలంగాణ తొలి మలి దశ ఉద్యమకారులకు గుర్తింపు పత్రాలు ఇవ్వాలని, 250 గజాల ఇంటి స్థలంతో పాటు 4 గదుల ఇంటిని నిర్మించి ఇవ్వాలని, రూ.30 వేల గౌరవ వేతనం ప్రతి నెల పెన్షన్‌గా ఇవ్వాలని, ఉచిత బస్ పాస్ సౌకర్యం, ఆరోగ్య భీమా రూ.20 లక్షల వరకు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వ విద్య, ఉద్యోగాల భర్తీలో ఉద్యమకారుల కుటుంబాలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రభుత్వ పథకాలలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, అమరవీరుల స్మృతి వనం 100 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సమితి నాయకులు ఏముల యాదగిరి, కాంపల్లి సాయిలు, కొయ్యడ రాజేష్, డి.కుర్మయ్య, కళ్లెపు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ఉత్తమ ప్రతిభ



నవతెలంగాణ-ముషీరాబాద్

మొదటి అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలను ప్రశంస పత్రాలను అందజేశారు. నగరంలో ఈనెల 21 నుంచి 22 వరకు నిర్వహించిన క్రీడల పోటీల్లో విజేతలైన పూమేన్స్‌లో 14 ఏండ్లలో లోపు క్రీడాకారులు ఆర్.రితిక్, 13 ఏండ్ల లోపు పి.కృష్ణవేణి, తొమ్మిదేళ్ల సబ్ జూనియర్ ఆర్.హార్దిక్ బంగారు పతకాలను సాధించారు.పూమేన్స్ 14 ఏండ్లలో సాయినాగ, అనిరుద్ధ11 ఏండ్ల సబ్ జూనియర్ పి.లాస్య రజత పతకాలు పొందారు. అంతర్జాతీయ టైక్వాండో కోచ్ కే పి హనుమంతుడు, బాలాజీ, తదితరులు క్రీడాకారులను అభినందించారు.

ఐఏఎస్ స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

● డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ద డే నేషనల్ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, కాటమొని వెంకటేష్ గౌడ్



నవతెలంగాణ-ముషీరాబాద్

వికలాంగులను కించపరిచే విధంగా ట్విట్టర్‌లో పోస్ట్ పెట్టిన ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ద డే నేషనల్ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, కో కన్వీనర్ కాటమొని వెంకటేష్ గౌడ్‌లు డిమాండ్ చేశారు ఈ మేరకు 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం రాష్ట్ర కమిషనర్‌కు పత్రిక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను రద్దు చేయాలని ప్రకటించే హక్కు స్మిత సబర్వాల్‌కు ఎక్కడిదని ప్రశ్నించారు. ప్రతిభ ఎవ్వరి సొత్తు కాదు.. వికలాంగుల ప్రతిభ ముందు స్మిత సబర్వాల్ ప్రతిభ ఎంత అన్నారు. వికలాంగులను కించ పరిచే విదంగా ట్విట్టర్‌లో పోస్ట్ పెట్టిన ఐఏఎస్ స్మిత సభర్వాల్పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగవైకల్యం శరీరానికే తప్ప ప్రతిభకు కాదని, వికలాంగులు అనుకుంటే ఏదైనా సాధిస్తారన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రంపై వివక్ష

● అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులి గారి గోవర్ధన్ రెడ్డి




నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర బడ్జెట్ 2024-25లో తెలంగాణ రాష్ట్రంపై వివక్ష చూపించిందని అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులి గారి గోవర్ధన్ రెడ్డి మంగళవారం పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయి ంచలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి ఎన్నుకోబడిన ఎనిమిది మంది ఎంపీలు ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్న కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి చూపిందని కేంద్ర మంత్రులు ప్రజల ముందు ముఖం లేకుండా చేసిందని తెలిపారు. కేంద్ర బడ్జెట్ కనీసం వికారాబాద్ నుండి కృష్ణ వయ పరిగి కొత్త రైల్ కు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం బాధాకరం వివక్షపూరిత బడ్జెట్ కేటాయింపుల వల్ల భవిష్యత్తులో దేశ సమైక్య స్ఫూర్తికి విగాథం కలుగుతుంది. గుంపు రాజకీయ పార్టీల పంపకంలా బడ్జెట్ తయారయిందన్నారు.

తెలంగాణ అనే పదమే లేని కేంద్ర బడ్జెట్

● బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నగేష్ ముదిరాజ్



నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ అనే పదమే కరువైందని అన్యాయమైన బడ్జెట్ అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నగేష్ ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం కేంద్ర బడ్జెట్ పై పత్రిక ప్రకటన ద్వారా స్పందించారు. బడ్జెట్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హెూదా లేదు.. విభజన హామీల్లో పొందుపరిచిన బయ్యారం ఉక్కు ప్రాజెక్టు నిధులు కేటాయించకపోవడం అన్యాయమని, తెలంగాణకు నిధులు రాబట్టడంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులకు వ్యవసాయానికి నిధులు కేటాయించకపోవడం తీరని నష్టమన్నారు. 48 లక్షల కోట్ల బడ్జెట్ లో తెలంగాణాకు ఇచ్చింది పెద్ద గుడ్డు సున్న..



బాగ్‌అంబర్‌పేట డివిజన్ పరిధిలోని శ్రీ మైసమ్మ ఆలయంలో జరిగే బోనాల ఉత్సవాలకు రావాలని ఆహ్వానం పత్రికను ఆలయ కమిటీ చైర్మెన్ కోట్ల శివకుమార్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయ్ కుమార్ గౌడ్, పద్మ వెంకట్ రెడ్డి తదితరులు నవతెలంగాణ-అంబర్‌పేట


విటమిన్ సి ఎందుకు?

ఆరోగ్యంగా ఉండాలంటే శరీరానికి అన్ని రకాల విటమిన్లు అందాలన్నది మనందరికీ తెలిసిందే. శరీరంలో అన్ని అవయవాలు సరిగ్గా పనిచేయాలన్నా, నిత్యం ఆరోగ్యంగా ఉండాలన్నా విటమిన్లు సమకూరాల్సిందే. ముఖ్యంగా మహిళల ఆరోగ్యాన్ని సంరక్షించడంలో విటమిన్ సి కీలక పాత్ర పోషిస్తుంది. మహిళల్లో విటమిన్ సి లోపం ఉంటే ఎన్నో రకాల వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

విటమిన్ సి కండరాలు, అవయవాలకు చాలా మేలు చేసే యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటుంది. కొల్లాజెన్ నిర్మాణానికి ఇది చాలా మంచిది. గర్భిణులు, పాలిచ్చే మహిళలు విటమిన్ సిని కచ్చితంగా తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. రుతుక్రమం సమయంలో వచ్చే సమస్యలకు విటమిన్ సీతో చెక్ పెట్టొచ్చు. ముఖ్యంగా పీరియడ్స్ సమయంలో నొప్పిని దూరం చేయడంలో విటమిన్ సి ఉపయోగపడుతుంది. అలాగే ఒత్తిడి, రక్తపోటును కూడా అదుపులో ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. మహిళల్లో సాధారణంగా కనిపించే హార్మోన్ల అసమతుల్యతకు విటమిన్ సీతో చెక్ పెట్టొచ్చు. అలాగే ఎల్‌డిఎల్ చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్‌లను, అధిక రక్తపోటు నియంత్రణలో ఉంచుతుంది. కాబట్టి మహిళలు ప్రతి రోజూ తాము తీసుకునే ఆహారంలో విటమిన్ సి కచ్చితంగా ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నారు. ■

శుద్ధి చేస్తున్న 'డిజిటల్ పానీ'





దేశంలో పెరిగిపోతున్న కాలుష్యం వల్ల రాబోతున్న పెను ప్రమాదాన్ని తన గురువుల ద్వారా ముందే తెలుసుకుంది. పర్యావరణం పట్ల చిన్నతనం నుండే అవగాహన పెంచుకుంది. దీనికి కుటుంబం కూడా ఆమెకు సహకరించింది. ఇక చదువు, అధ్యయనం మొత్తం అవైపే సాగింది. ఉన్నత విద్య పూర్తి చేసి తిరిగొచ్చిన ఆమెకు మన దేశంలో నీటి శుద్ధి ఎంత అవసరమో గ్రహించింది. దీని కోసమే డిటిటల్ పానీ అనే సంస్థను ప్రారంభించి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు కృషి చేస్తోన్న మాన్సీ జైన్ పరిచయం...

పాఠశాలలో చదివే రోజుల్లో గణితం, సైన్స్, సాహిత్యం నుండి మాన్సీ చాలా నేర్చుకుంది. పట్టణాభివృద్ధి, వనరుల కొరతతో ముడిపడి ఉన్న సవాళ్ల గురించి ఆమె మొదటిసారిగా తెలుసుకున్నది కూడా అప్పుడే. 'మాకు అప్పట్లో గొప్ప ఉపాధ్యాయుడు ఉన్నారు. ఆయన భవిష్యత్తులో పర్యావరణం ఎదుర్కోబోయే సమస్య గురించి మాకు వివరించారు' అని ఆమె గుర్తుచేసుకున్నారు. కుటుంబ నేపథ్యం కూడా ఆమె ఆలోచనల్లో ఓ ముఖ్యమైన పాత్ర పోషించింది. ఎందుకంటే ఆమె తండ్రి పర్యావరణం గురించి ఎక్కువగా ఆలోచించేవారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, నగరాల్లో పేరుకుపోతున్న వ్యర్థాల గురించి వారింట్లో నిత్యం చర్చలు జరుగుతుండేవి.

చురుగ్గా పాల్గొనేది

పాఠశాలలో మాన్సీ పర్యావరణ మండలి నాయకురాలిగా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది. ఆ రోజుల్లోనే సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, గురుగ్రామ్ కోసం పాలసీ ఫ్రేమ్‌వర్క్‌లను రూపొందించడంపై పరిశోధన చేసింది. తన పాఠశాల, సమీప పరిసరాల్లో రీసైక్లింగ్ డ్రైవ్‌లను నిర్వహించింది. అంత చిన్న వయసులోనే పర్యావరణ సమస్యలను పరిష్కరించడంలో చురుకైన పాత్ర పోషించింది. అనతి కాలంలోనే నగరాల్లో పర్యావరణ పరిరక్షణపై ఆమె దృష్టి పడింది. 'భారతదేశం అంతటా పట్టణీకరణ వేగవంతమైంది. ఫలితంగా వాతావరణం కూడా అనేక మార్పులకుగురౌతుంది. ఈ సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎక్కువగా ఉంది' అని మాన్సీ అంటుంది.

పర్యావరణ సమస్యలపై

పర్యావరణం పట్ల ఉన్న అభిరుచి ఆమెను స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయానికి తీసుకెళ్లింది. అక్కడ పర్యావరణ ఆర్థిక శాస్త్రాన్ని అభ్యసించింది. అలాగే వివిధ విభాగాలలో కోర్సులు చేసింది. 'అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో పర్యావరణ సమస్యలను పరిష్కరించాలని నేను దృఢంగా భావించాను' అని మాన్సీ పంచుకుంటోంది. కాలిఫోర్నియా గవర్నర్ కార్యాలయంలో, ఇండోనేషియాలోని వరల్డ్‌వైడ్ ఫండ్‌లో వాటర్ రీసైక్లింగ్‌లో పని చేయడం, కళాశాలలో అందుకున్న ఫెలోషిప్‌లు ఆమెకు విభిన్న అనుభవాలను, పర్యావరణానికి సంబంధించిన విభిన్న అంశాలలో మంచి అవగాహన కలిగించాయి.





సొంత మైదానంలో సవాళ్లు

చదువు పూర్తి చేసిన తర్వాత మాన్సీ భారతదేశానికి తిరిగి వచ్చింది. నగరం, దేశం మొత్తం వ్యర్థాల నిర్వహణలో ఎటువంటి పురోగతి సాధించకపోవడం చూసింది. 'నేను చూసిన సమస్య సాధారణమయింది. పరిష్కారాలు అన్నీ తెలుసు, కానీ ఇది పాలన, విధానకు సంబంధించిన సమస్య' ఆమె చెప్పింది. ఆ తర్వాత ఆమె IDIsight అనే సంస్థలో చేరారు. ఇది డేటా ఆధారిత విధాన రూపకల్పన ద్వారా పేదరిక నిర్మూలనపై పనిచేస్తుంది. అక్కడ ఉన్నప్పుడు పర్యావరణంతో సహా వివిధ అంశాలపై ప్రభుత్వ వాటాదారులతో పని చేసే అవకాశం ఆమెకు లభించింది. ఈ అనుభవంతో పట్టణ పర్యావరణ కోసం పని చేయాలనే ఆమె సంకల్పాన్ని పటిష్టం చేసింది.

మహమ్మారి సమయంలో

నిర్దిష్ట సమస్యల కోసం పాలసీ ఫ్రేమ్‌వర్క్‌పై లోతుగా అధ్యయనం ప్రారంభించింది. కోవిడ్-19 తాకిన వెంటనే నీటి సంబంధిత సమస్యలపై మాన్సీకి ఆసక్తి పెరిగింది. 'మహమ్మారి సమయంలో నేను నా కుటుంబంతో కలిసి ఇంట్లో ఉన్నాను. నీటిని శుద్ధి చేయడం, రీసైక్లింగ్ చేయడం, నిర్వహించడం గురించి మా మధ్య అనేక చర్చలు జరిగేవి' అని ఆమె చెప్పింది. 2021లో వాయు కాలుష్యం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఆ సమయంలో మాన్సీ తన తండ్రి రాజేష్‌తో కలిసి 'డిజిటల్ పానీ' స్థాపించింది. నీటి శుద్ధి, రీసైక్లింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడంపై ఈ సంస్థ దృష్టి పెట్టింది. 'నీటి శుద్ధి కోసం మౌలిక సదుపాయాలు ఉన్నప్పటికీ, అవి అవసరమైన విధంగా పని చేయకపోవడం గమనించాను. దీని వల్ల అనేక సమస్యలు వస్తున్నాయి. నిర్లక్ష్యం కారణంగా వ్యర్థ జలాలు పేరుకుపోతున్నాయి' అని ఆమె అంటుంది.

పరిష్కారాలు రూపొందించడం

సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫారమ్, ఆటోమేటెడ్ హార్డ్‌వేర్ సాధనాలను అందించడం ద్వారా నైపుణ్యం లేకపోవడం, మానవశక్తి లభ్యతపై ఆధారపడటం, నైపుణ్యం కలిగిన సిబ్బంది కొరత వంటి సమస్యలను డిజిటల్ పానీ పరిష్కరిస్తుంది. ఉదాహరణకు ఎక్కడైనా ఓ మురుగునీటి శుద్ధి కర్మాగారం పనికిరాకుండా పోతే డిజిటల్ పానీ దానికి అవసరమైన సహకారం అందిస్తుంది. 'ఇందులో సమస్యలను గుర్తించేందుకు ప్రభుత్వాన్ని కూడా భాగస్వామ్యం చేస్తాం. దీనివల్ల నీటి శుద్ధి సౌకర్యాలు పూర్తి సామర్థ్యంతో పనిచేయడానికి వీలుంటుంది. సమగ్ర విధి నిర్వహణ, ఆటోమేషన్ ద్వారా అవసరమైన నైపుణ్యాన్ని అందించడం, కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం ద్వారా అవి కాలక్రమేణా కార్యాచరణ ఖర్చులను తగ్గించడంలో సహాయపడతాయి' అని ఆమె అంటుంది.

గుర్తించడంతో ఆగిపోరు

'నీటి శుద్ధి కోసం మేము మా సాఫ్ట్‌వేర్ డిజైన్ పారామితులను ఇన్‌పుట్‌లుగా ఉపయోగిస్తాం. కాబట్టి సమస్యను గుర్తించడం, చెప్పడంతో మాత్రమే ఆగిపోము. కానీ మొత్తం వ్యవస్థను నిర్వహించడం ద్వారా దాన్ని పరిష్కరించడానికి సహాయం చేస్తాము' అని ఆమె జతచేస్తుంది. డిజిటల్ పానీ ప్రస్తుతం టాటా, రిలయన్స్ లీలా హోటల్స్, ఢిల్లీ జల్ బోర్డ్‌తో సహా దేశంలోని 12 రాష్ట్రాలలో 50 సౌకర్యాలతో పని చేస్తోంది. 2023 నాటికి వారు రూ. 2.2 కోట్ల ఆదాయంతో ముగించారు. ఈ ఏడాది మరింత అధిక లక్ష్యంతో ఉన్నారని మాన్సీ అంటుంది. ■

ఈ రంగంలో మహిళలు

రిమోట్ లేదా ఇండస్ట్రియల్ ఏరియాల్లో మెషినరీని ఇన్‌స్టాల్ చేయడం, ఆపరేట్ చేయడం, గ్రౌండ్ అప్ నుండి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను నిర్మించడం వంటి రంగాల్లో మహిళలు పని చేయడం చాలా అరుదు అని మాన్సీ అంటుంది. దీనితో పాటు ఇంజనీరింగ్ చదువులో అధిక సంఖ్యలో మహిళా డ్రాపౌట్‌లు, ఉద్యోగ అవకాశాల్లో అసమానతల వల్ల ఈ రంగంలోకి ప్రవేశించడం మహిళలకు సవాలుగా మారింది. 'అందుకే ఈ రంగంలోకి ప్రవేశించే ఏ స్త్రీ అయినా ఈ సవాళ్లకు సిద్ధంగా ఉండమని నేను చెబుతాను. కానీ నీటి శుద్ధి సమస్య దేశంలో తీవ్రంగా ఉంది. ఇటువంటి చోట ఎక్కువ మంది మహిళా నాయకులు ఉద్భవిస్తే పరిష్కారాలు మరింత తొందరగా దొరుకుతాయి' అంటూ ఆమె సలహా ఇస్తుంది.

సరిగ్గా ప్రిపేరవ్వండి..

(మొదటిపేజి తరువాయి)



ఫిరాయింపులకు సంబంధించి ప్రత్యేక వ్యూహాన్ని అనుసరించటం ద్వారా కాంగ్రెస్ వైఖరిని ఎండగడతామని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశాన్ని నిర్వహించారు. కేసీఆర్ అధ్యక్షతన మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమైన ఈ భేటీ... ఐదు గంటలపాటు సుదీర్ఘంగా కొనసాగింది. ఈ సందర్భంగా కేసీఆర్ ఇటు శాసనసభలోను, అటు మండలిలోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనుసరించాల్సిన వ్యూహంపై దిశా నిర్దేశం చేశారు. పార్టీ ఫిరాయింపులపై ఆయన ఈ సందర్భంగా తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసినట్టు తెలిసింది. రాజ్యాంగ, ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలొదిలిన సీఎం రేవంత్, ఇష్టానుసారంగా ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారంటూ తీవ్ర స్థాయిలో దుయ్యబట్టారు. ఫిరాయింపులకు సంబంధించి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తాను చెప్పిన మాటలకు విరుద్ధంగా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని కేసీఆర్ వ్యాఖ్యానించినట్టు తెలిసింది. అందువల్ల ఈ అంశంపై అసెంబ్లీలో ప్రభుతాన్ని నిలేయాలంటూ ఆయన పిలుపునిచ్చారు. ఉభయ సభల్లోనూ ఎవరెవరు ఏయే అంశాలపై మాట్లాడాలనే దానిపై కూడా ఆయన మార్గదర్శనం చేసినట్టు నేతలు తెలిపారు. మండలి గురించి మాట్లాడిన క్రమంలో తన కుమార్తె, ఎమ్మెల్సీ కవితను తలుచుకుని కేసీఆర్ భావోద్వేగానికి గురయ్యారు. రాజకీయ కక్షతోనే, ఉద్దేశపూర్వకంగానే ఆమెను జైల్లో పెట్టారంటూ ఆయన వాపోయారు. 'నేనిప్పుడు అగ్ని పర్వతంలా ఉన్నా.. మనం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నాం. ఇంతకంటే కఠినమైన పరిస్థితులను ఎదుర్కొని, తెలంగాణను సాధించాం...' అంటూ వ్యాఖ్యానించారు. 'బిడ్డ జైల్లో ఉంటే, ఏ కన్న తండ్రికైనా బాధ ఉంటుంది కదా.. నా పరిస్థితీ అదే...' అంటూ ఆయన కంట తడిపెట్టినట్టు సమాచారం.

రేవంత్ సర్కారు పరిపాలనపై ఇంకా పట్టు సాధించలేకపోయిందంటూ కేసీఆర్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కేవలం బీఆర్ఎస్‌ను బదనాం చేయటంపైన్నే సీఎం దృష్టి సారించారని ఆయన విమర్శించారు. పార్టీ నుంచి బయటకు పోయిన వారి గురించి ఆలోచించాల్సిన పని లేదనీ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఏ పార్టీకైనా బలం పెరుగుతుందంటూ వ్యాఖ్యానించారు. ఎక్కడో మూలన ఉన్న వారిని తీసుకొచ్చి, పదవులిచ్చి గౌరవిస్తే, ఇప్పుడు వారందరూ పార్టీని వీడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుదీర్ఘ ప్రస్థానంలో బీఆర్ఎస్ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొందని గుర్తు చేశారు. ఇప్పుడూ అలాంటి పరిస్థితినే ఎదుర్కొని తిరిగి బలాన్ని పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శాసనమండలిలో బీఆర్ఎస్ పక్షనేతగా మాజీ స్పీకర్ మధుసూదనాచారిని ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు.

డుమ్మాల మీద డుమ్మాలు

ఫిరాయింపుల మీద ఫిరాయింపులతో డీలాపడ్డ బీఆర్ఎస్‌కు కొంత బూస్టప్ ఇచ్చేందుకు కేసీఆర్ నిర్వహించిన శాసనసభాపక్ష సమావేశానికి సైతం పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు డుమ్మా కొట్టటం తీవ్ర చర్చనీయాంశమైంది, తీగుళ్ల పద్మారావు (సికింద్రాబాద్), తలసాని శ్రీనివాస యాదవ్ (సనత్‌నగర్), మాణిక్‌రావు (జహీరాబాద్), కొత్త ప్రభాకరరెడ్డి (దుబ్బాక), బండారు లక్ష్మారెడ్డి (ఉప్పల్)తోపాటు ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, చల్లా వెంకటరామిరెడ్డి కూడా ఎల్పీ సమావేశానికి హాజరు కాకపోవటం గమనార్హం. అయితే వీరందరూ తమ తమ వ్యక్తిగత కారణాల వల్ల మీటింగుకు రాలేకపోతున్నామంటూ పార్టీకి ముందస్తు సమాచారమిచ్చారని మాజీ మంత్రి హరీశ్‌రావు వివరణిచ్చారు.

కేంద్రం వివక్షపై అసెంబ్లీలో తీర్మానం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోడీ కేవలం తన కుర్చీని కాపాడుకొనేందుకు క్విడ్ ప్రోకోలో భాగంగా బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు నిధులు కేటాయించారన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టం తెలంగాణకు కూడా వర్తిస్తుందనే సోయిని మర్చిపోయారని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రం పట్ల చూపిన వివక్షను ఎండగడుతూ బుధవారం జరిగే శాసనసభ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల తర్వాత స్పీకర్ అనుమతితో తీర్మానం ప్రవేశపెడతామన్నారు. దీనిపై చర్చించేందుకు ప్రతిపక్షాలు కలిసిరావాలని కోరారు. శాసనసభ ఆమోదం పొందిన తీర్మానం ప్రతిని ప్రభుత్వం తరఫున కేంద్రానికి పంపుతామన్నారు. ఈ చర్చలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్షనేత కే చంద్రశేఖరరావు పాల్గొనాలని కోరారు. మంగళవారంనాడిక్కడి ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహా, దనసరి అనసూయ సీతక్క తదితరులతో కలిసి మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి కేటాయింపులు లేకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. దీనికి బాధ్యత వహిస్తూ కేంద్రమంత్రులు జీ కిషన్‌రెడ్డి, బండి సంజయ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన 8 మంది బీజేపీ ఎంపీలు మోడీకి బానిసలుగా వ్యవహరించొద్దని చెప్పారు. తెలంగాణపై ప్రధాని మోడీకి మొదటి నుంచి వ్యతిరేకత ఉన్నదనీ, రాష్ట్ర ఏర్పాటులో 'తల్లిని చంపి, బిడ్డను తీసారు' అంటూ అభ్యంతర వ్యాఖ్యలు చేశారని గుర్తుచేశారు. తాను, తన సహచర మంత్రివర్గం మూడుసార్లు ఢిల్లీకి వెళ్లి బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై ప్రధాని సహా కేంద్రమంత్రులకు వినతిపత్రాలు సమర్పించామని గుర్తుచేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఐఐఎం విద్యాసంస్థలు ఉన్నాయనీ, తెలంగాణకు కూడా ఇవ్వాలని ప్రధానికి లేఖ ఇస్తే, అది సాధ్యం కాదంటూ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ అధికారికంగా లేఖ రాసారని తెలిపారు. బడ్జెట్ మొత్తంలో 'తెలంగాణ' అనే పదాన్నే తొలగించారనీ, ఇంతకంటే వివక్ష ఇంకేం ఉందని అన్నారు. ఇలాంటి వివక్షల వల్లే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. మోడీ చెప్పే వికసిత భారత్, సబ్ కా సాత్-సబ్ కా వికాస్ ఒట్టి బోగస్ మాటలని విమర్శించారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు నిధులు కేటాయించారనీ, అదే చట్టం తెలంగాణకు కూడా వర్తిస్తుందనే విషయాన్ని ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌లో మూసీ రివర్ ఫ్రంట్, రీజనల్ రింగ్ రోడ్, మెట్రోరైల్, బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్, ఐటీఐఆర్ వంటి ప్రస్తావనలే లేవన్నారు. బీజేపీకి తెలంగాణ నుంచి ఓట్లు, సీట్లు మాత్రమే కావాలనీ, అభివృద్ధి అవసరం లేదన్నారు. రాష్ట్ర హక్కుల కోసం పార్లమెంట్‌లో కాంగ్రెస్ నిరసన తెలుపుతుందనీ, దీనిలో పార్టీలకు అతీతంగా రాష్ట్రానికి చెందిన ఎంపీలంతా పాల్గొనాలని కోరారు. కేంద్రం ఉద్దేశ్యపూర్వకంగానే దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష చూపుతున్నదనీ, దానికి వ్యతిరేకంగా తమిళనాడు, కర్నాటకతో పాటు కలిసొచ్చే రాష్ట్రాలన్నింటితో కలిపి ఉమ్మడి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాష్ట్ర ప్రజలు బీజేపీకి 38 శాతం ఓట్లు వేసి, ఎనిమిది మంది ఎంపీలను గెలిపిస్తే, కనీస కృతజ్ఞత చూపకుండా, కక్షపూరితంగా వ్యవహరించారని చెప్పారు. బడ్జెట్‌లో ఇతర రాష్ట్రాలకు ఎందుకు నిధులు ఇచ్చారని తాము అడగట్లేదనీ, తెలంగాణ హక్కుల్ని కోరుతూ, వివక్షను ప్రశ్నిస్తున్నామని వివరణ ఇచ్చారు. ఎన్డీఏ అంటే నాయుడు, నితీష్ డిపెండెంట్ అలయెన్స్ (ఎన్‌డీఏ) అని అర్థమైపోయిందని ఎద్దేవా చేశారు.

రాష్ట్రానికి మొండిచేయి

(మొదటిపేజి తరువాయి)

ఎనిమిది సీట్లు కట్టబెట్టినందుకు రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం రిటన్ గిఫ్టిది.

మోడీ సర్కార్ తెలంగాణ రాష్ట్రానికి మరోసారీ శూన్యహస్తం అందించింది. మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన రూ. 48 లక్షల ఇరవై ఒక్కవేల కోట్ల బడ్జెట్లో నిబంధనల ప్రకారం రావాల్సిన నిధులు తప్ప ప్రత్యేకంగా రాష్ట్రానికి నయాపైసా ఇవ్వలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పలుమార్లు ఢిల్లీకి వెళ్లి చేసిన వినతులను పట్టించుకోలేదు. ఒక్క కొత్త ప్రాజెక్టు ప్రకటించలేదు ఐటీఐఆర్‌ను అటకెక్కించిన కేంద్రం, మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, రీజినల్‌రింగ్‌రోడ్ నిర్మాణంపై రాష్ట్రం చేసిన విజ్ఞప్తికి స్పందించలేదు. బడ్జెట్ మొత్తంలో తెలంగాణకు సంబంధించి హైదరాబాద్, బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ అంశాన్ని మాత్రమే ప్రస్తావించారు. ఈ ప్రాజెక్ట్‌కు ఆర్థిక తోడ్పాటునందిస్తామని చెప్పారే తప్ప ఎన్ని నిధులు వెచ్చిస్తారో వెల్లడించలేదు. ఏపీ పునర్విజన చట్టంలోని 35కు పైగా హామీల్లో కనీసం ఒక్క దాని ప్రస్తావన బడ్జెట్లో లేదు. వెనుకబడిన జిల్లాలకు నిధులివ్వాలన్న విజ్ఞప్తిని పట్టించుకోలేదు. ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్టుకు ఆర్థిక సాయం ప్రకటించలేదు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హెూదా పక్కన పెడితే, కనీసం అక్షిరిటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్స్ ప్రోగ్రామ్ (ఏఐబీపీ) స్కీంలో కూడా పరిగణలోకి తీసుకోలేదు. సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్, వరంగల్ టెక్స్ టైల్ పార్క్‌కు ఆర్థిక సాయం, ఇండస్ట్రియల్ కారిడార్లకు నిధుల ఊసు లేకుండా బడ్జెట్ ప్రవేశపెట్టారు.ఉత్తర తెలంగాణ జిల్లా వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే హైదరాబాద్, నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌కు నిధుల ప్రస్తావన లేదు. ఖాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, నవోదయ విద్యాలయాలు, రైల్వే లైన్లు తదితర అంశాలను పట్టించుకోలేదు. ములుగు యూనివర్సిటీకి అదనపు నిధులు, సాగునీటి ప్రాజెక్టుల జాతీయ హెూదాపై ఎలాంటి హామీ ఇవ్వలేదు. ఐఐఎం సహా నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ వంటి కేంద్ర సంస్థల ప్రస్తావన లేదు. మొత్తంగా చూస్తే 2024 కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి మోడీ సర్కార్ మరోసారీ అన్యాయం చేసింది.

తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపించినా నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి శఠగోపం పెట్టింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఏపీ రీ ఆర్గనైజేషన్ యాక్ట్‌ను ప్రత్యేకంగా ప్రస్తావించినా, ఆ చట్టం పరిధిలోకి వచ్చే తెలంగాణ పేరును మాత్రం ప్రస్తావించలేదు. అక్కున చేర్చుకుని అందలం ఎక్కిస్తే మోడీ సర్కార్ తెలంగాణ ప్రజలకు మంచి పాఠం నేర్పిందనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు కేంద్ర మంత్రులు తమ పదవుల కోసం లాలూచి పడ్డారే తప్ప రాష్ట్ర ప్రయోజనాల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నీట్ పరీక్ష రద్దు అవసరం లేదు

(మొదటిపేజి తరువాయి)

తోసిపుచ్చింది. ఈ పరీక్షను తిరిగి నిర్వహించడం వల్ల దాదాపు 23లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడతారని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. పైగా భవిష్యత్తులో అర్హులైన వైద్య నిపుణులు అందుబాటులో వుండేందుకు ఆటంకం కలుగుతుందని పేర్కొంది.

పరీక్షలో ఇచ్చిన ఫిజిక్స్ ప్రశ్నకు సరైన సమాధానం ఏదో చెప్పాలంటూ నిపుణుల కమిటీని కోరిన నేపథ్యంలో నాలుగవ ఆప్షన్ సరైన సమాధానమని కమిటీ చెప్పింది. దీనివల్ల దాదాపు నాలుగు లక్షల మంది విద్యార్థుల మార్కులు ప్రభావితమవనున్నాయి. నాలుగవ ఆప్షన్ కాకుండా ఇతర ఆప్షన్లు పెట్టిన వారికి మార్కుల్లో కోత విధించాల్సిందిగా కోర్టు ఎన్‌టిఎను ఆదేశించింది. మార్కుల్లో కోత పడిన వారిలో పూర్తి స్థాయిలో వందశాతమూ మార్కులు సాధించిన వారు 44మంది వున్నారు. వీరందరికీ నాలుగు మార్కులు చొప్పున తగ్గాయి. సవరించిన మార్కుల జాబితాను వెంటనే అప్‌డేట్ చేయాల్సిందిగా కోర్టు ఎన్‌టిఎను ఆదేశించింది.

ఎనిమిది కేంద్రాల్లో తప్పుడు ప్రశ్నా పత్రాలను పంపిణీ చేయడంపై ఎన్‌టిఎకు కోర్టు పలు కఠినమైన ప్రశ్నలు సంధించింది. అందువల్లే ఆ ప్రశ్నా పత్రాలు రాసిన విద్యార్థులందరికీ గ్రేస్ మార్కులు కలపాలని నిర్ణయించింది. ప్రశ్నా పత్రాల లీక్స్ విస్తృతంగా జరిగాయా వుంటే వాటికి సరైన సాక్ష్యాధారాలను చూపించాలంటూ మరోవైపు పిటిషనర్లను కోరింది.

విభజన హామీల ఊసేలేదు

(మొదటిపేజి తరువాయి)

తగ్గించడంతోపాటు నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఎలాంటి ప్రాధాన్యతా ఇవ్వలేదని తెలిపింది. పైగా దిగుమతులపై ఆధారపడే విధంగా దేశాన్ని మార్చే దిశగా ఉన్నదని పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు అదనంగా రూ.నాలుగు లక్షల కోట్లు పెంచి రూ.48.20 లక్షల కోట్ల బడ్జెట్‌ను కేంద్రం ప్రతిపాదించిందని తెలిపారు. ఈ బడ్జెట్‌కు ముందురోజు విడుదల చేసిన ఆర్థిక సర్వేలోనే వ్యవసాయ ఉత్పత్తి 4.7 శాతం నుంచి 1.4 శాతానికి వృద్ధిరేటు పడిపోయినట్టు ప్రకటించారని పేర్కొన్నారు. గతేడాది 32.89 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి కాగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో 32.16 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అయిందని వివరించారు. ఒకవైపు జనాభా పెరుగుతుండగా ఆహారధాన్యాల ఉత్పత్తి పడిపోవడంతో దిగుమతులు పెరుగుతున్నాయని తెలిపారు. అలాగే రూ.20 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని ఏటా కోల్పోతున్నామని పేర్కొన్నారు. నిరుద్యోగం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. అందులోనూ గ్రామీణ ఉపాధి దెబ్బతింటున్నదని తెలిపారు. దీనిపై కేంద్ర ప్రభుత్వ స్పందన లేదని పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం పెరుగుతున్నదని వివరించారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. దీనిపై కేంద్రానికి ఎలాంటి కార్యాచరణ లేదని విమర్శించారు.

మొత్తంగా ఈ బడ్జెట్‌లో కార్పొరేట్ విధానాలను కేంద్రం అమలు చేస్తున్నదని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల విభజన హామీలను అమలు జరపడానికి కేంద్ర బడ్జెట్‌లో ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వలేదని తెలిపారు. తెలంగాణకు హామీ ఇచ్చిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే లేదని విమర్శించారు. బడ్జెట్‌లో కేటాయింపుల్లేవని పేర్కొన్నారు. గిరిజన విశ్వవిద్యాలయం ములుగులో ఏర్పాటు చేసినప్పటికీ తగిన నిధులు కేటాయించలేదని తెలిపారు. పాలమూరు ఎత్తిపోతలను జాతీయ ప్రాజెక్టుగా గుర్తించలేదని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన గురించి రాష్ట్రప్రభుత్వం మొరపెట్టుకున్నా స్పందించలేదని తెలిపారు. గ్యాస్ సబ్సిడీ, జల్ జీవన్ మిషన్ కింద తెలంగాణకు రూ.16,100 కోట్లు మంజూరు చేయాలంటూ కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరినప్పటికీ ఈ బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపుల్లేవని విమర్శించారు. ఈ బడ్జెట్‌లో తెలంగాణకు కేంద్రం మొండిచేయి చూపిందని తెలిపారు.

శాంతించినా..ప్రమాదకరంగానే..

(మొదటిపేజి తరువాయి)

రహదారి సైతం తూరుబాక గ్రామం వద్ద ముంపునకు గురికాగా ఈ రహదారిలోనూ రాకపోకలు నిలిపేశారు. భద్రాచలం పట్టణానికి మూడు వైపుల నుంచి ముంచుకొచ్చిన ముంపుతో పట్టణ ప్రజలు ఆందోళనకు గురికాగా అధికారులు అప్రమత్తమై లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

విలీన మండలాల్లో వీడని వరద కష్టాలు

పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంతో విలీన మండలాలైన కూనవరం, వీఆర్ పురం, చింతూరు మండలాల్లో అనేక గ్రామాలు ముంపునకు గురికాగా అధికారులు వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. గ్రామపంచాయతీ ఏర్పాటు చేసిన ట్రాక్టర్లలో సామాన్లను తరలించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంతో కూనవరం పట్టణంలో ఉన్న పోలీస్ స్టేషన్ సైతం ముంపునకు గురికాగా అవసరమైన ఫైళ్లు, కంప్యూటర్లు ఇతర ప్రాంతాలకు తరలించారు. చింతూరు మండలంలో సైతం అనేక ఏజెన్సీ గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకోగా ఆదివాసీ ప్రజలు కొండలు, గుట్టలు ఎక్కి తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుని తలదాచుకుంటున్నారు.

ఇప్పటికే వీఆర్ పురం మండలంలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు పలు గ్రామాల ప్రజలను తరలించి వారికి కావలసిన భోజన వసతిని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఎట్టపాక మండలంతో సహా అనేక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకోగా సీపీఐ(ఎం) బృందం పర్యటించి వరద బాధితులకు భరోసా కల్పిస్తూ పునరావాస కేంద్రాలకు తరలించింది. భద్రాచలం వద్ద గోదావరి క్రమక్రమంగా తగ్గుతున్నప్పటికీ ముంపు మండలాల్లో మాత్రం పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావం మరో నాలుగు రోజులపాటు విలీన మండలాలు ముంపులోనే ఉండే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు.

ఎన్నికలు జరిగే రాష్ట్రాలపై బడ్జెట్ దృష్టి..?

- మహారాష్ట్ర, హర్యానాలపై శీతకన్ను
- మిగిలిన రాష్ట్రాల పరిస్థితి ఏంటి?



న్యూఢిల్లీ : మంగళవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఇప్పుడు చర్చ నడుస్తోంది. ముఖ్యంగా ఈ బడ్జెట్‌తో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతుందని భావించారు. మరి ఈ బడ్జెట్‌తో ఎన్నికల రాష్ట్రాలు ఏం లాభం పొందాయని పరిశీలన జరుగుతోంది. ఈ ఏడాదిలో మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్, జమ్మూకాశ్మీర్ రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాలను కేంద్రం పట్టించుకోలేదు. ఈ రెండు రాష్ట్రాల్లో బిజెపినే అధికారంలో ఉన్నా వీటిపై కేంద్రం సీతకన్ను వేసింది. దీంతో ప్రస్తుతం మహారాష్ట్రలో శివసేన (ఏక్‌నాథ్ షిండే), బిజెపి, ఎన్‌సిపి (అజిత్ పవార్ గ్రూపు) అధికారంలో ఉన్నా.. వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష మహ వికాస్ అఘడి (ఎంవిఎ) కూటమికి అవకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు. ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ఉపయోగించుకోవాలని ఎంవిఎ నాయకులు కూడా దృష్టి పెట్టారు. 'మహారాష్ట్రను విస్మరించడాన్ని కేంద్రం కొనసాగిస్తోంది. రాష్ట్రం నుంచి డబ్బు తీసుకునే రాష్ట్రంగా మహారాష్ట్రను మార్చివేశారు' అని శివసేన (ఉద్ధవ్ బాల్ ఠాక్రే గ్రూపు) ఎంపి ప్రియాంక చతుర్వేది విమర్శించారు.

జార్ఖండ్..

తూర్పు భారతదేశంలో సమగ్ర అభివృద్ధి ప్రాజెక్టు గురించి మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. అయితే ఈ ప్రాంతంలో ఉన్న జార్ఖండ్‌కు పెద్దగా నిధులను మంత్రి కేటాయించలేదు. ఈ రాష్ట్రంలో ఇండియ వేదికలోని జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) అధికారంలో ఉంది.

జమ్మూకాశ్మీర్

ఎన్నికల జరిగే రాష్ట్రాల విషయానికివస్తే మంగళవారం బడ్జెట్‌లో జమ్మూకాశ్మీర్‌కు అధిక నిధులు లభించాయని చెప్పుకోవాలి. బడ్జెట్‌లో ఈ రాష్ట్రానికి రూ. 42,777 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో మౌలిక వసతుల ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు, ఆర్థిక కార్యక్రమాలకు ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. సుదీర్ఘ కాలం తరువాత అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సిద్ధపడు తుండటంతో ఈ రాష్ట్రానికి కేంద్రం ఎక్కువ నిధులు కేటాయించిందని భావిస్తున్నారు.

నిరాశాజనకంగా నిర్మలమ్మ బడ్జెట్

- ఆపరేషన్ అవసరమైనప్పుడు ఉపశమనంతో ఏం లాభం?
- ఆదాయ సంక్షోభ పరిష్కారంలో వైఫల్యం
- ద్రవ్యోల్బణం అదుపునకూ చర్యలు లేవు
- కీలక రంగాలకు తగ్గిన కేటాయింపులు
- అండగా నిలిచిన వారికి మాత్రం దండిగా నిధులు



న్యూఢిల్లీ : ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగం సందర్భంగా గత దశాబ్ద కాలంలో ప్రభుత్వ వైఫల్యాలను అంగీకరించారు. అయితే దిద్దుబాటు చర్యలు తీసుకున్న దాఖలాలు కన్పించలేదు. ప్రభుత్వానికి సాయపడేందుకు ఆర్థికవేత్తలు, ప్రతిపక్షాలు ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మ్యానిఫెస్టోలోని ప్రధానమైన విధాన ప్రతిపాదనలనే నిర్మలమ్మ తన బడ్జెట్‌లో పొందుపరిచారు. ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాలు, అప్రెంటీస్‌షిప్ నిబంధనలు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోనివే. అయితే ఇవి పౌరుల మౌలిక సమస్యలను పరిష్కరిస్తాయా అనేదే ఇక్కడ ప్రశ్న. ఆర్థికవేత్తలు మాత్రం ఈ చర్యలు సరిపోవని అభిప్రాయపడ్డారు.

ఆత్మవిశ్వాసం కొరవడింది

నూతన ఉపాధి కల్పన కార్యక్రమానికి ప్రభుత్వం రూ.10,000 కోట్లు, ఇంటర్న్‌షిప్ కార్యక్రమానికి రూ.2,000 కోట్లు కేటాయించింది. అయితే ఆత్మనిర్భర్ భారత్ ప్యాకేజీ విషయంలో మాదిరిగానే ఇందులో కూడా ప్రభుత్వానికి ఆత్మవిశ్వాసం కొరవడింది. ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ లేకపోవడంతో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సరఫరా చర్యల పైనే ఆధారపడింది. సగటున ప్రతి కంపెనీ 20,000 మందిని ఇంటర్న్‌షిప్ కోసం తీసుకోవాల్సి ఉంటుంది. నియామకాల ఖర్చులో కొంత భాగాన్ని భర్తీ చేస్తానని ప్రభుత్వం చెబుతోంది. అయితే డిమాండ్ పెరగకపోతే, ఉత్పత్తి సామర్థ్యం అలాగే ఉంటే ఏ కంపెనీ అయినా మరింత మంది ఉద్యోగులను తీసుకొని లాభాలు తగ్గించుకుంటుందా? దీనిని బట్టి అర్థమవుతోంది ఏమంటే రోగికి శస్త్ర చికిత్స అవసరమైతే ఆర్థిక మంత్రి ఉపశమన చర్యలు చేపడుతున్నారు.

ఆదాయ సంక్షోభ పరిష్కారంలో వైఫల్యం

2023-24 ఆర్థిక సంవత్సరంలో కుటుంబ వినియోగ వ్యయం 20 సంవత్సరాల కనిష్ట స్థాయికి పడిపోయింది. జీడీపీలో నికర ద్రవ్య పొదుపు 5.1%కి తగ్గడంతో కుటుంబ పొదుపు 47 సంవత్సరాల కనిష్ట స్థాయికి చేరిందని ఆర్‌బీఐ తెలిపింది. ఇప్పుడు భారతీయులు ఆదాయ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. దానికి పరిష్కారాన్ని కనుగొనడంతో బడ్జెట్ విఫలమైంది. కుటుంబ వినియోగాన్ని పెంచడానికి స్వల్పకాలిక పరిష్కారంగా ప్రభుత్వం వ్యక్తిగత ఆదాయపన్నులో కొన్ని మినహాయింపులు ఇచ్చింది. శ్లాబుల సవరణ కూడా నూతన పన్ను విధానంలో ఉన్న ఉద్యోగులకే వర్తిస్తుంది. స్టాండర్డ్ డిడక్షన్లను అది అనుమతించడం లేదు. ఉదాహరణకు ఓ మధ్య తరగతి కుటుంబంలో ఇద్దరు సంపాదనాపరులు, పాఠశాలకు వెళ్లే ఇద్దరు పిల్లలు ఉన్నారనుకోండి. ఓ ఫ్లాటు కొనుగోలు చేసేందుకు ఇంటి రుణం తీసుకోవాలని వారు అనుకున్నారు. వారు నూతన పన్ను విధానాన్ని అనుసరిస్తుంటే ఈఎంఐలలో వడ్డీ భాగానికి స్టాండర్డ్ డిడక్షన్ వర్తింపజేయాలని కోరే అవకాశం ఉండదు. ఓ వైపు ఆహార ధరలు ఆకాశాన్ని తాకుతుంటే, ప్రైవేటు విద్య-వైద్యం తలకు మించిన భారంగా మారుతుంటే ఆ కుటుంబం ఏం చేస్తుంది? ఫ్లాటు కొనుగోలు ఆలోచనకు స్వస్తి చెబుతుంది. ఇలాంటి నిర్ణయాలు డిమాండ్ క్షీణతకు దోహదపడతాయి.

మెజారిటీ ప్రజలకు ఒరిగింది శూన్యం

ఇప్పుడు అనేక కుటుంబాలను ఆందోళనకు గురిచేస్తున్న అంశం ద్రవ్యోల్బణం. ద్రవ్యోల్బణం లక్ష్యానికి లోబడే ఉన్నదని, ప్రాధాన్యత లేని వస్తువుల ద్రవ్యోల్బణం తక్కువగా ఉన్నదని ఆర్థిక మంత్రి చెబుతున్నారు. జూన్‌లో ఆహార ద్రవ్యోల్బణం 9.5 శాతం దాటింది. కూరగాయలు, పండ్ల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి. ధరల పెరుగుదలను అడ్డుకోవడానికి సరఫరాలను పెంచాలని ప్రజలు కోరుకుంటున్నారు. గృహ వినియోగ సర్వే ప్రకారం 80శాతానికి పైగా ప్రజలు రోజుకు రూ.200, దాదాపు 34శాతం మంది రూ.100 కంటే తక్కువగానే ఖర్చు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశంలోని మెజారిటీ ప్రజలు ఈ బడ్జెట్ వల్ల పొందిన ప్రయోజనమేమీ లేదని తేలిపోయింది.

ప్రధాన రంగాలకు తగ్గిన కేటాయింపులు

ప్రధాన రంగాలకు బడ్జెట్‌లో చూపిన కేటాయింపులను పరిశీలిస్తే ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. ఆహారం, ఎరువులపై సబ్సిడీలను తగ్గించారు. రక్షణ బడ్జెట్‌లో కూడా స్వల్పంగా కోత పెట్టారు. పింఛన్లపై వ్యయం స్వల్పంగా పెరిగింది. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ కేటాయింపులు పెరగలేదు. ఈ పథకం కింద ఇప్పటికే 5.8 కోట్ల మంది ఉపాధి కోసం డిమాండ్ చేస్తున్నారు. జాబ్ కార్డుల్లో కొత్తగా 25 లక్షల మందిని చేర్చారు. ఈ పరిస్థితుల్లో ఉపాధి పథకానికి కేటాయింపులు పెంచకపోవడం విమర్శలకు తావిస్తోంది. పంటల బీమా పథకం, యూరియా సబ్సిడీ, పోషకాల ఆధారిత సబ్సిడీలను కూడా తగ్గించారు. ప్రతి ఏటా అన్నదాతలు అధిక సంఖ్యలో అర్హత పొందుతున్నప్పటికీ ఉపాధి హామీ పథకం తరహాలోనే పీఎం కిసాన్‌కు కూడా కేటాయింపులు పెంచలేదు.

టీడీపీ, జేడీయూలకు బుజ్జగింపులు

ఎన్డీఏ ప్రభుత్వం ఇప్పుడు భాగస్వామ్య పక్షాలైన తెలుగుదేశం, జేడీయూ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి మనుగడ సాగిస్తున్న విషయం తెలిసిందే. ఆ రెండు పార్టీలనూ సంతృప్తి పరచేందుకు బడ్జెట్ కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు పెద్దపీట వేశారు. ఈ బుజ్జగింపుల కారణంగా ప్రధాని బలమైన వ్యక్తి అనే ఇమేజ్ చెరిగిపోతోంది.

పాలమూరుకు బడ్జెట్ నిధులు 'సున్నా'

కరుణించని మోడీ సర్కారు

- తొమ్మిదేండ్లుగా ఎదురుచూపులు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్



కేంద్రంలోని బీజేపీ సర్కారు తెలంగాణ నీటిపారుదల రంగానికి ఉత్త చేతులు చూపించింది. రాజకీయ ప్రాధాన్యతలతో బడ్జెట్ కేటాయింపులు చేశామని తన ప్రసంగంలో చెప్పిన కేంద్రఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, తెలంగాణ ప్రాజెక్టులను పట్టించుకోలేదు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని ప్రభుత్వాలు పదే పదే కోరుతున్నా నిధులు కేటాయించలేదు. సుమారు తొమ్మిదేండ్ల గా నిధుల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. దాదాపు 12.3 లక్షల ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రాజెక్టుకు 2015 జూన్ 11న అప్పటి సర్కారు శంకుస్థాపన చేసింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే సుమారు ఆరు జిల్లాల భవిష్యత్ మారుతుందని అధికారులు అంటున్నారు. అలాగే నల్లగొండ, రంగారెడ్డి, వికారాబాద్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధికి ఉపయో గ పడనుంది. తొలుత డీపీఆర్ రూపొందించినప్పుడు సుమారు రూ.35 వేల కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. ఇప్పటివరకు సర్కారు కొంత వ్యయం చేసింది. కృష్ణానదీపై నిర్మిస్తున్న ప్రాజెక్టుతో దక్షిణ తెలంగాణకు ప్రయోజనం చేకూరనుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రధాని మోడీ సర్కారును పదే పదే కోరుతున్నా పట్టించుకోకపోవడం ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇటీవల సీఎం, పలువురు మంత్రులు ప్రధా కాగా ఏఐబీపీ నిధుల కింద పెద్దవాగు, కుమ్రంభీమ్, జగన్నాథపురం తదితర మధ్యతరహా ప్రాజెక్టులకు స్వల్పంగా నిధులొచ్చే అవకాశం ఉంది. కేంద్ర జలశక్తి శాఖ దేశవ్యాప్త అవసరాల కోసం రూ. 30 వేల కోట్లను తాజా బడ్జెట్‌లో కేటాయించింది. ఇందులో నుంచి రాష్ట్రానికి రూ. 100 కోట్లు వచ్చే అవకాశాలు లేకపోలేదని తెలిసింది. అలాగే చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చినట్టు సమాచారం.

సమతుల్య బడ్జెట్ : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఆత్మనిర్భర భారత్ నిర్మాణమే లక్ష్యంగా సమతుల్య బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశీయ ఉత్పత్తిని పెంపొందించడానికి, మధ్య ఎగువ మధ్యతరగతి వారికి పన్ను ఆదా ప్రకటించిందని తెలిపారు. వీధి వ్యాపారుల నుంచి మొదలు రైతులు, పారిశ్రామికవేత్తల వరకు అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఆర్థిక మంత్రి నిర్మల బడ్జెట్ ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదారులకు ఉపశమనం కల్పించేలా స్లాబ్‌లను మార్చారని తెలిపారు. పెరిగిన స్టాండర్డ్ డిడక్షన్ ద్వారా 4 కోట్ల మందికి మేలు జరగనుందని పేర్కొన్నారు. ఖనిజ రంగంలో మరింత ప్రగతి సాధించే దిశగా నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. ఆఫ్ షోర్ మినరల్ బ్లాక్‌ల వేలం, క్రిటికల్ మినరల్స్ మిషన్, 25 క్రిటికల్ మినరల్స్ మీద దిగుమతి సుంకం తొలగించడం, మరో రెండు మినరల్స్ మీద దిగుమతి సుంకాన్ని తగ్గించడం, బ్లిస్టర్ కాపర్ మీద దిగుమతి సుంకాన్ని పూర్తిగా తొలగించడం వంటి కీలకాంశాలు ప్రగతి దిశగా మరిన్ని అడుగులు వేయడానికి దోహపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు శూన్య హస్తం : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు శూన్య హస్తం అందించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. మంగళవారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా మోడీ సర్కార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలుగు కోడలు నిర్మలా సీతారామన్ రాష్ట్రానికి భారీగా నిధులు కేటాయిస్తారని ఆశిస్తే, బడ్జెట్ మొత్తంలో తెలంగాణ పేరును ప్రస్తావించక పోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. పునర్విభజన చట్టంలోని దాదాపు 35 హామీల పైన నిర్ణయం తీసుకోవాలని గతంలో కేసీఆర్ పలు మార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్, వరంగల్ టెక్స్‌టైల్ పార్క్‌తో పాటు ఇండస్ట్రియల్ కారిడార్లకు నిధులు కేటాయించలేదని విమర్శించారు. హైదరాబాద్, నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్, ఖాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, నవోదయ విద్యాలయాలు, రైల్వే లైన్లు తదితర అంశాలను బడ్జెట్లో ప్రస్తావించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నవచిత్రం

హీరోగా నన్ను కొత్తగా చూపిస్తుంది



రక్షిత్ అట్లూరి

"పలాస, నరకాసుర' వంటి భిన్న చిత్రాలతో హీరోగా మంచి పేరు తెచ్చుకున్న రక్షిత్ అట్లూరి నటిస్తున్న కొత్త సినిమా 'ఆపరేషన్ రావణ్'. ధ్యాన్ అట్లూరి నిర్మాణంలో న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా దర్శకుడు వెంకట సత్య తెలుగు, తమిళ బాషల్లో తెరకెక్కించారు. సంగీర్తన విపిన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం ఈ నెల 26వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం హీరో రక్షిత్ అట్లూరి మీడియాతో చిత్ర విశేషాలను షేర్ చేసుకున్నారు.

'తండ్రి దర్శకత్వంలో నటించే అవకాశం ఎంతమంది పిల్లలకు వస్తుందో తెలియదు. మా నాన్న నాకు ఈ అవకాశం ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. ఈ చిత్రంలో నేను ఆనంద్ శ్రీరామ్ అనే టీవీ రిపోర్టర్ క్యారెక్టర్ చేస్తున్నాను. హీరో, విలన్ ఇలా డ్యూయల్ రోల్ చేయాలని ఉంటుంది అయితే అది ఈ సినిమాతో తీరిందా లేదా అనేది స్క్రీన్ మీదే చూడండి. మా సినిమా ఎక్కువ మంది ఆడియెన్స్‌కు రీచ్ అవ్వడం కోసం సిల్వర్ కాయిన్ గిఫ్ట్ ఇస్తున్నామని ప్రకటించాం. సినిమా చూసి ఫస్టాఫ్‌లోగా సైకో ఎవరన్నది కనిపెట్టి మేము ఇచ్చిన నెంబర్‌కు వాట్సాప్ పంపిస్తే వారికి సిల్వర్ కాయిన్ ఇవ్వబోతున్నాం. విజయవాడ, వైజాగ్‌లో నా చేతుల మీదుగా ఈ కాయిన్ ఇస్తాను. ఈ సినిమాలో సైకో చిన్నప్పటినుంచి అలా ఉండడు. కొన్ని పరిస్థితుల వల్ల అలా అవుతాడు. మనలో ఆలోచనల అంతర్యుద్ధాన్ని ఇప్పటిదాకా ఎవరూ స్క్రీన్ మీద చూపించలేదు. మా సినిమాలో అలాంటి ప్రయత్నం చేశాం. సైకో తన ఆలోచనలను విజువలైజ్ చేసే సీన్ చూస్తూ ఆడియెన్స్ ట్రాన్స్‌లోకి వెళ్తారు. 'పలాస, నరకాసుర' చేసిన తర్వాత అన్నీ సీరియస్ రోల్స్ చేస్తున్నాననే అంటున్నారు. నాకూ ఆ భయం ఉంది. అయితే ఈ సినిమాతో పాటు 'శశివదనే' నన్ను కొత్తగా చూపిస్తాయని చెప్పగలను. ముఖ్యంగా ఈ సినిమా నన్ను ఆడియెన్స్‌కు మరింత దగ్గర చేసే సినిమా అవుతుందని నమ్ముతున్నా. 'పలాస 2' వర్క్ జరుగుతోంది. తప్పకుండా ఈ సినిమా ఉంటుంది'.



అశ్విన్ కెరీర్‌లో బెస్ట్ సినిమా

గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై అప్సర్ దర్శకత్వంలో అశ్విన్ బాబు హీరోగా, దిగంగనా సూర్యవంశీ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'శివం భజే'. ఈ చిత్రం ఆగస్టు 1న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానుంది. న్యూ ఏజ్ డివైన్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్ర ట్రైలర్‌ను మంగళవారం లాంచ్ చేశారు. ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి హీరో విశ్వక్ సేన్, సంగీత దర్శకుడు తమన్, దర్శకుడు అనిల్ రావిపూడి ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

విశ్వక్ సేన్ మాట్లాడుతూ, 'ట్రైలర్ చూశా. చాలా బాగుంది. ఆర్‌ఆర్ అదిరిపోయింది. అశ్విన్ కెరీర్‌లో ఇది నిలిచిపోతుందనిపిస్తుంది. ఆగస్ట్ 1న అశ్విన్‌కు బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులు సక్సెస్ ఇస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు. 'అశ్విన్ కెరీర్‌లో ది బెస్ట్ సినిమా అవ్వాలని కోరుకుంటున్నాను. శివేంద్ర నాతో పని చేశాడు. వికాస్ ఆర్‌ఆర్ బాగుంది. నిర్మాత మహేశ్వర్ రెడ్డికి మంచి సక్సెస్ రావాలి. డైరెక్టర్ అప్సర్ సినిమాను బాగా తీశారు. తమన్ ఇచ్చిన ఆర్‌ఆర్ ఇప్పటికీ మార్మోగిపోతూనే ఉంది' అని దర్శకుడు అనిల్ రావిపూడి చెప్పారు. సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ, ' 'ట్రైలర్ రెండ్రోజుల ముందే చూశాను. ఆర్టిస్ట్‌కి టాలెంట్ ఉంటే సరిపోదు.. కసి కూడా ఉండాలి. అశ్విన్‌కు ఆ కసి ఉంటుంది. ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలి' అని తెలిపారు. 'మహేశ్వరుడి కథ.. నిర్మాత మహేశ్వర్ రెడ్డి వరకు వెళ్లిందని అనిపించింది. డివోషనల్ పాయింట్ ఎందుకు పెట్టామనేది ప్రేక్షకుడు కన్విన్స్ అయ్యేలానే చూపించాం' అని డైరెక్టర్ అప్సర్ చెప్పారు. హీరో అశ్విన్ బాబు మాట్లాడుతూ, 'ఈ కథను నిర్మాత నా దగ్గరకు తీసుకొచ్చారు. పాయింట్ చాలా బాగుంది. అప్సర్ ముస్లిం. ఆయన ఇలాంటి కథను ఎలా రాశారని అనుకున్నా. ఇదంతా శివ లీల అనిపించింది. చాలా మంచి కాన్సెప్ట్‌తో రాబోతోన్నాం. అందరికీ సినిమా నచ్చుతుందని భావిస్తున్నాను' అని అన్నారు.

మెగాస్టార్ బర్త్‌డే కానుకగా రిలీజ్

బిఎస్‌కె మెయిన్ స్ట్రీమ్ పతాకంపై బండి సరోజ్ కుమార్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పరాక్రమం'. శ్రుతి సమన్వి, నాగలక్ష్మి, మోహన్ సేనాపతి, నిఖిల్ గోపు, అనిల్ కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.

ఈ సినిమా ఆగస్టు 22న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించిన మూవీ రిలీజ్ అనౌన్స్‌మెంట్ వేడుకలో టీజర్‌ని కూడా విడుదల చేశారు.

బండి సరోజ్ కుమార్ మాట్లాడుతూ, 'మా సినిమాను చిరంజీవి బర్త్ డే సందర్భంగా ఆగస్టు 22న విడుదల చేస్తున్నాం. ఇదొక సంఘర్షణతో కూడుకున్న కథ. నా జీవితంలో జరిగిన కొన్ని ఘటనలతో లోవరాజు క్యారెక్టర్ రాసుకున్నా. నేను గతంలో 'నిర్బంధం, నిర్బంధం2, మాంగళ్యం' సినిమాలను రూపొందించాను. అవి డిజిటల్‌గానే మీ ముందుకు వచ్చాయి. ఒక మంచి ఫీచర్ ఫిల్మ్ చేయాలనుకున్నప్పుడు మాత్రం నా స్టైల్ మార్చాలని ఫిక్స్ అయ్యా. అలా మార్చి చేసిన సినిమానే ఇది. నా గత సినిమాలను కొన్ని వర్గాల ప్రేక్షకులు మాత్రమే చూశారు. కానీ ఈ సినిమాను అన్ని వర్గాల ప్రేక్షకులు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడొచ్చు. ఈ వేడుకలో రిలీజ్ చేసిన పరాక్రమం డేట్ అనౌన్స్‌మెంట్ టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా ఉండి అందర్నీ ఆకట్టుకోవడం ఆనందంగా ఉంది. సినిమాను థియేటర్‌లోనే చూడాలనే క్యూరియాసిటీ ఈ టీజర్ క్రియేట్ చేసింది' అని తెలిపారు.



కెప్టెన్‌గా అసలంక

భారత్‌తో టీ20 సిరీస్‌కు శ్రీలంక జట్టు



పల్లెకెలె: ఇండియాతో ఈ నెల 27 నుంచి జరిగే మూడు టీ20ల సిరీస్‌లో ఆతిథ్య శ్రీలంక జట్టుకు చరిత్ అసలంక కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆ దేశ క్రికెట్ బోర్డు 16 మందితో కూడిన జట్టును మంగళవారం ప్రకటించింది. టీ20 వరల్డ్ కప్‌లో నిరాశ తర్వాత స్పిన్ ఆల్‌రౌండర్ వానిందు హసరంగ కెప్టెన్సీ నుంచి తప్పుకోవడంతో అసలంకకు పగ్గాలు దక్కాయి. 29 ఏండ్ల అసలంకకు ఇది వరకు కెప్టెన్సీ అనుభవం ఉంది. ఈ ఏడాది ఆరంభంలో బంగ్లాదేశ్ టూర్‌లో రెండు టీ20లకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. కాగా, ఇండియాతో సిరీస్‌కు శ్రీలంక జట్టులో సెలెక్టర్లు భారీ మార్పులు చేశారు. సీనియర్ ఆల్‌రౌండర్లు ఏంజెలో మాథ్యూస్, ధనంజయ డిసిల్వ, కీపర్ సదీర సమరవిక్రమ, పేసర్ దిల్షన్ మధుశంకను పక్కనబెట్టారు. 34 ఏండ్ల దినేశ్ చండిమల్‌ను రెండేండ్ల తర్వాత తిరిగి టీ20 టీమ్‌లోకి తీసుకున్నారు. కాగా, ఈ సిరీస్‌లో మ్యాచ్‌లు ఈ నెల 27, 28, 30వ తేదీల్లో జరుగుతాయి.

శ్రీలంక జట్టు: చరిత్ అసలంక (కెప్టెన్), పాతుమ్ నిశాంక, కుశాల్ పెరీరా (కీపర్), అవిష్క ఫెర్నాండో, కుశాల్ మెండిస్ (కీపర్), దినేష్ చండిమల్, కమిందు మెండిస్, దాసున్ షనక, వానిందు హసరంగ, దునిత్ వెల్లగే, మహేశ్ తీక్షణ, చమిందు విక్రమసింగే, మతీష పతిరణ, నువాన్ తుషార, దుష్మంత చమీర, బినుర ఫెర్నాండో.

బింద్రాకు 'ఒలింపిక్ ఆర్డర్'

దిగ్గజ షుటర్‌కు ఐఓసీ గౌరవం

పారిస్ : భారత స్పోర్ట్స్ దిగ్గజం, షుటింగ్ ఐకాన్ అభినవ్ బింద్రాకు అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) 'ఒలింపిక్ ఆర్డర్' పురస్కారం ప్రకటించింది. ఒలింపిక్ మూమెంట్‌లో విశేష సేవలు అందించినందుకు అభినవ్ బింద్రాకు ఐఓఏ ఈ పురస్కారం అందించనుంది. ఆగస్టు 10న పారిస్‌లో జరిగే 142వ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) సెషన్‌లో బింద్రాకు ఈ పురస్కారం ప్రదానం చేయనున్నారు.

ఆటలు

కొలంబోలో టీమ్ ఇండియా

శ్రీలంక చేరుకున్న భారత క్రికెటర్లు



కొలంబో : భారత క్రికెట్ జట్టు శ్రీలంకకు చేరుకుంది. శ్రీలంకతో మూడు టీ20లు, మూడు వన్డేలు ఆడేందుకు కొత్త చీఫ్ కోచ్ గౌతం గంభీర్ శిక్షణ సారథ్యంలో టీమ్ ఇండియాకు కొలంబోలో అడుగుపెట్టింది. జులై 27న తొలి టీ20తో శ్రీలంక పర్యటన షురూ కానుండగా.. ఆ తర్వాత వన్డే సిరీస్ ఆరంభం కానుంది. వన్డే జట్టులో మాత్రమే ఆడుతున్న క్రికెటర్లు మినహా టీమ్ ఇండియాలోని ఆటగాళ్లు అందరూ కొలంబోకు చేరుకున్నారు. ఓ రోజు విశ్రాంతి అనంతరం భారత క్రికెటర్లు ప్రాక్టీస్ చేయనున్నారు. ఇక చీఫ్ కోచ్‌గా గౌతం గంభీర్ శ్రీలంక పర్యటనలో తొలి సవాల్ ఎదుర్కొన్నాడు. భారత్ టీ20 ప్రపంచకప్ డిఫెండింగ్ చాంపియన్‌గా, ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ రన్నరప్‌గా కొనసాగుతున్న భారత జట్టు పగ్గాలు చేపట్టిన గంభీర్‌పై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. చీఫ్ కోచ్‌గా ఆటగాళ్లకు స్వేచ్ఛ, నమ్మకం ఇవ్వటానికే అధిక ప్రాధాన్యం ఇస్తానని గంభీర్ వెల్లడించాడు. 'ఉత్తమ బంధం నమ్మకంపైనే ఏర్పడుతుంది. ఆటగాళ్లకు ఎప్పుడూ నా మద్దతు ఉంటుంది' అని గంభీర్ తెలిపాడు.

ఉత్సాహంగా జేపీఎల్ టీ20 పోటీలు



హైదరాబాద్: కేఎస్‌జీ జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ (జేపీఎల్) టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. విజయానంద్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచుల్లో సాధికారిక విజయాలు నమోదు చేసిన ఏబీఎన్-ఆంధ్రజ్యోతి, బిగ్ టీవీ జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. వర్షం ప్రభావిత మ్యాచ్‌లో బిగ్ టీవీ జట్టు వీజేడీ పద్ధతిలో 16 పరుగుల తేడాతో వీ6పై విజయం సాధించింది. బిగ్ టీవీ జట్టు తొలుత 12 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 87 పరుగులు చేసింది.. వీజేడీ పద్ధతి ప్రకారం వీ6 లక్ష్యాన్ని 12 ఓవర్లలో 94 పరుగులుగా తేల్చారు. ఛేదనలో వీ6 జట్టు 9 వికెట్ల నష్టానికి 77 పరుగులు చేసింది. మూడు వికెట్లతో మెరిసిన ఎస్.సుధ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. మరో మ్యాచ్‌లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి 42 పరుగుల తేడాతో జీ - కింగ్స్ జట్టుపై గెలుపొందింది. ఆంధ్రజ్యోతి నిర్ణీత 15 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసింది. ఓపెనర్ దిలీప్ (48), అబ్దుల్ షుకూర్ (29), రవి (31) రాణించారు. ఛేదనలో జీ కింగ్స్ 15 ఓవర్లలో 105/8 పరుగులు చేసింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మెరిసిన అబ్దుల్ షుకూర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.